
'ప్రాజెక్టులు పూర్తి చేసి
శాశ్వత వనరుల ద్వారా
రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 114

సోమవారం 15-7-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



4-1తో ముగించారు

చివరిదైన ఐదో టి20లోనూ జింబాబ్వేపై గెలిచిన భారత్ - 14లో



'కింగ్' అల్‌కరాజ్

వరుసగా రెండోసారి వింబుల్డన్ టైటిల్.. ఫైనల్లో జొకోవిచ్‌పై విజయం - 14లో



'మూడు ముక్కలాట'

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఉద్యోగ ఖాళీల భర్తీ వ్యవహారం మూడు ముక్కలాటగా మారింది.


- వివరాలు 3లో



మోదీ ఫాలోయర్లు 10 కోట్లు

'ఎక్స్' హ్యాండిల్‌లో ప్రధాని మోదీ ఫాలోయర్ల సంఖ్య ఆదివారం రికార్డు స్థాయిలో 10 కోట్లను దాటిపోయింది.

- వివరాలు 6లో



నేపాల్ ప్రధానిగా కేపీ శర్మ

నేపాల్‌లో నూతన ప్రధానిగా కేపీ శర్మ ఓలి నాలుగోసారి నియమితులయ్యారు. ఆయనకు చైనా అనుకూలవాదిగా పేరుంది.

- వివరాలు 6లో



నాపై రెండు హత్యాయత్నాలు

గత 8 నెలల్లో తనపై రెండుసార్లు హత్యాయత్నం జరిగినట్లు బిలియనీర్, టెస్లా సీఈవో ఎలన్ మస్క్ వెల్లడించారు.

- వివరాలు 6లో

రాచకొండలో ఫిలింసిటీ

అంతర్జాతీయ హంగులతో అత్యాధునికంగా ఏర్పాటు చేస్తాం: సీఎం రేవంత్



ఇబ్రహీంపట్నంలోని లష్కర్‌గూడలో గీత కార్మికులకు రక్షణ కవచం కిట్లను అందిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి శ్రీధర్‌బాబు

- ఫార్మాసిటీ భూముల్లో ఐటీ పార్కులు, విద్యుత్ కార్ల పరిశ్రమలు.. మహేశ్వరంలో మరో విశ్వనగరం
- హయత్‌నగర్, శంషాబాద్ వరకు మెట్రో విస్తరణ
- ట్రిపుల్ ఆర్ చుట్టూ, చెరువులు, కాల్వ గట్లపై తాటి, ఈత చెట్లు పెంచుతామన్న ముఖ్యమంత్రి
- లష్కర్‌గూడలో 'కాటమయ్య రక్షణ కవచం' పథకం ప్రారంభం.. గీత కార్మికులకు రక్షణ కిట్లు అందజేత

సాక్షి, రంగారెడ్డి జిల్లా: 'ఎత్తైన కొండలు, గుట్టలు, ఎటుచూసినా పచ్చని చెట్లతో ఎంతో ఆహ్లాదంగా కనిపించే రాచకొండ గుట్టల్లో అంతర్జాతీయ హంగులతో ఫిలింసిటీని ఏర్పాటు చేస్తాం. ఫార్మాసిటీ కోసం సేకరించిన 20 వేల ఎకరాల్లో అంతర్జాతీయ ఐటీ పార్కులు, కాలుష్య రహిత ఫార్మాస్యూటికల్ కంపెనీలు, స్పోర్ట్స్ యూనివర్సిటీ, ఎలక్ట్రిక్ కార్ల తయారీ పరిశ్రమలు, బ్యాటరీ తయారీ కంపెనీలు ఏర్పాటు చేస్తాం. న్యూయార్క్ తరహాలో మహేశ్వరంలో మరో విశ్వనగరాన్ని తీర్చిదిద్దుతాం..' అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లష్కర్‌గూడలో 'కాటమయ్య రక్షణ కవచం పథకం'ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. కల్లు గీత కార్మికుల రక్షణ కోసం ఐఐటీ హైదరాబాద్ విద్యార్థులు (ఎవరెస్ట్ అధిరోహించిన మాలోతు పూర్ణతో కూడిన బృందం) రూపొందించిన కిట్లను ఈ సందర్భంగా కల్లు గీత కార్మికులకు అందజేశారు. కిట్ల పనితీరును పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

పర్యాటక ప్రదేశంగా రంగారెడ్డి జిల్లా

'దేశంలోనే ఎక్కడా లేని విధంగా రంగారెడ్డి జిల్లాలో భూముల ధరలు ఉన్నాయి. ఎకరం రూ.100 కోట్లకు పైగా పలుకుతోంది. రాబోయే రోజుల్లో జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది. ప్రపంచంలోనే ఉత్తమ పర్యాటక క్షేత్రంగా విరాజిల్లుతుంది. అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్డుతో పాటు కొత్తగా రాబోతున్న రీజనల్ రింగ్ రోడ్డు తెలంగాణకు ఓ మణిహారంగా నిలుస్తుంది. దాని చుట్టూ కొత్తగా పరిశ్రమలు వస్తాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇటు హయత్‌నగర్, అటు శంషాబాద్ వరకు మెట్రో రైలు విస్తరిస్తాం..' అని రేవంత్ చెప్పారు.

వెంచర్లలోనూ ఈత, తాటి చెట్లు

'వృత్తిదారులకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది. వీరి కోసం ప్రభుత్వ ఖాళీ భూముల్లో, రీజనల్ రింగ్ రోడ్డు

మిగతా 2వ పేజీలో ▶

వైఎస్సార్ హయాంలో అనేక సంక్షేమ పథకాలు

2004 నుంచి 2014 మధ్య కాలంలో దివంగత నేత వైఎస్సార్ నాయకత్వంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలు కాంగ్రెస్ సృష్టే. గత ప్రభుత్వం చనిపోయిన గీత కార్మికులకు రూ.7.90 కోట్లు బకాయిపడింది. పెండింగ్‌లో ఉన్న ఈ బకాయిలను తక్షణమే విడుదల చేస్తాం..' అని ముఖ్యమంత్రి తెలిపారు.

ట్రంప్‌పై హత్యాయత్నం

ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తుండగా కాల్పులు

కుడి చెవిని గాయపరుస్తూ దూసుకెళ్లిన తూటా

తలపక్కగా దూసుకెళ్లిన నాలుగైదు తూటాలు

అప్రమత్తమై కిందికి వంగిన మాజీ అధ్యక్షుడు



చెవికి గాయంతో నెత్తురోడుతూనే పిడికిలి బిగించి నినాదాలు చేస్తున్న డొనాల్డ్ ట్రంప్‌ను చుట్టుముట్టి అక్కడి నుంచి తరలిస్తున్న అమెరికా సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు

- సురక్షితంగా తరలించిన భద్రతా సిబ్బంది
- పిడికిలి బిగించి 'ఫైట్' అంటూ నినదించిన ట్రంప్
- ప్రతి నినాదాలతో పెద్దపెట్టున స్పందించిన సభికులు
- దుండగుడి కాల్చివేత, 20 ఏళ్ల యువకుడిగా గుర్తింపు
- కాల్పుల్లో ఒకరి మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు

6లో

ఎప్పుడేం జరిగిందంటే...

దేవుడే కాపాడాడు: ట్రంప్

పెరిగిన విజయావకాశాలు!

దుండగుడు రిపబ్లికన్ ఓటరే..

వివరాలు 6లో

హరీశ్‌రావు మంచి నేత

ప్రజాభిమానం ఉంది

- ఆయన బీజేపీలోకి రావాలన్నా రాజీనామా చేసి రావాల్సిందే
- బీజేపీలో బీఆర్ఎస్ విలీనం.. అది కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల డ్రామానే..
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు

వివరాలు 3లో



టీచర్లు లేక పేద విద్యార్థులకు ఇబ్బంది..

డీఎస్సీకి సిద్ధం కండి

అభ్యర్థులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచన

- మిగిలిన టీచర్ పోస్టుల భర్తీ కోసం కొన్ని నెలల్లో మరో డీఎస్సీ నోటిఫికేషన్
- నిరుద్యోగులు ఆందోళన పడొద్దు.. జాబ్ కేలండర్ ప్రక్రియ వేగవంతం చేస్తాం
- యువత జీవితాల్లో స్థిరపడాలన్నదే తమ ఆశ అని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య సరిగా లేక పేద విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని.. దీన్ని దృష్టిలో పెట్టుకుని అభ్యర్థులు డీఎస్సీ పరీక్ష రాసేందుకు సిద్ధం కావాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. ప్రస్తుతం 11 వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తున్నామని.. కొన్ని నెలల్లో

మిగతా 3వ పేజీలో ▶



కుటుంబం యూనిట్‌గా

రుణమాఫీ!

గతంలో అనుసరించిన పద్ధతిలోనే ఇప్పుడూ అమలు

- ఒక కుటుంబంలో అందరికీ కలిపి గరిష్టంగా రూ.2లక్షల వరకు మాఫీ
- పీఎం కిసాన్ మార్గదర్శకాల్లో కొన్నింటిని పరిగణనలోకి తీసుకునే అవకాశం
- నేడో, రేపో మార్గదర్శకాలు రావొచ్చన్న వ్యవసాయ శాఖ వర్గాలు
- పంటలు పండించే ప్రతి రైతుకు లబ్ధి చేకూరేలా పథకం ఉంటుందని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కుటుంబం యూనిట్‌గా పంటల రుణమాఫీని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఒక కుటుంబంలోని వారి పేరిట బ్యాంకుల్లో పంట రుణాలు ఎంత ఉన్నా.. గరిష్టంగా రూ.2 లక్షల వరకు మాత్రమే మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వ్యవసాయ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు కసరత్తు పూర్తయిందని.. నేడో, రేపో మార్గదర్శకాలు విడుదల కావొచ్చని తెలిపాయి. ఒక కుటుంబాన్ని ఎలా లెక్కలోకి తీసుకోవాలన్న దానిపై అధికారులు ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. రేషన్‌కార్డుగానీ, గ్రామ పంచాయతీ రికార్డుగానీ, వ్యవసాయశాఖ వద్ద ఇప్పటికే ఉన్న డేటాను ఆధారం చేసుకొనిగానీ కుటుంబాలను అంచనా వేయాలని భావిస్తున్నట్టు సమాచారం. అనంతరం ఒక రైతు కుటుంబానికి ఎన్ని బ్యాంకు ఖాతాలు, వాటిలో ఎన్ని పంట రుణాలు ఉన్నప్పటికీ.. మొత్తం రూ.2 లక్షల వరకే మాఫీ చేయనున్నారు. రుణాలు ఉన్న కుటుంబ సభ్యుల మధ్య దామాషా ప్రకారం ఈ మాఫీ సొమ్మును విభజిస్తారు. ఒక కుటుంబం అంటే.. భర్త, భార్య, వారిపై ఆధారపడి ఉన్న పిల్లలను పరిగణనలోకి తీసుకుంటారు. ఈ మార్గదర్శకాలు విడుదలైన వెంటనే గ్రామాల వారీగా రైతుల జాబితా తయారు చేస్తారు. బ్యాంకుల అధికారులతో కలసి రుణాలున్న వారి జాబితా తయారు చేస్తారు. చివరగా గ్రామసభలో చర్చించి తుది జాబితాను సిద్ధం చేయనున్నారు.

పీఎం కిసాన్ నిబంధనల అమలు యోచన!

వచ్చే నెల 15వ తేదీ నాటికి పంట రుణాలను మాఫీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందుకోసం రూ.31 వేల కోట్లు అవసరమని అంచనా వేశారు. 2018 డిసెంబర్ 12వ తేదీ నుంచి 2023 డిసెంబర్ 9 వరకు ఐదేళ్లలో రాష్ట్ర రైతులు తీసుకున్న రూ.2 లక్షల మేరకు పంట రుణాలను మాఫీ చేయనున్నారు. దాదాపు 47 లక్షల

మిగతా 3వ పేజీలో ▶



'కాళేశ్వరం'పై ఐఏఎస్‌ల విచారణ!

కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌లపై విచారణలో భాగంగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సోమవారం పలువురు సీనియర్ ఐఏఎస్‌లు, రిటైర్డ్ ఐఏఎస్‌లను ప్రశ్నించనుంది. ప్రాజెక్టుకు అనుమతుల జారీ, అంచనాల పెంపు, నిధుల విడుదలలో వారి పాత్రపై కమిషన్ విచారించనుందని తెలిసింది.

వివరాలు 5లో

కోచింగ్ సెంటర్లకు వెళ్లి ఉద్యోగాలు తెచ్చుకుంది..

మీరు కాదా?

- సీఎం స్థాయిని మరిచి దివాలాకోరు వ్యాఖ్యలు
- నిరుద్యోగులకు రేవంత్ క్షమాపణ చెప్పాలి
- ఉద్యోగాలు, జాబ్ కేలండర్‌పై శ్వేతపత్రం విడుదల చేయాలి
- మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగ యువతను, విద్యార్థులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి తన స్థాయిని మరిచి అత్యంత దివాలాకోరుతనంతో నిరుద్యోగుల కోసం పోరాటం చేస్తున్న మోతీలాల్‌ను అవమానించేలా మాట్లాడారని ధ్వజమెత్తారు. ఆదివారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. అశోక్‌నగర్ కోచింగ్ సెంటర్లకు వెళ్లి ఉద్యోగాలు సంపాదించుకున్న రేవంత్‌రెడ్డి అదే

మిగతా 3వ పేజీలో ▶



ఉరిమిన వరుణుడు

నగరంలో కుండపోత

నగరంలో వర్షం దంచికొట్టింది. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి 10 గంటల వరకు సగటున 8.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రహదారులపై భారీగా వరద నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. పలుచోట్ల రోడ్లు చెరువులను తలపించాయి.

వివరాలు 7లో



పర్లేదు! ఇలా ఇవ్వు!
నీ సమస్యలన్నీ పరిష్కరిస్తాను!

ఆదివారం పూరీ జగన్నాథ ఆలయానికి కొత్త ఇత్తడి పెట్టెలను తీసుకొస్తున్న దృశ్యం. 'రత్న భండార్'లోని నగల తరలింపు కోసం ఈ పెట్టెలను తెచ్చారు.



46 ఏళ్ల తర్వాత తెరుచుకున్న

పూరీ రత్నభండార్

- వజ్రాభరణాలు, పసిడి నిల్వలను లెక్కించేందుకు సిద్ధమైన బృందం
- జగన్నాథ ఆలయంలో ప్రత్యేకపూజలు

6లో

సమ్మక్క నుంచే అనుసంధానం!

నేడు ఎన్‌డబ్ల్యూడీఏ పాలకమండలి సమావేశం

గోదావరి-కావేరీ నదుల అనుసంధానంపై జరగనున్న చర్చ

ఇచ్చంపల్లి నుంచి కాకుండా సమ్మక్క సాగర్ బరాజ్ నుంచి నీళ్లను తరలించాలంటున్న తెలంగాణ



సాక్షి, హైదరాబాద్: గోదావరి-కావేరీ నదుల అనుసంధానం ప్రాజెక్టులో భాగంగా ఇచ్చంపల్లి వద్ద కొత్త బరాజ్ నిర్మించాలనే ప్రతిపాదనలకు బదులుగా ఇప్పటికే నిర్మించిన సమ్మక్క సాగర్ బరాజ్ నుంచే నీళ్లను తరలించాలని తెలంగాణ చేసిన విజ్ఞప్తిపై సోమవారం జరగనున్న నేషనల్‌వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) పాలకమండలి సమావేశంలో చర్చించనున్నారు. సమావేశం ఎజెండాలో ఈ అంశాన్ని సైతం చేర్చినట్టు ఎన్‌డబ్ల్యూడీఏ రాష్ట్రానికి సమాచారం ఇచ్చింది.

అలాగైతే అన్నీ సమస్యలే: తెలంగాణ

ఆరు నెలల కిందట గోదావరి-కావేరీ అనుసంధానం ప్రాజెక్టు డీపీఆర్‌ను తెలంగాణకు అందించిన ఎన్‌డబ్ల్యూడీఏ దానిపై అభిప్రాయాన్ని కోరింది. ఇచ్చంపల్లి వద్దే బరాజ్ నిర్మిస్తామని ఇందులో ప్రతిపాదించింది. అయితే ఇచ్చంపల్లి బరాజ్ నిర్మిస్తే నదుల అనుసంధానం ప్రాజెక్టుకి, ఇచ్చంపల్లి దిగువన ఉన్న తమ ప్రాజెక్టుల అవసరాలకు ఏకకాలంలో నీళ్లను తరలించడం సాధ్యం కాదంటూ తెలంగాణ అభ్యంతరం తెలిపింది. సమ్మక్క సాగర్ బరాజ్‌కి బ్యాక్‌వాటర్ సమస్య ఏర్పడుతుందని, వరదల నిర్వహణ ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఇచ్చంపల్లి వద్ద కొత్త బరాజ్ కడితే, దానికి దిగువన తమ రాష్ట్రానికి ఉన్న 158 టీఎంసీల నీటి అవసరాలకు సైతం నష్టం కలుగుతుందని పేర్కొంది. ఇచ్చంపల్లికి దిగువన ఉన్న ప్రాజెక్టులైన దేవాదులకు 38 టీఎంసీలు, సీతారామకు 70 టీఎంసీలు, తుపాకులగూడెంకు 50 టీఎంసీలు కలిపి మొత్తం 158 టీఎంసీలు తమకు అవసరమని తెలంగాణ పేర్కొంటుండగా, ఈ నీటి వినియోగం లెక్కలను సమర్పించాలని గతంలో ఎన్‌డబ్ల్యూడీఏ కోరింది. దీంతో సమ్మక్కసాగర్ బరాజ్‌కి ఎగువన కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా కట్టిన

మిగతా 5వ పేజీలో ▶



గరీబ్‌రథ్.. సూపర్ ఫాస్ట్

ఆకుపచ్చ బోగీలతో పరుగులు తీసే గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ ఇప్పుడు సరికొత్తగా ఎరుపు రంగు బోగీలతో పట్టాలెక్కడంతోపాటు శరవేగంగా పరుగులు తీయనుంది. ఈ రైళ్లకు దశాబ్దాలుగా వాడుతున్న ఐసీఎఫ్ కోచ్‌ల స్థానంలో ఇకపై ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు అందుబాటులోకి రానుండటంతో గరీబ్‌రథ్‌ల వేగం గరిష్టంగా గంటకు 130 కి.మీ. వరకు చేరుకోనుంది.

వివరాలు 16లో



లోన్ యాప్‌ల కొత్తరకం వేధింపులు

దారుణాలకు ఏఐ దన్ను!

అప్పు తీసుకున్న వ్యక్తి కాల్‌లిస్టుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాల్స్

ప్రతీ పది నిమిషాలకు ఆటోమేటిక్ కాల్స్

స్పందించకపోతే ఇక తిట్ల దండకం, బెదిరింపులు

నేతలు, పోలీసులు, డాక్టర్లు, జర్నలిస్టులు, అధికారులే బాధితులు

ఎక్కువమంది కాల్‌లిస్టులో వీరంతా ఉండటమే కారణం

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్‌లో ఓ డాక్టర్‌కు ఉదయం నుంచి మీరు లోన్ కట్టాలంటూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కాల్స్ వచ్చాయి. తరువాత వాయిస్ కాల్స్ చేసి విసిగించారు. చేసిన ప్రతీసారీ కొత్త నెంబరుతో వేధించడంతో ఏం చేయాలో పాలుపోక ఫోన్ స్విచాఫ్ చేసుకున్నారు. మీ మిత్రుడు లోన్ తీసుకున్నాడంటూ మరో పోలీసు అధికారికి పదే పదే ఫోన్లు చేసి విసిగించారు. ఇది కేవలం పోలీసులు, వైద్యులకే కాదు.. రాజకీయ నాయకులు, అధికారులు మొదలుకుని విలేకరులను కూడా వదలకుండా వేధిస్తున్నారు.

→ ఇంతకాలం కాల్‌సెంటర్ల ద్వారా వేధించిన లోన్‌యాప్ యాజమాన్యాలు ఇప్పుడు రూటు మార్చాయి. తమ బాకీని ఎలాగైనా వసూలు చేసుకునేందుకు సరికొత్త పంథాను ఎంచుకున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను సరికొత్త ఆయుధంగా వాడుతున్నాయి. ముందుగా లోన్ తీసుకునే వ్యక్తి నుంచి కాంటాక్ట్స్ యాక్సెస్ చేయాలా? అని అడుగుతారు. యాక్సెస్ పర్మిషన్ ఇవ్వకపోతే లోన్ రాదు. అవసరాల్లో ఉంటారు కాబట్టి అంతా కాంటాక్ట్ యాక్సెస్ పర్మిషన్ ఇస్తారు. ఇదే అదనుగా కాల్స్ చేసి విసిగించడంతోపాటు ఆటోమేటిక్ కాల్స్‌తో వేధింపులకు దిగుతున్నారు.

ఉదయం, సాయంత్రం ఏఐ కాల్స్!

→ ఒక వ్యక్తి ఫోన్ కాంటాక్ట్స్‌లో ఉన్న వందలు, వేల కాంటాక్ట్స్‌కి ఒకేసారి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా గ్రూప్ కాల్ వెళ్తుంది. సార్ మీ లోన్ పెండింగ్‌లో ఉంది. వెంటనే ఈ నెంబరుకు కాల్‌బ్యాక్ చేయండి అంటూ రికార్డెడ్ వాయిస్ వస్తుంది. ఉదయం, సాయంత్రం, లంచ్ సమయాల్లో ఏఐ కాల్స్ వస్తాయి. ప్రతీ పది నిమిషాలకు ఒకసారి కాల్స్ చేసి విసుగు తెప్పిస్తాయి.

కొత్త తలనొప్పులు..

→ సాధారణంగా ఎవరైనా పోలీసు, వైద్యుడు, ప్రభుత్వాధికారి, రాజకీయ నాయకుల ఫోన్ నంబర్లను సేవ్ చేసుకుంటారు. అయితే సదరు వ్యక్తి పొరపాటున అప్పు తీసుకుని కట్టకపోతే.. అప్పుడు ఈ కాంటాక్ట్స్‌లో ఉన్న వారంతా బాధితులుగా మారుతున్నారు. వీరిని లక్ష్యంగా చేసుకుంటే అప్పు వసూలు చేయవచ్చన్నది వారి వ్యూహం. ప్రజాజీవితంతో ముడిపడి పనిచేసే వీరు రోజంతా ఏదో పనిలో తలమునకలై ఉంటారు. పైగా నెంబర్లు మార్చి మార్చి చేయడంతో ఎత్తక తప్పనిసరి పరిస్థితి. తీరా ఎత్తితే.. అప్పు కట్టాలి అంటూ వేధింపులు, తిట్లు, దూషణలతో విసిగిస్తున్నారు. మొత్తానికి అకారణంగా వీరంతా వేధింపులకు గురవుతున్నారు.

లోన్ యాప్ వేధింపుల నుంచి బయటపడండిలా..

- ఎంచుకున్న లోన్‌యాప్ రివ్యూలు ఆన్‌లైన్‌లో చదవాకే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- యాప్‌లో అనవసరమైన కాంటాక్ట్ ఎనేబుల్ పర్మిషన్స్ ఇవ్వరాదు.
- పదేపదే కాల్స్ వస్తే బ్లాక్ చేయాలి లేదా ట్రూకాలర్‌లో వాటిని స్పామ్ నంబర్లుగా రిపోర్టు చేయాలి.
- అయినా వేధింపులు ఆగకపోతే.. డయల్ 100కి కాల్ చేసి చెప్పాలి లేదా సమీపంలోని పోలీసుస్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేయాలి లేదా 1930కి కాల్‌చేసి ఫిర్యాదు చేయవచ్చు.
- httpr://cybercrime.gov.in ఈ లింక్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చు.



క్లుప్తంగా...

ఇంటర్‌లో ఆన్‌లైన్ మూల్యాంకనం!

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ విద్యలో ఈ ఏడాది ఆన్‌లైన్ మూల్యంకనం చేపట్టాలని ఇంటర్ బోర్డు భావిస్తోంది. గత రెండేళ్లుగా ఈ ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. 2023లో కూడా ప్రయోగాత్మకంగా దీనిని తీసుకురావాలని భావించారు. కానీ ప్రభుత్వం అంగీకరించలేదు. దీనివల్ల ఇబ్బందులుంటాయని అధ్యాపక సంఘాలు ప్రభుత్వం వద్ద అభ్యంతరాలు తెలియజేయడంతో నిలిపివేశారు. అయితే, అన్ని యూనివర్సిటీల్లో కూడా డిగ్రీ, ఇతర కోర్సుల్లో ఆన్‌లైన్ మూల్యాకనం చేపడుతున్నారు. దీనివల్ల త్వరగా ఫలితాలు వెల్లడవుతాయని, పారదర్శకంగానూ ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఏటా దాదాపు 60 లక్షల పేపర్లకు మూల్యాంకనం చేపడుతున్నారు. దీనికోసం ప్రత్యేకంగా కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి వస్తోంది. అయితే ఈ కేంద్రాలకు రావడానికి కొంతమంది అధ్యాపకులు ఇష్టపడటం లేదు. కొత్త పద్ధతిలో దీనికి బదులు పేపర్ మూల్యాంకనం చేసే అధ్యాపకుడికి ఆన్‌లైన్‌లో సమాధాన పత్రాన్ని పంపుతారు. ఈ ప్రక్రియలో ఎక్కువమంది అధ్యాపకులను కూడా ఉపయోగించుకునే వీలుంటుందని చెపుతున్నారు.

ట్యాంక్ బండ్‌పై పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయండి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్ రావు గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని గౌడ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్ గూడలో జరిగిన కాటమయ్య రక్షణ కవచం పంపిణీ సభావేదికపై సీఎం రేవంత్ రెడ్డికి ఆయన వినతి పత్రం అందజేశారు. ప్రమాదవశాత్తు మృతిచెందిన గీత కార్మికుల కుటుంబాలకు అందించే ఎక్స్‌గ్రేషియా ఇంకా పెండింగ్‌లోనే ఉందని, తక్షణమే విడుదల చేసి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

లండన్‌లో ఘనంగా బోనాల జాతర

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసోసియేషన్ అఫ్ యునైటెడ్ కింగ్‌డమ్ (టాక్) ఆధ్వర్యంలో లండన్‌లో బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. పూజలు నిర్వహించి, తొట్టెల ఊరేగింపు చేశారు. పోతురాజు విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకలకు వెయ్యికి పైగా ప్రవాస తెలుగు కుటుంబాలు హాజరైనట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. విదేశాల్లో ఉన్నపటికీ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్తున్న తీరు గొప్పగా ఉందని హౌన్‌స్లో నగర డిప్యూటీ మేయర్ ముహమ్మద్ షకీల్ అక్రమ్ చెప్పారు. కార్యక్రమంలో టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల, ఉపాధ్యక్షుడు శుష్మణ రెడ్డి పాల్గొన్నారు.

దేశంలో మోదీ ప్రభ తగ్గింది

- టీపీసీసీ నేత నిరంజన్



సాక్షి, హైదరాబాద్: నాలు గొందల సీట్లు గెలుస్తామన్న బీజేపీకి సార్వత్రిక ఎన్నికల్లో చావు తప్పి కన్ను లొట్ట బోయిందని, ఇప్పుడు జరిగిన ఉపఎన్నికల్లో వచ్చిన ఫలితాలతో దేశంలో మోదీ ప్రభ తగ్గిందని అర్థమైందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ వ్యాఖ్యానించారు. గాంధీ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హిమాచల్, ఉత్తరాఖండ్, బెంగాల్, పంజాబ్, తమిళనాడు, మధ్యప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఇండియా కూటమికి 10 సీట్లు వస్తే, బీజేపీ కూటమికి వచ్చింది రెండేనని, మోదీకి ప్రజల్లో తగ్గుతున్న ఆదరణకు ఇదే నిదర్శనమన్నారు.

సీటొచ్చే ఆప్షనేంటి?

నేటితో ముగియనున్న ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ఆప్షన్లు

- ఆఖరి నిమిషం వరకూ కసరత్తు ముఖ్యం.. 19న తొలి విడత సీట్ల కేటాయింపు
- 71 వేల సీట్లకు 98 వేల మంది పోటీ.. లక్షల్లో ఆప్షన్లు ఇచ్చిన విద్యార్థులు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ తొలి విడత కౌన్సెలింగ్‌లో ఆప్షన్ల ప్రక్రియ సోమవారంతో ముగియనుంది. ఏవైనా మార్పులు చేర్పులకు చివరి అవకాశం ఇదే. కన్వీనర్ కోటాలో 71వేల సీట్లు ఉండగా, ఇప్పటివరకూ కౌన్సెలింగ్‌కు దాదాపు 98,238 మంది దరఖాస్తు చేశారు. వీరిలో 82 వేల మంది ఆప్షన్లు ఇచ్చారు. గత రెండు రోజుల్లో ధ్రువపత్రాల పరిశీలనకు వెళ్లిన విద్యార్థులు సోమవారం ఆప్షన్లు ఇచ్చే వీలుంది. మొత్తం మీద 90వేల మందికిపైగా విద్యార్థులు ఆప్షన్లు ఇవ్వొచ్చని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఆదివారం సాయంత్రం వరకూ దాదాపు 46 లక్షలకుపైగా ఆప్షన్లు అందినట్టు ఆ వర్గాలు తెలిపాయి. ఒక్కో విద్యార్థి బ్రాంచీలు, కాలేజీలతో వందకుపైగానే ఆప్షన్లు ఇస్తున్నారు. కౌన్సెలింగ్‌కు కొత్తగా సీట్లు వస్తాయని ఆశించినా ప్రభుత్వం అనుమతి ఇచ్చే అవకాశం కన్పించడం లేదు. తాజాగా జేఎన్‌టీయూహెచ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, సివిల్, మెకానికల్,



ఎలక్ట్రికల్ కోర్సులను తగ్గించడానికి తాము అంగీకరించడం లేదని చెప్పారు. దీన్నిబట్టి ఐఓటీ వంటి బ్రాంచీలను రద్దు చేసుకున్న వారికి మాత్రమే అదనపు సీట్లు వస్తాయని భావిస్తున్నారు.

ఇప్పుడే కీలకం

విద్యార్థులు ఆప్షన్లు ఇచ్చేప్పుడు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. ఆఖరి నిమిషం వరకూ కసరత్తు చేయాలని సూచిస్తున్నారు. తొలి విడత కౌన్సెలింగ్‌లో వచ్చే సీట్లలో ఎక్కువ మంది చేరే అవకాశం ఉంటుంది. కేవలం జేఈఈ టాపర్లు మాత్రమే దూరంగా ఉండే అవకాశం ఉంటుంది. వాళ్లు కూడా ఆఖరి కౌన్సెలింగ్ వరకూ సెల్ఫ్ రిపోర్టింగ్ చేసినా, సీటును రద్దు చేసుకోరు. కాబట్టి మొదటి కౌన్సెలింగ్‌లో కాకపోయినా రెండో విడతలో కోరుకున్న సీటు వస్తుందనే ఆశ సరికాదని చెబుతున్నారు. చాలామంది తమ ర్యాంకును బట్టి, ఏయే కాలేజీలో ఏయే బ్రాంచీలో సీటొస్తుందో ఓ అంచనాకు రావాల్సి ఉంటుంది. దీని ప్రకారం ప్రాధాన్యత క్రమాన్ని ఎంచుకుంటే బాగుంటుందని సూచిస్తున్నారు. ఉదాహరణకు ఐటీలో తమకు దగ్గర్లోని కాలేజీలో సీటు వచ్చే అవకాశం ఉంటుంది. కానీ దాన్ని ప్రాధాన్యతల్లో చేర్చడం లేదు. దీనివల్ల ఆ సీటు వేరే వాళ్లకు వెళ్తుంది. తర్వాత కౌన్సెలింగ్‌ల్లో కోరుకున్నా సీటు వచ్చే అవకాశం ఉండదు.

కసరత్తు చేయాలి: ఎంఎస్ రావు (గణిత శాస్త్ర నిపుణుడు)

ఆప్షన్లు ఇచ్చేప్పుడు విద్యార్థులు ఆఖరి నిమిషం వరకూ కసరత్తు చేయాలి. అవసరం అనుకుంటే ఆప్షన్లు మార్చుకునే వెసులుబాటు ఉంటుంది. ర్యాంకుకు దగ్గరగా ఉండే కాలేజీలకు ప్రాధాన్యం ఇవ్వడం ముఖ్యం. ఏ ర్యాంకు వరకూ ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందనేది పరిశీలించాలి. తొలి విడత ఆప్షన్లు చాలా కీలకమనే విషయాన్ని విద్యార్థులు గుర్తించాలి.

అన్ని వివరాలు పరిశీలించాలి...

గత ఏడాది ప్రతీ కాలేజీలో కటాఫ్ ఏ విధంగా ఉందనే వివరాలను సాంకేతిక విద్య విభాగం వెబ్‌సైట్‌లో ఉంచింది. 2023–24లో 86,671 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో కన్వీనర్ కోటా కింద 70 శాతం భర్తీ చేయాలి. కానీ 81 శాతం మాత్రమే భర్తీ అయ్యాయి. ఈసారి స్లైడింగ్ సీట్లు పెరిగినా 10 వేల సీట్లు అదనంగా వచ్చే వీలుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని గత ఏడాది కన్నా కొంత అటూ ఇటూగా కటాఫ్‌ను అంచనా వేయొచ్చని నిపుణులు అంటున్నారు. బ్రాంచీకి ప్రాధాన్యత ఇవ్వాలనుకుంటే, కాలేజీ విషయాన్ని రెండో ఐచ్ఛికంగా చూడటం ఉత్తమం. కాలేజీ ప్రాధాన్యత అనుకుంటే ఏ బ్రాంచీలో సీటు వస్తుందనేది అంచనా వేసి ఆప్షన్ పెట్టడం మంచిది. ఆప్షన్లు ఇచ్చేటప్పుడు కాలేజీల ఫీజు, రీయింబర్స్‌మెంట్ వివరాలు, దగ్గర్లో ఉన్న కాలేజీ ఏంటి? అనే వివరాలను పరిశీలించి ఆప్షన్లు ఇవ్వడం మంచిదని నిపుణులు అంటున్నారు.



మహంకాళీ అమ్మవారి ఘటాన్ని బయటకు తీసుకొస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ప్రజాభవన్‌లో వైభవంగా బోనాలు

- హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు, ఎమ్మెల్యేలు
- నల్ల పోచమ్మ ఆలయంలో పూజలు

లక్డీకాపూల్: ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం తెలంగాణ ప్రజాభవన్‌లోని నల్ల పోచమ్మ దేవాలయంలో బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేంరెడ్డి నరేందర్ రెడ్డి హాజరయ్యారు. ప్రజాభవన్‌కి విచ్చేసిన సీఎం, మంత్రులకు భట్టి దంపతులు పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలికారు. పండితుల మంత్రోచ్ఛారణల మధ్య భట్టి దంపతులు బోనాలకు, మహంకాళి అమ్మవారి ఘటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత నల్ల పోచమ్మ అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం మంత్రి కొండా సురేఖ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందిని, ఎమ్మెల్యే ఎన్ ఉత్తమ్ పద్మావతి, పలువురు మహిళా ప్రజాప్రతినిధులు బోనమెత్తారు. రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి మహంకాళి అమ్మవారి ఘటాన్ని ఇంట్లో నుంచి బయటకు తీసుకువచ్చి జోగిని తలపై ఎత్తారు. డిప్యూటీ సీఎం నివాసం నుంచి ప్రజాభవన్ ఆవరణలోని నల్ల పోచమ్మ దేవాల యం వరకు డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యా సాల మధ్యన బోనాలను ఎత్తుకెళ్లారు. అనంతరం అమ్మవారికి భట్టి విక్రమార్క దంపతులు బోనంలో ఉన్న నైవేద్యాన్ని సమర్పించారు. నల్ల పోచమ్మ దేవాలయంలో భట్టి విక్రమార్కతో కలిసి రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలతో విలసిల్లాలని అమ్మవారిని వేడుకున్నారు.

35 మందిని ఒకేసారి విలీనం చేసుకోండి



- సీఎం రేవంత్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొంటున్నారు
- బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ధ్వజం

గజ్వేల్‌రూరల్/ప్రశాంత్‌నగర్: 'బావ, బామ్మర్ది, మామ (హరీశ్, కేటీఆర్, కేసీఆర్).. ముగ్గురిని వదిలేసి, 35 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ ఒకేసారి విలీనం చేసుకోవాలి'అని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు వ్యంగ్యంగా అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో మహంకాళీ బోనాల ఉత్సవాలకు హాజరైన ఆయన అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, రాజ్యాంగంపై ప్రమాణం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి.. సంతలో పశువులను కొన్నట్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొంటున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో రాజ్యాంగ విలువల గురించి మట్లాడుతూ, ఇక్కడ రేవంత్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొనడాన్ని ఎందుకు చెక్ పెట్టలేకపోతున్నారని ప్రశ్నించారు. ఒక సీఎం వేరే పార్టీకి చెందిన ఎమ్మెల్యేకు కండువా కప్పిన మరుక్షణం ఆ ఎమ్మెల్యేను డిస్క్వాలిఫై చేయాలని కర్ణాటకలో హైకోర్టు తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. ఈ విషయంలో తెలంగాణ న్యాయమూర్తులు, సుప్రీంకోర్టు జడ్జీలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

పాలనపై దృష్టిపెట్టాలి..: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పార్టీ ఫిరాయింపులపై కాకుండా పరిపాలనపై సీఎం దృష్టి సారించాలని ఎంపీ రఘునందన్ రావు హితవు పలికారు. ఆదివారం ఆయన సిద్దిపేట జిల్లా బీజేపీ కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రభుత్వంలో నంబర్ టూగా చెలామణి అవుతున్న మంత్రి, బీఆర్ఎస్ బెదిరింపులు ఆపేదాక ఎమ్మెల్యేల ఫిరాయింపులు ఉంటాయనడం సరికాదన్నారు.

రెడ్డి జనసంఘం సేవలు భేష్

- విద్యార్థులకు సాయం అందజేయడం గొప్ప విషయం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- 353 మంది విద్యార్థులకు రూ.30 లక్షల చెక్కుల పంపిణీ



విద్యార్థులకు చెక్కులను అందజేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సుల్తాన్‌బజార్: విద్యార్థులకు విద్యను అభ్యసించేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తున్న రెడ్డి జన సంఘం సేవలు అభినందనీయమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం అబిడ్స్‌లోని రెడ్డి బాలుర వసతి గృహంలోని ఆడిటోరియంలో రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో 2023–24 విద్యా సంవత్సరానికి చెందిన ఇంజనీరింగ్, మెడికల్, గ్రాడ్యుయేషన్‌లలో మెరిట్ సాధించిన 353 మంది విద్యార్థులకు రూ.30 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రెడ్డి జన సంఘం అబిడ్స్ సభ్యుల కోరిక మేరకు రెండెకరాల స్థలం కేటాయించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఉపకార వేతనాలు ఇచ్చిన దాతలు డాక్టర్ మహిపాల్ రెడ్డి, ఆర్‌జేఎస్ సుకన్యారెడ్డి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ బాలకృష్ణారెడ్డిని ఘనంగా సన్మానించిన అనంతరం విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించారు.కాగా, మంత్రి పొంగులేటిని, నల్లగొండ ఎంపీ కందూరి రఘువీర్ రెడ్డిని జన సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి నర్సింహారెడ్డి, సలహాదారులు ప్రొఫెసర్ కంచర్ల దశరథ్‌రెడ్డి, కోశాధికారి కాశిరెడ్డి పాండురంగారెడ్డి సత్కరించారు.

'విద్యుత్ కమిషన్'పై సుప్రీంకోర్టుకు కేసీఆర్

- నేడు విచారించనున్న సీజేఐ ధర్మాసనం



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం నియమించిన విద్యుత్ కమిషన్‌ను రద్దు చేయాలంటూ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ కేసీఆర్ తరపున న్యాయవాది మోహిత్ రావ్ పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో తెలంగాణ ప్రభుత్వం, జస్టిస్ ఎల్. నరసింహారెడ్డిలను ప్రతివాదులుగా చేర్చారు. సోమవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించనుంది.

డబుల్ పెన్షనర్ల నుంచి రూ.10 లక్షలు రికవరీ

- నోటీసులు రావడంతో డబ్బు చెల్లించిన పది మంది సర్వీసు పెన్షనర్లు
- వారికి ఆసరా పెన్షన్ల రద్దు.. వాయిదాల్లో రికవరీకి ప్రణాళిక



జూలై 6న 'సాక్షి'లో ప్రచురితమైన కథనం

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ సర్వీసు పెన్షన్లు, సామాజిక ఆసరా పెన్షన్.. రెండూ పొందుతున్న పది మంది రూ.10 లక్షలను తిరిగి ప్రభుత్వ ఖజానాకు చెల్లించారు. జిల్లాలో 71 మంది రెండు పెన్షన్లు పొందుతున్నట్లుగా పేర్కొంటూ జూలై 6న 'సాక్షి'లో 'ప్రభుత్వ పెన్షనర్లకు ఆసరా' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో రెండు పెన్షన్లు పొందుతున్న వారికి పంచాయతీ కార్యదర్శుల ద్వారా నోటీసులు జారీచేశారు. రెండు పెన్షన్లు పొందుతున్న వారు ఆసరా పెన్షన్ డబ్బులను తిరిగి చెల్లించాలని ఆదేశించారు. కాగా, ఏళ్ల తరబడి పొందిన ఆసరా పెన్షన్ డబ్బులను ఒకేసారి చెల్లించడం ఇబ్బందిగా ఉండడంతో రికవరీకి సమయం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు వారికి వెసులుబాటు కల్పించారు. ఇప్పటికే 10 మంది రూ.10 లక్షలు చెల్లించగా.. ఇంకా 61 మంది, రూ.47.75 లక్షల మేరకు చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తాన్ని దశలవారీగా రికవరీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఆసరా పెన్షన్లు నిలిపివేసి, సర్వీసు పెన్షన్ నుంచి ఆ సొమ్మును దశలవారీగా రికవరీ చేయాలని జిల్లా అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఒకేసారి చెల్లించాలని ఒత్తిడి చేయకుండా వాయిదా పద్ధతిలో వసూళ్లకు ప్రణాళిక సిద్ధం చేశారు.

రాచకొండలో ఫిలింసిటీ

▶ మొదటి పేజీ తరువాయి

చుట్టూ, చెరువులు, కుంటలు, కాలువగట్లు, జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి రహదారులకు ఇరువైపులా ఈత, తాటి చెట్లు నాటిస్తాం. వన మహోత్సవంలో భాగంగా ఈ చెట్లను పెద్ద సంఖ్యలో నాటాల్సిందిగా ఎక్సైజ్, అటవీ శాఖలకు ఇక్కడి నుంచే ఆదేశాలు జారీ చేస్తున్నా. కొత్తగా పుట్టుకొచ్చే రియల్ ఎస్టేట్ వెంచర్లతో పాటు గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాల్లోనూ ఈత, తాటి చెట్లకు ప్రాధాన్యత ఇచ్చేలా నిబంధనలు తీసుకొస్తాం. చేతి వృత్తులకు సమ న్యాయం కల్పిస్తాం.

ప్రభుత్వాన్ని నిలబెడతామంటూ పార్టీలో చేరుతున్నారు!

'కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరుసగా ఎన్నికలే. ఇటీవలే ఎన్నికలు ముగిశాయి. ప్రభుత్వం పాలనపై దృష్టి పెట్టింది. సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ వస్తోంది. ఈ లోపే బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్రలు పన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అర్థం పర్థం లేని ఆరోపణలు చేస్తున్నారు. ప్రభుత్వం కూలిపోతుందని విష ప్రచారం చేస్తున్నారు. ఫాం హౌస్‌లలో పడుకున్నోళ్లు ప్రభుత్వాన్ని కూలుస్తామంటుంటే.. ప్రజాక్షేత్రంలో తిరిగే వారి ఎమ్మెల్యేలు మాత్రం నిలబెడతామంటూ వచ్చి పార్టీలో చేరుతున్నారు. వచ్చే పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుంది. ప్రజలు ఆశించే అన్ని పనులు పూర్తి చేసి తీరుతుంది. పోటీ పరీక్షల షెడ్యూల్‌పై నిరుద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రతిపక్ష నేతల మాటలు విని భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు. అయినదానికి, కానిదానికి ఆవేశపడి రోడ్లెక్కొద్దు. ఏదైనా ఉంటే మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి మాట్లాడండి. అంతా కలిసి సమస్యను పరిష్కరించుకునేందుకు కృషి చేద్దాం..' అని సీఎం చెప్పారు. కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, డి.శ్రీధర్‌బాబు, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్ ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రకాశ్‌గౌడ్, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, జిల్లా కలెక్టర్ శశాంక తదితరులు పాల్గొన్నారు.



వనమహోత్సవంలో భాగంగా ఈత మొక్క నాటి నీరు పోస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

రోజూ ఎన్ని చెట్లు ఎక్కుతావు?

గీత కార్మికులతో సీఎం సంభాషణ

అబ్దుల్లాపూర్‌మెట్: 'ఏం లక్ష్మయ్యా..రోజుకు ఎన్ని చెట్లు ఎక్కుతావ్? ఎన్ని సీసాల కల్లు తీస్తావ్? తీసేదాంట్లో కల్లెంత.. నీళ్లెంత..? రోజుకు కనీసం రూ.వెయ్యి అయినా మిగులుతుందా? ఊళ్లో బెల్ట్ షాపులు ఏమైనా ఉన్నాయా..?'

'ఏం రంగయ్యా.. ఏం కిష్టయ్యా.. ప్రభుత్వం ఇచ్చిన రక్షణ కిట్టు మంచిగుందా? పనిచేస్తోందా? కిట్టును కనిపెట్టినోళ్లకు ఏమైనా దావత్ ఇచ్చారా..?' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి లష్కర్‌గూడలో కల్లుగీత కార్మికులతో కొద్దిసేపు ముచ్చటించారు. వృత్తిపరంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు స్పీకర్, మంత్రులతో కలిసి వన మహోత్సవంలో భాగంగా ఈత మొక్కలు నాటారు. గీత కార్మికులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

అనర్హుల నుంచి ఇప్పుడే రికవరీలు వద్దు

- అన్ని శాఖలు, కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశం
- అర్హులకే సంక్షేమ పథకాలు అందేలా త్వరలో కొత్త మార్గదర్శకాలు
- రికవరీలకు కొత్త విధానం ప్రకటించేంత వరకు నోటీసులు కూడా పంపొద్దు..,

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలో అనర్హులను చేర్చి ప్రయోజనం కల్పిస్తున్న అంశంపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. పథకాలు మరింత కట్టుదిట్టంగా, సమర్థవంతంగా అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే చేరేలా కొత్త మార్గదర్శకాలను త్వరలో ప్రకటిస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. ఆలోగా పథకాల ద్వారా లబ్ధిపొందిన అనర్హులైన వ్యక్తులకు నోటీసులు జారీ చేయడం, వారి నుంచి నగదును తిరిగి వసూలు (రికవరీ) చేయడం వంటి చర్యలకు ఉపక్రమించరాదని ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం అన్ని ప్రభుత్వ శాఖల కార్యదర్శులతోపాటు జిల్లా కలెక్టర్లకు లేఖ రాశారు. అర్హులకు మాత్రమే అందేలా ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్రమబద్ధం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం విస్తృతంగా సంప్రదింపులు జరుపుతోందని తెలిపారు. ఇప్పటికే గుర్తించిన సమస్యలు, వాటికి సాధ్యమైన పరిష్కారాలపై త్వరలో జరగనున్న శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం చర్చించనుందన్నారు. ఆ తర్వాత ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు కట్టుదిట్టంగా అందించడానికి మార్గదర్శకాలను జారీ చేస్తుందన్నారు. అనర్హులు లబ్ధిపొందినట్టు నిర్ధారణ జరిగితే వారి నుంచి రికవరీ చేసేందుకు అవలంబించాల్సిన విధానాన్ని సైతం ప్రకటించనుందన్నారు. ఈ కొత్త మార్గదర్శకాలు, రికవరీ విధానం ప్రకటించేంత వరకు అనర్హులైన లబ్ధిదారులపై ఎలాంటి చర్యలకు ఉపక్రమించరాదని సీఎస్ ఆదేశించారు.

క్లుప్తంగా...

ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేయండి

- టీచర్లకు కోదండరాం పిలుపు



శిక్షణ కార్యక్రమంలో కోదండరాం తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఉపాధ్యాయ వర్గం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషియాలని ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. టీచర్ల బదిలీలు, పదోన్నతులతో పాఠశాలల్లోని అన్ని ఖాళీలను ప్రభుత్వం నింపే ప్రయత్నం చేసినందున ఇక నుంచి బడుల బలోపేతంపై దృష్టిపెట్టాలని సూచించారు. ఆదివారం కాచిగూడలోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యకర్తల శిక్షణా శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. సర్కారు బడులపై మరింత విశ్వాసం కలిగించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. తొలి ఉపాధ్యాయ సంఘంగా ఎస్టీయూ అనేక ఉపాధ్యాయ హక్కులను పరిరక్షించిందని ఈ సందర్భంగా కోదండరాం గుర్తుచేశారు. అర్హులైన టీచర్లకు జేఎల్, ఎంఈవో, డిప్యూటీ ఈవో పదోన్నతులకు సంబంధించి ప్రభుత్వంతో మాట్లాడతానని హామీనిచ్చారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎం పర్వత్‌రెడ్డి, జీ సదానందంగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, బదిలీ అయ్యి రిలీవ్ కాని టీచర్లను వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగులపై నిర్బంధం ఆపాలి: తమ్మినేని



సాక్షి, హైదరాబాద్: గ్రూప్ 2, గ్రూప్ 3, డీఎస్సీ అభ్యర్థుల పట్ల పోలీసుల నిర్బంధం ఆపాలని, వారి న్యాయమైన సమస్యలను తక్షణం పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రాత్రి హైదరాబాద్‌లోని అశోక్‌నగర్ చౌరాస్తాలో డీఎస్సీ అభ్యర్థులు వందలాదిగా బైఠాయించడంతోపాటు దిల్‌సుఖ్‌నగర్‌లో ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. డీఎస్సీకీ గ్రూప్స్ పరీక్షలకు మధ్య కనీసం నెలరోజుల వ్యవధి ఉండాలని నిరుద్యోగులు కోరడం న్యాయమైనదేనని కానీ ప్రభుత్వం మాత్రం మొండిగా వ్యవహరిస్తోందని ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు.

ఓయూలో కొనసాగుతున్న ముందస్తు అరెస్టులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో విద్యార్థుల ముందస్తు అరెస్టులు కొనసాగుతున్నాయి. ఆదివారం బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు జంగయ్య, రమేశ్, సాయిని అరెస్టు చేశారు. వివిధ ఉద్యోగాల రాత పరీక్షల వాయిదా కోసం జరుగుతున్న ఆందోళనలో భాగంగా ఉదయం 6 గంటలకు ఎన్‌ఆర్‌ఎస్ హాస్టల్ నుంచి విద్యార్థులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

హామీల అమలుపై దృష్టి పెట్టండి

బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్

సాక్షి, హైదరాబాద్: పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యేలను చేర్చుకునే అంశాన్ని పక్కన పెట్టి ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలని బీజేపీ శాసనసభ్యుడు పాయల్ శంకర్ రేవంత్‌రెడ్డి సర్కార్‌కు హితవు పలికారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లపై భువనగిరి పార్లమెంట్ సభ్యులు సామల కిరణ్ కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను పాయల్ శంకర్ ఆదివారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. అంచలంచెలుగా ఎదిగి, పోరాట పటిమ, ప్రజా సమస్యలపై పోరాటంతో పైకి వచ్చిన నేతలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అని అన్నారు. కేసీఆర్, కేటీఆర్ లను కాంగ్రెస్ లోకి తీసుకున్నా తమకు అభ్యంతరం లేదన్నారు. విలువలతో కూడిన రాజకీయం చేయాలని సూచించారు. బీజేపీలోకి ఎవరు వచ్చిన రాజీనామా చేసి మళ్లీ ఉప ఎన్నికల్లో పోరాడాలని, ఇప్పటివరకు వచ్చిన వారంతా అలాంటి వారే అని అన్నారు. నిరుద్యోగుల సమస్యలకు మద్దతుగా ఎవరైనా దీక్ష, నిరసన చేయవచ్చని, సమస్య పరిష్కారానికి రేవంత్ సర్కార్ నిరుద్యోగులను పిలిచి మాట్లాడాలన్నారు.

ఆర్టీసీ నియామకాల్లో 'మూడు ముక్కలాట'

సొంతంగా ఖాళీల భర్తీ అధికారం కోల్పోయిన ఆర్టీసీ ● టీజీపీఎస్సీ, వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డులకు అప్పగింత

- ఇటీవలే 3,035 ఖాళీల భర్తీకి అనుమతించిన ప్రభుత్వం
- కానీ, ఎప్పుడు భర్తీ చేస్తాయో స్పష్టతనివ్వని ఆయా సంస్థలు
- జాబ్ కేలండర్ ఆధారంగా నోటిఫికేషన్లు జారీ చేస్తామని వెల్లడి
- 1200మంది డ్రైవర్ల కొరత.. ఉన్న డ్రైవర్లకు డబుల్ డ్యూటీలు



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలో ఖాళీల భర్తీ వ్యవహారం మూడు ముక్కలాటగా మారింది. సంస్థలో 3035 పోస్టుల భర్తీకి ఇటీవలే ప్రభుత్వం అనుమతించింది. అయితే ఇప్పటి వరకు ఆర్టీసీలో ఖాళీల భర్తీకి సంస్థనే సొంతంగా నియామకాలు చేపడుతూ వస్తోంది. కానీ, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్టీసీ అధికారానికి కోత పెడుతూ.. సొంతంగా భర్తీ చేసుకునే వీలు లేకుండా నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ బాధ్యత చూస్తున్న టీఎస్‌పీఎస్సీకి ఆ బాధ్యత అప్పగించింది. డ్రైవర్‌లాంటి పోస్టుల భర్తీ బాధ్యత తమకు వద్దంటూ ఆ సంస్థ పేర్కొనటంతో పోలీసు రిక్రూట్‌బోర్డుకు అటాచ్ చేసింది. డ్రైవర్లు, శ్రామిక్‌లు, సూపర్‌వైజర్లు లాంటి పోస్టుల నియామక బాధ్యతను దానికి అప్పగించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది నియామకాల బాధ్యతను వైద్య ఆరోగ్యశాఖ నియామక విభాగానికి అప్పగించారు. దీంతో ఈ మూడు సంస్థలు ఆర్టీసీలో ఖాళీల భర్తీని చూడనున్నాయి. ఫలితంగా పోస్టులు ఎప్పుడు భర్తీ అవుతాయో ఆర్టీసీకే తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.

జాబ్ కేలండర్ ఆధారంగానే...

ఒకే అభ్యర్థి ఏక కాలంలో రెండుమూడు ఉద్యోగాల కోసం యత్నించటం సహజం. దీంతో అర్హత ఉన్న అన్ని ప్రవేశ పరీక్షలు రాస్తుంటారు. ఆయా పరీక్షలన్నింటికీ వారు హాజరు కావాలంటే వాటి నిర్వహణ తేదీలు వేరువేరుగా ఉండాల్సి ఉంటుంది. ఒకేరోజు రెండు పరీక్షలుంటే, ఏదో ఒక పరీక్షను మిస్ చేసుకోవాల్సిందే. దీంతో ఆయా సంస్థలు సమన్వయం చేసుకుని వేర్వేరు తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తాయి. జాబ్ క్యాలెండర్ ఆధారంగా ఇది సాగుతుంది. ఇప్పుడు ఇదే ఆర్టీసీకి ఇబ్బందిగా మారింది. ఆర్టీసీకేమో ఖాళీల భర్తీ అత్యవసరం. కానీ, భర్తీ ప్రక్రియ చూసే మూడు సంస్థలు ప్రత్యేకంగా ఆర్టీసీ కోసం ఏర్పాట్లు చేసేందుకు ససేమిరా అంటున్నాయి. ఇతర శాఖల్లోని ఖాళీల భర్తీకి సంబంధించి పరీక్షల నిర్వహణకు రూపొందించే షెడ్యూల్ ఆధారంగానే ప్రక్రియ ఉంటుందని స్పష్టం చేస్తున్నాయి.

రాష్ట్రం వచ్చిన తర్వాత కొత్త నియామకాల్లేవ్

ఉమ్మడి రాష్ట్రంలో 2012లో చివరి సారిగా ఆర్టీసీలో ఖాళీల భర్తీ జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత కొత్త నియామకాలు చేపట్టలేదు. ప్రతినెలా పదవీ విరమణలు కొనసాగుతుండటంతో క్రమంగా సిబ్బంది సంఖ్య తగ్గిపోతూ బస్సుల నిర్వహణ పెద్ద సమస్యగా మారింది. ఓ దశలో మూడు వేలకుపైగా డ్రైవర్ పోస్టులు ఖాళీ అయ్యాయి. 2019లో ప్రభుత్వం ఆదేశించిందంటూ ఏకంగా 2 వేల బస్సులను ఆర్టీసీ తగ్గించుకుంది. అలా కొంత సమస్యను అధిగమించింది. ఆ తర్వాత మళ్లీ కొత్త బస్సులు అవసరమంటూ అద్దె బస్సుల సంఖ్యను ఒక్కసారిగా పెంచింది. అద్దె బస్సుల్లో వాటి యజమానులే డ్రైవర్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇలాంటి పద్ధతులతో ఎలాగోలా నెట్టుకొస్తూ వస్తోంది. మొత్తంగా చూస్తే ప్రస్తుతం 1200 డ్రైవర్ల కొరత ఉంది. ఫలితంగా ఉన్న డ్రైవర్లకు డబుల్ డ్యూటీలు వేస్తున్నారు. ఇది డ్రైవర్లపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోంది. నిద్ర కూడా చాలని స్థితిలో వారు డ్రైవింగ్ విధుల్లో ఉంటున్నారు. ఇది బస్సు ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారమిస్తోందని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

కనీసం డ్రైవర్ పోస్టులు భర్తీ చేయాలంటూ..

డ్రైవర్ల కొరత తీవ్రంగా ఉందనీ వెంటనే ఖాళీల భర్తీని చేపట్టాలంటూ తాజాగా పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డును ఆర్టీసీ అభ్యర్థించింది. పలుదఫాలు కోరిన మీదట ఆగస్టులో చూద్దామని ఆ బోర్డు పేర్కొన్నట్టు సమాచారం.

హరీశ్‌రావు మంచి నేత

ప్రజాభిమానం ఉంది

- ఆయన బీజేపీలోకి రావాలన్నా రాజీనామా చేసి రావాల్సిందే
- బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనం ఆ రెండు పార్టీలూ ఆడుతున్న డ్రామా
- కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు



కరీంనగర్ టౌన్: 'రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు మంచి రాజకీయ నాయకుడు. కేసీఆర్, కేటీఆర్‌లపై వ్యతిరేకత ఉంది కానీ, హరీశ్ ఉద్యమ నాయకుడు.. జనంలో మంచి పేరు ఉంది. బీజేపీలో చేరాలని చాలామంది బీఆర్‌ఎస్ నేతలకు ఉంది. కానీ మేం ఎవరినీ రమ్మని అడగట్లేదు. ఎవరొచ్చినా పదవులకు రాజీనామా చేసి రావాల్సిందే. ఒకవేళ హరీశ్‌రావు వచ్చినా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రావాల్సిందే. ఇది మా విధానం. హరీశ్‌రావుకు ప్రజాభిమానం ఉంది. సులభంగా గెలుస్తారు..' అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ వ్యాఖ్యానించారు. ఆదివారం కరీంనగర్‌లో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సన్మానం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనం, హరీశ్ బీజేపీలో చేరతారంటూ జరుగుతున్న ప్రచారంపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

ఆ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించే దమ్ముందా?

'బీజేపీలో బీఆర్‌ఎస్‌ను విలీనం చేయబోతున్నారంటూ జరుగుతున్న ప్రచారమంతా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఆడుతున్న కుట్రలో భాగం. బీఆర్‌ఎస్‌ను కాపాడుకోవడానికి కేసీఆర్, దొంగ హామీల నుండి ప్రజల దృష్టి మళ్లించడానికి కాంగ్రెస్ నేతలు ఆడుతున్న డ్రామా. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను కాపాడుకోలేక కేసీఆర్ ఆ పార్టీ లీడర్లను ఢిల్లీకి పంపి లీకులిస్తున్నారు. అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరుతున్నారని మాట్లాడుతున్న అధికార పార్టీ నేతలారా.. నిజంగా మీరు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు భావిస్తే మీ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలందరితో రాజీనామా చేయించి ఉప ఎన్నికల్లో ప్రజా తీర్పు కోరే దమ్ముందా? ప్రజలిచ్చిన తీర్పును అపహాస్యం చేస్తూ కొందరు ఎమ్మెల్యేలు తమ అక్రమాస్తులను కాపాడుకోవడానికే అధికార పార్టీలో చేరుతున్నారు. పైకి మాత్రం సిగ్గు లేకుండా నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరుతున్నామని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు చెప్పడం సిగ్గుచేటు. ప్రజలు పిచ్చోళ్లు కాదు. ఏ పార్టీ ని చూసి ప్రజలు మీకు ఓటేశారు. మీరు ఏ పార్టీలో కి వెళుతున్నారు?..' అంటూ సంజయ్ మండిపడ్డారు.

మాపై దాడులు ఎవరూ మర్చిపోలేదు

'కేసీఆర్ హయాంలో నాతో పాటు బీజేపీ కార్యకర్తలపై జరిగిన దాడులు, పెట్టిన అక్రమ కేసులు, హింస, జైళ్లలో వేయడాన్ని ఎవరూ మర్చిపోలేదు. మేం ఆ పార్టీతో పొత్తు ఎందుకు పెట్టుకుంటాం? అధికార పార్టీ ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా జనం నమ్మలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని 8 ఎంపీ స్థానాల్లో గెలిపించారు. ఇప్పుడు మాకున్న ఏకైక లక్ష్యం తెలంగాణను అభివృద్ధి చేయడమే. కాంగ్రెస్ పార్టీ మోసాలను, దొంగ హామీలను ప్రజలు గుర్తించారు. అందుకే కాంగ్రెస్‌ను ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. అశోక్‌నగర్‌లో నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనే ఇందుకు నిదర్శనం. యువతను రెచ్చగొడితే కాంగ్రెస్‌కే నష్టమని గుర్తుంచుకుని వ్యవహరించాలి..' అని సంజయ్ అన్నారు.

అదేమన్నా బ్యాంకు లోనా?!

'ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై వన్ టైం సెటిల్‌మెంట్ ఏంటి? ఇదేమైనా బ్యాంకు అనుకుంటున్నారా? లోన్లు తీసుకుని వడ్డీలు కట్టలేకపోతే వన్ టైం సెటిల్‌మెంట్ చేసుకోవడానికి? ఏళ్ల తరబడి ఫీజు కట్టక పోవడంతో కాలేజీల యాజమాన్యాలు అనేక ఇబ్బందుల్లో ఉన్నాయి. విద్యార్థులు కష్టాలు పడుతున్నారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి..' అని కేంద్ర మంత్రి డిమాండ్ చేశారు.

గల్ఫ్ గోడువింటే గుండె తరుక్కుపోతుంది

- అక్కడి కార్మికుల కష్టాలు స్వయంగా చూశా: కేటీఆర్
- 'మేక బతుకు'పుస్తకం ఆవిష్కరణ



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో కేటీఆర్, ఘంటా చక్రపాణి తదితరులు

సాక్షి, హైదరాబాద్: గల్ఫ్ కార్మికుల కష్టాలు విన్నా, చూసినా గుండె తరుక్కుపోతుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. తాను స్వయంగా దుబాయ్‌లో అక్కడి లేబర్ క్యాంపులో కార్మికుల కష్టాలను చూశానని తెలిపారు. అక్కడ వారు బతుకీడుస్తున్న పరిస్థితులను చూస్తే బాధ కలుగుతుందని చెప్పారు. వలస ఎంత వాస్తవమో వలసలో దోపిడీ కూడా అంతే వాస్తవమని, అది దుబాయ్ అయినా హైదరాబాద్, ఇంకెక్కడైనా అదే జరుగుతుందని పేర్కొన్నారు. స్వర్ణ కిలారి రాసిన 'మేక బతుకు'పుస్తకాన్ని ఆదివారం ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు.

ప్రత్యేక పాలసీ కోసం గతంలో యత్నాలు

గతంలో గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక పాలసీ తేవాలని ప్రయత్నం చేసినట్లు కేటీఆర్ తెలిపారు. టామ్ కామ్ సంస్థ ద్వారా కొంత ప్రయత్నం చేశామని, మరింత ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. పెద్దూరు వలస కార్మికుల కోసం దుబాయ్‌లోని జైలుకు వెళ్లి కలిసి వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. వారిని విడిపించేందుకు అనేక ప్రయత్నాలు చేసి, సంవత్సరాల తర్వాత చివరికు ఇండియాకి తీసుకు రాగలిగినట్లు చెప్పారు. గతంలో సుష్మా స్వరాజ్ విదేశాంగ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు తెలుగు రాష్ట్రాల నుంచి గల్ఫ్‌కు జరుగుతున్న మహిళల అక్రమ రవాణాపై చర్చించారని, దీనిపై ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ఒకనాడు దేశంలో ఎక్కడ నిర్మాణం జరిగినా పాలమూరు జిల్లా నుంచి వలసలు ఉండేవని, ఈరోజు అనేక రాష్ట్రాల నుంచి తెలంగాణకు వలస వస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం సమాజంలో చదివే అలవాటు బాగా తగ్గుతూ వస్తోందని, ఇలాంటి సమయంలోనూ అన్వీక్షికి సంస్థ 'మేక బతుకు'పుస్తకాన్ని తీసుకురావడం హర్షణీయమని అన్నారు. సమాజంలో చైతన్యం, మార్పు తీసుకురాగలిగే సాహిత్యానికి మరింత మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని కేటీఆర్ చెప్పారు. ఈ దిశగా పుస్తక ప్రచురణలతో పాటు డిజిటల్ మాధ్యమాల ద్వారా, ఆడియో పుస్తకాల ద్వారా మరింత ప్రయత్నం జరగాలని సూచించారు.

కుటుంబం యూనిట్‌గా రుణమాఫీ!

▶ మొదటి పేజీ తరువాయి

మంది రైతులకు దీనితో లబ్ధి జరుగుతుందని అంచనా. అయితే రుణమాఫీ కోసం పీఎం కిసాన్ పథకంలోని మార్గదర్శకాలను అమలు చేసే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. పీఎం కిసాన్ పథకంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్లు, జెడ్పీ చైర్మన్లు, రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, అధిక ఆదాయం ఉండి ఐటీ పన్ను చెల్లించేవారిని మినహాయించారు. అదే తరహాలో ఇప్పుడు రుణమాఫీని మినహాయించే అవకాశం ఉందని అంటున్నారు. అయితే ఆదాయ పన్ను చెల్లించే అందరినీ కాకుండా అధిక ఆదాయం ఉన్నవారిని మాత్రమే మినహాయించే ఆలోచన ఉన్నట్టు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో అందరినీ మినహాయించకుండా.. అటెండర్ల వంటి చిన్నస్థాయి ఉద్యోగులకు రైతు రుణమాఫీ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నారు. అయితే ఈ విషయంలో ఆచితూచి వ్యవహరించాలని.. మిగిలే మొత్తం ఎక్కువగా ఉంటేనే పీఎం కిసాన్ నిబంధనలు అమలు చేయాలని, లేకుంటే ఉదారంగానే రుణమాఫీ ఇవ్వాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఏదేమైనా పంటలు పండించే ప్రతి రైతుకు ప్రయోజనం కలిగించేలా పథకం అమలు జరుగుతుందని అధికారులు అంటున్నారు.

బంగారం పెట్టి తీసుకున్న రుణాలు కూడా..!

బంగారం తాకట్టు పెట్టి పంట రుణాలు తీసుకున్న రైతులకు కూడా రుణమాఫీ పథకాన్ని వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. గ్రామీణ బ్యాంకుల్లో పట్టాదారు పాస్‌బుక్‌ను జత చేసి, పంటల కోసం తీసుకున్న బంగారం రుణాలకు మాత్రమే రుణమాఫీ చేయాలని భావిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో తీసుకున్న బంగారు రుణాలను మాఫీ నుంచి మినహాయించాలనే యోచన ఉన్నట్టు సమాచారం. గతంలోనూ ఇదే తరహా నిబంధనలు అమలు చేశారు. షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్‌లు, కో–ఆపరేటివ్ క్రెడిట్ సంస్థలు (అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంకులు సహా), ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు రైతులకు పంపిణీ చేసిన రుణాలు, బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న పంట రుణాలను మాఫీ చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది.

బీసీ సమగ్ర కుల గణన చేపట్టాలి: జాజుల

కామారెడ్డి నుంచి సమగ్ర కుల గణన సాధన యాత్ర ప్రారంభం



బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, వేదికపై బీసీ సంఘం నేతలు

కామారెడ్డి అర్బన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బీసీ సమగ్ర కుల గణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. 'మేమెంతో మాకంత.. బీసీ మేలుకో.. నీలెక్క తెలుసుకో'అనే నినాదంతో సమగ్ర కుల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కామారెడ్డిలో బీసీ సమగ్ర కుల గణన సాధన యాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాభారతి ఆడిటోరియంలో ఆయన మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల సమయంలో కామారెడ్డిలో నిర్వహించిన సభలో కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ ప్రకటించిందన్నారు. ఆ డిక్లరేషన్‌తో బీసీలు కాంగ్రెస్ వైపు ఆకర్షితులై ఓట్లేయడంతోనే ఆ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే సమగ్ర కుల గణన చేపట్టాలన్నారు. బీసీల కులగణన చేశాక రిజర్వేషన్లు నిర్ణయించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. దేశవ్యాప్తంగా బీసీ కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ యాత్ర 17 రోజులపాటు తెలంగాణలోని అన్ని జిల్లాల మీదుగా సాగుతుందన్నారు. ప్రభుత్వాలు చర్యలు తీసుకోకపోతే దేశవ్యాప్తంగా మరో మహా మండల్ ఉద్యమాన్ని తెస్తామని హెచ్చరించారు. కుల గణనతో దేశ సమగ్రత దెబ్బతింటుందని పలువురు చేస్తున్న ప్రచారంలో ఎలాంటి శాస్త్రీయత లేదని విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు పేర్కొన్నారు.

మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయాలి

- ప్రభుత్వం పంతాలకు పోవద్దు
- మాజీ మంత్రి హరీశ్‌రావు



గజ్వేల్‌లో బోనమెత్తుకున్న మాజీ మంత్రి హరీశ్

గజ్వేల్: మేడిగడ్డ వద్ద ప్రస్తుతం 40 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని, ప్రభుత్వం పంతాలను మానుకొని నీటిని ఎత్తి పోయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరిగిన బోనాల పండుగలో పాల్గొని కౌన్సిలర్ గుంటుకు శిరీష తెచ్చిన బోనమెత్తుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ఈ సమయంలో రిజర్వాయర్ల ద్వారా సాగు, తాగు అవసరాలకు గోదావరి జలాలను అందించాల్సిన అవసరముందని అన్నారు. మేడిగడ్డలో బ్యారేజీ గేట్లు తెరిచి ఉన్నా కూడా నదిలో ఉన్న ప్రవాహానికి అనుగుణంగా దాదాపుగా నాలుగు పంపులను నడిపి నీటిని ఎత్తిపోసే అవకాశముందని చెప్పారు. మేడిగడ్డ నుంచి సుందిల్ల, అన్నారం, మిడ్‌మానేరు, అనంతగిరి రిజర్వాయర్ల మీదుగా సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లలో వెంటనే నీటిని నింపాలన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఇప్పటికైనా భేషజాలను మానుకోవాలన్నారు.

'భరోసా' ఎలా ఉంటే బాగుంటుంది?!

మహిళా రైతులు, కూలీలను ఆరా తీసిన మంత్రి పొంగులేటి



మహిళా రైతులు, కూలీలతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ఖమ్మంరూరల్: 'ఆడబిడ్డలందరికీ నమస్కారం, అందరూ బాగున్నారా, ఏం పనులు చేస్తున్నారు'అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మహిళా రైతులు, కూలీల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలో ఆదివారం పర్యటించిన మంత్రి పొంగులేటి ఖమ్మం రూరల్ మండలం గూడురుపాడుకు వెళ్తూ మధ్యలో ఎం.వెంకటాయపాలెం వద్ద పత్తి చేలో ఉన్న మహిళా రైతులు, కూలీలను పలకరించారు. ఈ సందర్భంగా మహిళా కౌలు రైతులు కౌలు పెరగడంతో వ్యయసాయం గిట్టుబాటు కావడంలేదని..పట్టాదారులకే రైతు భరోసా వస్తోందని వివరించారు. దీంతో రైతుభరోసా ఎలా అమలు చేస్తే బాగుటుందని అడిగిన మంత్రి...అర్హులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అలాగే, పలువురు తమ పిల్లలు డిగ్రీ, పీజీ చదివినా ఉద్యోగాలు రాలేదని చెప్పగా తమ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇస్తోందని తెలిపారు. మంత్రి వెంట నాయకులు క్లౌం వెంకటరెడ్డి, మద్ది మల్లారెడ్డి, వీరారెడ్డి తదితరులు ఉన్నారు.

నిరుద్యోగులను రెచ్చగొడతారా?

- వారి సమస్యలను పట్టించుకోరా?
- సీఎంకు హరీశ్ రావు బహిరంగ లేఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని నిరుద్యోగులు వారి న్యాయమైన డిమాండ్లు సాధించుకునేందుకు రోడ్ల మీదకు వచ్చి నిరసనలు తెలియజేస్తుంటే, ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేకపోవడం దారుణమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్ రావు విమర్శించారు. పెద్ద మనసుతో వారి సమస్యలకు పరిష్కారం చూపాల్సింది పోయి, రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం ముఖ్యమంత్రి స్థాయికి తగదన్నారు. ఈ మేరకు ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చమని గ్రూప్స్, డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగులు నెత్తీనోరు కొట్టుకుంటుంటే ప్రభుత్వం ఎందుకు పరిష్కారం దిశగా ఆలోచన చేయడం లేదని ప్రశ్నించారు. నిరుద్యోగుల పోరాటం వెనుక రాజకీయ శక్తులు ఉన్నాయంటూ నిందారోపణలు చేయడం ఆక్షేపణీయమని పేర్కొన్నారు. ఇలా సాకులు చెప్పి తప్పించుకునే ప్రయత్నం వల్ల అభ్యర్థులు, నిరుద్యోగుల సమస్యకు పరిష్కారం లభించదని, నిరాహార దీక్షలు చేస్తున్న వారెవరు కూడా పరీక్షలు రాయడం లేదని అపహాస్యం చేయడం వల్ల వారు శాంతించరని హరీశ్ అభిప్రాయపడ్డారు. కంచెలు, ఆంక్షలు విధించి నిరుద్యోగుల గొంతులను నొక్కాలనుకున్న మీ విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామంటూ రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో హరీశ్ స్పష్టం చేశారు. నిరుద్యోగుల జీవితాలను దృష్టిలో ఉంచుకొని సానుకూల దృక్పథంతో చర్చలకు ఆహ్వానించాలని కోరారు.

నాడు వైఎస్ చేసినట్టుగా చేయండి..

హరీశ్ ఏడు ప్రధాన డిమాండ్లను ఆ లేఖలో ప్రస్తావించారు. గ్రూప్1లో 1:100 నిష్పత్తితో అభ్యర్థులను అనుమతించాలని, గతంలో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గ్రూప్–1 మెయిన్స్ పరీక్షకి 1:100 నిష్పత్తిలో ఎంపిక చేశారని గుర్తు చేశారు. ఇటీవల ఏపీలో నిర్వహించిన గ్రూప్2 నోటిఫికేషన్‌ను సవరించి 1:100కు మార్చారని తెలిపారు. గ్రూప్2 ,గ్రూప్ 3 ఉద్యోగాల సంఖ్యను పెంచాలని, 25వేలతో మెగా డీఎస్సీ వేయాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని కోరారు.

...డీఎస్సీకి సిద్ధం కండి

▶ మొదటి పేజీ తరువాయి

మరిన్ని పోస్టులతో కొత్త డీఎస్సీ నోటిఫికేషన్ వేస్తామని ప్రకటించారు. ఆదివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో.. వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేశ్‌రెడ్డి తదితరులతో కలసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉద్యోగాలను స్థానికులకే ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందన్నారు.

జాబ్ కేలండర్ ప్రక్రియ వేగవంతం చేస్తాం

గత పదేళ్లలో గ్రూప్స్, డీఎస్సీ పరీక్షలు నిర్వహించకుండా బీఆర్‌ఎస్ సర్కారు నిరుద్యోగులను గాలికి వదిలేసిందని భట్టి విక్రమార్క మండిపడ్డారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలన్నీ భర్తీ చేసేందుకు ప్రజాప్రభుత్వం సిద్ధంగా ఉందని.. జాబ్ కేలండర్ విడుదల ప్రక్రియను వేగవంతం చేస్తామని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 30వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామన్నారు. గురుకుల పీఈటీలు, అసిస్టెంట్ ఇంజనీర్లు, డివిజనల్ అకౌంట్ ఆఫీసర్లు, లైబ్రేరియన్లు, జూనియర్ లెక్చరర్లు, మెడికల్ ల్యాబ్ అసిస్టెంట్ వంటి మరో 13,321 మంది ఉద్యోగుల నియామక ప్రక్రియ చివరి దశకు చేరుకుందని చెప్పారు.

షెడ్యూల్ ప్రకారం పరీక్షలు

భర్తీ సాధ్యం కాదని తెలిసినా గత ప్రభుత్వం ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిందని ఆరోపించారు. తాము వాటికి మరో 6వేల పోస్టులు కలిపి 11వేల టీచర్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే.. 2.79 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. జూలై 18 నుంచి ఆగస్టు 5వరకు పరీక్షల షెడ్యూల్ ఉందని.. ఆ షెడ్యూల్ ప్రకారం పరీక్షలు రాసేందుకు 2.05 లక్షల మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని తెలిపారు. నిరుద్యోగులెవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని.. ఖాళీగా ఉన్న మరో ఐదువేల టీచర్ పోస్టులతో పాటు మరికొన్ని పోస్టులు కలిపి త్వరలోనే మరో నోటిఫికేషన్ ఇస్తామని హామీ ఇచ్చారు.

గతంలో పరీక్ష పెట్టారు.. లీక్ చేశారు..!

గత ప్రభుత్వం గ్రూప్–1 పరీక్షకు నోటిఫికేషన్ ఇచ్చిందని.. ఆ పేపర్ లీక్ అయిందని భట్టి చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ నోటిఫికేషన్‌ను రీషెడ్యూల్ చేశామని.. ప్రిలిమ్స్ పరీక్షను విజయవంతంగా నిర్వహించామని, 31,382 మంది మెయిన్స్‌కు కూడా ఎంపికయ్యారని వివరించారు. గత ప్రభుత్వం గ్రూప్–2 పరీక్షలను మూడు సార్లు వాయిదా వేసిందని.. తాము అధికారంలోకి రాగానే ఆగస్టులో పరీక్షలు నిర్వహించేలా తేదీలు ఖరారు చేశామన్నారు. గత సర్కారు గ్రూప్–3 కోసం డిసెంబర్ 30, 2022న నోటిఫికేషన్ ఇచ్చినా పరీక్షలు నిర్వహించలేదని.. తాము నవంబర్‌లో ఆ పరీక్ష తేదీలు ఖరారు చేశామని చెప్పారు. తెలంగాణ బిడ్డలు ఉద్యోగాలు సాధించి జీవితాల్లో స్థిరపడాలన్నదే తమ ప్రభుత్వ ఆశ, ఆలోచన అని.. డీఎస్సీకి సిద్ధమవుతున్న నిరుద్యోగులు పరీక్షలు బాగా రాసి, త్వరగా పాఠశాలల్లో చేరి పేదబిడ్డలకు పాఠాలు చెప్పాలని కోరారు.

కోచింగ్ సెంటర్లకు వెళ్లి ఉద్యోగాలు తెచ్చుకుంది.. మీరు కాదా?

▶ మొదటి పేజీ తరువాయి

కోచింగ్ సెంటర్లను, నిర్వాహకులను అవమానించేలా మాట్లాడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. మమ్మల్ని దించి మిమ్మల్ని గద్దెనెక్కించిన యువత ఈరోజు ప్రశ్నిస్తున్నదని అన్నారు. 8 నెలల్లో ఇప్పటిదాకా ఒక్క నోటిఫికేషన్ ఇవ్వని పాలకులు, మిగిలిన నాలుగు నెలల్లో ఏవిధంగా రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇది రాజకీయ పార్టీల సమస్య కాదని, లక్షలాదిమంది యువతకు సంబంధించిన అంశం అని అన్నారు. ఈ అంశంలో రేవంత్‌రెడ్డి ఇగోకి, భేషజాలకు పోకుండా నిర్ణయం తీసుకోవాలని, కండకావరంతో మాట్లాడడం ఆపాలని హితవు పలికారు.

గతంలో నిరుద్యోగుల్ని రెచ్చగొట్టింది మీరు కాదా?

రాజకీయ నిరుద్యోగులుగా యువతను రెచ్చగొట్టిన రాజకీయ శక్తులు ముమ్మాటికీ రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీలేనని కేటీఆర్ ఆరోపించారు. గతంలో ఏ పరీక్ష రాశారని రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి నిరుద్యోగులతో కలిసి దీక్ష చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. అశోక్‌నగర్‌లోని విద్యార్థులను రేవంత్‌రెడ్డి సన్నాసులు అంటున్నారని, అసలు సన్నాసులు రేవంత్‌రెడ్డా, రాహుల్‌గాంధీయా అనే విషయం చెప్పాలన్నారు. 2023 అక్టోబర్, నవంబర్‌లో అప్పటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులను నిరుద్యోగులను రెచ్చగొట్టారని, అనేక అవాకులు చవాకులు పేలారని ధ్వజమెత్తారు. రాజకీయ నిరుద్యోగం నుంచి బయట పడటానికి రాహుల్‌గాంధీ, రేవంత్ రెడ్డి యువతను వాడుకున్నారని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే వందల నోటిఫికేషన్లు, రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఒక్క సంవత్సరంలో ఇస్తామని నమ్మబలికారని అన్నారు. ఇప్పుడు ఒకాయన ముఖ్యమంత్రి అయ్యారని, ఇంకొకరు జాతీయస్థాయిలో నాయకుడు అయ్యారు తప్ప తెలంగాణ నిరుద్యోగులకు దక్కింది శూన్యం అని విమర్శించారు.

నిరుద్యోగులతో కలిసి కొట్లాడతాం..

ప్రస్తుతం అశోక్‌నగర్‌లో, యూనివర్సిటీలో పిల్లలను ఈడ్చుకుపోతుండడం వాస్తవం కాదా చెప్పాలని కేటీఆర్ నిలదీశారు. మిమ్మల్ని వదిలిపెట్టకుండా నిలదీస్తామని, విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి కొట్లాడుతామని అన్నారు. రేవంత్‌రెడ్డి ఇంకా ప్రతిపక్షంలో ఉన్నట్లుగానే మాట్లాడుతున్నారని, ఆయన ముఖ్యమంత్రిని అని గుర్తుంచుకొంటే మంచిదని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రికి సత్తా, చిత్తశుద్ధి ఉంటే ఉద్యోగాలు, నోటిఫికేషన్లు, జాబ్ క్యాలెండర్‌పై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల డిమాండ్లపై స్పందించి, వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలన్నారు.



“ నేను కణాల విశ్వాన్ని, విశ్వంలో కణాన్ని.
– రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి
సోమవారం, 15 జూలై 2024

ముసుగు మనుషులు

‘సుగుణం మేలిముసుగు, దుర్గుణం దొంగముసుగు’ అన్నాడు ఫ్రెంచ్ రచయిత, రాజనీతిజ్ఞుడు విక్టర్ హ్యూగో. ‘కరోనా’ కాలంలో మనుషులందరికీ ముసుగులు అనివార్యంగా మారాయి. మహమ్మారి కాలంలో మూతిని, ముక్కును కప్పి ఉంచే ముసుగులు లేకుంటే మాయదారి మహమ్మారి రోగం మరెందరిని మట్టుబెట్టేదో! ముసుగులు పలు రకాలు. అన్నింటినీ ఒకే గాటన కట్టేయలేం. పిడుక్కీ బియ్యానికీ ఒకటే మంత్రం కుదరదు కదా! అనివార్యంగా ధరించే ముసుగులు కొన్ని, మతాచారాల కారణంగా ధరించే ముసుగులు ఇంకొన్ని– ఇవి ప్రమాదకరమైన ముసుగులు కాదు. ఇలాంటి ముసుగుల చాటున ఉన్న మనుషులను గుర్తించడమూ అంత కష్టం కాదు.

అయితే, వచ్చే చిక్కంతా దేవతా వస్త్రాల్లాంటి ముసుగులతో మన మధ్య తిరుగుతుండే మనుషులతోనే! కనిపించని ముసుగులు ధరించే మనుషుల బతుకుల్లో లెక్కలేనన్ని లొసుగులు ఉంటాయి. వాటిని దాచుకోవడానికే ముఖాలకు దేవతావస్త్రాల ముసుగులను ధరిస్తుంటారు. అలాంటివారు మన మధ్య ఉంటూ, మనతోనే సంచరిస్తుంటారు. మనం పనిచేసే కార్యాలయాల్లో, మనం నివసించే కాలనీల్లో ఉంటారు. ముసుగులకు చిరునవ్వులు అతికించుకుని మనల్ని పలకరిస్తుంటారు కూడా! వాళ్లను ముసుగులతో తప్ప ముఖాలతో గుర్తుపట్టలేని పరిస్థితికి చేరుకుంటాం. వాళ్ల అసలు ముఖాలను పోల్చుకునే సరికి కనిపించని ఊబిలో కూరుకుపోయి ఉంటాం.

గాంభీర్యం చాలా గొప్పగా ఉంటుంది గాని, చాలా సందర్భాల్లో అది పిరికిపందలు ధరించే ముసుగు. అలాగే, పలు సందర్భాల్లో భూతదయా ప్రదర్శనలు క్రౌర్యానికి ముసుగు; బహిరంగ వితరణ విన్యాసాలు లుబ్ధబుద్ధులకు ముసుగు; నిరంతర నీతి ప్రవచనాలు అలవిమాలిన అవినీతి పనులకు ముసుగు; సర్వసంగ పరిత్యాగ వేషాలు సంపన్న వైభోగాలకు ముసుగు– ఇలా చెప్పుకుంటూ పోతే ముసుగుల జాబితా కొండవీటి చేంతాడు కంటే పొడవుగా తయారవుతుంది.

‘ఒక్క బంగారు ముసుగు అన్ని వైకల్యాలనూ కప్పిపుచ్చుతుంది’ అన్నాడు ఇంగ్లిష్ నాటక రచయిత థామస్ డెకర్. బంగారు ముసుగులు తొడుక్కోవడం అందరికీ సాధ్యమయ్యే పని కాదు. అందుకని తెలివిమంతులు దేవతా వస్త్రాల ముసుగులలో తమ తమ లొసుగులను కప్పిపుచ్చుకుంటూ, నిక్షేపంగా సమాజంలో పెద్దమనుషులుగా చలామణీ అయిపోతుంటారు. ఇలాంటి పెద్దమనుషుల అసలు ముఖాలేవో గుర్తించడం దుస్సాధ్యం. ముసుగుల మాటునున్న ముఖాలను గుర్తించేలోపే అమాయకులు కాటుకు గురైపోతారు. సాధారణంగా ముసుగులు నాటకాది ప్రదర్శనల వేషధారణలో భాగంగా ఉంటాయి. ఇటీవలి కాలంలో ముసుగులూ వేషాలూ దైనందిన జీవితంలో నిత్యకృత్యాలుగా మారిపోయాయి.

అతి వినయం ధూర్త లక్షణానికి ముసుగు. ‘వదనం పద్మదళాకారం వచశ్చందన శీతలం/ హృదయం కర్తరీ తుల్యం, అతి వినయం ధూర్త లక్షణం’ అని మనకో సుభాషిత శ్లోకం ఉంది. అలాగే, ‘జటిలో ముండీ లుంఛిత కేశః/ కాషాయాంబర బహుకృత వేష/ పశ్యన్నిపిచ న పశ్యతి మూఢో/ ఉదర నిమిత్తం బహుకృత వేషం’ అన్నాడు ఆదిశంకరుడు. పైన ఉదహరించిన సుభాషిత శ్లోకాన్ని, ఆదిశంకరుడి శ్లోకాన్ని గమనిస్తే, ముసుగులూ వేషాలూ ఆనాటి నుంచే ఉన్నట్లు అర్థమవుతుంది. కాకుంటే, అప్పటివి సత్తెకాలపు ముసుగులు. అతి తెలివిని ప్రదర్శించబోయిన అమాయకపు వేషాలు. ప్రధానంగా వాటి ప్రయోజనం ఉదర నిమిత్తానికే పరిమితమై ఉండేది. కేవలం ఉదర నిమిత్తం వేసుకునే ముసుగులూ వేషాల వల్ల ఎంతో కొంత వినోదమే తప్ప సమాజానికి పెద్దగా చేటు ఏమీ ఉండదు. అయినా, ఆనాటి సమాజంలోని ప్రాజ్ఞులు ముసుగులనూ, వేషాలనూ నిరసించేవారు. అలాంటివారి నిరసనల వల్ల ముసుగులూ వేషాలూ శ్రుతి మించకుండా ఉండేవి.

అప్పట్లో ముసుగులకూ వేషాలకూ పెద్దగా ప్రచారం ఉండేది కాదు. అంతగా జనాదరణ ఉండేది కాదు. సినిమాలు వచ్చాక చిత్రవిచిత్ర వేషాలకు ప్రచారమూ పెరిగింది. నాటకాలు, సినిమాలు మాత్రమే వినోద సాధనాలుగా ఉన్న కాలంలో నటీనటులు మాత్రమే పాత్రోచిత వేషాలు వేసేవారు. సమాజంలో పెద్దమనుషుల ముసుగులో ఉండే వేషధారులు అక్కడక్కడా మాత్రమే ఉండేవారు. ఇక స్మార్ట్‌ఫోన్లు చేతిలోకి వచ్చాక మనుషులంతా వేషధారులుగా మారిపోయిన పరిస్థితి దాపురించింది. కృత్రిమ మేధ తోడయ్యాక మనుషుల అసలు ముఖాలను పోల్చుకోవడమే కష్టమయ్యే పరిస్థితి వాటిల్లింది. ఇప్పుడు నటీనటులే కాదు, వారికి పోటీగా దేశాధినేతలు కూడా యథాశక్తిగా దేవతావస్త్రాల ముసుగులను తొడుక్కుని, రకరకాల వేషాలతో నవరసాభినయ చాతుర్యంతో జనాలను విస్మయంలో ముంచెత్తుతున్నారు.

‘స్మార్ట్’ వేషాల సంగతి ఒక ఎత్తయితే, ఇప్పుడు చైనాలో సిలికాన్ ముసుగులు అందుబాటులోకి వచ్చాయి. ఇవి అలాంటిలాంటివి కావు, అల్ట్రా రియలిస్టిక్ ముసుగులు. ఒక నలభయ్యేళ్ల వ్యక్తి ఒక వృద్ధుడి ముఖాన్ని పోలిన సిలికాన్ ముసుగు వేసుకుని నేరాలకు పాల్పడిన సంగతి బయటపడటంతో కలకలం మొదలైంది. సిలికాన్ ముసుగుల చట్టబద్ధతపై కూడా చర్చ మొదలైంది. అయినా, ఎంత సిలికాన్ ముసుగులైతే మాత్రం అవేమైనా దేవతా వస్త్రాల ముసుగులా? అసలు ముఖాలను ఎంతకాలం దాచగలవు పాపం?!

అంబేడ్కర్ ఆలోచనల్ని ప్రతిఫలిస్తాయా?

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

నూతనంగా ఏర్పడిన ఎన్డీఏ 3.0 ప్రభుత్వం 2024–25కి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి సమాయత్తమవుతోంది. దీనిమీద అందరిలోనూ ఆసక్తి నెలకొని వుంది. అణగారిన సామాజిక వర్గాలు అభివృద్ధి చెందితేనే ప్రపంచ వ్యాప్తమైన ఆర్థికాభివృద్ధిలో భారతదేశం భాగస్వామ్యం కాగలుగుతుందని అంబేడ్కర్ ఏనాడో చెప్పారు. షెడ్యూల్డ్ కులాల ఆర్థిక విమోచన జరగాలంటే, వారికి భూములను పంచే ముఖ్య విషయం మీద ప్రభుత్వం దృష్టి పెట్టాలని కూడా అంబేడ్కర్ సూచించారు. దానికి బడ్జెట్‌లో ప్రాధాన్యమివ్వాలి. కుల నిర్మూలనకు, స్త్రీ సాధికారతకు, వ్యవసాయ కూలీలను వ్యవసాయదారులుగా మలిచేందుకు బడ్జెట్ కేటాయింపులు జరగాలి. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేసేలా, కొత్త ఉద్యోగాలు కల్పించేలా బడ్జెట్ కేటాయింపులు జరపాలి.

2024–25 సంవత్సరానికి కేంద్రంలోని నూతన ఎన్డీఏ ప్రభుత్వం జూలై 22, 23 తేదీల్లో బడ్జెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా దళితుల్లోనూ, స్త్రీలలోనూ, ఆదివాసీలలోనూ కొత్త ఆశలు కలుగుతున్నాయి. మొత్తం పార్లమెంట్‌లో 111 మంది దళిత ఎంపీలు ఉన్నారు. అస్పృశ్యతా నిర్మూలనకు, కుల నిర్మూలనకు, స్త్రీ సాధికారతకు, వ్యవసాయ కూలీలను వ్యవసాయదారులుగా మలిచే అంశాల పట్ల దేశంలో ఎంతో ఆసక్తి నెలకొనివుంది.



ఈ క్రమంలో ముఖ్యంగా స్త్రీ సాధికారత భారతదేశంలో చాలా అవసరంగా కనిపిస్తుంది. పురుషుల సంఖ్యతో దాదాపు సమానంగా ఉన్న స్త్రీలలో 20 కోట్ల మందికి పనిలేదు. ముఖ్యంగా దళిత స్త్రీలకు సొంత భూమి లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించే విషయం. భూమి చరిత్ర చూస్తే భూస్వామ్య ఆధిపత్య కులాలకే భూమి ఉంది. భూమి ఉత్పాదకతపై వారికి పూర్తి అవగాహన ఉండేది. సమాజంలో వారు బలమైన వర్గంగా వ్యవహరించేవారు. అందుకే కేంద్ర పాలకులు వారిని విస్మరించడం కానీ, వారితో వైరం పెట్టుకోవడం కానీ జరిగేది కాదు. తరతరాలుగా పాలకవర్గాలు అగ్రకులాలకు భూ వసతిని కల్పించడంలోనూ, వాటికి నీటి వసతి కల్పించడంలోనూ జాగరూకతతో ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్ భూపరిమితి చట్టాన్ని 1958లో అప్పటి ప్రభుత్వం తెచ్చింది. అది జూన్ 1961లో అమల్లోకి వచ్చింది. కానీ ఇప్పటి వరకూ దానికి తూట్లు పడుతూనే వున్నాయి. ప్రధానమైన విషయం ఆంధ్రప్రదేశ్ వ్యావసాయిక రాష్ట్రం. ఇందులో 69.7 శాతం మంది వ్యవసాయ కూలీలు. అందులో 90 శాతం మంది దళితులు. ఈ దళితులకు ఉన్నత స్థాయి కలిగించాలంటే తప్పకుండా వీరికి భూమి ఇవ్వాలి. రాను రాను వ్యవసాయ కూలీపని మీద శిథిలమౌతున్న వృత్తులవారందరూ ఆధారపడుతున్నారు.

పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో భూమి రేటు విపరీతంగా పెరగడం వల్ల ఏ వ్యవసాయ కూలీలైతే భూమిని చదును చేసి వ్యవసాయీకరించారో వారు భూమి కొనలేని పరిస్థితుల్లోకి నెట్టబడ్డారు. అలాగే కృష్ణా డెల్టాలో అసలు మిగులు భూమి లేదని అధికారులు ప్రకటిస్తున్నారు. ఇటు వ్యవసాయ కూలి పని లేక, అటు ప్రభుత్వం భూమి ఇవ్వక, గ్రామాల్లో ఉండే పరిస్థితులు లేక తీవ్రమైన వలసలకు దళితులు గురి అవుతున్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కనీసం రూ.1,000 కోట్లు అయినా భూమి కొనుగోలు పథకానికి కేటాయించవలసిన అవసరం ఉందని సామాజిక ఆర్థిక శాస్త్రవేత్తలు కోరుకుంటున్నారు. ఈ విషయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మొదటి ప్రణాళిక సంఘంలోనే భూమి కొనుగోలు పథకానికి 20 కోట్ల కేటాయింపు చేసిన విషయాన్ని మనం గుర్తు చేసుకోవాలి.

అంబేడ్కర్ 1954 సెప్టెంబర్ 6వ తేదీన రాజ్యసభలోని చర్చల్లో ఇలా నివేదించారు: ‘‘ఆర్యా! నేనిప్పుడు షెడ్యూల్డ్ కులాల ఆర్థిక విమోచన సమస్యను ప్రస్తావిస్తున్నాను. చదువుతో పాటుగా ఉద్యోగాలు కూడా షెడ్యూల్డ్ కులాల ఆర్థిక హోదా పెరుగుదలకు ఎక్కువ ప్రాధాన్యమైనవి. అయితే ఇప్పుడు షెడ్యూల్డ్ కులాల ఆర్థిక హోదా పెరుగుదలకు ఏమి అవకాశాలున్నాయి? షెడ్యూల్డ్ కులాల ఆర్థిక విమోచన లాభదాయకమైన వృత్తులలో ప్రవేశం పొందే అవకాశం మీదనే ఆధారపడి ఉందని స్పష్టమైంది. లాభదాయకమైన వృత్తుల్లోకి ద్వారాలు తెరవబడనంత వరకు, వారి ఆర్థిక విమోచన జరిగే వీలు లేదు. వారు బానిసలుగానే మిగిలి పోతారు. బానిసలు కాకపోయినా, గ్రామాలలో భూస్వాముల సేవకులుగా మిగిలిపోతారు. ఆ విషయంలో ఏమాత్రం అనుమానం లేదు. ఆర్యా! నిస్సందేహంగా షెడ్యూల్డ్ కులాల వారికి ప్రభుత్వంవారు భూమిని పంచే ముఖ్యమైన విషయంపై దృష్టి ఉంచాలి. భూస్వాముల పొలాలపై పరిమితిని విధించి, అంతకన్నా ఎక్కువ ఉన్న భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని దానిని షెడ్యూల్డ్ కులాల వారికి ఇవ్వాలి. రెండవదేమిటంటే అమ్మకానికి వచ్చిన భూమిని కొనుక్కోవటం కోసం వారికి ఋణాలివ్వాలి.’’

ఇకపోతే స్త్రీలకు భారతదేశ వ్యాప్తంగా కుటీర పరిశ్రమలు రూపొందించి వాటిని వస్తూత్పత్తి కేంద్రాలుగా రూపొందించాలి. అక్కడ తయారైన వస్తువులకు ప్రపంచ మార్కెట్‌లో స్థానం ఏర్పాటు చేయగలిగితే మన స్త్రీలు చైనాను మించిపోతారు. నిజానికి గత రెండు దశాబ్దాలుగా నిరుద్యోగుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. చైనా నుంచి దిగుమతులు పెరుగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల గ్రాడ్యుయేట్ యువతలో నిరుద్యోగ రేటు 42 శాతానికి పెరిగింది. దీని వల్ల నిరుద్యోగులలో నిరాసక్తత, సోమరితనం పెరుగుతున్నాయి. మత్తు మందుల వాడకం పెరగడానికి కూడ నిరుద్యోగితే కారణం. ఈ నిరుద్యోగుల్లో మహిళలు ఎక్కువగా ఉండటం గమనించదగ్గ విషయం. స్త్రీల విద్య, ఉపాధి విషయాల గురించి అంబేడ్కర్ హిందూ కోడ్ బిల్లులోనూ, ఆ తరువాత పార్లమెంట్ చర్చల్లోనూ ఎన్నో సలహాలు ఇచ్చారు. వాటిని పెడచెవిన పెట్టడం వల్లే ఈ రోజున స్త్రీలు చదువుకొని కూడా అటు వ్యవసాయపని చేయలేకా, ఇటు ఉద్యోగం దొరక్కా సంక్షోభంలో ఉండిపోయారు. నిరుద్యోగ నిర్మూలన కోసం బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేసేలా, కొత్త ఉద్యోగాలు కల్పించేలా బడ్జెట్ కేటాయింపులు జరపాలి. దళిత విద్యార్థుల కోసం గురుకుల పాఠశాలలను దేశం మొత్తంగా మండలానికి ఒకటి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. నిజానికి గురుకుల పాఠశాలల్లోనే దళితులకు సరైన విద్య, ఆహారం లభిస్తాయి.

ఈ బడ్జెట్‌లో కుల నిర్మూలన కోసం, కులాంతర వివాహితుల రక్షణ కోసం కూడా కేటాయింపులు తప్పకుండా అవసరం. కుల నిర్మూలనను ఒక ఉద్యమంగా చేపట్టడం వల్ల సమాజంలో విస్తృతమైన మార్పులు వస్తాయనీ, సామాజిక సమతుల్యత ఏర్పడుతుందనీ అంబేడ్కర్ స్పష్టం చేశారు. అందుకే సాంఘిక స్వాతంత్ర్యాన్ని, మేధా స్వాతంత్ర్యాన్ని, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని, రాజకీయ స్వాతంత్ర్యాన్ని ప్రజలకు కలిగించాలంటే దానికి అవసరమైన బడ్జెట్ కేటాయింపులు ఉండాలని సూచించారు. దేశ బడ్జెట్ అనేది ఉత్పత్తి శక్తుల మానసిక, శారీరక సౌష్ఠవాన్ని పెంచే దిశగా ఉండాలన్నారు. తాగుడు, సిగరెట్, ఇతర వ్యసనాల నుండి దూరం చేసే నైతిక అధ్యయన కేంద్రాలు పెంచడం వల్ల సంపద మిగులు ఏర్పడుతుందని చెప్పారు. యువకుల నైపుణ్యాలను పెంచే కేంద్రాలను పెంచడం వల్ల వాళ్లు ఏ రంగంలోనైనా అభివృద్ధి చెందగలుగుతారనీ, ఆధీనత భావాన్ని తగ్గించే దిశగా బడ్జెట్ ఉండాలనీ సామాజిక, ఆర్థికవేత్తలు కోరుతున్నారు.

శ్రమ నుండే మానవాళి అభివృద్ధి జరుగుతుంది. శ్రమ నుండే చైతన్యం వస్తుంది. ప్రభుత్వం ఎన్ని సబ్సిడీలు కల్పించినా ప్రజలు ఆర్థికాభివృద్ధి చెందరు. వారిలో ఉత్సాహాన్ని, జీవన భద్రతని కల్పించాలంటే వారు చేసే పనికి ప్రతిఫలం లభించాలి. ‘ప్రభుత్వం ఏదైనా ఇస్తే బతుకుదాం’ అనే పరిస్థితుల్లోకి ప్రజలు నెట్టబడుతున్నారు. దీని వల్ల చాలా నష్టం కలగడమే కాక జాతుల్లో అలసత్వం పెరిగే ప్రమాదం ముంచుకొస్తుందని అంబేడ్కర్ ప్రజలకు ఉద్బోధించారు. నిజానికి ఆయన భూమిని జాతీయం చేయండి, పరిశ్రమలను జాతీయం చేయండి అని పిలుపును ఇచ్చిన మేధావి. భారతదేశంలో అణగారిన సామాజిక వర్గాలు అభివృద్ధి చెందితేనే ప్రపంచవ్యాప్తమైన ఆర్థికాభివృద్ధిలో భారతదేశం భాగస్వామ్యం కాగలుగుతుందని చెప్పారు. విద్య, విజ్ఞానం, ఉత్పత్తి, భూపంపిణీ, సామాజిక అభివృద్ధి, పారిశ్రామికీకరణ, స్త్రీ అభివృద్ధి, యువశక్తి వినియోగం, వృద్ధుల రక్షణ, పర్యావరణ పరిరక్షణ, నదుల అనుసంధానం... వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని కేంద్ర బడ్జెట్ రూపకల్పన జరిగినపుడు భారతదేశం నిజమైన వికాసాన్ని, ప్రాభవాన్ని పొందుతుందని చెప్పారు. ఆ దిశగా పాలకులు, ప్రజలు నడుస్తారని ఆశిద్దాం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు । 98497 41695

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

హత్య సరే కానీ...



జూన్ 25ను ఇకనుంచీ ‘సంవిధాన్ హత్యా దివస్’ (రాజ్యాంగాన్ని హత్య చేసిన రోజు)గా ప్రకటించడం పట్ల నాకు చాలా ప్రశ్నలున్నాయి. ఆ రోజు డ్రై డేనా (మద్యం అందుబాటులో ఉండని రోజు)? బ్యాంకుకు సెలవు ఉంటుందా? దాన్ని ఎలా ఆచరిస్తాం? నా ‘భక్త్’ స్నేహితుడికి ‘హ్యాపీ సంవిధాన్ హత్యా దివస్’ అని వాట్సాప్‌లో మెసేజ్ పంపొచ్చా?

– అతుల్ ఖత్రి, కమెడియన్

కొత్త పదాలు



‘ఆ పెళ్లి’కి వచ్చిన ప్రచారం చూస్తుంటే, 2024 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలోకి చేరే కొత్త పదాల్లో సంగీత్, మెహెందీ, హల్దీ ఉంటాయని కచ్చితంగా చెప్పవచ్చు.

– పర్మీందర్ సింగ్, వ్యాపారవేత్త

ఒంటరి పరిస్థితి



క్లినిక్‌కు వెళ్లాను. పెద్దవాడైన మగ రిసెప్షనిస్ట్, ‘భర్త పేరు?’ అని అడిగారు. లేదని చెప్పాను. నిరాశగా కనబడ్డారు. ‘పితాజీ ఉండివుంటారు గదా?’ అన్నారు. ‘వెళ్లిపోయారు. నా అస్తిత్వం ఒకరి భార్యగానో, కూతురిగానో ఎందుకు ఉండాలి? అదీ ఈ వయసులో’ అన్నాను. ఆయనలో మరింత నిరాశ. (అయినా) నా కార్డు మీద శ్రీమతి స్మితా శర్మ అని కనబడింది.

– స్మితా శర్మ, పాత్రికేయురాలు

వాస్తవ నిరాకరణ



మహమ్మద్ అలీ జిన్నా ఒక గుజరాతీ షియా ముస్లిం. భారతదేశం ఆయన తాలూకు ఈ గుజరాతీ పార్శ్వాన్ని గుర్తుంచుకోవాలని అనుకోదు. పాకిస్తాన్ ఆయన షియా పార్శ్వాన్ని గుర్తుంచుకోవాలని అనుకోదు.

– దేవ్‌దత్ పట్నాయక్, రచయిత

మేధావుల్లారా మీరెటువైపు?

గత పదేళ్లుగా బీజేపీ పాలనలో పరిస్థితులను గమనిస్తే ప్రపంచంలోనే గొప్ప ప్రజాస్వామ్య దేశం అని చెప్పుకునే మనదేశంలో పూర్తిగా అప్రజాస్వామిక పాలన నడుస్తున్నదని అర్థమవుతుంది. పాలనా వ్యవస్థ రోజు రోజుకూ గాడి తప్పి చివరకు దేశం ఫాసిజం వైపు అడుగులు వేస్తున్నది. మధ్యభారత ఆదివాసీల ప్రాంతంలో ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు విచ్చలవిడిగా తవ్వుకోవడానికి బీజేపీ ప్రభుత్వం అనుమతులు ఇచ్చి, ఆదివాసులను నిర్వాసితులను చేస్తోంది. రాజ్యాంగం లోని 5వ, 6వ షెడ్యూళ్లను పట్టించుకోకుండా అటవీ చట్టాలను అతిక్రమించి, గ్రామసభ తీర్మానాలు అమలుకాకుండా ఆదివాసీల జీవించే హక్కును హరిస్తోంది ప్రభుత్వం. దీన్ని శాంతియుతంగా, ప్రజాస్వామిక నిరసన పోరాటాలతో ఆదివాసులు ప్రతిఘటిస్తున్నారు.

వీరి ఆందోళనలను అణచి వేయడానికి ఈ అటవీ ప్రాంతంలో దాదాపు 2 కిలోమీటర్లకు ఒక సైనిక క్యాంపు పెట్టారు. డిసెంబర్ 2023 నుండి ‘ఆపరేషన్ కగార్’ అనే అత్యంత పాశవిక అణచివేత పద్ధతిని ప్రవేశపెట్టారు. దీనిలో భాగంగా ఆదివాసీ గ్రామాలపై డ్రోన్ దాడులు, హెలికాప్టర్‌తో బాంబు దాడులు చేస్తున్నారు. ఆదివాసులకు అండగా ఉన్న మావోయిస్టుల ఏరివేత పేరుతో అంతర్జాతీయ సహజ న్యాయ సూత్రాలను కూడా పట్టించుకోకుండా బస్తర్ రీజియన్, కాంకేర్, నారాయణపూర్‌లలో అకృత్యాలకు పాల్పడుతున్నారు పాలకులు. కాంకేర్ లో 2024 జనవరి 1 నుండి జూన్ చివరి వరకు 150 మంది ఆదివాసులను, మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్ల ద్వారా క్రూరంగా చంపారు.

ఖనిజాలు, ఇతర అటవీ సంపద కొందరి చేతుల్లో కేంద్రీకృతం కాకుండా అందరికీ చెందాలనడం, పచ్చని అడవులను ఖనిజాల తవ్వకాల ద్వారా ధ్వంసం చేయకుండా ఉండాలనడం, రాజ్యాంగం ఇచ్చిన ఆదివాసీ హక్కులను కాపాడాలనడం నేరమెట్లా అవుతుంది? ఈ లక్ష్యాల సాధన కోసం ఉద్యమిస్తున్న ఆదివాసీలకు అండగా కవులు, రచయితలూ, ఇతర మేధావులూ నిలబడాలి. దేశం సమన్యాయం, ప్రజాస్వామ్యాల దిశలో ప్రయాణం చేయడానికి బాధ్యత గల కవులు, రచయితలు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలి. బ్రిటిష్‌వాళ్లకూ, నిజాం నవాబుకూ వ్యతిరేకంగా ఎందరో కవులూ, రచయితలూ గొప్ప రచనలు చేశారు. షోయబుల్లా ఖాన్, కాళోజీ, బందగి, సుంకర, సుద్దాల హనుమంతులాంటి రచయితలు పీడితుల పక్షాన నిలిచారు. ఇప్పుడు స్వదేశీ పాలకుల అన్యాయాలను ఎదుర్కోవడానికి మనమూ వారి మార్గాన్ని అనుసరించాలి.

– బాలసాని రాజయ్య;
విప్లవ రచయితల సంఘం, పెద్దపల్లి । 9441970025


ప్రజాసేవలో తరించిన రాజు!

జ్ఞాపకం



జి.వి. భూదానం సుబ్బారావు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన మొదట్లో అధికార పక్షమైన కాంగ్రెస్‌కూ, కమ్యూనిస్టులకూ మధ్యేవాద పార్టీగా సోషలిస్ట్ పార్టీ ఉండేది. కార్ల్ మార్క్స్ సిద్ధాంతంతో కార్మిక, శ్రామిక వర్గాల కోసం జాతీయ భావంతో ఆ పార్టీ పనిచేస్తోంది. ఈ తరుణంలో మద్రాస్ విశ్వవిద్యాలయంలో డా॥ మీనన్ ప్రభావానికి గురైన విజయనగరం మహారాజు పూసపాటి విజయరామ గజపతిరాజు (పీవీజీ రాజు) సోషలిస్టుగా మారారు. దీంతో ముఖ్యంగా విశాఖ, శ్రీకాకుళం జిల్లాల్లో ఈ పార్టీ పెద్ద రాజకీయ శక్తిగా మారింది. పార్లమెంటు, శాసన సభ స్థానాలను గెలుచుకునే స్థాయికి చేరింది. పీవీజీపై ప్రజలకు అపారమైన విశ్వాసం ఉండేది. ఆయన్ని దైవ సమానులుగా చూసేవారు. అలాగే ఆయన కూడా ప్రజలను ఎంతో ప్రేమించారు. అందుకే ఆయన ఆస్తిపాస్తులలో చాలా భాగం ప్రజల పరం చేశారు. ఒకసారి ఆయన రాష్ట్ర మంత్రిగా గ్రామాల పర్యటనకు వెళ్లగా ‘రాజుగా’ కాకుండా మంత్రిగా వచ్చారని రాజ్యాధికారం ఎవరో తీసుకున్నారనే భావనతో ఆ యా గ్రామాల్లో ప్రజలు గగ్గోలు పెట్టినట్లుగా వార్తలు వచ్చాయి.



పీవీజీ రాజు
(1914–1995)

1951లో నేను బెజవాడలో విద్యార్థిగా ఉన్న సమయంలో సోషలిస్టు పార్టీ విద్యార్థి సంఘాలలో క్రియాశీలకపాత్ర పోషిస్తుండేవాడిని. ఒక చిన్న కారులో 30 ఏళ్ల లోపున్న యువకుడిగా పీవీజీ రాజు తన భార్య కుసుమా గజపతితో కలిసి బెజవాడ బంగారు దుకాణాల బజారులో రాంపిళ్ళ తాతబాబు ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి మద్రాసు నుండి వచ్చారు. మేడపైన హాలులో ఏర్పాటుచేసిన సమావేశానికి హాజరైన రాజు మాటలు తెలుగు ఇంగ్లీష్ సమ్మేళనంగా ఉంది. ఆ సమావేశంలో పార్టీ నిర్మాణానికి ఉత్సాహంగా పని చేయాలని చెప్పారు. మా నాన్న పాపారావు కూడా ఆ సమావేశంలో ఉన్నారు.

1954లో కర్నూలు జిల్లాలో ‘కరివెన ఈనాం రైతు సత్యాగ్రహం’ సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో నడుపుతున్న సమయంలో... సోషలిస్టు పార్టీ – కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీలు విలీనమై ‘ప్రజా సోషలిస్టు పార్టీ’ అవతరించింది. ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు నాయకత్వంలో తెలుగు నేలపై ఈ పార్టీ నడిచింది. ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఉద్యమాన్ని సోషలిస్టులు నడిపి 1953లో సాధించగా... ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు బాధ్యతలు తీసుకోవాలని నెహ్రూ స్వయంగా మద్రాసు వచ్చి కోరారు. ప్రజా సోషలిస్టు పార్టీ అధ్యక్షుడైన ప్రకాశం పంతులు ముఖ్యమంత్రిగా... తన అనుచరులు తెన్నేటితో సహా కాంగ్రెస్ వారిని కలుపుకొని మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకు రాష్ట్రంలోని సోషలిస్టు వర్గంవారు పార్టీకి ద్రోహం చేసి వెళ్లారని వారిని నిందించారు. ఈ సందర్భంలో కరివెన ఇనాం భూములపై వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నవారికి భూమిపై హక్కులను కల్పించవలసిందిగా కోరుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇనాం రైతు సత్యాగ్రహం ఎమ్‌బీ సుబ్బారెడ్డి, రత్నసభాపతి వంటివారి నాయకత్వంలో ప్రారంభమయ్యింది.

ముగ్గురు పార్లమెంటు సభ్యులు, 12 మంది శాసన సభ్యులు ప్రతిరోజూ కరివెనకు వచ్చి సత్యాగ్రహులుగా అరెస్టు అవుతూ వచ్చారు. నేను కూడా నలుగురి సహచరులతో బెజవాడ నుండి నంద్యాల ద్వారా కరివెన సత్యాగ్రహ శిబిరానికి చేరగా మమ్మల్ని బెజవాడ పాపిరెడ్డి బృందంలో చేర్చారు. నన్ను అరెస్టు చేశారు. పీవీజీ రాజు తన అనుచరులతో మా కంటే ముందే అరెస్టు అయ్యారు. కోర్టులో తాను చేసిన శాంతియుత సత్యాగ్రహం రాజ్యాంగ విరుద్ధం కాదని న్యాయపోరాటం చేయడం వల్ల శిక్ష పడకుండా కర్నూల్ సబ్ జైలులో ఉంచి అన్ని వసతులూ కల్పించారు. పోలీసులు మమ్మల్ని కర్నూల్ సబ్ జైలుకు తీసుకొచ్చిన సందర్భంలో పీవీజీతో కలిసి ఉన్నాం. తెలుగుభాష రాని రాజు జైలులోనికి తీసుకొచ్చిన ‘ఆంధ్రప్రభ’ పేపర్ హెడ్డింగ్ చదివి తాను తెలుగు కూడా చదవగలుగుతున్నాని మా అందరికీ చెప్పి నవ్వించారు.

1958లో విజయనగరం వెళ్లి ఆయన్ని కలిశాను. నన్ను చూసి ‘పాపారావు కొడుకువురా’ అని నన్ను దగ్గరికి పిల్చి ఈ కోటను విద్యాసంస్థలకు ఇస్తున్నాను. భోజనాలు చేయడానికి ముందే వెళ్ళి అంతా చూసి రండి అని మనిషిని ఇచ్చి పంపారు. 1976–78లో పూరి ‘సర్వోదయ’ సమ్మేళనానికి వెళ్ళి తిరుగు ప్రయాణంలో సింహాచలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దైవ దర్శనం చేసుకొని దేవాలయ వంశ పారంపర్య ధర్మకర్త పీవీజీ అక్కడే ఉంటున్నారని తెలిసి వారిని చూడడానికి వెళ్ళి వారి శ్రీమతితో మాట్లాడి వచ్చాము. ఆయన గుర్తుపట్టగల స్థితిలో లేరు. సిమ్లాలో కారు ప్రమాదం వలన మెదడు దెబ్బతిని చాలా కాలం నుండి కోమాలో ఉండి ఈ పరిస్థితికి వచ్చారని తెలిసింది.

ఆంధ్రరాష్ట్రంలో ప్రజా సోషలిస్టు పార్టీ చీలిపోయి లోహియా అనుచరులుగా ఆంధ్రా సోషలిస్టు పార్టీ అధ్యక్షులుగా పీవీజీ రాజు, కార్యదర్శిగా మా నాన్న జీవీఎల్ నర్సింహారావు (పాపారావు) బాధ్యతలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత విద్యాశాఖమంత్రిగా పీవీజీ మా తమ్ముడి ఉన్నత విద్యాభ్యాసానికి ఆర్థిక సహకారం అందించారు. దేశానికి ఎనలేని సేవలు చేసిన రాజుగారు 1995 నవంబర్ 14న స్వర్గస్థులైనారు. వివిధ ప్రదేశాల్లో 1951 నుండి 1972 వరకు ఆయన్ని కలిసినప్పటి జ్ఞాపకాలు ఇవన్నీ. మహోన్నతమైన వ్యక్తి, త్యాగ శీలి, విద్యా ప్రదాత అయిన రాజుగారు అందరికి పూజనీయులు.

వ్యాసకర్త తెలంగాణ గాంధీ స్మారక నిధి అధ్యక్షులు । 9440296710
(పీవీజీ రాజు శతజయంతి సంవత్సరం సందర్భంగా)

అపాత్ర దానం

పద్దెనిమిది రోజులు జరిగిన మహాభారత సంగ్రామంలో, భీష్ముని సర్వసేనాధిపత్యంలో పది రోజులు, ద్రోణుడి సేనాధిపత్యంలో ఐదు రోజులు యుద్ధం జరిగిన తరువాత, దుర్యోధనుడి చేత కర్ణుడు సర్వసేనాధిపతిగా నియమించబడ్డాడు. తన సర్వసేనాధిపత్యంలో రెండవ రోజు యుద్ధరంగంలోకి ప్రవేశిస్తున్న తరుణంలో తన సేనలో ఉన్న వారిని ఉద్దేశించి కర్ణుడు ‘ఎవరైనా సరే నాకు అర్జునుడిని సత్వరం చూపిస్తే అతడికి నేను బంగారు రథాలైనా, వెలకట్టలేని అందం కలిగిన గుర్రాలనైనా, ఏనుగులనైనా, పెద్ద గ్రామాన్నైనా... వారికి ఏది కావాలంటే అది బహుమానంగా ఇస్తాను. కృష్ణార్జునులను ఇద్దరినీ చూపిస్తే, ఈరోజు వారిద్దరినీ ఓడించి వారిరువురి సంపదనంతా వారిని నాకు చూపించిన వాళ్ళకు బహుమానంగా ఇస్తాను!’ అంటాడు. కర్ణుడి రథసారథి అయిన శల్యుడికి ఇవన్నీ మతి తప్పిన వాడి మాటలుగా అనిపించి, ఆ మాటలలో కర్ణుడి వాచాలత్వానికి తనలో తాను నవ్వుకుని, ‘యుద్ధరంగంలో ఒకరు కృష్ణార్జునులను చూపడమేమిటి? కాసేపు ఆగితే ఎక్కడ చూసినా వారిరువురే కనబడతారు కదా!’ అని మనసులో అనుకుంటూ, ఆ మాటలనే కర్ణుడితో కొంత పరిహాసం జోడించి ఇలా చెబుతాడు.

జ్యోతిర్మయం

**ఎవ్వరు సూప నేల? నరు నిప్పుడె కాంచెదు; రిత్త వారికిం
గ్రొవ్వున నుజ్జ్వలార్థములు గొందని యీ వల; దిట్టు లిచ్చినన్
నవ్వు జనంబు, మిక్కిలి ధనంబులు గల్గిన జేయరాదె నీ
కెవ్విధినైన సద్వ్యయము, లెందు నపాత్రపు టీవి యొప్పునే?**

‘ఒకరు చూపేదేమిటి? కాసేపు ఆగితే అర్జునుడు తానే కనిపిస్తాడు. అనవసరమైన మాటలు మాట్లాడి, అర్హత లేని వారికి డబ్బు ఇస్తానంటూ జనం దృష్టిలో చులకన కావద్దు. అలా ఇస్తే జనం నవ్వుతారు కూడా! అంతగా నీ దగ్గర సంపద అధికంగా ఉంటే దానితో ఏవైనా సత్కార్యాలు చేయడం, అందుకోసం వినియోగించడం మంచిది. అనర్హుడైనవాడికి సంపదను దానం చెయ్యడం సరైన పని అనిపించుకుంటుందా?’ అని తిక్కన మహాకవి రచనలోని ఆంధ్ర మహాభారతం, కర్ణపర్వం, ద్వితీయాశ్వాసంలోనిపై పద్యం భావం. యోగ్యత తెలిసి చేసే దానమే సత్ఫలితాలను ఇస్తుంది. అనర్హుడికి చేసిన దానం, ఆ దానం చేసిన వ్యక్తి విచక్షణను ప్రశ్నించేలా చేస్తుందని మహాభారతంలోని పై సన్నివేశం ద్వారా చెప్పబడింది.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం; **తిథి:** శు.నవమి ప.3.50 వరకు, తదుపరి దశమి; **నక్షత్రం:** స్వాతి రా.10.09 వరకు, తదుపరి విశాఖ; **వర్జ్యం:** తె.4.10 నుండి 5.53 వరకు (తెల్లవారితే మంగళవారం); **దుర్ముహూర్తం:** ప.12.30 నుండి 1.22 వరకు, తదుపరి ప.3.06 నుండి 3.58 వరకు; **అమృత ఘడియలు:** ప.12.31 నుండి 2.16 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు; **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు; **సూర్యోదయం:** 5.36; **సూర్యాస్తమయం:** 6.34

క్లుప్తంగా...

సీఎం రేవంత్‌తో నటుడు సాయిదుర్గ తేజ్ భేటీ



సీఎం రేవంత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హీరో సాయి దుర్గ తేజ్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మెగా సుప్రీం హీరో సాయి దుర్గ తేజ్ జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల యూట్యూబర్ ప్రణీత్ హనుమంతు కుటుంబ విలువలకు మచ్చ తెచ్చేలా చేసిన నిర్వాకాన్ని ముందుగా సాయి తేజ్ సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. సీఎం రేవంత్ వెంటనే స్పందించిన నేపథ్యంలో పోలీసులు ప్రణీత్‌తో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేశారు. తన ట్వీట్‌పై స్పందించిన తీరుకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, భేటీ సమయంలో మంత్రి కొండా సురేఖ, కాంగ్రెస్ ఎంపీ కిరణ్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ నేత రోహిత్ రెడ్డి కూడా ఉన్నారు.

బీసీల ఉద్యమ పంథా మారాలి: ఆర్.కృష్ణయ్య



పంజగుట్ట: బీసీలు ఉద్యమపంథా మార్చాలని, సాంప్రదాయ ఉద్యమాలు మాని మిలిటెంట్ తరహా ఉద్యమాలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. బీసీలకు చట్టసభల్లో, బడ్జెట్‌లో 50 శాతం వాటా వచ్చేవరకు ఉద్యమించాలని ఉద్బోధించారు. తెలంగాణ మేధావుల సంఘం ఆధ్వర్యంలో 'బీసీ సమాజం అభివృద్ధి – తక్షణ కర్తవ్యం' అనే అంశంపై ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సంఘం చైర్మన్ డాక్టర్ బి.కేశవులు నేత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, వివిధ కుల సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, బీసీలకు రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని కేంద్రాన్ని అడిగితే కేవలం రూ. 2వేల కోట్లు విదిలించిందని, అవి బీసీలకు చాక్లెట్‌లు, బిస్కెట్‌లు కొనేందుకు కూడా సరిపోవన్నారు. మాజీ ఐపీఎస్ అధికారి చిరంజీవులు, బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్, మేధావుల సంఘం కన్వీనర్లు దాసరి కిరణ్, శ్రీనివాస్ యాదవ్, బండ సురేందర్, ఎం.నర్సయ్య, చారి, రాహుల్ దేవ్, వినయ్ పాల్గొన్నారు

సమసమాజ స్థాపనతోనే విప్లవోద్యమ లక్ష్యం నెరవేరుతుంది

- ప్రముఖ విప్లవ కవి నిఖిలేశ్వర్



సంస్మరణ సభలో నివాళులర్పిస్తున్న ప్రముఖ విప్లవ కవి నిఖిలేశ్వర్ తదితరులు

హిమాయత్‌నగర్: సమసమాజ స్థాపనతోనే భారత విప్లవోద్యమం విజయవంతం అవుతుందని ప్రముఖ విప్లవ కవి నిఖిలేశ్వర్ పేర్కొన్నారు. ప్రజలు పోరాటాలలో భాగస్వామ్యమైతేనే భారత విప్లవ రథసారథులు దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డిలకు నిజమైన నివాళి చెప్పారు. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యత కేంద్రం ఆధ్వర్యంలో విప్లవోద్యమ రథసారథులు కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డిల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న నిఖిలేశ్వర్ మాట్లాడుతూ...తరిమెల నాగిరెడ్డి రచించిన 'తాకట్టులో భారతదేశం'పుస్తకం కమ్యూనిస్టులకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు. వెంకటేశ్వరరావు, నాగిరెడ్డిలు తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర, సాహిత్యం, సంస్కృతి, కళలపై రచనలు చేశారని కొనియాడారు. ఈ సంస్మరణ సభకు వినోద్‌కుమార్ అధ్యక్షత వహించగా నవోదయ సాహితీ సాంస్కృతిక సమాఖ్య సభ్యుడు డాక్టర్ జతిన్ కుమార్, యూసీసీఆర్ ఎంఎల్ రాష్ట్ర నాయకుడు సి.భాస్కర్, ప్రధాన కార్యదర్శి డి.విజయేందర్‌రావు, గ్రామీణ పేదల సంఘం కార్యదర్శి జి.వెంకటాద్రి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటితో ముగియనున్న పీజీ ప్రవేశ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని ఎనిమిది వర్సిటీల్లో వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు జరుగుతున్న ఎంట్రన్స్ టెస్టులు రేపటితో (16న) ముగియనున్నాయి. ఈ మేరకు టీజీ సీపీజీఈటీ–2024 కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి ఆదివారం తెలిపారు. సోమవారం ఎంకామ్‌తో పాటు ఎమ్మెస్సీ బోటనీ, స్టాటిస్టిక్స్, న్యూట్రీషియన్, హెచ్‌ఆర్‌ఎం, ఎంఏ ఇస్లామిక్ స్టడీస్, మంగళవారం ఎంఈడీ కోర్సుల ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. పది రోజుల్లో ఫలితాలను వెల్లడించనున్నట్లు కన్వీనర్ చెప్పారు.

బొగత.. జనం పులకింత



ములుగు జిల్లా వాజేడు మండల పరిధి చీకుపల్లి సమీపంలోని బొగత జలపాతం ఆదివారం జన సంద్రంగా మారింది. సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఇక్కడి ప్రకృతి అందాలకు ఫిదా అయ్యారు. జలధారలను వీక్షించడంతో పాటు సెల్ ఫోన్లలో బంధించారు. సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ సందడి చేశారు.

- వాజేడు

'కాళేశ్వరం'పై ఐఏఎస్‌ల విచారణ!

- పలువురు ఐఏఎస్, రిటైర్డ్ ఐఏఎస్‌లకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ పిలుపు
- అందులో మాజీ సీఎస్‌లు సోమేశ్‌కుమార్, ఎస్కే జోషీ, మాజీ సీఎం కేసీఆర్ కార్యదర్శి స్మిత సబర్వాల్ కూడా..
- రజత్‌కుమార్, కె.రామకృష్ణారావు, వి.నాగిరెడ్డి తదితర అధికారులకూ సమన్లు



సోమేశ్ కుమార్ | ఎస్.కె. జోషీ | స్మిత సబర్వాల్



రజత్‌కుమార్ | రామకృష్ణారావు | నాగిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌లపై చేపట్టిన విచారణలో భాగంగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సోమవారం బీఆర్‌కేఆర్ భవన్‌లోని తమ కార్యాలయంలో పలువురు సీనియర్ ఐఏఎస్‌లు, రిటైర్డ్ ఐఏఎస్‌లను ప్రశ్నించనుంది. సోమవారం విచారణకు రావాలంటూ.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులుగా పనిచేసి రిటైరైన సోమేశ్‌కుమార్, ఎస్కే జోషీ, ఆర్థిక శాఖ మాజీ ముఖ్యకార్యదర్శి వి.నాగిరెడ్డి, ఆ శాఖ ప్రస్తుత ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, నీటిపారుదల శాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, మాజీ సీఎం కేసీఆర్ కార్యదర్శిగా పనిచేసిన స్మిత సబర్వాల్‌లకు సమన్లు జారీ చేసింది. ఇప్పటివరకు నిర్మాణ, సాంకేతిక అంశాలపై వివరాలు సేకరించిన చేసిన కమిషన్.. ఇప్పుడు ఆర్థికపరమైన అంశాలపై దృష్టిపెట్టిందని, ఈ క్రమంలోనే అనుమతుల జారీ, అంచనా వ్యయాల పెంపు, నిధుల విడుదలలో పాత్ర ఉన్న ఐఏఎస్‌లను విచారించనుందని అధికారవర్గాలు చెప్తున్నాయి.

నిర్మాణ సమయంలో ఉన్నవారిని..

తెలంగాణ ఏర్పాటయ్యాక సుదీర్ఘకాలం పాటు రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శిగా ఎస్కే జోషి పనిచేశారు. ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైనా నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఇన్‌చార్జి బాధ్యతల్లో కొనసాగారు. ఆయన హయాంలోనే కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన చాలా నిర్ణయాలు తీసుకున్న నేపథ్యంలో.. కమిషన్ ఆయనను విచారణకు పిలిచింది. ఎస్కే జోషి రిటైరైన తర్వాత కొన్ని నెలల పాటు నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఇన్‌చార్జి బాధ్యతల్లో సోమేశ్‌కుమార్ వ్యవహరించడంతో ఆయనను కూడా విచారణకు రావాలని ఆదేశించింది. ఇక మాజీ సీఎం కేసీఆర్ కార్యదర్శిగా స్మిత సబర్వాల్ దాదాపుగా తొమ్మిదిన్నరేళ్ల పాటు పనిచేశారు. సీఎం కార్యదర్శి హోదాలో కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టుల నిర్మాణాన్ని పర్యవేక్షించిన నేపథ్యంలో.. ఆమెను కమిషన్ విచారించనుంది. ప్రస్తుతం ఆమె రాష్ట్ర ఆర్థిక సంఘం కార్యదర్శిగా ఉన్నారు. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రుణాల సమీకరణ, బడ్జెట్ కేటాయింపులు, బిల్లుల చెల్లింపులో పాత్ర నేపథ్యంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శిగా వ్యవహరించిన రిటైర్డ్ ఐఏఎస్ వి.నాగిరెడ్డి, ప్రస్తుత ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును కమిషన్ విచారణకు రమ్మని కోరింది.

నేడు కమిషన్‌కు కె.రఘు ప్రజెంటేషన్

ఐఏఎస్‌లు, మాజీ ఐఏఎస్‌ల విచారణ సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనుంది. తర్వాత కాళేశ్వరం బరాజ్‌ల నిర్మాణంపై విద్యుత్ రంగ నిపుణుడు కె.రఘు మధ్యాహ్నం 2.30 గంటలకు కమిషన్‌కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. బరాజ్‌ల నిర్మాణంలో సాంకేతిక లోపాలు, అవకతవకతలపై సాక్ష్యాధారాలను సేకరించడానికి ఆయనను కమిషన్ విచారణకు పిలిచింది.

సమ్మక్క నుంచే అనుసంధానం!

▶ మొదటి పేజీ తరువాయి

మేడిగడ్డ బరాజ్ నుంచి ఏ మేరకు నీటిని పంపింగ్ చేయనున్నారు? సమ్మక్క సాగర్ నుంచి దేవాదుల ఎత్తిపోతల పథకానికి, శ్రీరాంసాగర్ రెండో దశ ప్రాజెక్టుకు తరలించనున్న నీటి లెక్కలతో పాటు సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా తరలించనున్న 70 టీఎంసీల నీటి వినియోగం లెక్కలను తెలంగాణ అందించింది. ఈ లెక్కల ఆధారంగా సిమ్యులేషన్ స్టడీస్ నిర్వహించి ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మాణం విషయంలో ఓ నిర్ణయం తీసుకుంటామని గతంలో ఎన్‌డబ్ల్యూడీఏ తెలియజేసింది. మరోవైపు ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మాణానికి తెలంగాణ అంగీకారం లభించే పరిస్థితి లేకపోవడంతో సమక్కసాగర్ నుంచే నీటిని తరలించే అంశాన్ని ఎన్‌డబ్ల్యూడీఏ సోమవారం నిర్వహించే సమావేశంలో పరిశీలించే అవకాశం ఉంది.

సిమ్యులేషన్ స్టడీకి కేంద్రం ఓకే

గోదావరి నీళ్లను తెలంగాణ ప్రాంతానికి తరలించడానికి వీలుగా ఇచ్చంపల్లి వద్ద 118 మీటర్ల ఎత్తుతో బరాజ్ నిర్మించడానికి 1980లోనే బచావత్ ట్రిబ్యునల్ అనుమతినిచ్చింది. అయితే మధ్యప్రదేశ్, మహారాష్ట్ర అభ్యంతరాలతో దీని ఎత్తును తొలుత 112 మీటర్లకు, మళ్లీ 1986–88లో 108 మీటర్లకు, కాలక్రమంలో 105 మీటర్లకు తగ్గించారు. తాజాగా నదుల అనుసంధానంలో భాగంగా 87 మీటర్ల ఎత్తుకు కుదించారు. అయినా ఛత్తీస్‌గఢ్‌లోని నాలుగు గ్రామాలు ముంపునకు గురికానున్నాయి. ఇక ఇచ్చంపల్లికి 24 కిలోమీటర్ల దిగువలోనే సమ్మక్క బరాజ్ ఉంది. ఇచ్చంపల్లి నుంచి అకస్మికంగా వరదను విడుదల చేస్తే సమ్మక్క బరాజ్ వద్ద వరదలు పోటెత్తి నిర్వహణ కష్టంగా మారుతుందని తెలంగాణ ఆందోళన వ్యక్తం చేస్తోంది. వరదల తీవ్రతపై సిమ్యులేషన్ స్టడీ చేయాలన్న తెలంగాణ విజ్ఞప్తికి కేంద్రం అంగీకరించడంతో సమ్మక్క సాగర్ బరాజ్ నుంచే గోదావరి–కావేరీ అనుసంధానం ప్రాజెక్టులో భాగంగా నీళ్లను తరలించే అవకాశాలు మెరుగయ్యాయి.

దేవాదుల నీటి పంపింగ్ షురూ..

- ఫేజ్–3లో ఒక మోటార్ ఆన్ చేసిన అధికారులు



దేవాదుల వద్ద పంపింగ్ అవుతున్న నీరు

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద ఉన్న దేవాదుల ఎత్తిపోతల పథకంలో నీటి పంపింగ్ మొదలైంది. ఇక్కడ కొన్ని రోజుల కింద పూర్తిగా నిలిచిపోయిన పంపింగ్‌ను అధికారులు ఆదివారం పునఃప్రారంభించారు. ఇక్కడ ఫేజ్–3లో ఆరు మోటార్లు ఉండగా.. అందులో ఒక మోటార్‌ను ఆన్ చేసి, 283 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నట్టు ఇంజనీరింగ్ అధికారులు వెల్లడించారు. ఈ పంపుహౌజ్ వద్ద ప్రస్తుతం 73.80 మీటర్ల నీటిమట్టం కొనసాగుతోందని తెలిపారు. సమ్మక్కసాగర్ బ్యారేజీకి 59 గేట్లు ఉండగా 52 గేట్లు ఎత్తారు. ఎగువ నుంచి 64,350 క్యూసెక్కుల వరద వస్తుండగా.. 64,067 క్యూసెక్కులు దిగువకు విడుదలవుతున్నాయి.

మూడున్నర గంటల్లో 30 కి.మీ పరుగు

- నిర్మల్ జిల్లాలో పరుగెత్తిన డాక్టర్ లక్ష్మీనర్సింహారెడ్డి



ఖానాపూర్ చౌరస్తాలో వైద్యుడు లక్ష్మీనర్సింహారెడ్డి

ఖానాపూర్: నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన వైద్యుడు లక్ష్మీనర్సింహారెడ్డి ఆదివారం నిర్మల్ నుంచి ఖానాపూర్ వరకు ఆగకుండా పరుగెత్తారు. ఆర్థోపెడిక్ డాక్టర్ అయిన నర్సింహారెడ్డి 30 కిలోమీటర్లకుపైగా దూరాన్ని కేవలం 3 గంటల 51 నిమిషాల వ్యవధిలో చేరుకున్నారు. ఉదయం 6 గంటలకు నిర్మల్‌లో పరుగు ప్రారంభించి 9 గంటల 51 నిమిషాలకు ఖానాపూర్‌లోని కుమురంభీం చౌరస్తాకు చేరుకున్నాడు. వైద్యుడి సాహసాన్ని స్థానికులు అభినందించారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ వాకింగ్, సైక్లింగ్, రన్నింగ్ వంటివి అలవాటుగా చేసుకోవాలని, వాటిపై అవగాహన కలిగించేందుకే ఈ పని చేసినా్నరు. రానున్న రోజుల్లో నిర్మల్ నుంచి జన్నారం వరకు 75 కిలోమీటర్ల దూరం ఏకధాటిగా రన్నింగ్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

ఆత్మహత్యలు వద్దు.. అండగా మేమున్నాం

- సబ్ ఇన్‌స్పెక్టర్లకు వెల్ఫేర్ సొసైటీ భరోసా
- ఆత్మహత్య చేసుకున్న ఎస్సై శ్రీను కుటుంబానికి ఆర్థిక సాయం



శ్రీను కుటుంబానికి చెక్కు అందిస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్లు

నల్లబెల్లి: విధి నిర్వహణలో ఒత్తిడితో ఇబ్బంది పడుతున్న సబ్ ఇన్‌స్పెక్టర్లు అధైర్యపడి ఆత్మహత్యలు చేసుకోవద్దని, తాము అండగా ఉంటామని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సబ్ ఇన్‌స్పెక్టర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు శ్రీధర్ అన్నారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీను స్వగ్రామమైన నారక్కపేటను 2014 బ్యాచ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు శనివారం సందర్శించారు. శ్రీను చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబాన్ని ఓదార్చి, వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీను కుటుంబానికి రూ.25 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ శ్రీను కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, నాయకులు శ్రీనివాస్, రవికుమార్, అభినవ్, పరమేశ్వర్, రామారావు, సాంబమూర్తి, ప్రవీణ్, తిరుపతి, రాజుకుమార్, సుమన్, లక్ష్మరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టుబెట్టి.. ప్రమాదమని నమ్మించి..

నెలన్నర క్రితం భార్యాబిడ్డలను చంపేసిన డాక్టర్

- ఆపై కారు చెట్టును ఢీకొన్నట్లుగా చిత్రీకరణ
- పోలీసుల విచారణలో తేలిన నిజాలు



భార్య కుమారి, కుమార్తెలతో డాక్టర్ ప్రవీణ్ (ఫైల్)

రఘునాథపాలెం: ఓ యువతితో కొనసాగిస్తున్న వివాహేతర సంబంధానికి భార్య, ఇద్దరు కుమార్తెలు అడ్డుగా ఉన్నారని భావించిన డాక్టర్.. తనకు ఉన్న విషయ, వైద్య పరిజ్ఞానంతో ముగ్గురినీ మట్టుబెట్టాడు. భార్య అనారోగ్యంతో ఉందని చెప్పడంతో చికిత్స పేరిట అధిక మోతాదులో మత్తు మందు ఇచ్చిన ఆ దుర్మార్గుడు ..ఆపై ఇద్దరు చిన్నారుల ముక్కు, నోరు మూసి చంపేశాడు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని అందరినీ నమ్మించే యత్నం చేసినా పోలీసులు సాంకేతిక ఆధారాలతో విచారణ చేపట్టి నిందితుడిని ఆదివారం అరెస్ట్ చేశారు. ఈమేరకు వివరాలను రఘునాథపాలెం పోలీసు స్టేషన్‌లో ఖమ్మం ఏసీపీ రమణమూర్తి, సీఐ శ్రీహరి, ఎస్‌ఐ రాము వెల్లడించారు.

హైదరాబాద్‌లో డాక్టర్... నర్స్‌తో సంబంధం

రఘునాథపాలెం మండలం బావోజీతండాకు చెందిన బోడా ప్రవీణ్ హైదరాబాద్‌లో ఫిజియోథెరపీ డాక్టర్‌గా పని చేస్తున్నాడు. భార్య కుమారితో పాటు నాలుగేళ్ల లోపు కుమార్తెలు క్రుషిక, కృతిక ఉన్నారు. అతను పనిచేసే ఆస్పత్రిలోనే కేరళకు చెందిన నర్స్‌తో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం భార్య కుమారికి తెలియడంతో నిలదీస్తూ వచ్చింది. ప్రవీణ్ తల్లితండ్రులు, కుమారి తల్లితండ్రులు హైదరాబాద్‌కు వెళ్లి ఇరువురికీ పలుమార్లు నచ్చచెప్పారు. హైదరాబాద్ వదిలేసి వైద్య వృత్తిని ఖమ్మంలోనే కొనసాగించాలని అతని తల్లిదండ్రులు సూచించారు. అయితే ఇవేమీ పట్టని ప్రవీణ్ భార్యాబిడ్డలను ఎలాగైనా మట్టుబెట్టాలని నిర్ణయించుకున్నాడు. ఈక్రమంలోనే భార్యాపిల్లలను తీసుకుని స్వగ్రామమైన బావోజీ తండాకు మే నెల రెండో వారంలో వచ్చాడు.

కలిసొచ్చిన భార్య అనారోగ్యం..

స్వగ్రామానికి వచ్చాక కుమారికి ఒంట్లో నలతగా ఉందని చెప్పడంతో అదును కోసం చూస్తున్న ప్రవీణ్‌కు కలిసొచ్చినట్లయింది. ఆమెకు చికిత్స పేరిట మే 27న ఇంజక్షన్ వేశాడు. ఆ తర్వాత ఆధార్ కార్డులో తప్పులు సరిదిద్దేందుకు కారులో వెళ్లి వస్తుండగా 28న కూడా ఆమె ఒంట్లో సుస్తీగా ఉందనడంతో చికిత్స కోసం వేస్తున్న ఇంజక్షన్‌తో పాటు అప్పటికే కారులో దాచిన మత్తు మందు హైడోస్ కలిపి ఇచ్చాడు. దీంతో ఆమె స్పృహ కోల్పోయి కన్నుమూసింది. కాగా, తల్లికి ఇంజక్షన్ వేసిన విషయాన్ని పిల్లలు చూడడంతో వారి ముక్కు, గొంతు మూసి హత్య చేశాడు. ముగ్గురూ చనిపోయారని నిర్ధారించుకున్న ప్రవీణ్ కారును తీసుకెళ్లి రోడ్డు పక్కన చెట్టుకు ఢీకొట్టి ప్రమాదంలో చనిపోయినట్లుగా చిత్రీకరించాడు.

బంధువులు నమ్మకపోవడంతో...

కారు చెట్టును ఢీకొట్టిన ఘటనలో ప్రవీణ్‌కు స్వల్పగాయాలే కావడంతో అక్కడి నుంచి హాస్పిటల్‌కు తరలించారు. అయితే, ఘటనాస్థలికి చేరుకున్న కుమారి తల్లిదండ్రులు, బంధువులు మాత్రం తమ అల్లుడి వ్యవహార శైలి తెలియడంతో అతనే చంపేశాడని అనుమానిస్తూ ఆందోళన చేయడమే కాక పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించారు. ఘటన తర్వాత అంత్యక్రియలకు హాజరైన ప్రవీణ్ ఆ తర్వాత ముఖం చాటేయడం ఈ ఆరోపణలకు బలం చేకూర్చింది.

గూగుల్ హిస్టరీతో బయటపడిన నిర్వాకం

ఘటనపై తొలుత రోడ్డు ప్రమాదంగా కేసు నమోదు చేసిన పోలీసులు మృతుల ఒంటిపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో పోస్టుమార్టం వచ్చేవరకు వేచిచూశారు. అందులో కుమారి శరీరంలో మత్తు మందు అధికంగా ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఆపై కారులో ప్రవీణ్ ఉపయోగించిన ఇంజక్షన్ నీడిల్ లభించగా మత్తుమందు ఆనవాళ్లు కనిపించాయి. ఏ మత్తు మందు వాడితే శరీరంపై ఎంతసేపు ప్రభావం ఉంటుందనే వివరాలను ప్రవీణ్ గూగుల్‌లో వెతికినట్లు హిస్టరీ ద్వారా గుర్తించారు. ఈమేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా ముగ్గురిని హత్య చేసినట్లుగా ఒప్పుకున్నట్లు ఏసీపీ రమణమూర్తి తెలిపారు. ప్రవీణ్‌తో పాటు హత్యకు ప్రేరేపించిన అతని ప్రియురాలు సోనీ ఫ్రాన్సిపైనా కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. కేసు విచారణలో కీలకంగా వ్యవహరించిన రఘునాథపాలెం సీఐ శ్రీహరి, ఎస్సై సురేశ్, సిబ్బందిని అభినందించిన ఏసీపీ రివార్డుకు ప్రతిపాదించినట్లు తెలిపారు.

బీర్‌పూర్, ధర్మపురిలో హైకోర్టు జడ్జి పూజలు



బీర్‌పూర్‌లోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్

సారంగాపూర్/ధర్మపురి: జగిత్యాల జిల్లా బీర్‌పూర్, ధర్మపురిలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రాలను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. రెండుచోట్లా ఆయనకు ఆలయ అర్చకులు, సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ప్రసాదాలు, చిత్రపటాలు అందించారు. న్యాయమూర్తిని ఘనంగా సన్మానించారు.

కాంట్రాక్టర్ల బిల్లులను విడుదల చేయాలి

- మున్సిపల్ కౌన్సిల్ ఫోరం చైర్మన్ రాము నాయక్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ కాంట్రాక్టర్ల బిల్లులను తక్షణమే విడుదల చేయాలని మున్సిపల్ కౌన్సిల్ ఫోరం రాష్ట్ర చైర్మన్ రాము నాయక్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 142 మున్సిపాలిటీలలో చిన్న, చిన్న కాంట్రాక్టర్లు ముందుకు వచ్చి సొంత పెట్టుబడులతో అభివృద్ధి పనులు చేస్తున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో మున్సిపాలిటీల్లోనే బిల్లులు మంజూరు చేసేవారని, అయితే బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఆర్థిక శాఖ చీఫ్ సెక్రెటరీ ఆమోదంతోనే బిల్లులు వచ్చేలా ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. సంవత్సరాల తరబడి బిల్లులు రాకపోవడంతో చిన్న కాంట్రాక్టర్లు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీల్లోనే బిల్లులు చెల్లించే విధంగా ఆదేశాలు జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. చిన్న కాంట్రాక్టర్లు బిల్లులు రాకపోవడంతో, కొత్తగా పనులు చేయడానికి జంకుతున్నారని తెలిపారు. అలాగే ఆస్తి మార్పిడీకి వసూలు చేసే మొత్తంలో పురపాలక శాఖకు ఐదేళ్లుగా వాటా ఇవ్వడం లేదని, రూ. 2,500 కోట్ల బకాయిలను తక్షణమే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



ట్రంప్‌పై హత్యాయత్నం

ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తుండగా కాల్పులు

షికాగో/వాషింగ్టన్: అమెరికా చరిత్రపై మరో రక్తపు మరక. ఆ దేశ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (78)పై హత్యా యత్నం జరిగింది. నవంబర్లో జరగనున్న ఎన్నికల్లో గెలిచి మరోసారి అధ్యక్ష పదవి చేపట్టేందుకు రిపబ్లికన్ల అభ్యర్థిగా సర్వశక్తులూ ఒడ్డుతున్న ఆయన ఈ ప్రాణాంతక దాడి నుంచి త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డారు. స్థానిక కాలమానం ప్రకారం శనివారం పెన్సిల్వేనియాలోని బట్లర్ టౌన్‌లో ఔట్‌డోర్ ఎన్నికల ర్యాలీలో ఉండగా ఈ ఘోరం జరిగింది. భారీగా హాజరైన మద్దతుదారులు, అభిమానులను ఉద్దేశించి సాయంత్రం ఆరు గంటలకు ట్రంప్ ప్రసంగం మొదలు పెట్టారు. అప్పటికే సమీప గోడౌన్‌పై నక్కిన ఓ దుండగుడు ఏఆర్ శ్రేణి ఆటోమేటిక్ అసాల్ట్ రైఫిల్‌తో ట్రంప్‌పైకి కనీసం ఐదు రౌండ్లకు పైగా కాల్పులు జరిపాడు. దాంతో ఒక్కసారిగా గందరగోళం చెలరేగింది. అరుపులు, కేకలు, ఆక్రందనలు, పారిపోతున్న జనాలతో పరిస్థితి గందరగోళంగా మారింది. ఒక తూటా ట్రంప్ కుడి చెవి పై భాగాన్ని గాయపరిచింది. మరిన్ని తూటాలు ఆయన తలకు అతి సమీపం నుంచి దూసుకెళ్లాయి. ట్రంప్ బాధతో తన చెవిని చేత్తో పట్టుకుంటూనే తూటాల నుంచి తప్పించుకునేందుకు వెంటనే డయాస్ కిందకు వంగారు. ఆలోపే సీక్రెట్ సర్వీస్ సిబ్బంది ట్రంప్‌ను చుట్టుముట్టి రక్షణ కవచంలా నిలిచారు. చెవి నుంచి కుడి చెంప మీదుగా రక్తమోడుతున్న ట్రంప్‌ను హుటాహుటిన వేదిక నుంచి తీసుకెళ్లి కార్లో కూర్చోబెట్టి సురక్షితంగా తరలించారు. వేదికను వీడుతూ ట్రంప్ పిడికిలి బిగించి పైకెత్తి, సభికులనుద్దేశించి 'ఫైట్' అని పదే పదే భావోద్వేగంతో బిగ్గరగా నినాదాలు చేశారు. వారు కూడా తమ నేతకు మద్దతుగా ఫైట్ అంటూ పెద్దపెట్టున ప్రతి నినాదాలు చేశారు. అక్కణ్నుంచి ట్రంప్‌ను హుటాహుటిన పిట్స్‌బర్గ్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కారెక్కే ముందు కూడా ట్రంప్ మరోసారి పిడికిలి బిగించి నినాదాలు చేశారు. ఈ మొత్తం ఉదంతానికి సంబంధించిన వీడియో ప్రపంచమంతటా వైరలవుతోంది. ట్రంప్ క్షేమంగా ఉన్నట్టు అనంతరం ఆయన ప్రచార కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. దుండగుని కాల్పుల్లో సభికుల్లో ఒకరు దుర్మరణం పాలయ్యారు. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సమీప భవనాలపై మోహరించి ఉన్న సీక్రెట్ సర్వీస్ స్నైపర్లు తక్షణం స్పందించి దుండగున్ని కాల్చి చంపారు. అతన్ని 20 ఏళ్ల థామస్ మాథ్యూ క్రూక్స్ అనే యువకునిగా గుర్తించారు. అతను కాల్పులకు తెగబడేందుకు కారణం తెలియాల్సి ఉంది. అమెరికా వంటి అగ్ర రాజ్యంలో మాజీ అధ్యక్షుని స్థాయి నేతపై ఇంత సమీపం నుంచి కాల్పులు జరగడం ఘోర భద్రతా వైఫల్యమేనంటున్నారు. ఈ ఘటనపై ఎఫ్‌బీఐ పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతోంది. ట్రంప్‌పై దాడితో ప్రపంచం నివ్వెరపోయింది. హత్యా యత్నాన్ని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్, ప్రధాని నరేంద్ర మోదీతో సహా దేశాధినేతలంతా ఈ ఘటనను ఖండించారు.


ట్రంప్ చుట్టూ రక్షణ కవచంలా కమ్ముకుంటున్న సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు


సిబ్బంది రక్షణ మధ్య డయాస్‌పై కిందికి వంగిన ట్రంప్



దాడి అనంతరం ట్రంప్‌ను సురక్షితంగా తరలిస్తున్న భద్రతా సిబ్బంది

దేవుడే కాపాడాడు: ట్రంప్



ప్రాణాంతక దాడి నుంచి తనను భగవంతుడే రక్షించాడని ట్రంప్ అన్నారు. కాల్పుల ఘటనపై తన సొంత సోషల్ మీడియా 'ట్రూత్'లో ఆయన స్పందించారు. కాల్పుల్లో మరణించిన, గాయపడ్డ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ''నిర్భయంగా ముందుకెళ్దాం. ఈ సమయంలో అమెరికన్లమంతా మరింత సమైక్యంగా నిలబడాల్సిన అవసరముంది. అమెరికన్లుగా మన వ్యక్తిత్వాన్ని చాటాల్సిన, దుష్టశక్తి గెలవకుండా అడ్డుకోవాల్సిన సమయమిది. మిమ్మల్ని, మన దేశాన్ని నేను త్రికరణశుద్ధిగా ప్రేమిస్తున్నా. త్వరలో విస్కాన్సిన్ సభ ద్వారా మీ అందరినీ ఉద్దేశించి మాట్లాడేందుకు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా'' అని రిపబ్లికన్ పార్టీ మూడు రోజుల సదస్సును ఉద్దేశించి అన్నారు. ఈ సదస్సులో అధ్యక్ష అభ్యర్థిని అధికారికంగా ప్రకటించనుండటం తెలిసిందే.

> జుయ్‌మంటూ తూటాలు దూసుకెళ్తున్న శబ్దాలు స్పష్టంగా విన్పించాయి. ఏదో జరుగుతోందని అనుకునేంతలో ఓ తూటా నా కుడి చెవి పై భాగాన్ని ఛిద్రం చేసింది. చర్మం తెగిపోయింది. విపరీతంగా రక్తం కారింది. ఏం జరుగుతోందో అప్పటికి నాకర్థమైంది. అమెరికా వంటి దేశంలో ఇలాంటి చర్య జరగడం అనూహ్యం. గాడ్ బ్లెస్ అమెరికా
>
> - తనపై కాల్పులను ఉద్దేశించి సొంత సోషల్ మీడియా 'ట్రూత్'లో డొనాల్డ్ ట్రంప్

120 మీటర్ల నుంచే కాల్పులు

ట్రంప్‌పై కాల్పుల ఘటనపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. కేవలం 120 నుంచి 150 మీటర్ల దూరం నుంచి కాల్పులు జరిగినట్టు ప్రాథమికంగా తేలింది. అత్యంత కట్టుదిట్టమైన భద్రతా వలయంలో ఉండే అమెరికా మాజీ అధ్యక్షునిపైకి ఇంత సమీపం నుంచి కాల్పులు జరపడం నమ్మశక్యం కాని విషయమని ఎఫ్‌బీఐ స్పెషల్ ఏజెంట్ కెవిన్ రోజెక్ అన్నారు. అంతమంది భద్రతా సిబ్బంది రక్షణలో ఉన్న ట్రంప్‌పైకి దుండగుడు అన్ని రౌండ్ల పాటు కాల్పులు జరపగలగడం వింతగా ఉందని అభిప్రాయపడ్డారు. ''దుండగుడు అంత సమీపానికి ఎలా రాగలిగాడు, ఎవరు సహకరించారు వంటి కోణాల్లోనూ దర్యాప్తు జరుగుతుంది'' అని చెప్పారు.

దుండగుడు రిపబ్లికన్ ఓటరే



ట్రంప్‌పై కాల్పులకు తెగబడ్డ థామస్ మాథ్యూ క్రూక్స్ రిపబ్లికన్ పార్టీ ఓటరుగా నమోదు చేసుకున్నట్టు తేలడం విశేషం. అయితే 2021లో డెమొక్రటిక్ పార్టీ అనుబంధ విభాగానికి 15 డాలర్ల విరాళం ఇచ్చినట్టు కూడా వెల్లడైంది. కొద్ది రోజుల ముందే ట్రంప్‌ను ద్వేషిస్తూ, రిపబ్లికన్ పార్టీని విమర్శిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడట. క్రూక్స్‌ది పెన్సిల్వేనియాలో పిట్స్‌బర్గ్ శివార్లలోని బెథెల్ పార్క్ అని తేలింది. బతికుంటే ఈ నవంబర్లో అతను తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునేవాడు. మృతదేహం వద్ద గుర్తింపు కార్డుల వంటివేవీ లభించకపోవడంతో అతన్ని గుర్తించడం ఏజెంట్లకు కష్టంగా మారింది. దాంతో చివరికి డీఎన్‌ఏ పరీక్ష చేసి గుర్తించారు.

దుండగుని ముందస్తు ఏర్పాట్లు!

ట్రంప్‌పై కాల్పులకు తెగబడేందుకు దుండగుడు ముందుగానే పక్కాగా ఏర్పాట్లు చేసుకున్నట్టు భావిస్తున్నారు. దాడికి పాల్పడ్డ గోడౌన్ వంటి భవనం ర్యాలీకి అతి సమీపంలో ఉంది. దానిపైకి చేరుకునేందుకు ఒక నిచ్చెన కూడా ఏర్పాటు చేసి ఉంది. అతని మృతదేహం పక్కన పలు రకాలైన ప్యాకేజీలను పోలీసులు గుర్తించారు. వాటిలో పేలుడు పదార్థాలు ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

భీతావహంగా ఘటనా స్థలి

ట్రంప్‌పై హత్యా యత్నం జరిగిన బట్లర్ కేవలం 13 వేల జనాభా ఉండే చిన్న పట్టణం. పశ్చిమ పెన్సిల్వేనియాలో పిట్స్‌బర్గ్‌కు 33 మైళ్ల దూరంలో ఉంటుంది. ఆరుబయట మైదాన ప్రదేశంలో ర్యాలీ జరిగింది. తన మార్కు ఎర్ర టోపీ, నల్ల సూటులో ట్రంప్ వేదికపైకి చేరుకుని ప్రసంగం మొదలు పెట్టారు. అమెరికాలోకి అక్రమ వలసలు పెరిగిపోయాయంటూ చార్ట్ సాయంతో వివరిస్తుండగా కాల్పులు మొదలయ్యాయి. దాంతో అంతా ప్రాణభయంతో కేకలు వేశారు. తూటాలను తప్పించుకునేందుకు నేలపై పడుకుండిపోయారు. ఆ ప్రదేశమంతా భీతావహంగా మారింది. ట్రంప్‌ను సురక్షితంగా తరలించాక కూడా చాలాసేపటిదాకా జనం నేలపై పడుకునే కన్పించారు. అనంతరం భద్రతా సిబ్బంది రంగప్రవేశం చేసి ర్యాలీ వేదికను అదుపులోకి తీసుకున్నారు.

ముందే చూసిన జనం...!

ట్రంప్‌పై కాల్పులకు దిగిన దుండగుడు క్రూక్స్‌ను తాము ముందే చూసినట్టు సభికుల్లో పలువురు వెల్లడించారు. అతడు గోడౌన్‌పై నెమ్మదిగా కదులుతూ ట్రంప్‌కు వీలైనంత సమీపంగా వచ్చినట్టు ఇద్దరు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. కాల్పులకు ముందే క్రూక్స్ చేతిలో తుపాకీని స్పష్టంగా చూసినట్టు మరో ప్రత్యక్ష సాక్షి చెప్పాడు. ''దేవుడా! అతని చేతిలో తుపాకీ ఉందంటూ అరిచా. అంతలోనే కాల్పులకు తెగబడటంతో వెంటనే నేలపై పడుకుని తలెత్తి చూశా. ఏజెంట్ల తూటాలకు అతని తల పేలిపోవడాన్ని కళ్లారా చూశా'' అని చెప్పుకొచ్చాడు.

పెరిగిన ట్రంప్ విజయావకాశాలు!

అధ్యక్ష ఎన్నికల రేసులో ఇప్పటికే దూసుకుపోతున్న ట్రంప్ విజయావకాశాలు కాల్పుల ఉదంతం నేపథ్యంలో మరింతగా పెరిగినట్టు చెబుతున్నారు. ఆయన విజయావకాశాలు గత 24 గంటల్లోనే 8 శాతం పెరిగి ఏకంగా 70 శాతానికి చేరినట్టు రాజకీయ అంచనాల వేదిక పాలీ మార్కెట్ పేర్కొంది. అంతటి ప్రాణాపాయ పరిస్థితిలోనూ ట్రంప్ అత్యంత వీరోచితంగా వ్యవహరించారంటూ అన్నివైపుల నుంచీ ప్రశంసల వర్షం కురుస్తోంది. ''తల పక్కనుంచి తూటాలు దూసుకెళ్లాయి. ఒకటి చెవిని ఛిద్రం చేసింది. అయినా ట్రంప్ అస్సలు భయపడలేదు. ప్రాణాలు కాపాడుకోవడానికి మోకాళ్లపై పాక్కుంటూ పోవడం వంటివేవీ చేయలేదు. ఏ మాత్రం వెరవకుండా తిరిగి లేచి నుంచున్నారు. భద్రతా సిబ్బందిని నిలువరించి మరీ పిడికిలి బిగించి పోరాట నినాదాలు చేశారు'' అంటూ పలువురు మద్దతుదారులు ప్రశంసిస్తున్నారు.

ట్రంప్‌తో మాట్లాడిన బైడెన్

హత్యా యత్నంపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ విస్మయం వెలిబుచ్చారు. ఈ దారుణ ఘటనను అంతా తీవ్రంగా ఖండించాల్సిన అవసరముందన్నారు. ట్రంప్ క్షేమంగా ఉండటం పట్ల హర్షం వెలిబుచ్చారు. ఆయనకు ఫోన్ చేసి మాట్లాడారు. అనంతరం బైడెన్ ప్రజలనుద్దేశించి కూడా మాట్లాడారు. ఇలాంటి హింసకు అమెరికాలో తావు లేదన్నారు. షెడ్యూల్ ప్రకారం వారాంతాన్ని గడిపేందుకు బైడెన్ డెలావెర్ వెళ్లాల్సి ఉన్నా పర్యటన రద్దు చేసుకుని వైట్‌హౌస్‌కు తిరిగొచ్చారు. ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌తో పాటు మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, బిల్ క్లింటన్, జార్జి బుష్, డెమొక్రటిక్, రిపబ్లికన్ పార్టీ నేతలు తదితరులు కూడా దాడిని తీవ్రంగా ఖండించారు.

మోదీ ఖండన

ట్రంప్‌పై హత్యా యత్రాన్ని ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో, రాజకీయాల్లో హింసకు తావు లేదని స్పష్టం చేశారు. ''నా మిత్రుడు ట్రంప్‌పై దాడి పట్ల తీవ్రంగా ఆందోళన చెందా. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా'' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దేశాధినేతలు మాక్రాన్ (ఫ్రాన్స్), స్టార్మర్ (బ్రిటన్), ఆల్బనీస్ (ఆస్ట్రేలియా), మెలోనీ (ఇటలీ), కిషిడా (జపాన్), ట్రూడో (కెనడా), జెలెన్‌స్కీ (ఉక్రెయిన్), నెతన్యాహూ (ఇజ్రాయెల్) తదితరులు కూడా దాడిని తీవ్రంగా ఖండించారు.

ఎప్పుడు ఏమి జరిగిందంటే

అమెరికా స్థానిక కాలమానం ప్రకారం శనివారం సాయంత్రం ఆరింటికి ర్యాలీని ఉద్దేశించి ట్రంప్ ప్రసంగం మొదలైంది. తర్వాతేం జరిగిందంటే...

6:11:33 - ట్రంప్‌పై కాల్పులు జరిగాయి. ఒక తూటా కుడి చెవికి తాకడంతో బాధతో ముఖాన్ని తడుముకున్నారు

6:11:35 - తూటాల నుంచి తప్పించుకునేందుకు డయాస్ కిందికి వంగారు. 'గెట్ డౌన్' అని అరుస్తూ భద్రతా సిబ్బంది పోడియం పైకి దూసుకొచ్చారు. రక్షణ కవచంలా ట్రంప్‌ను చుట్టుముట్టారు. అంతలో మరిన్ని తూటాలు దూసుకొచ్చాయి.

6:11:41 - 'ఏం చేస్తున్నాం మనం? ఏం జరుగుతోంది?' అంటూ మహిళా ఏజెంట్ కేకలు. జనం కేకలు, అరుపులు. అంతటా గందరగోళం

6:11:50 - మళ్లీ కాల్పుల చప్పుడు. ఒక మహిళ ఆక్రందన

6:11:58 - ''స్పేర్ (కారు) దగ్గరికి కదలండి'' అంటూ ట్రంప్ భద్రతా ఏజెంట్ల పరస్పర హెచ్చరికలు

6:12:06 - 'హాక్ఐ (కౌంటర్ అటాక్ టీం) వచ్చేసింది, కారు వైపు వెళ్దాం' అన్న భద్రతా సిబ్బంది

6:12:09 - సిద్ధంగా ఉండాలంటూ కార్లోని సిబ్బందికి సూచనలు

6:12:21 - షూటర్ చనిపోయాడని నిర్ధారించుకున్న ట్రంప్ భద్రతా సిబ్బంది

6:12:22 - కారువైపు కదిలేందుకు సేఫేనా అంటూ ఏజెంట్ల ఆరా

6:12:23 - 'అంతా సేఫ్, కారువైపు పదండి' అన్న మరో ఏజెంట్. ట్రంప్‌ను పైకి లేపిన సిబ్బంది.

6:12:35 - అంతా ఓకే అని ట్రంప్‌కు చెప్పిన ఏజెంట్లు


6:12:36 - తన షూ వేసుకోనివ్వాలన్న ట్రంప్

6:12:37 - 'ఆగండి సర్. మీ తలంతా రక్తం' అని ట్రంప్‌తో ఓ ఏజెంట్

6:12:39 - 'సర్, మనం కారువైపు కదలాలి' అన్న మరో ఏజెంట్

6:12:47 - 'ఆగండి, ఆగండి' అంటూ భద్రతా సిబ్బందిని నిలువరించిన ట్రంప్. జనంకేసి చూస్తూ పిడికిలి బిగించి 'ఫైట్' అంటూ బిగ్గరగా నినాదాలు. అంతే బిగ్గరగా బదులిచ్చిన జనం

6:12:54 - 'మనమిక వెళ్లాలి' అంటూ ట్రంప్‌ను కారుకేసి తీసుకెళ్లిన భద్రతా సిబ్బంది. మరోసారి నినాదాలు చేస్తూ కార్లో కూర్చున్న ట్రంప్




రత్నభండార్‌ను తెరుస్తున్న సందర్భంగా జగన్నాథాలయం వెలుపల భక్తులు

పూరీలో తెరుచుకున్న.. రత్నభండార్

భువనేశ్వర్: అశేష భక్తజనం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. ఒడిశాలోని ప్రఖ్యాత పూరీ జగన్నాథ స్వామికి శతాబ్దాలుగా రాజులు, భక్తులు కానుకగా సమర్పించిన వజ్రాభరణాలు, వెండి, బంగారు నిల్వలను దాదాపు 46 ఏళ్ల తర్వాత తొలిసారిగా తనిఖీచేయనున్నారు. ఆభరణాలను తూకం వేసి, నాణ్యత లెక్కించి, అవసరమైతే మరమ్మతులు చేయనున్నారు. ఆలయంలోని రహస్య ఖజానా గది జీర్ణావస్థకు చేరిన నేపథ్యంలో గదికి మరమ్మతులు చేయనున్నారు. అంతవరకు అపారమైన ఖజానాను జాగ్రత్తగా వేరేచోట భద్రపరచనున్నారు. ప్రభుత్వ కమిటీ సభ్యులు ఆదివారం మధ్యాహ్నం ఆలయానికి చేరుకున్నారు. ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు చేసి ఖజానా యజమానులైన విమలా మాత, మహాలక్ష్మీ ఆజ్ఞ తీసుకున్నారు. తర్వాత ఖజానాకు రక్షకుడైన లోకనాథ్ స్వామి అనుమతి తీసుకున్నారు. మధ్యాహ్నం 1.28 గంటలకు ఖజానా గది తలుపులు తెరిచారు. 11 మంది మాత్రమే సంప్రదాయ దుస్తుల్లో గదిలోకి వెళ్లారు. ఆభరణాలను లెక్కించకుండానే సాయంత్రం 5.20కి బయటికి వచ్చారు.

తరలింపు మరో రోజున


''లోపలి గది తాళాలు తెరుచుకోకపోవడంతో వాటిని పగలగొట్టి తెరిచాం. ఆభరణాలు, విలువైన వస్తువులను తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లోకి తరలించి సీల్ వేశాం. అన్నింటినీ ఒకే రోజు తరలించడం కష్టం. త్వరలో తేదీని నిర్ణయించి తరలింపు మొదలెడతాం. రిపేర్ల తర్వాత ఆభరణాలకు విలువ కట్టే పని మొదలుపెడతాం' అని ఏఎస్ఐ శాఖ అధికారులు వెల్లడించారు. గదిలోని ఆభరణాలను తరలించేందుకు సిద్ధం చేసిన 4.5 అడుగుల పొడవు, 2.5 అడుగుల వెడల్పు, 2.5 అడుగుల లోతున్న పెద్ద టేకు చెక్కపెట్టెలను గది వద్దకు తెప్పించారు. గదిలో పాములేవీ లేవని తేలింది.

'ఎక్స్'లో మోదీ ఫాలోయర్లు 10 కోట్లు..!



న్యూఢిల్లీ: సామాజిక మాధ్యమ వేదికలపై ఎల్లప్పుడూ చురుగ్గా ఉండే ప్రధాని మోదీ మరో మైలురాయిని అధిగమించారు. 'ఎక్స్'హ్యాండిల్‌లో ప్రధాని మోదీ ఫాలోయర్ల సంఖ్య ఆదివారం రికార్డు స్థాయిలో 10 కోట్లను దాటిపోయింది. గత మూడేళ్లలో అదనంగా 3 కోట్ల మంది ఫాలోయర్లు నమోదవడంతో మోదీ ఈ ఘనత సాధించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో అత్యధిక ఫాలోయర్లు కలిగిన ప్రపంచ నేతల్లో ఒకరిగా ఆయనకు ఇప్పటికే పేరుంది. దేశంలో ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్‌కు 2.75 కోట్ల మంది, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీకి 2.64 కోట్ల మంది ఫాలోయర్లు ఉన్నారు. ప్రపంచ నేతల్లో అమెరికా అధ్యక్షుడు బైడెన్‌కు 3.81 కోట్ల మంది, తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగన్‌కు 2.15 కోట్ల మంది ఫాలోయర్లు ఉన్నారు. క్రీడాకారుల్లో క్రికెటర్ విరాట్ కోహ్లీకి 6.41 కోట్ల మంది, ఫుట్‌బాల్ క్రీడాకారుడు నెయ్‌మార్‌కు 6.36 కోట్లు, అమెరికా బాస్కెట్ బాల్ క్రీడాకారుడు లెబ్రాన్ జేమ్స్‌కు 5.29 కోట్ల మంది ఫాలోయర్లు ఉన్నారని 'ఎక్స్'అధికారి ఒకరు వివరించారు. అమెరికాకు చెందిన సెలెబ్రిటీ టేలర్ స్విఫ్ట్‌కు 9.53 కోట్లు, లేడీ గాగాకు 8.31 కోట్లు, కిమ్ కర్దాషియన్‌కు 7.52 కోట్ల మంది ఫాలోయర్లు ఉన్నట్లు తెలిపారు.

నేపాల్ నూతన ప్రధానిగా కేపీ శర్మ ఓలి



కఠ్మాండు: నేపాల్ ప్రధానమంత్రిగా ఖడ్గ ప్రసాద్ శర్మ ఓలి నాలుగోసారి నియమితులయ్యారు. ఆదివారం అధ్యక్షుడు రాం చంద్ర పౌడెల్ ఆయన్ను ప్రధానిగా నియమించారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్- యూనిఫైడ్ మార్కిస్ట్ లెనినిస్ట్ (సీపీఎన్-యూఎంఎల్)-నేపాలీ కాంగ్రెస్(ఎన్సీ)లతో కొత్తగా ఏర్పాటైన సంకీర్ణ ప్రభుత్వానికి చైనా అనుకూలవాదిగా పేరున్న ఓలి నాయకత్వం వహించనున్నారు. పార్లమెంట్‌లో శుక్రవారం జరిగిన విశ్వాస పరీక్షలో పుష్ప కమల్ దహల్ ప్రచండ ఓడిపోవడంతో కొత్త ప్రభుత్వం ఏర్పాటు అనివార్యమైంది. ఓలితోపాటు ఆయన మంత్రివర్గం సోమవారం ప్రమాణం చేయనుంది. గతంలో నేపాల్ ప్రధానిగా కేపీ శర్మ ఓలి 2015-16, 2018-2021 సంవత్సరాల మధ్యలో పనిచేశారు. అయితే, అప్పటి రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2021 మే 13వ తేదీన మరోసారి ఓలిని రాష్ట్రపతి బిద్యాదేవి భండారీ ప్రధానిగా నియమించడం వివాదమైంది. ఈ నియమాకం రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడంతో ఓలి అప్పట్లో రాజీనామా చేయాల్సి వచ్చింది. తాజాగా ఏర్పడిన సంకీర్ణంలో మరో ఐదు పార్టీలు చేరే అవకాశాలున్నాయంటున్నారు.

నా పైనా రెండు హత్యాయత్నాలు: మస్క్



వాషింగ్టన్: గత ఎనిమిది నెలల కాలంలో తనపై రెండుసార్లు హత్యాయత్నం జరిగినట్లు బిలియనీర్, టెస్లా సీఈవో ఎలన్ మస్క్ వెల్లడించారు. టెక్సాస్‌లోని టెస్లా ప్రధాన కార్యాలయం సమీపంలో తుపాకులతో ఉన్న వ్యక్తులను భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారన్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్‌పై హత్యాయత్నం నేపథ్యంలో మస్క్ వ్యక్తిగత భద్రతపై ఆయన సొంత సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో ఓ యూజర్ 'దయచేసి మీకున్న భద్రతా ఏర్పాట్లను మూడింతలు పెంచుకోండి. ఇవాళ ట్రంప్.. రేపు మీ వంతు రావచ్చు'అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి మస్క్ స్పందిస్తూ... 'నిజమే, ప్రమాదం పొంచి ఉంది. గత ఎనిమిది నెలల్లో నన్ను చంపేందుకు ఇద్దరు వ్యక్తులు ప్రయత్నం చేశారు. తుపాకీలతో సహా వారిని అరెస్ట్ చేశారు'అని తెలిపారు. ఏ సమయంలోనైనా తాను హత్యకు గురి కావచ్చునంటూ గతంలోనూ మస్క్ ఆందోళన వ్యక్తం చేశారు.

'జుక్తోసాధన' భారత సంప్రదాయం

ప్రస్తుతం పరమత సహనంపై దృష్టిపెట్టాలన్న ఆర్థికవేత్త అమర్త్యసేన్



కోల్‌కతా: మతాలకతీతంగా హిందువులు, ముస్లింలు కలిసి జీవించడం, పనిచేసుకోవడం భారత సంప్రదాయమని ప్రముఖ ఆర్థిక వేత్త, నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ అన్నారు. అలీపూర్ జైలు మ్యూజియంలో జరిగిన పుస్తక పఠన కార్యక్రమంలో యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ''మన దేశ చరిత్రను చూస్తే.. కొన్ని యుగాలుగా హిందువులు, ముస్లింలు మతసామరస్యంతో కలిసిమెలసి జీవిస్తున్నారు. క్షితిమోహన్ సేన్ దీనిని 'జుక్తోసాధన' అన్నారు. ఒకమతం వారు ఇంకో మతంపై విద్వేషాన్ని ప్రదర్శిస్తున్న ప్రస్తుత కాలంలో ఈ సిద్ధాంతంపై మనం దృష్టి పెట్టాల్సి ఉంది. పిల్లలు ఇలాంటి విషపూరిత భావజాల బారిన పడకపోవడం వల్లే వారు ఎలాంటి భేదభావాలు లేకుండా బతుకుతున్నారు. సమాజంలో పరమత సహనం విలువలను పెంపొందించాల్సిన అవసరం ఉంది. 'జుక్తోసాధన' సామాజిక సేవ, కళల్లో వ్యక్తమవుతోంది'' అని ఆయన అన్నారు. ఉపనిషత్తులను పార్శీలోకి అనువదించిన ముంతాజ్ కుమారుడు దారా షికోను ప్రస్తావిస్తూ దేశంలోని బహుళ సంస్కృతిని గుర్తు చేశారు.

ఆందోళనకరంగా కేజ్రీవాల్ ఆరోగ్యం: ఆప్



న్యూఢిల్లీ: జైలులో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఆరోగ్యం ఆందోళనకరంగా మారిందని ఆప్‌నకు చెందిన మంత్రి అతిశీ పేర్కొన్నారు. జైలులో ఉన్న కాలంలో కేజ్రీవాల్ 8.5 కిలోల వరకు బరువు తగ్గారని, రక్తంలో చక్కెర స్థాయి నిద్రిస్తున్న సమయంలో 50 కంటే దిగువకు పడిపోతోందని పేర్కొన్నారు. తప్పుడు కేసులో ఇరికించి, బీజేపీ ఆయన్ను జైలులోనే ఉంచాలని కుట్ర పన్నిందని అతిశీ ఆరోపించారు. వెంటనే జైలు నుంచి విడుదల చేసి, సరైన వైద్యం అందించకుంటే ఆయనకు ఏదైనా ప్రమాదం జరగొచ్చని, అందుకు బాధ్యతెవరిదని ఆమె ప్రశ్నించారు. మద్యం కుంభకోణంలో మనీ లాండరింగ్ ఆరోపణలనెదుర్కొంటున్న కేజ్రీవాల్‌ను ఈడీ మార్చి 21న అరెస్ట్ చేసింది.

తమిళనాడు బీఎస్పీ చీఫ్ హంతకుని ఎన్‌కౌంటర్

చెన్నై: తమిళనాడు బహుజనసమాజ్ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసు నిందితుడు కె.తిరువేంగడమ్(33) పోలీసు ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు. కస్టడీలో ఉన్న అతను తప్పించుకున్నాడని, వెతికి అరెస్ట్ చేయబోతే దేశవాళీ పిస్టల్‌తో కాల్పులు జరిపాడని తమిళ పోలీసులు చెప్పారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో తిరువేంగడమ్ చనిపోయాడని స్పష్టంచేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యకు వినియోగించిన స్వాధీనంచేసుకునేందుకు నిందితుడిని వెంటబెట్టుకుని ఎస్కార్ట్ పోలీసు బృందం ఆదివారం తెల్లవారుజామున బయల్దేరింది. మార్గమధ్యంలో ఒక చెరువు సమీపంలో నిందితుడు కాలకృత్యాల కోసం పోలీసు వాహనం ఆపారు. ఈ సమయంలో ఎస్కార్ట్ పోలీసులను తోసేసి అక్కడి నుంచి నిందితుడు పరారయ్యాడు. అటవీప్రాంతంలో అతని ఆచూకీ కనిపెట్టారు. నిందితుడు కాల్పులు జరిపాడు. ఎదురుకాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలించేలోపే కన్నుమూశాడు.

నిందితుడి తరలింపులో ఇంత నిర్లక్ష్యమా: పళనిస్వామి

ఎన్‌కౌంటర్ ఘటనపై విపక్ష నేత, అన్నాడీఎంకే చీఫ్ కె.పళనిస్వామి స్పందించారు. ''వాహనంలో తరలించేటపుడు నిందితుడికి బేడీలు వేశారా?. కస్టడీలో ఉన్న వ్యక్తి విషయంలో ఇంత నిర్లక్ష్యమా? తెల్లవారుజామునే ఎందుకు తరలించారు? అసలు నిందితులను కాపాడేందుకు బూటకపు ఎన్‌కౌంటర్ చేశారన్న అనుమానాలొస్తున్నాయి' అన్నారు.

సాక్షి
హైదరాబాద్
సోమవారం । 15 । జూలై । 2024


నెక్టర్ గార్డెన్ ప్రాంతంలో పరిస్థితిని సమీక్షిస్తున్న దానకిషోర్


మలక్‌పేట్‌లో వరద ఉధృతి

గరిష్టం/కనిష్టం
29.0/23.0

వాతావరణం
నగరంలో రాబోయే 24 గంటల్లో భారీ వర్షం కురవవచ్చు. గరిష్టంగా 29, కనిష్టంగా 23 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.


అమీర్‌పేట్‌లో రహదారిని ముంచెత్తిన వరద

ఉరిమిన వరుణుడు

నగరంలో కుండపోత

సాక్షి, సిటీబ్యూరో/గచ్చిబౌలి: నగరంలో వర్షం దంచికొట్టింది. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి 10 గంటల వరకు సగటున 8.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రహదారులపై భారీగా వరద నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. పలుచోట్ల రోడ్లు చెరువులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. ఇళ్లలోకి వరద నీరు చేరింది. కొన్నిచోట్ల కార్లు, ఆటోలతో పాటు ద్విచక్ర వాహనాలు వరదలో కొట్టుకుపోయాయి. ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. కాగా.. నగరంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ పర్యటించారు. నగరంలోని శేరిలింగంపల్లి, ఖైరతాబాద్‌తో పాటు..దుర్గం చెరువు, నెక్టర్ గార్డెన్ ప్రాంతాల్లో పరిస్థితిని ఆయన సమీక్షించారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, జలమండలి ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి క్షేత్రస్థాయిలో పరిస్థితుల్ని అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జలమండలి ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్స్, ఎన్డీఆర్ఎఫ్ బృందాల్ని రంగంలోకి దించాలన్నారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ క్షేత్ర స్థాయిలో పరిస్థితుల్ని అంచనా వేయాలని సూచించారు. ఆయన వెంట శేరిలింగంపల్లి సర్కిల్ ఈఈ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


ఈసీఐఎల్ వద్ద ట్రాఫిక్‌జాం



కూలిన నాచారం పోలీస్ స్టేషన్ ప్రహరీ

మల్లాపూర్: భారీ వర్షానికి నాచారం పోలీస్ స్టేషన్ ప్రహరీ కూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. గోడకు ఆనుకుని ఉన్న చిరు వ్యాపారుల పూల బండ్లపై రాళ్లు పడటంతో అవి విరిగిపోయాయి.


రెజిమెంటల్ బజార్‌లో నీట మునిగిన వాహనాలు

అధికారులు అప్రమత్తం..

నగరంలో కురిసిన వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులను అప్రమత్తం చేసినట్టు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. నగరంలోని పరిస్థితిపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్ అధికారులతో కలిసి నగరంలోని పలు ప్రాంతాలను సందర్శించారు.

నిండుకుండలా హుస్సేన్ సాగర్..

భారీగా కురుస్తున్న వర్షాలకు హుస్సేన్‌సాగర్ నిండుకుండను తలపిస్తోంది. హుస్సేన్‌సాగర్ గరిష్ట స్థాయి నీటి సామర్థ్యం 514.75 మీటర్లు కాగా.. ప్రస్తుత నీటి మట్టం 513.210 మీటర్ల మేర ఉందని అధికారులు తెలిపారు.


జూబ్లీహిల్స్‌లో..


శ్రీకృష్ణానగర్‌లో సహాయక చర్యలు

రాత్రి 10 గంటల వరకు వర్షపాతం ఇలా..	యూసుఫ్‌గూడ	న్యూ మెట్టుగూడ	షేక్‌పేట	బోరబండ	ముషీరాబాద్	సీతాఫల్‌మండి	మాదాపూర్	నాచారం	హెచ్‌సీయూ	రహమత్‌నగర్	కూకట్‌పల్లి	పాటిగడ్డ	మల్కాజిగిరి	ఉప్పల్
	8.9	8.1	7.9	7.9	7.6	7.1	7.1	7.0	6.9	6.7	6.6	6.4	6.3	6.3

పరుగెత్తించి.. హత్యకు యత్నించి..

- ట్రాఫిక్ హోంగార్డుపై ఆటో వాలా దాడి
- రాంగ్ రూట్‌లో వస్తున్నావని ప్రశ్నించినందుకు..


నిందితుడు ఒమర్ షరీఫ్

బంజారాహిల్స్: రాంగ్‌రూట్‌లో వస్తున్నావని ప్రశ్నించిన ట్రాఫిక్ హోంగార్డుపై ఆటోవాలా దౌర్జన్యానికి పాల్పడ్డాడు. హోంగార్డును ఉరికించి తీవ్రంగా కొడుతూ బండరాయితో హత్య చేసేందుకు యత్నించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ ముత్యాల మెహర్ రాకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో జూబ్లీహిల్స్ ట్రాఫిక్ హోంగార్డు జయప్రకాష్ కృష్ణానగర్ ఇందిరానగర్ చౌరస్తాలో విధులు నిర్వహిస్తున్నాడు. ఎల్లారెడ్డిగూడకు చెందిన ఆటోడ్రైవర్ ఎండీ ఒమర్ షరీఫ్ ఇందిరానగర్ గడ్డ నుంచి రాంగ్‌రూట్‌లో కృష్ణానగర్ వైపు వస్తున్నాడు. ఇదేం పద్ధతి అని, రాంగ్‌రూట్‌లో ఎందుకు వస్తున్నావని హోంగార్డు ప్రశ్నించాడు. నన్నే ఆపుతావా అంటూ ఆగ్రహంతో ఊగిపోయిన ఆటోడ్రైవర్ షరీఫ్.. హోంగార్డుపై విచక్షణారహితంగా పిడిగుద్దులతో గాయపర్చాడు. నిందితుడి నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించిన హోంగార్డును వెంబడించి చితకబాదాడు. అందరూ చూస్తుండగానే అక్కడ ఉన్న బండరాయిని ఎత్తుకుని హోంగార్డును హత్య చేసేందుకు యత్నించగా బాధితుడు త్రుటిలో తప్పించుకుని నేరుగా వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గంటల వ్యవధిలోనే పరారీలో ఉన్న ఆటోడ్రైవర్‌ను పోలీసులు బీఎన్‌ఎస్ సెక్షన్ 132, 121, 125 (ఏ), 126 (2), 119, ఎంవీయాక్ట్ 177 కింద కేసు నమోదు చేసి ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి మాన్సూన్ 'రెగట్టా'




సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్, యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించే ప్రతిష్టాత్మక జూనియర్ నేషనల్ రేగట్టా 'మాన్సూన్ రెగట్టా' సోమవారం నుంచి ప్రారంభం కానుంది. హుస్సేన్ సాగర్ వేదికగా జరిగే పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు తమిళనాడు, మధ్యప్రదేశ్, మైసూర్, ఒడిశా, కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన 140 మంది సెయిలర్స్ పాల్గొంటున్నారు. ఇందులో దాదాపు 40 శాతం మంది తెలంగాణ నుంచే పాల్గొనడం విశేషం. ఈసారి పోటీల్లో ఐఎల్ సీఏ4, 29ఈఆర్, ఇంటర్నేషనల్ 420 అనే నూతన బోట్లను తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సుహైమ్ షేక్ మాట్లాడుతూ.. జాతీయ ర్యాంకింగ్ చాంపియన్‌షిప్‌లో ఉత్తమ సెయిలర్‌కు ఎస్‌హెచ్ బాబు మెమోరియల్ ట్రోఫీని అందిస్తారని పేర్కొన్నారు.

ఇక దూకుడే..

డెకాయ్ టీమ్స్ మరింత అప్రమత్తం

అర్ధరాత్రి వేళ శాంతిభద్రతలకు విఘాతం కలిగించడానికి ప్రయత్నం చేసిన గుంపుపై ఆసిఫ్‌నగర్‌లో..
నేరం చేసి పారిపోతున్న సెల్‌ఫోన్ స్నాచర్లను పట్టుకోవడానికి నార్త్‌జోన్‌లోని 'సిటీ లైట్' సమీపంలో..
సుదీర్ఘకాలంగా తప్పించుకు తిరుగుతున్న నేరగాడిని పట్టుకోవడం కోసం సైదాబాద్ పరిధిలో..
రైల్వేస్టేషన్ల వద్ద నేరాలు చేస్తూ, ఆయుధంతో సంచరిస్తున్న ఇద్దరు మాన్గార్‌బస్తీ వాసులను పట్టుకోవడానికి నాంపల్లిలో..
ఇలా.. నేరగాళ్లను గుర్తించి, పట్టుకునే ప్రయత్నంలో నగర పోలీసు డెకాయ్ టీమ్స్ కాల్పులు జరిపిన ఉదంతాలివి. వీటితో పాటు వీరి నిఘా ఫలితంగా గడిచిన 20 రోజుల్లో ఎనిమిది మంది పాత, కొత్త నేరగాళ్లు పోలీసులకు చిక్కారు. శుక్రవారం నాంపల్లి రైల్వేస్టేషన్ వద్ద జరిగిన ఘటనను పరిగణనలోకి తీసుకున్న నగర పోలీసు ఉన్నతాధికారులు.. డెకాయ్ టీమ్స్ మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. గస్తీ, నిఘా సైతం వ్యూహాత్మకంగా నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.
– సాక్షి, సిటీబ్యూరో




శుక్రవారం నాటి నాంపల్లి ఉదంతంలో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కీలకంగా వ్యవహరిస్తున్న సాయుధ బృందాలు
- నేరాలకు ఆస్కారమున్న చోట్ల మఫ్టీలో నిఘా
- నేరగాళ్లను గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం
- అవసరమైతే కాల్పులు జరపడానికీ ఆదేశాలు
- నగరంలో 20 రోజుల్లో నాలుగు చోట్ల ఫైరింగ్
- పోలీసులకు పట్టుబడిన ఎనిమిది మంది నేరగాళ్లు

ఆ ఉదంతాల ప్రభావం చాలా ఎక్కువ..

ఓ బాధితుడి నుంచి సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్‌లో రూ.కోటి కొట్టేస్తే దాని ప్రభావం అతడు, అతడి కుటుంబం వరకే ఉంటుంది. ఆర్థిక నేరగాళ్లు అనేక మందిని నమ్మించి రూ.10 కోట్లు కాజేసినా బాధితులు, వారి సంబంధీకుల వరకు దీని ఆ నేర ప్రభావానికి లోనవుతారు. అదే రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని కత్తులతో బెదిరించిన దుండగులు రూ.10 వేలు కాజేసినా, చేతిలో ఉన్న సెల్‌ఫోన్ దోచుకుపోయినా, కత్తి పోట్లు వంటివి జరిగినా.. వీటి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వీటి ప్రభావం నగరంలోని శాంతిభద్రతలపై పడుతుంది. నగర వాసులు అభద్రతా భావానికి లోనుకావడంతో పాటు 'లా లెస్ నెస్' ప్రతిబింబిస్తుంది. రాజధానిలో శాంతిభద్రతలపై ప్రభావం చూపే నేరాలను ఉపేక్షించకూడదని నగర పోలీసులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో సాయుధ డెకాయ్ బృందాలను రంగంలోకి దింపారు.

క్రైమ్ ప్రోన్ ఏరియాలను గుర్తించి..

నగరంలోని ప్రతీ పోలీసుస్టేషన్ పరిధిలో ఒకటి చొప్పున డెకాయ్ టీమ్స్ పని చేస్తున్నాయి. వీటి మోహరింపు విషయంలోనూ ఉన్నతాధికారులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఏదో ఒకచోట, ఏదో ఒక సమయంలో నామ్‌కేవాస్తేగా మోహరించడానికి బదులు వ్యూహాత్మకంగా చేపట్టాలని డీసీపీలకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో తొలుత నగర వ్యాప్తంగా పోలీసుస్టేషన్ల వారీగా రాత్రి వేళల్లో నడిరోడ్డుపై నేరాలు జరగడానికి ఆస్కారం ఉన్న, పదేపదే నేరాలు జరిగిన క్రైమ్ పోర్న్ ఏరియాలను గుర్తించారు. ఈ జాబితాల ఆధారంగా హాట్ స్పాట్స్‌ను గుర్తించి, ఒక్కో రోజు ఒక్కో ప్రాంతంలో ఉండేలా ఈ సాయుధ డెకాయ్ టీమ్స్ మోహరిస్తున్నాయి. రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు ఈ బృందాలు విధుల్లో ఉంటున్నాయి.

నిఘా ఉంచడమే వీరి ప్రధాన విధి..

డెకాయ్ టీమ్స్‌లో స్థానిక పోలీసుస్టేషన్ కానిస్టేబుల్‌తో పాటు సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ (సీఏఆర్) హెడ్ క్వార్టర్స్‌కు చెందిన కానిస్టేబుల్‌ను నియమించారు. హాట్ స్పాట్స్‌తో పాటు క్రైమ్ ప్రోన్ ఏరియాల్లో నిర్దేశిత వేళల్లో మఫ్టీలో సంచరిస్తూ నేరగాళ్ల కదలికలపై నిఘా ఉంచడం ఈ బృందాల ప్రధాన విధి. వీలున్నంత వరకు ఎక్కడా తమ ఉనికి బయటపడనీయకుండా జాగ్రత్తలు తీసుకుంటుంటారు. ఇందులో భాగంగా తమ దృష్టికి వచ్చిన అనుమానాస్పద వ్యక్తులు, పాత నేరగాళ్ల సమాచారం స్థానిక పోలీసులకు అందిస్తుంటారు. ఇలాంటి డెకాయ్ టీమ్స్ ఇచ్చిన సమాచారం ఆధారంగా నగరంలో కొందరు పాత నేరగాళ్లు, అనుమానిత వ్యక్తులు పట్టుబడ్డారు. మధ్య మండల పరిధిలోని సైఫాబాద్ పోలీసులు ముగ్గురు చైన్‌స్నాచర్లను పట్టుకోలిగారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అనేక ఉదంతాలను పోలీసులు అడ్డుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి.

అవసరమైతే తుపాకీకి పని చెప్పేలా..

డెకాయ్ బృందాలకు అవసరమైతే కాల్పులు జరిపేలా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. బందోబస్తు, కేసుల భారం నేపథ్యంలో నగర కమిషనరేట్‌కు సంబంధించిన శాంతిభద్రతల విభాగం పోలీసులు సుదీర్ఘ కాలంగా తుపాకీకి, ఫైరింగ్ ప్రాక్టీస్‌కు దూరంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో కేవలం శాంతిభద్రతల విభాగం అధికారులతో డెకాయ్ టీమ్స్ ఏర్పాటు చేస్తే ఫైరింగ్‌లో అపశ్రుతులు చోటు చేసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అవసరమైతే కాల్పులు జరపడం కోసం డెకాయ్ బృందంలో సీఏఆర్ హెడ్-క్వార్టర్స్ కానిస్టేబుల్‌ను ఉంచుతున్నారు. గడిచిన 20 రోజుల్లో సికింద్రాబాద్, సైదాబాద్ ఉదంతాల్లో మరో ముగ్గురు పాత నేరగాళ్లు, తాజాగా నాంపల్లిలో ఇద్దరు చిక్కడానికి ఈ కానిస్టేబుళ్లే కారణం. నిత్యం ఈ డెకాయ్ టీమ్స్ పని తీరును నేరుగా సమీక్షిస్తూ నగర కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి అవసరమైన మార్పుచేర్పులు సూచిస్తున్నారు.


పెద్దమ్మ తల్లి

పెద్దమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తజనం

జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయంలో శాకంబరి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. వందలాది కిలోల కూరగాయలు, పండ్లతో ఆలయాన్ని అధికారులు సర్వాంగ సుందరంగా అలంకరించారు.
–బంజారాహిల్స్


భక్తుల సందడి




ఐటీ హబ్‌లో..


గోల్కొండ కోటలో..

బోనం.. ఘనం



గోల్కొండ కోటలో ఆదివారం మూడో బోనం పూజ అంగరంగ వైభవంగా జరిగింది. అలాగే.. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళికి తొలి బోనం సమర్పించారు. మాదాపూర్‌లోని ఐటీ హబ్‌లో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.




గోల్కొండ కోటలో శివసత్తి విన్యాసం


ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మొకు, లొట్టి అందజేస్తున్న గీత కార్మికులు


సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న కలెక్టర్ శశాంక

అండగా ఉంటాం

నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'కాటమయ్య రక్షణ కవచం' పేరుతో రూపొందించిన కిట్లను ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి గీత కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్లుగీత కార్మికులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

గురుకుల పాఠశాలల్లో కనీస వసతులు కల్పించండి



మాట్లాడుతున్న వేముల రామకృష్ణ

కాచిగూడ: గురుకుల పాఠశాలల్లో కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ అన్నారు. ఆదివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక శాతం గురుకుల పాఠశాలలకు స్వంత భవనాలు లేక అరకొర వసతులతో ఉన్న అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మెనూ ప్రకారం భోజనం ఇవ్వడం లేదని, కలుషిత ఆహారం తిని విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాల్లో ఉద్యోగులు, సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులతోనే పనులు చేయిస్తున్నారన్నారు. గురుకులాల్లో కనీస వసతులు కల్పించాలని లేని పక్షంలో సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. గురుకుల పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అభినవ్, నవీన్, నవదీప్, కిషోర్, రఘు, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానాల ఏర్పాటు అభినందనీయం

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో ఒక క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయాలని బీసీ విద్యార్థి సంఘం డిమాండ్‌పై స్పందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డా మైదానాల ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రతి ఏటా నెల రోజులు క్రీడా దినోత్సవాలుగా ప్రకటించి విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. క్రీడల పట్ల ముఖ్యమంత్రి స్పందిస్తున్న తీరుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సాఫ్ట్‌వేర్ సంస్థ సీఈఓ కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్ట్

ఎనిమిది మంది రిమాండ్



బంజారాహిల్స్: జీతాలు ఇవ్వడం లేదన్న కోపంతో సాఫ్ట్‌వేర్ సంస్థ సీఈఓను అహపరించి నిర్బంధించి దొంగతానికి పాల్పడిన కేసులో ఎనిమిది మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లను జూబ్లీహిల్స్ క్రైమ్ పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి 84 కొత్త ల్యాప్‌ట్యాప్‌లు, నాలుగు కార్లు, ఒక బైక్, 18 మొబైల్ ఫోన్లు, మూడు పాస్‌పోర్టులను సీజ్ చేశారు. ఈ నెల 10న నందగిరిహిల్స్‌లో నివసించే గిగ్‌లెజ్‌ సాఫ్ట్‌వేర్ సంస్థ సీఈఓ వాకాటి రవిచంద్రారెడ్డిని అదే సంస్థలో పనిచేస్తున్న ఎనిమిది మంది ఉద్యోగులు తమకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదంటూ కారులో ఎక్కించుకుని నాగర్‌కర్నూల్ సమీపంలోని ఓ హోటల్‌లో నిర్బంధించిన విషయం తెలిసిందే. బాధితుడి తల్లి వాకాటి మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కిడ్నాపర్ల నుంచి రవిచంద్రారెడ్డిని రక్షించారు. ఈ ఘటనలో కిడ్నాప్‌నకు పాల్పడిన ఆకుల జగదీష్, కొలగట్ల గౌతమ్, తాతా శివశంకర్ రెడ్డి, సూదగాని సుజిత్‌కుమార్, కమల్‌తేజ, షేక్ ఆజాద్, కర్నాటి ముఖేష్, రాకేష్ అలియాస్ ప్రవీణ్‌లను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కొంతకాలంగా తమకు రవిచంద్రారెడ్డి జీతాలు ఇవ్వడం లేదని, సుమారు 12 నుంచి 15 వందల మంది యువతీ యువకుల నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల ఉద్యోగాల కోసం రూ.17 కోట్ల వరకు వసూలు చేశారని, ఈ విషయాలు మాట్లాడుకుందామనే ఆయనను తీసుకెళ్లినట్లు నిందితులు పోలీసుల దర్యాప్తులో వెల్లడించారు. అయితే తనను కిడ్నాప్ చేసి హత్య చేసేందుకు పథకం వేశారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అరెస్టైన వారిలో చాలామంది కన్సల్టింగ్ సంస్థలు, ప్లేస్‌మెంట్లు నిర్వహిస్తూ వివిధ సంస్థల్లో యువతీ యువకులను బ్యాక్‌డోర్‌లో రిక్రూట్ చేస్తున్నారని, రవిచంద్రారెడ్డి వద్ద కూడా అలాగే నియమించినట్లు తేలింది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేరు గొప్ప..

పనితీరులో ఇంటర్‌సెప్టర్లు విఫలం



- నగర వ్యాప్తంగా 20 వాహనాలు
- పదేళ్ల క్రితం అమలులోకి..
- కీలక సమయాల్లో తక్షణ స్పందన కోసం ఏర్పాటు
- కేవలం నామ్‌కే వాస్తేగా పనితీరు
- సమీక్షించి, ప్రక్షాళన చేయాలని కొత్వాల్ నిర్ణయం

సాక్షి, సిటీబ్యూరో: 'ఇంటర్‌సెప్టర్'.. ఈ పదానికి తెలుగులో అడ్డగించేవాడు అని అర్థం. నగరంలో ఏదైనా జరగరాని ఉదంతం జరిగినా, ముష్కర మూకలు దాడులు చేసినా, శాంతిభద్రతల పరమైన హఠాత్పరిణామాలు తలెత్తినా తక్షణం స్పందించాలని, బాధ్యతలను అడ్డుకోవాలని, పారిపోతున్న వారిని పట్టుకోవాలనే ఉద్దేశంతో నగర పోలీసు విభాగం ఇంటర్‌సెప్టర్ వాహనాలు, అందులో సిబ్బందిని ఏర్పాటు చేసింది. అయితే పదేళ్ల ఈ టీమ్స్ కనీసం ఒక్కసారీ 'అడ్డుకోలేదు'.. కొన్ని అంశాల్లో ఆ అవసరం ప్రాంతానికీ రాలేదు. ఈ పరిణామాలను పరిగణలోకి తీసుకున్న నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఈ వాహనాల అంశాన్ని సమీక్షించాలని నిర్ణయించారు.

స్పందించిన ఉదంతం ఒక్కటీ లేదు..

గడిచిన పదేళ్ల కాలంలో ఉన్నతాధికారులు మారినప్పుడల్లా వారి ప్రాధాన్యాలు మారాయి. అందులో భాగంగా ఇంటర్‌సెప్టర్ తీరుతెన్నులు, రూపు మారుతూ వచ్చింది. కాలక్రమంలో ఇద్దరు ఏఆర్ కానిస్టేబుళ్లను పంప్ గన్‌తో, ఒక హోంగార్డును వాకీటాకీతో ఈ వాహనంలో ఉంచి సరిపెట్టారు. నగర పోలీసు కమిషనరేట్ పునర్విభజన తర్వాత డివిజన్ల సంఖ్య 25కు పెరిగింది. ఈ వాహనాల సంఖ్య 20కి మాత్రమే చేరింది. ప్రజాభవన్, డీజీపీ కార్యాలయం సహా అనేక ప్రాంతాల్లో నిలిచి ఉండే ఈ ఇంటర్‌సెప్టర్స్ గడిచిన పదేళ్లలో అడ్డుకున్న ఉదంతం కానీ, పట్టుకున్న నేరగాడు కానీ లేడు. ఈ విషయాలను పరిగణలోకి తీసుకున్న నగర కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఈ వాహనాల పనితీరును సమీక్షించాలని, పునర్ వ్యవస్థీకరించాలని కీలక నిర్ణయం తీసుకున్నారు.

ఆ వాహనం పని తీరు చూసిన తర్వాతే..

నాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున డెకాయ్ బృందాలు నేరగాళ్లపై కాల్పులు జరిపాయి. ఈ ఉదంతం నేపథ్యంలో నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. అదే రోజు మధ్య మండల డీసీపీ కార్యాలయానికి వెళ్లిన ఆయన జరిగిన ఉదంతాన్ని సమీక్షించారు. తిరిగి వెళ్తున్న సమయంలో అక్కడ ఉన్న ఇంటర్‌సెప్టర్ వాహనంపై ఆయన దృష్టి పడింది. అందులో ఉన్న సిబ్బందితో మాట్లాడటంతో పాటు దాని కదలికలను నమోదు చేసే లాగ్‌బుక్‌ను పరిశీలించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఈ వాహనాల పరిస్థితి ఆయన దృష్టికి వచ్చింది. ఇలా నగరంలోని అనేక ప్రాంతాల్లో కనిపించే ఈ ఇంటర్‌సెప్టర్ బృందాలను సద్వినియోగం చేసుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమగ్ర విధివిధానాలు ఖరారు చేయనున్నారు. మొత్తమ్మీద ప్రతి షిఫ్ట్‌లోనూ 60 మంది చొప్పున సిబ్బంది ఉండే ఈ వాహనాలను నగర ప్రజలకు ఉపయోగపడేలా నిఘాతో పాటు గస్తీకి వినియోగించుకోవాలని సీపీ భావిస్తున్నారు.

అంతన్నారు.. ఇంతన్నారు..

రాష్ట్రం ఏర్పడిన తర్వాత చేపట్టిన పోలీసు సంస్కరణల్లో భాగంగా 2014లో ఇంటర్‌సెప్టర్ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రాథమికంగా ఒక్కో డివిజన్‌కు ఒకటి చొప్పున కేటాయించారు. అప్పటికి నగరంలో 17 సబ్ డివిజన్లే ఉండటంతో 17 వాహనాలు, అదనంగా మరోటి ఆవిష్కరించారు. ఆలివ్ గ్రీన్ యూనిఫాంలో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు ధరించిన సాయుధులు ముగ్గురు ఉండేలా, వీరితో అత్యాధునిక కమ్యూనికేషన్ పరికరాలు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. 24 గంటలూ నగరంలోని కీలక ప్రాంతాల్లో మోహరించిన ఉండే ఈ టీమ్స్ ఆయా ప్రాంతాల్లో నిఘా వేసి ఉంటారని, శాంతిభద్రతల సమస్యలు తలెత్తినప్పుడు వీరు తక్షణం స్పందించి వాటిని అణిచి వేస్తారని ప్రకటించారు. దీనికోసమే వీటికి పంప్ యాక్షన్ షాట్ గన్స్ కూడా అందించారు.

19న దేవిశ్రీ ప్రసాద్ లైవ్ షో..



దేవిశ్రీ ప్రసాద్

బంజారాహిల్స్: ప్రముఖ సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ తొలిసారిగా నగరంలో లైవ్ మ్యూజిక్ షో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. జూబ్లీహిల్స్‌లో లైవ్ షో వివరాలను వెల్లడించారు. గత పాతికేళ్లుగా సంగీత ప్రపంచంలో ఎన్నో విజయాలు సాధించానని, త్వరలోనే తాను నిర్వహించబోయే లైవ్ షోల ద్వారా మరింత మందిని ఉత్సాహపరుస్తానని అన్నారు.. దేశ వ్యాప్తంగా ఈ లైవ్‌షోలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అద్భుతమైన లైటింగ్, జోష్ నింపే పాటలతో ఈ షోలను డిజైన్ చేస్తున్నట్లు, ఇప్పటి వరకూ అనేక దేశాల్లో లైవ్ ప్రదర్శనలు ఇచ్చానని, మన దేశంలో కూడా వివిధ రాష్ట్రాల్లో నిర్వహించనున్నామని తెలిపారు. డీఎస్పీ క్రియేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ మ్యూజిక్ ఈ ఏడాది అక్టోబర్ 19న గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించనున్నామని, సంగీతం మాత్రమే కాకుండా ప్రేక్షకులకు మంచి వినోదాన్ని అందించనున్నామని వివరించారు.

సిటీ మార్కెట్లోకి మెర్సిడెస్ బెంజ్ సిల్వర్ స్టార్..



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ లగ్జరీ కార్ల బ్రాండ్ మెర్సిడెస్ బెంజ్ సిల్వర్‌స్టార్ తమ సరికొత్త మెర్సిడెస్ బెంజ్ ఇక్యూఏ 250+ ను సిటీ మార్కెట్లోకి అందుబాటులోకి తెచ్చింది. నగరంలోని గోల్కొండ రిసార్ట్స్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ లగ్జరీ కార్‌ను విడుదల చేశారు. మి లైఫ్ టూర్ అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విలాసంతో పాటు సమగ్ర వికాసం కూడా ప్రధానమనే సందేశాన్ని అందిస్తూ యోగా, హీలింగ్ సెషన్లు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ సీఈఓ వినోద్ సేతుమాధవన్ సహా పలువురు ప్రముఖులు, నగరానికి చెందిన మెర్సిడెస్ బెంజ్ వాహన యజమానులు పాల్గొన్నారు.

ధృవ కాలేజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి కన్నుమూత

నేడు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు



సాక్షి, సిటీబ్యూరో: ధృవ కాలేజీ ఆఫ్ మేనేజ్‌మెంట్ చైర్మన్ డాక్టర్ ఎస్.ప్రతాప్‌రెడ్డి ఆదివారం కన్నుమూశారు. సోమవారం మధ్యాహ్నం మేడ్చల్‌లోని ఆయన నివాసం నుంచి అంతిమ యాత్ర ప్రారంభమవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

కోటలో భక్తులపై కందిరీగల దాడి

లంగర్‌హౌస్/గోల్కొండ: గోల్కొండ కోటలో భక్తులపై కందిరీగలు దాడి చేశాయి. ఈ ఘటనలో దాదాపు 90 మంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు.వివరాల్లోకి వెళితే.....గోల్కొండ బోనాల మూడో పూజ సందర్భంగా ఆదివారం గోల్కొండ ప్రాంతం భక్తులతో కిక్కిరిసింది. మధ్యాహ్నం కోటపైకి ఎక్కే మొదటి మెట్టు వద్ద భ భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో పక్కన పార్కులో చెట్ల కింద వంటలు చేస్తుండగా సెగ తగలంతో కందిరీగలు ఒక్కసారిగా లేచి భక్తులపై దాడి చేశాయి. కందిరీగలు చుట్టుముట్టడంతో భక్తులు అక్కడి నుంచి పరుగులు తీశారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని తొక్కిసలాట జరగకుండా భక్తులను పలు మార్గాల్లో అక్కడి నుంచి బయటికి తరలించారు. కందిరీగల దాడిలో దాదాపు 30 మంది చిన్నారులు, పలువురు పోలీసు సిబ్బంది గాయపడ్డారు. బాధితులకు వైద్య సిబ్బంది చికిత్స చేశారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ పైడి నాయుడు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.లక్ష్మిగూడ ప్రాంతానికి చెందిన నరేందర్ మార్కెటింగ్ ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం రాత్రి అతను డ్యూటీ ముగించుకుని కాటేదాన్ మీదుగా వస్తుండగా స్ప్రింగ్ డయల్ స్కూల్ సమీపంలో ఎండి ఖయ్యూం అనే వ్యక్తి బైక్‌పై అతి వేగంగా వస్తూ నరేందర్ బైక్‌ను ఢీకొట్టాడు. అతడి తలకు బలమైన గాయాలు కావడంతో నరేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బుల కోసం తండ్రిపై తనయుడి దాడి

ఘట్‌కేసర్: డబ్బులు ఇవ్వాలని తండ్రిపై దాడి చేసిన కుమారుడిపై ఘట్‌కేసర్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అంకుషాపూర్ గ్రామానికి చెందిన చింతకింది శంకరయ్య తార్నాకలోని ఎన్ఐఎన్‌లో ఉద్యోగిగా పని చేశాడు. అతడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రస్తుతం అతను భార్య లక్ష్మితో కలిసి గ్రామంలో నివాసం ఉంటున్నాడు శంకరయ్య పెద్ద కుమారుడు చింతకింది వేణుగోపాల్ గత కొన్ని రోజులుగా డబ్బుల కోసం తరచూ తండ్రితో గొడవ పడుతున్నాడు. శనివారం సాయంత్రం ఇంటికి వచ్చిన అతను తండ్రిపై దాడి చేశాడు. ఆదివారం ఉదయం శంకరయ్య తన సోదరుడు శ్రీనివాస్ ఇంటికి వెళ్లి రాత్రి జరిగిన గొడవ గురించి చెబుతుండగా అదే సమయంలో అక్కడికి వచ్చిన వేణుగోపాల్ మరోసారి తండ్రిపై దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లలో కనీస సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కె. నాగేశ్వర్

కవాడిగూడ: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రేటర్ హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో నిర్మించిన 65వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో కనీస సౌకర్యాలు కల్పించి, లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ అన్నారు. సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో కనీస సౌకర్యాలు కల్పించి లబ్ధిదారులకు అందజేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ మాట్లాడుతూ..... గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు హడావిడిగా డబుల్ బెడ్‌రూం ఇళ్లలో కనీస సౌకర్యాలైన మంచినీరు, విద్యుత్, రోడ్లు, లిఫ్ట్ ఏర్పాటు చేయకుండానే లబ్ధిదారులకు కేటాయించిందన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు తర్వాత కూడా కనీస సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోకపోవడంతో లబ్ధిదారులు వాటిలో నివసించే పరిస్థితి లేదన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లలో కనీస సౌకర్యాల కల్పనకు రూ.700 కోట్లు అవసరమని జీహెచ్ఎంసీ, హౌసింగ్ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు అందజేశారని, రాబోయే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం నగర్ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ..... డబుల్ బెడ్‌రూం ఇళ్లలో కనీస సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని లేని పక్షంలో లబ్ధిదారులతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం శ్రీనివాస్‌రావు, ఎం. దశరథ్, ఎం. మహేందర్, కె. నాగలక్ష్మి, వి. విజయ్‌కుమార్, నాయకులు ఆర్ మల్లేష్‌తోపాటు పెద్ద ఎత్తున లబ్ధిదారులు పాల్గొన్నారు.

స్కూటీ ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

మరో ఇద్దరికి గాయాలు

గచ్చిబౌలి: రోడ్డు దాటుతున్న ఓ వృద్ధురాలిని స్కూటీ ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ భాను ప్రసాద్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపూర్ శ్రీరాంగనర్ కాలనీ ఏ బ్లాక్‌లో లో నివాసం ఉండే కామేశ్వరీ(60) ఆదివారం ఉదయం తమలపాకులు తెచ్చుకునేందుకు ఇంటి నుంచి బయటికి వచ్చింది. పాలపిట్ట సైకిల్ పార్క్ ఎదురుగా రోడ్డు దాటుతుండగా అదే సమయంలో అపర్ణ అపార్ట్‌మెంట్‌లో మేడ్ సర్వెంట్‌గా పని చేసే గీతా బాయి తన యజమాని కుమార్తె, తనీషా, కుమారుడు అభియుక్త్‌లను బైక్‌పై జిమ్నాస్టిక్ సెంటర్ తీసుకు వెళుతూ రోడ్డు దాటుతున్న కామేశ్వరిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన కామేశ్వరిని ఓ ఆటో డ్రైవర్ కొండాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కొద్ది రోజుల క్రితమే ఆమె తన కుమారుడు ధర్మారావు ఇంటికి వచ్చినట్లు స్థానికులు తెలిపారు. కాగా ఈ ఘటనలో గీతా భాయి తలకు తీవ్రగాయాలు కాగా తనీషాకు స్వల్ప గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మత్తు మందు కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చి దోపిడీ

80 గ్రాముల బంగారు ఆభరణాలు, నగదు అపహరణ

కాచిగూడ: మైసూర్ ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణిస్తున్న దంపతులకు మత్తు మందు కలిపిన శీతల పానీయాన్ని ఇచ్చి దోపిడీకి పాల్పడిన సంఘటనపై కాచిగూడ రైల్వే పోలీసులు ఆదివారం జీరో ఎఫ్ఐఆర్ చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లా, వేంపల్లికి చెందిన రిటైర్డ్ టీచర్ వెంకట రాం రెడ్డి (72) భార్యతో కలిసి బెంగళూర్‌లో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లారు. అక్కడి నుంచి శనివారం మైసూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో మియాపూర్‌లో ఉంటున్న కుమార్తె ఇంటికి బయలుదేరారు. రైలులో పరిచయమైన ఇద్దరు వ్యక్తులు వారికి లోయర్ బెర్త్‌లను ఇచ్చారు. హిందూపురం రైల్వే స్టేషన్ వద్ద వెంకటరాంరెడ్డి దంపతులు వారికి అరటిపండ్లు ఇవ్వగా ప్రతిగా వారు మత్తు మందు కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చారు. అది తాగిన కొద్దిసేపటికే వారు నిద్రలోకి జారుకున్నారు. ఆదివారం ఉదయం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో రైలు దిగే సమయంలో చూసుకోగా 80 గ్రాముల బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్, రూ.2వేల నగదు ఉన్న బ్యాగు కనిపించలేదు. దీంతో బాధితులు కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం హిందూపురం రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

వానా.. హైరానా..



మైత్రీవనం వద్ద..



ఖైరతాబాద్‌లో..



అమీర్‌పేట్ చర్మాస్ వద్ద..



బంజారాహిల్స్‌లో..



మలక్‌పేట్‌లో..

నగరంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాలు జలమయం కావడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. – సాక్షి, సిటీబ్యూరో

భక్తుల కిటకిట








జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయంలో శాకంబరి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం నగర నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.

– బంజారాహిల్స్

అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట..!

● 15 నుంచి 20 వరకు అంగన్‌వాడీల్లో ప్రత్యేక కార్యక్రమాలు ● కార్యాచరణ రూపొందించిన ఐసీడీఎస్ యంత్రాంగం ● విద్యకు దూరంగా ఉండే బాలబాలికల గుర్తింపు ● కొత్త విద్యార్థులను చేర్చుకోవడమే లక్ష్యం




బంజారాహిల్స్: ప్రాథమిక విద్యను మరింత బలోపేతం చేసి చిన్నారులను, వారి తల్లిదండ్రులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 'అమ్మ మాట–అంగన్‌వాడీ బాట' అనే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ఈ నెల 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పకడ్బందీగా అమలు చేసేందుకు ఐసీడీఎస్ అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఐసీడీఎస్ ఖైరతాబాద్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, వెంగళరావునగర్, ఎర్రగడ్డ, బోరబండ డివిజన్ల పరిధిలో ఉన్న 141 అంగన్‌వాడీ కేంద్రాలు, 10 మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఇప్పటికే అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కూడా ఇచ్చారు. ప్రస్తుతం ఈ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 8,136 మంది చిన్నారులు చదువుకుంటుండగా, ఈ విద్యా సంవత్సరంలో కొత్తగా 736 మంది విద్యార్థులు చేరారు. ఈ కార్యక్రమం ద్వారా మరింత మంది చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే అంగన్‌వాడీ టీచర్లకు విడతలవారీగా శిక్షణ పూర్తి చేశారు.

◆ ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు పిల్లలకు అక్షరాలు, అంకెలు, ఆటపాటలతో కూడిన చదువులు బోధిస్తారు. ఇందుకు సంబంధించిన సామగ్రిని సైతం కేంద్రాలకు అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, బాలికలు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, పాఠశాలల్లో ఉపాధ్యాయులు, యువత, ఎన్జీఓలు, తల్లిదండ్రుల సహకారంతో ర్యాలీలు నిర్వహించాలని నిర్దేశించారు. తమ పిల్లలను అన్ని హంగులతో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలని, ఉచితంగా భోజనం, స్కూల్ డ్రెస్సులు, పలకలు, పుస్తకాలు అందిస్తారని, పోషకాహారం కూడా లభిస్తుందని తెలియజేస్తారు.

◆ అలాగే పాఠశాల, కళాశాల విద్యకు దూరంగా ఉన్న బాలికలను గుర్తిస్తారు. స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేస్తారు.

◆ 18న ఇంటింటికీ తిరిగి రెండున్నర ఏళ్ల వయస్సున్న చిన్నారులను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడతారు. బోధనా పద్ధతులు, చిన్నారుల వివరాలను నమోదు చేయడం, ఐదేళ్లు నిండిన వారికి అంగన్‌వాడీ నుంచి ప్రీ స్కూల్ సర్టిఫికెట్ అందజేస్తారు.

◆ 19న కేంద్రాల్లో స్వచ్ఛత పాటిస్తారు. మొక్కలు నాటడం, కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయడం, మంచినీరు, మరుగుదొడ్డి తదితర సౌకర్యాలు కల్పనపై దృష్టిపెడతారు.

◆ 20న చైల్డ్ హుడ్ డేలో భాగంగా సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తారు. తల్లిదండ్రులు, బంధువులు, అమ్మమ్మలు, నాన్నమ్మలు, తాతలను ముఖ్యఅతిథిగా ఆహ్వానించి అవగాహన కలిగిస్తారు. బోధన, ఆట వస్తువులను ప్రదర్శిస్తారు. చిన్నారుల తల్లిదండ్రులను సత్కరిస్తారు.

చిన్నారులను చేర్చుకోవడమే లక్ష్యం

మా పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం నుంచి 'అమ్మ మాట–అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించి టీచర్లను సన్నద్ధం చేశాం. ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే తల్లిదండ్రులు, బస్తీవాసుల సహకారం చాలా అవసరం. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉచితంగా బోధన లభిస్తోంది. శిక్షణ పొందిన, అనుభవజ్ఞులైన టీచర్లు బోధిస్తారు. ప్రైవేటు పాఠశాలల కంటే అంగన్‌వాడీ టీచర్లకే చిన్నారుల చదువులపై మెరుగైన శిక్షణ ఇవ్వడం జరిగింది.

– పుష్ప,ప్రాజెక్టు అధికారి, ఐసీడీఎస్ ఖైరతాబాద్

వాల్మీకులకు నిధులు కేటాయించి అండగా నిలవాలి

లిబర్టీ: ఆర్థికంగా చితికిపోయి దయనీయ జీవితాలు వెళ్లదీస్తున్న వాల్మీకులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని వాల్మీకి సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డి.ప్రీతంసింగ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆ సంఘ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంప్రదాయ వృత్తిని జీవన భృతిగా మార్చుకొని అత్యంత దారిద్ర్య రేఖకు దిగువన జీవనం సాగిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో లక్షలాది మంది వాల్మీకులు జీవన ప్రమాణాలు మార్చేందుకు 2024–25 వార్షిక బడ్జెట్‌లో కనీసం వెయ్యి కోట్లు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను విన్నవించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో వాల్మీకుల జీవన స్థితిగతులు మెరుగుపరిచి జీవన ప్రమాణాలను తీర్చిదిద్దాలని అందుకు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో డి.దిలీప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లు రవి జన్మదినోత్సవం



పుట్టిన రోజు కేక్ కట్ చేస్తున్న ఎంపీ మల్లు భట్టి రవి

బంజారాహిల్స్: నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం జూబ్లీహిల్స్ రోడ్ నెం. 10లోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన నేతలు, కార్యకర్తలు సన్నిహితుల నడుమ ఆయన పుట్టినరోజు వేడుకలను అట్టహాసంగా జరిపారు. నగరంలోని ప్రముఖ నేతలతోపాటు నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి ఆయనను కలసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లు రవి 73 సంవత్సరాల సందర్భంగా 73 కిలోల భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు రాజ్‌కోటి, మోహన్, దత్తాత్రేయ, చిన్నారెడ్డి, శ్రీనివాస్, ఖదీర్, భాస్కర్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో కాంగ్రెస్ నేత రామన్‌గౌడ్

హిమాయత్‌నగర్: ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి వ్యక్తి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కాంగ్రెస్ నేత రామన్‌గౌడ్ అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్ డివిజన్‌లోని మేల్కోటి పార్క్‌లో అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని రామన్‌గౌడ్ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, కంటి పరీక్ష, దంత పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి అగర్వాల్ హాస్పిటల్‌లో ఉచిత కన్సల్టేషన్ అవకాశం కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎంఎస్ఆర్ ట్రస్ట్ సేవలు అభినందనీయం



చెక్కులు అందజేస్తున్న అనిల్‌కుమార్, ఎంఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు

బంజారాహిల్స్: పేద విద్యార్థులకు ఎంఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ అన్నారు. ఎంఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రతి సంవత్సరం వెయ్యి మంది విద్యార్థులకు కోటి రూపాయల ఆర్థిక సహాయం అందిస్తూ వస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో 300 మంది పేద విద్యార్థులకు వారి చదువు నిమిత్తం ఆర్థిక సహాయ కింద చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కుంభం అనిల్‌కుమార్ మాట్లాడుతూ నిరుపేదలకు చేయూతనందించి ఎంఎస్ఆర్ ట్రస్ట్ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. ట్రస్ట్ నిర్వాహకులు శివారెడ్డి, శిరీషారెడ్డిలు మాట్లాడుతూ భగవంతుడు తనకు నలుగురికి సహాయం చేసే అదృష్టం కలిగించడం చాలా సంతోషంగా ఉందన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో మంచి మార్కులు సాధించిన పేద విద్యార్థులకు రూ.10,000 చొప్పున ఆర్థికంగా చేయూతనందించడం జరుగుతుందన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారికి ఉచిత వైద్యం, పేదల ఆకలి తీర్చడం, పేదలకు సాయం అందించడమే ఎంఎస్ఆర్ ట్రస్ట్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జీవీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని పర్మనెంట్ చేయండి

పంజగుట్ట: తెలంగాణ మైనార్టీ విద్యాసంస్థల్లో కాంట్రాక్ట్ టీచర్లుగా పనిచేస్తున్న 31 మంది ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను పర్మినెంట్ చేయాలని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ టీచింగ్, నాన్ టీచింగ్, కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ యూనియన్ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూనియన్ నాయకులు షమీమ్, సల్మా, జమీల్, తన్వీర్‌లు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2000 నుంచి 2003 సంవత్సరాలకు మధ్య అప్పటి రెసిడెన్షియల్ పాఠశాలల సొసైటీ కింద నియామకాలు జరిగాయన్నారు. మిగిలిన ఎస్సీ, ఎస్టీ, బీసీ సొసైటీలలో కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను, సిబ్బందిని పర్మినెంట్ చేశారు కానీ తమను మాత్రం రెగ్యులర్ చెయ్యలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో మంత్రులను కలసి వినతి పత్రాలు ఇచ్చామని, ఈ ప్రభుత్వంలో పెద్దలను కూడా కలసి మా గోడు వెళ్లబోసుకున్నామని తాము కేవలం 31 మందిమి మాత్రమే ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి తమను ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో అబ్బు, హాబీబా, పాండు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఎదుటి వారికి సాయం చేయడమే అంబేడ్కర్ విధానం



వివేక్, వంశీకృష్ణలకు సన్మానం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

పంజగుట్ట: ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ ఆలోచనా విధానాలు అలవర్చుకుని 10 మందికి సాయం చేసేలా ఎదగాలని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో భీం సైనిక్ ఫౌండేషన్, గోసంగి కుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఎన్నికల్లో ఘన విజయం సాధించిన వివేక్ వెంకటస్వామి, ఎంపీగా ఘన విజయం సాధించిన గడ్డం వంశీకృష్ణలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ రిజర్వేషన్లు కల్పించారని రిజర్వేషన్లు సద్వినియోగం చేసుకుని విద్యా, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఎదగాలన్నారు. దళితులు, పేదలు బాగా చదువుకోవాలని తన తండ్రి వెంకటస్వామి అంబేడ్కర్ విద్యాలయాలు ఏర్పాటు చేశారని ఎంతో మంది పేదవారు అందులో ఉన్నత చదువులు చదువుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమం భీం సైనిక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కె.సత్యనారాయణ అధ్యక్షతన జరగగా గోసంగి కుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రవీందర్, వివిధ సంఘాల నాయకులు సంగీత, జైరాజు, శంకర్, సంపత్, సిద్దిఖీ, ప్రమీళ, మహేశ్వర్ రాజ్, కృష్ణారావు, ఎల్లన్న, సంగీత తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఎల్‌ఓసీని అందిస్తున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన కొనసాగుతున్నదని రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి కొనియాడారు. డివిజన్‌లోని శ్రీరాంనగర్‌కు చెందిన ఖాజా మొయినుద్దీన్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ. 1 లక్ష ఎల్‌ఓసీని ఆదివారం తన కార్యాలయంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా సీఎన్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ సీఎం రిలీఫ్ ఫండ్స్ అందించాలని ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశ పెట్టిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రమే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'దానం'ను విమర్శించే స్థాయి కౌశిక్‌రెడ్డికి లేదు



కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పంజగుట్ట: ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను విమర్శించే అర్హత కౌశిక్‌రెడ్డికి లేదని కార్పొరేటర్ వనం సంగీత యాదవ్ అన్నారు. ఆదివారం హుజూరాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ శ్రేణులు పంజగుట్ట చౌరస్తా వద్ద కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వనం సంగీత శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో భార్య, పిల్లల్ని అడ్డం పెట్టుకుని గెలిచిన కౌశిక్‌రెడ్డి బీసీ నేతను విమర్శిస్తే సహించేది లేదన్నారు. దానం జోలికి వస్తే హైదరాబాద్‌లో ఎలా తిరుగుతావో చూస్తామని, బిసీ, ఎస్సీ, ఎస్టీలు అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు. మీ పార్టీ నుంచి వెళ్లిపోయే ఎమ్మెల్యేలను మీరు కాపాడుకోలేరు కానీ ఇతర పార్టీ నేతలను ఎలా విమర్శిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ యాదవ్, అరుణ్ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

ప్రావీణ్యంతో మంచి గుర్తింపు

వెంగళరావునగర్: యువత క్రీడల్లో రాణించాలని అప్పుడే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని రెజ్లింగ్ పోటీల ఆర్గనైజర్, కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ కన్వీనర్ వి.నవీన్‌యాదవ్ సూచించారు. యూసుఫ్‌గూడలో ఆదివారం తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజయం సాధించిన వారికి బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నవీన్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని అన్నారు. అందువల్ల విద్యార్థి దశ నుంచే చదువుతో పాటుగా క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కూడా ప్రోత్సహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసి

మానవ హక్కుల పరిరక్షణం కోసం ఉద్యమిద్దాం

లిబర్టీ: మానవ హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర శాఖ జాయింట్ సెక్రటరీ మాజీద్ రెహమాన్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల శాఖ పరిధిలోని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ ఎన్నికైన సందర్భంగా ఆదివారం మాజీద్ రెహమాన్‌కు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పరిధిలోని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మానవ హక్కుల పరిరక్షణ కోసం మానవ రక్తంలో ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మానవ హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

బంజారాహిల్స్: ఉస్మానియా యూనివర్శిటీ పరిధిలోని సైఫాబాద్ సైన్స్ కళాశాలలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్‌లలో వివిధ సబ్జెక్టుల్లో బోధించేందుకు పార్ట్ టైం లెక్చరర్ (పీటీఎల్) ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. కెమిస్ట్రీ (మూడు పోస్టులు), స్టాటిస్టిక్స్ (02), జువాలజీ (02), బయో టెక్నాలజీ (01), ఇంగ్లిష్ (02), తెలుగు (01), సంస్కృతం (01), డేటా సైన్స్ (02), ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ (01)లో బోధించేందుకు దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. యూజీసీ నిబంధనల మేరకు అభ్యర్థులకు పీజీలో 55 శాతం మార్కులు, ఎన్ఈటీ, ఎస్ఈటీ/ఎస్ఎల్ఈటీ అర్హత కలిగిన వారితో పాటు పీహెచ్‌డీ చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు. ఈ నెల 18వ తేదీ వరకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దంచికొట్టిన వాన

లోతట్టు ప్రాంతాలు జలమయం




బంజారాహిల్స్: దంచికొట్టిన వానతో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు, బస్తీలు, కాలనీలు నీట మునిగాయి. ఆదివారం సాయంత్రం ఏకధాటిగా గంటన్నరపాటు కురిసిన వానకు జూబ్లీహిల్స్, ఫిలింనగర్, బంజారాహిల్స్, ఖైరతాబాద్, పంజగుట్ట, అమీర్‌పేట, సోమాజిగూడ తదితర ప్రాంతాల్లో జన జీవనం స్తంభించిపోయింది. పెద్దఎత్తున వరద నీరు నిలిచిపోవడంతో వాహనాల వేగం నెమ్మదించింది. డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. శ్రీకృష్ణానగర్, యూసుఫ్‌గూడ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వరద నిలిచిపోవడంతో పాటు కరెంటు పోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ద్విచక్ర వాహనం చోరీ

వెంగళరావునగర్: హాస్టల్ ఎదుట పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీ అయిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మధురానగర్ హాస్టల్‌లో నివసించే బి.సాయిశ్రీరామ్ ఈనెల 12న తన హాస్టల్ ఎదుట ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేశాడు. మరుసటి రోజు వచ్చి చూసేసరికి కనిపించలేదు. దీంతో పలు ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఆదివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరగాడిని పట్టించిన జీపీఎస్

యునిసెఫ్ ఉద్యోగి తెలివితేటలను అభినందించిన పోలీసులు



నిందితుడు మంజీత్‌సింగ్..

బంజారాహిల్స్: ఇటీవల కాలంలో సైబర్ మోసగాళ్లు రకరకాల పద్ధతుల్లో ప్రజలను మోసగిస్తూ లక్షల్లో వసూలు చేస్తున్నారు. సైబర్ వలకు చిక్కితే ఊపిరాడకుండా చేస్తూ ఎంతో కొంత వసూలు చేయనిదే వదిలిపెట్టడం లేదు. ఇలాంటి ఘటనలు రోజూ జరుగుతున్నా, వార్తల్లో చూస్తోన్నా చాలామంది ఇంకా మోసపోతూనే ఉన్నారు. అయితే ఓ యునిసెఫ్ ఉద్యోగి మాత్రం తన తెలివితేటలు, ముందుజాగ్రత్తతో ఓ సైబర్ నేరస్తుడి ఉచ్చులో చిక్కకుండా పోగొట్టుకున్న సామానును తానే స్వయంగా పోలీసుల చేత పట్టించాడు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జూబ్లీహిల్స్‌లోని యునిసెఫ్ కార్యాలయంలో పనిచేస్తున్న షాహీద్ పర్వేజ్ (40)కు హైదరాబాద్ నుంచి ముంబయికి బదిలీ అయ్యింది. వెంకటగిరిలో అద్దెకు ఉంటున్న పర్వేజ్ తన వాహనంతో పాటు సామగ్రినంతా ముంబయికి తరలించే క్రమంలో గూగుల్‌లో ఓ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీని వెతికిపట్టుకున్నాడు. ఆ నెంబర్‌కు ఫోన్ చేసి వెంకటగిరి నుంచి ముంబయికి తన సామగ్రి తరలించాలంటూ చెప్పాడు. అయితే పలువురి ఫోన్ నెంబర్లను చాకచక్యంగా రాబడుతున్న సైబర్ మోసగాళ్లకు పర్వేజ్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీకి ఫోన్ చేసిన విషయం తెలిసింది.రాజస్థాన్ నుంచి కిషన్‌సింగ్ అనే వ్యక్తి పర్వేజ్‌కు ఫోన్ చేసి మీ ఇంటికి కొద్దిసేపట్లో డీసీఎం వస్తుందని, సామాన్లు అందులో తీసుకెళ్తామని, ఇందుకుగాను రూ.18000 ఖర్చవుతుందని చెప్పాడు. పర్వేజ్ ఇందుకు అంగీకరించి ఇంటికి వచ్చిన వాహనంలో తన బైక్‌తో పాటు సామాన్లను భద్రపరిచి ముందుజాగ్రత్త చర్యగా ఆ డీసీఎంకు జీపీఎస్ అమర్చాడు. ముంబయికి డీసీఎం వెళ్లకుండా పటాన్‌చెరులో ఓ గోడౌన్ వద్ద ఆగిందని గుర్తించాడు. ఇదే విషయాన్ని ఎక్స్‌పర్ట్ ప్యాకర్స్ అండ్ మూవర్స్‌కు ఫోన్ చేయగా మంజీత్‌సింగ్ అనే డ్రైవర్ సామగ్రిని తీసుకువెళ్తున్నాడని, ఆయనతో మాట్లాడాలని చెప్పారు. అయితే మంజీత్‌సింగ్ ఫోన్ ఎంతకీ కలవలేదు. అప్పటికే మంజీత్‌సింగ్, కిషన్‌సింగ్ ఇద్దరూ కుమ్మక్కై పెద్ద మొత్తంలో డబ్బు రాబట్టడం, సామగ్రిని తస్కరించే ఉద్దేశంతో ఇద్దరూ కూడపలుక్కుని సామగ్రిని పటాన్‌చెరులో భద్రపరిచారు. రెండు రోజులు గడిచినా సామగ్రి ముంబయికి చేరకపోవడం, డీసీఎం కదలికలు పటాన్‌చెరులో ఉండడాన్ని గుర్తించిన బాధితుడు తానే స్వయంగా అక్కడికి వెళ్లి చూడగా ఓ గోడౌన్ వద్ద డీసీఎం కనిపించింది. వెంటనే తిరిగి వచ్చి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి డీసీఎంతో పాటు మొత్తం సామగ్రిని కూడా సీజ్ చేశారు. మంజీత్‌సింగ్‌ను విచారించగా కిషన్‌సింగ్ అనే సైబర్ నేరస్తుడితో కుమ్మక్కైన విషయం వెల్లడించాడు. పర్వేజ్ ఆ వాహనానికి జీపీఎస్ అమర్చడం వల్లనే నిందితుడి జాడ కనిపెట్టామని పోలీసులు ఆయనను అభినందించారు. మంజీత్‌సింగ్‌ను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

వెంగళరావునగర్: మధురానగర్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మధురానగర్ కాలనీలో హోరాహోరీగా ఆదివారం జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో కోడె సాంబశివరావు ప్యానల్, శేషాచారి ప్యానల్‌పై విజయ దుందుభి మోగించింది. ఎన్నికల్లో మధురానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎం.ప్రతాప్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎస్.వి.మనోహర్ (371 ఓట్లు), డాక్టర్ పి.శ్రీలక్ష్మి (247)లు పోటీ చేయగా మనోహర్ విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా కోడె సాంబశివరావు (342) తన ప్రత్యర్థి ఎం.వి.శేషాచారి (238)పై గెలుపొందారు. జాయింట్ సెక్రటరీగా పోటీ చేసిన ఎస్.రాజన్‌బాబు (193)పై ప్రత్యర్థి సి. హనుమంతరావు (398) విజయం సాధించారు. కోశాధికారిగా కె.సుగుణ (320) తన ప్రత్యర్థి బి.వెంకటరావు (251)పై గెలుపొందారు. వీరి పదవీ కాలం రెండేళ్ళ పాటు ఉంటుంది. కాగా పి.మోహన్‌కుమార్ ఎన్నికల అధికారిగా, జి.వి.కృష్ణ, వి.రాజగోపాల్‌రావు, వై. సాంబశివరావు, చిలకల వెంకటేశ్వరరావు, ధర్మరాజు, శ్రీనివాస్‌లు పరిశీలకులుగా వ్యవహరించారు. అసోసియేషన్‌లో మొత్తం 1106 ఓట్లు ఉండగా 585 ఓట్లు పోలైనట్టు ఎన్నికల అధికారి తెలియజేశారు.

కారు విడి భాగాలు మాయం

వెంగళరావునగర్: పార్కింగ్ చేసిన కారులో నుంచి వాటి విడి భాగాలను దొంగలు ఎత్తుకెళ్ళిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం జవహర్‌నగర్ నివాసి సయ్యద్ యూనస్ కళ్యాణ్‌నగర్‌లో వ్యాపారం చేస్తుంటాడు. ఈనెల 13న తన కారు మరమ్మతుల కోసం విడి భాగాలను తీసుకుని కారులో ఉంచాడు. కారును తన ఆఫీస్ ఎదురు పార్క్ చేసి లోనికి వెళ్ళివచ్చే సరికి అందులో ఉండాల్సిన గేర్‌బాక్స్, ఇంజన్ డైనమో, బ్యాటరీ, ఏసీ కంప్రెసర్, రేడియేటర్, కూలర్ తదితర పార్టులు మాయమయ్యాయి. చుట్టుపక్కల విచారించినా కనిపించ లేదు. దీంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్‌ను పటిష్టం చేద్దాం: కేటీఆర్


కేటీఆర్‌ను కలిసిన మణికొండ బీఆర్‌ఎస్ నేతలు, కౌన్సిలర్‌లు

మణికొండ: రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ నాయకులు పార్టీ మారినంత మాత్రాన పార్టీకి ఏమీ కాదని, ప్రజలు తమ పార్టీ వైపే ఉన్నారని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరిన నేపథ్యంలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. మణికొండ ది సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ నేత డి.సీతారాంను కేటీఆర్ పిలిపించుకొని పార్టీ పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేద్దామని చెప్పారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో ఆ పార్టీ మణికొండ మున్సిపాలిటీ వర్కింగ్ అధ్యక్షుడు కె.ధన్‌రాజ్, కౌన్సిలర్‌లు వసంతరావు, నవీన్‌కుమార్, నాయకులు ఎ.లక్ష్మణ్‌రావు, మహ్మద్ ఆరీఫ్, శ్రీకాంత్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ పూర్వవిద్యార్థుల ఔదార్యం

- రూ.2.24 కోట్ల సేకరణ..
- 66 మంది విద్యార్థులకు సహాయం

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లోని పూర్వ విద్యార్థులు ఔదార్యం చాటుకున్నారు. వారంతా కలిసి రూ.2.24 కోట్ల నిధులను సేకరించారు. 'పే–ఫార్వర్డ్ మోడల్'లో అర్హులైన 66 మంది విద్యార్థులకు ఈ ఆర్థిక సహాయం అందించారు. వీరిలో 40 మంది అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులు, 12 మంది పోస్టుగ్రాడ్యుయేట్, 14 మంది డ్యూయల్ డిగ్రీ విద్యార్థులు ఉన్నారు.

ఓయూ పాత భవనాలపై నజర్


ఓయూలోని విదేశీ విద్యార్థుల కార్యాలయం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని పాత భవనాలపై అధికారులు దృష్టి సారించారు. వర్షాకాలం ప్రారంభమవడం, ఇటీవల వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ లేడీస్ హాస్టల్ పైకప్పు పెచ్చులూడి పడటంతో ఓయూ అధికారులు అప్రమత్తమయ్యారు. కార్యాలయాలు, హాస్టల్ భవనాల మరమ్మతులు, ఇతర భవనాల్లోకి హాస్టళ్లను తరలించడం వంటి చర్యలు చేపట్టారు. మూసివేసిన ఏ, బీ హాస్టళ్ల మరమ్మతులను చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. విదేశీ విద్యార్థుల కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకున్నందున ఓయూ సీపీ భవనంలోకి తరలించనున్నారు. అయితే అంతర్గ రోడ్లు అధ్వానంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని, మరమ్మతులు చేయించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

28 నుంచి బీఎల్‌ఎఫ్ భూసదస్సులు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నల్లా సూర్యప్రకాష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్నవారికి ఇళ్లస్థలాల పట్టాలు, సొంత స్థలం ఉన్న వారికి ఐదు లక్షల రూపాయల రుణ సహాయం అందించాలని జూలై 28 నుంచి ఆగస్టు 28 వరకు బహుజన లెఫ్ట్ ఫ్రంట్(బీఎల్‌ఎఫ్) ఆధ్వర్యంలో వివిధ జిల్లా కేంద్రాల్లో భూ సదస్సులు నిర్వహిస్తున్న బీఎల్‌ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ తెలిపారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని బీఎల్‌ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత కేసీఆర్ పది సంవత్సరాల పాలనలో అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూమ్, సాగు భూములకు పట్టాలు ఇస్తామని వాగ్దానాలు చేసి మోసం చేశారని విమర్శించారు. సమావేశంలో బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ వనం సుధాకర్, నేతలు దండి వెంకట్, గాదగోని రవి, నూనె వెంకటస్వామి, కె.పర్వతాలు, సబ్బని లత, సిద్ధిరాములు, రాంబాబు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని పోస్టులకు పదోన్నతులు అవసరం

- తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులన్నింటికీ పదోన్నతులు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ హైదరాబాద్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం దోమల్‌గూడలోని సమాఖ్య భవన్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజారావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఈడీ అర్హత కలిగిన ఉపాధ్యాయులకు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా పదోన్నతలు కల్పించాలని కోరారు. అనంతరం కమిటీ పలు తీర్మానాలను ఆమోదించింది. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు కూడా పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని, స్కావెంజర్లను నియమించాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని సభ్యులు తీర్మానించారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శులు రమేష్ బాబు, కవిత, విశాలి, రఘునాథ్ బాబు, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

బూస్టర్ డోస్‌లను అందుబాటులో ఉంచాలి

సాక్షి, సిటీబ్యూరో: దేశంలో కేవలం 27 శాతం జనాభా మాత్రమే కోవిడ్ బూస్టర్ డోస్ తీసుకున్నారని డాక్టర్ ప్రియా అబ్రహం అన్నారు. నగరంలోని బి.ఎం.బిర్లా సైన్స్ సెంటర్‌లో నిర్వహించిన డా. కె.వి.రావు సైంటిఫిక్ సొసైటీ 24వ వార్షిక సైన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో ఆమె మాట్లాడుతూ.. కోవిడ్ బూస్టర్ డోస్‌లను తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నామన్నారు. ది మేకింగ్ ఆఫ్ ఎ ఇండిజినస్ కోవిడ్ వ్యాక్సిన్, దేశవాళీ కోవిడ్ తయారీ, సవాళ్లు, వ్యాక్సిన్ తయారు చేయడంలో పరిశ్రమలతో సహకారం వంటి అంశాలను వివరించారు. సాధారణంగా వ్యాక్సిన్ రూపొందించేందుకు 10 ఏళ్లు పడుతుందని, కరోనా సమయంలో కేవలం పదిన్నర నెలల్లో అభివృద్ధి చేశామన్నారు. సైంటిస్టులు సైనికుల్లాగా సరిహద్దుల్లో పని చేయకపోయినా ఎంతోమంది ప్రాణాలను కాపాడడానికి కృషిచేశారని కొనియాడారు.


విజయవాడలో బోనం ఊరేగింపులో నిషాక్రాంతి, అంజయ్య

భాగ్యనగరంలో బోనం.. సందోహంగా భక్తజనం.. ఊరేగింపులు ఘనం.. విజయవాడలోని కనక దుర్గ చెంత మన బంగారు బోనం సందడి చేసింది. అమ్మవారికి భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నైవేద్యం సమర్పించారు. మరోవైపు భక్తులు సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో తొలిబోనం సమర్పించారు. టీహబ్ వద్ద బోనాల ఊరేగింపు ప్రారంభమై మాదాపూర్ ఐటీ కారిడార్, శిల్పారామం మీదుగా కొండాపూర్‌లోని చిన్న, పెద్ద అమ్మవారి ఆలయం వరకు వైభవంగా సాగింది.

కనకదుర్గ చెంత బంగారు బోనం

చార్మినార్: విజయవాడ ఇంద్రకీలాద్రిలో కొలువుదీరిన కనక దుర్గమ్మ చెంత ఆదివారం తెలంగాణ ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలు వైభవంగా జరిగాయి. భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం శనివారం మీరాలం మండి మహంకాళేశ్వర దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విజయవాడకు వెళ్లారు. సప్త మాతృకలకు సప్తబంగారు బోనం పూజాకార్యక్రమంలో భాగంగా ప్రతి ఏడాది ఏడు దేవాలయాల్లో అమ్మవార్లకు బంగారు పాత్రలో నైవేద్యం సమర్పిస్తారు. ఇందులో భాగంగా విజయవాడ బ్రాహ్మణ వీధిలోని ఈవో కార్యాలయం వద్ద అమ్మవారి ఘటానికి పూజలు నిర్వహించిన తర్వాత బాజాభజంత్రీల నడుమ దుర్గమ్మగుడికి సామూహిక ఊరేగింపుగా వెళ్లి బంగారు బోనంలో నైవేద్యం, పట్టువస్త్రాలు, వడి బియ్యం సమర్పించారు. జోగిని నిషాక్రాంతి బంగారు బోనాన్ని తలపై పెట్టుకొని దారి పొడవునా నృత్యం చేస్తూ ఆంధ్ర, తెలంగాణ భక్తులను అలరించింది. పూజా కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, ఎంపీ ఎం.అనిల్‌కుమార్ యాదవ్, ఏపీ దేవాదాయ శాఖ మంత్రి రామనారాయణ రెడ్డి పాల్గొన్నారు.


బోనం సమర్పించేందుకు వస్తున్న జోగిని శ్యామల


విజయవాడలో పొట్టి పోతరాజులు

ఉజ్జయినీ అమ్మవారికి తొలి బోనం

రాంగోపాల్‌పేట్: ఆషాఢమాసం రాకతో సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయం ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులతో కిటకిటలాడింది. దేవాలయం నుంచి రోచా బజార్ వరకు భక్తులు బారులుతీరి నిల్చున్నారు. అమ్మవారికి ఒడిబియ్యం, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేవాలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. కాగా, ప్రతి ఏడాది ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతరకు ముందు వచ్చే ఆదివారం మాజీ కార్పొరేటర్ అత్తెల్లి మల్లికార్జున్‌గౌడ్ ఇంటి నుంచి తొలిబోనం తీసుకు వచ్చి సమర్పించడం ఆనవాయితీ. జోగిని శ్యామల అమ్మవారి బోనాన్ని అత్తెల్లి మల్లికార్జున్‌గౌడ్ ఇంటి నుంచి తీసుకుని వచ్చి అమ్మవారికి సమర్పించారు.


ఉజ్జయినీ మహంకాళి అమ్మవారు

కోట నిండా భక్తులు

గోల్కొండ: గోల్కొండ కోటలో మూడో బోనం పూజ అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీ జగదాంబిక మహంకాళీ అమ్మవారిని ఆషాఢమాసం బోనాల ఉత్సావాల్లో భాగంగా ఆదివారం అమ్మవార్లకు మూడోబోనం పూజ నిర్వహించారు. ఉదయం పది గంటల వరకు కోటకు సుమారు లక్ష మంది భక్తులు చేరుకున్నారు. నగీనాబాగ్ పక్కన గల నగీనా బ్యారెక్స్‌లో భక్తులు అమ్మవారికి నైవేద్యం తయారు చేస్తూ సందడి చేశారు. ప్రముఖ గాయని మంగ్లీ విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం నుంచి కోటకు వచ్చిన వాహనాలను టోలిచౌకీ, శాతంచెరువు, లంగర్‌హౌజ్ దర్గా, ఎండీ లైన్స్ చౌరస్తాలో ప్రయాణికులు పార్కు చేసి 2–3 కిలోమీటర్లు కాలినడకన కోటకు చేరుకున్నారు. గత వారం జరిగిన మొదటి బోనం పూజలో జరిగిన తోపులాట పునరావృత్తం కాకుండా పోలీసులు 3వ బోనం పూజకు జాగ్రత్తపడ్డారు. కోటలో నుంచి భక్తులు బయటకు రావడానికి ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేశారు. నగర అదనపు పోలీస్ కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్ కోట ప్రధాన ద్వారం వద్ద బందోబస్తును పర్యవేక్షించారు. మరోవైపు మహిళల కోసం అధికారులు ప్రత్యేక క్యూలైన్‌లు, ప్రత్యేక టాయిలెట్స్‌ను ఏర్పాటు చేశారు. ఆరోగ్య శాఖ వారు కోట ప్రవేశ ద్వారం వద్ద, నగీనా బాగ్ తదితర ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. కోట చౌరస్తా శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలకు వేదిక అయింది. లంగర్‌హౌజ్, రాందేవ్‌గూడ, బంజారి దర్వాజా తదితర ప్రాంతాల నుంచి భక్తులు తొట్టెళ్ల ఊరేగింపుగా వచ్చారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న మంగ్లీ


కోట చౌరస్తా వద్ద శివసత్తుల పూనకాలు

ఐటీ కారిడార్‌లో ఘనంగా ..

రాయదుర్గం: బోనాల వేడుకలను టీహబ్ నుంచి ఘనంగా ఆదివారం ఆరంభించారు. తెలంగాణ సంప్రదాయం ఐటీ కారిడార్, హైదరాబాద్ నాలెడ్జ్ సిటీ ప్రాంతంలో వెల్లివిరిసింది. తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్(టీటా) అధ్యక్షుడు సందీప్ కుమార్ మక్తాలా ఆధ్వర్యంలో ఈ బోనాల వేడుకలను నిర్వహించారు. టీహబ్ వద్ద ఆరంభమైన బోనాల ఊరేగింపు మాదాపూర్ ఐటీ కారిడార్, శిల్పారామం మీదుగా కొండాపూర్‌లోని చిన్న, పెద్ద అమ్మవారి ఆలయం వరకు వైభవంగా సాగింది. వేడుకలకు దుబాయ్ రాయల్ కింగ్ ఫ్యామిలీ సభ్యుడు, ప్రముఖ వ్యాపారవేత్త డాక్టర్ అబ్దుల్లా ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో టీటా గ్లోబల్ అఫైర్స్ చైర్మన్ సత్యరావు, ప్రఖ్యాత కవి అందెశ్రీ, పలువురు టీటా సభ్యులు, ఐటీ ఉద్యోగులు, ఇతరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


టీహబ్ ప్రాంతంలో బోనాల ఊరేగింపులో..

విద్యాశాఖ మార్గదర్శకాలను అమలు చేయాలి

మైనారిటీ గురుకులాల్లో బదిలీలపై మసూదుద్దీన్


మహమ్మద్ మసూదుద్దీన్

సాక్షి, సిటీబ్యూరో: మైనారిటీ గురుకులాల్లో కూడా విద్యాశాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్(టీఎస్ మేవా) అధ్యక్షుడు మహమ్మద్ మసూదుద్దీన్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ కింద పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీల ప్రక్రియలో విద్యాశాఖ మార్గదర్శకాలు అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలు విద్యాశాఖ మార్గదర్శకాలను పాటిస్తుండగా మైనారిటీ గురుకులాల్లో కొత్త నిబంధనలను అమలు చేస్తున్నారని ఆరోపించారు. ఒకేచోట ఐదేళ్లు నిండిన ప్రధానోపాధ్యాయులను తప్పనిసరిగా బదిలీ చేయాల్సి ఉండగా, మైనారిటీ గురుకుల సొసైటీలో నాలుగేళ్లకు, నాన్ గెజిటెడ్ టీచర్లు ఎనిమిదేళ్లకు బదులు నాలుగేండ్లకు కుదించి బదిలీ చేస్తున్నారని విమర్శించారు.

నగరంలో నేడు

- సీఎం ఎస్టీ ఎంట్రప్రెన్యూర్, ఇన్నోవేషన్ పథకం కింద డ్రాప్‌ఇట్ ప్రీమియం లాండ్రీ సర్వీసెస్ ఇవాళ నార్సింగి కోకాపేట టెర్మినల్‌లో ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.
- కాచిగూడలోని వైశ్య హాస్టల్ వార్షికోత్సవాలు సాయంత్రం 5 గంటలకు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జ్ఞాననిధి సేవా ట్రస్ట్ చైర్మన్ గీతా ఆచార్య ఎం.శ్రీనివాస్ కానున్నారు. వైశ్య హాస్టల్ ప్రెసిడెంట్ ఉప్పల రాజేశ్వర్ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారు.
- దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళాసభ (డీడీఎంఎస్) ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు డాక్టర్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ 37వ మెమోరియల్ లెక్చర్ విద్యానగర్ ఓయూ రోడ్డులోని డీడీఎంఎస్ ఆడిటోరియంలో జరుగుతుంది.

70 ఏళ్లు.. అడుగులు..

రూపుదిద్దుకుంటున్న ఖైరతాబాద్ మహాగణపతి

ఖైరతాబాద్: ప్రతియేటా వివిధ రూపాల్లో దర్శనమిచ్చే ఖైరతాబాద్ మహాగణపతి ఈసారి 70 అడుగుల ఎత్తులో సప్తముఖాలతో నిలబడి ఉండే ఆకారంలో శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ నేతృత్వంలో రూపుదిద్దుకుంటోంది. విగ్రహ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తల, కాళ్లు, నడుము భాగానికి సంబంధించిన వెల్డింగ్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. 1954లో తొలిసారి ఒక్క అడుగు విగ్రహంతో ఖైరతాబాద్ మహాగణపతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈ ఏడాదితో 70 వసంతాలు పూర్తి చేసుకుంటాయి. సప్తముఖాలు, సప్తసర్పాలతో నిలబడి ఉండే ఆకారంలో భక్తులకు దర్శనమిచ్చే విధంగా మహాగణపతి రూపుదిద్దుకుంటున్నాడు. మహాగణపతికి ఒకవైపు బాలరాముని విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 70 అడుగుల ఎత్తు, 28 అడుగుల వెడల్పులో ఉండేలా మహాగణపతి రూపురేఖలను తీర్చిదిద్దేందుకు మచిలీపట్నంకు చెందిన వెల్డర్ నాగబాబు ఆధ్వర్యంలో 25 మంది వెల్డర్లు ఉదయం, సాయంత్రం రెండు షిఫ్టులుగా పనిచేస్తున్నారు. విగ్రహం నెలకొల్పేందుకు ఆదిలాబాద్, జిన్నారానికి చెందిన నర్సయ్య ఆధ్వర్యంలో 25 మంది కార్మికులు 70 అడుగుల షెడ్డును ఏర్పాటు చేశారు. గత 40 ఏళ్లుగా శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్‌తో కలిసి ఖైరతాబాద్ మహాగణపతి పనులను దివంగత సింగరి సుదర్శన్ బావమరిది సందీప్‌రాజ్ పర్యవేక్షిస్తున్నారు. వీరిద్దరు మహాగణపతి కర్రపూజ మొదలు నిమజ్జనం వరకు అన్నీ తామై వ్యవహరిస్తారు.


70 అడుగుల మహాగణపతి కోసం ఏర్పాటుచేసిన భారీ షెడ్డు


మహాగణపతి విగ్రహ రూపురేఖల్ని తీర్చిదిద్దే టీం

రాజ్యాధికారం దిశగా మున్నూరుకాపులు

పిలుపు ఇచ్చిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


మున్నూరుకాపుల సమావేశంలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

కాచిగూడ: మున్నూరుకాపులు బీసీల రాజ్యాధికారం సాధించే దిశగా కృషి చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు అధ్యక్షతన ఆదివారం కాచిగూడ మ్యాడం అంజయ్య హాల్‌లో మున్నూరుకాపు ప్రజాప్రతినిధుల సన్మాన కార్యక్రమం జరిగింది. అనంతరం మున్నూరుకాపు వివాహ పరిచయవేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మున్నూరుకాపులు సంఘాలుగా విడిపోవడం కంటే సమైక్యంగా ఉంటేనే లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యమవుతుందన్నారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా మున్నూరుకాపులు ఆశించేస్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ మున్నూరుకాపుల్లో ఐక్యత లేనందునే రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో మన కులానికి ప్రాతినిధ్యం దక్కలేదన్నారు. ఈ సందర్భంగా 25 మంది పేద మున్నూరుకాపు ఆడపిల్లల వివాహానికి పుస్తెమట్టెలు అందిస్తానని మున్నూరుకాపు విద్యార్థి వసతిగృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోట రఘునాథ్‌రావు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు గంప చంద్రమోహన్, దామెర జ్ఞానేశ్వర్, బి.ఆర్.జితేందర్, మణికొండ రమేష్, కొండూరి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఇస్కాన్' జగన్నాథ రథయాత్ర

గచ్చిబౌలి: ఇస్కాన్ ఆధ్వర్యంలో కొండాపూర్‌లోని సీతారామాంజనేయ స్వామి దేవాలయం నుంచి జగన్నాథ రథయాత్ర ఆదివారం సాయంత్రం ప్రారంభమైంది. అంతకుముందు జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సినీనటుడు సుమన్ మాట్లాడుతూ 'నేను హిందువును కాబట్టి హిందుత్వాన్ని కాపాడేందుకు ప్రయత్నిస్తాను' అని చెప్పారు. ఎవరి మతాన్ని వారు గౌరవించుకున్నప్పటికీ ఇతర మతాలను కించపరిచే విధంగా ప్రవర్తించవద్దని సూచించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి రథాన్ని లాగి భక్తిని చాటుకున్నారు. ప్రధాన రహదారి వెంట గచ్చిబౌలి జీపీఆర్‌ఏ క్వార్టర్స్ గ్రౌండ్ వరకు యాత్ర సాగింది. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.




కొండాపూర్‌లో జగన్నాథ రథ యాత్రలో పాల్గొన్న భక్తులు

ఆర్ట్ గ్యాలరీలో 'అనంతయ్య' చిత్రాలు



చిత్రమయి స్టేట్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్స్‌లో ప్రముఖ చిత్రకారుడు దుద్యాల అనంతయ్య గీసిన అద్భుతమైన పెయింటింగ్స్ అహూతులను ఆకట్టుకున్నాయి. ఈ నెల 6న ప్రారంభమైన ఈ ఎగ్జిబిషన్ ఆదివారంతో ముగిసింది. ప్రకృతిని కాన్వాస్‌గా మలచుకుని, పర్యావరణానికి జరుగుతున్న ముప్పు, జీవజాలం పడుతున్న ఇబ్బందులను కళ్లకు కట్టినట్టు మలచడంలో దిట్ట. ఆర్ట్‌తో పాటు ఎంతో సాంకేతికత కలగలుపుతూ అద్భుతమైన చిత్రాలను తన కుంచెతో ఆవిష్కరించారు.

టీబీసీ వేదికగా సెలబ్రిటీల సందడి

నగరంలో నూతనంగా ప్రారంభించిన టీబీసీ లగ్జరీ సెలూన్స్ వేదికగా టాలీవుడ్ హీరోలు శ్రీకాంత్, తరుణ్, అశ్విన్‌తో పాటు పలువురు తారలు సందడి చేశారు. బాలీవుడ్ తారలు, క్రికెట్ సెలబ్రిటీలు విరాట్ కోహ్లీ, కె.ఎల్ రాహుల్, హార్దిక్, సూర్య కుమార్ యాదవ్ వంటి ప్రముకులకు స్టైలింగ్ అందిస్తున్న జోర్డాన్‌కు చెందిన టీబీసీ లగ్జరీ సెలూన్స్‌ను మాదాపూర్ వేదికగా బిగ్ బాస్ ఫేమ్ వీజే సన్నీ ప్రారంభించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో సేవలను అందిస్తున్న టీబీసీ లగ్జరీ సెలూన్స్‌ను నగరానికి తీసుకురావడం సంతోషంగా ఉందని సన్నీ తెలిపారు. స్వతహాగా బ్యూటీ ఇండస్ట్రీ అంటే ఎంతో ఇష్టమని, సిటీలో అధునాతన సెలూన్ ఏర్పాటు చేయడమే డ్రీమ్ అని బిగ్ బాస్ సీజన్ 5 హౌస్‌లో చెప్పిన తన మాటలు గుర్తు చేసుకున్నారు. తన కల నెరవేరడంతో పాటు నగరంలోని ట్రెండ్స్‌కు నూతన హంగులు అద్దుతుండడం సంతోషాన్ని వ్యక్తం చేశారు. తెలుగు సినీ తారలతో పాటు బిగ్ బాస్ ఫేం సిరి శ్రీహన్, ప్రియాంక జైన్, దీప్తి సునైనా, నాయని పావని, మానస్, అమర్ దీప్, శుభశ్రీ.. సింగర్స్ అదితి, సాత్విక్, అమల చేబో పాల్గొని సందడి చేశారు.



ఫ్యాషన్ గాలా జిగేల్



రాయదుర్గం: మిస్టర్ అండ్ మిస్ ఫ్యాషన్ గాలా–2024 అట్టహాసంగా సాగింది. ఆదివారం రాత్రి హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో ప్రముఖ ఎంటర్‌టైన్‌మెంట్, ఈవెంట్‌మేనేజ్ మెంట్ కంపెనీ థర్డ్ ఐ ఎంటైర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో గ్రాండ్ ఫినాలే కార్యక్రమాన్ని నిర్వహించారు. 100 మంది మోడలింగ్ ఔత్సాహికులు ఈ కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. మోడల్, నటుడు ఈశ్వర్‌సాయి, ఫ్యాషన్ డైరెక్టర్, కొరియోగ్రాఫర్ వంశీ పి పల్లెతో సహా పరిశ్రమ నిపుణుల బృందం ఈ పోటీకి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. గ్రాండ్ ఫినాలేలో ఫైనలిస్టులు ర్యాంప్ వాక్, టాలెంట్ షోకేస్, పర్సనాలిటీ రౌండ్‌తో సహా వివిధ రౌండ్లలో పోటీపడ్డారు. మిస్టర్ ఫ్యాషన్ గాలా–2024 విజేతకు లక్ష నగదు బహుమతి, రన్నరప్‌కు రూ.50వేలు అందిస్తారు. ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్లు, కొరియోగ్రాఫర్లు, పరిశ్రమ నిపుణులు పాల్గొని ఈ ఫైనల్ కార్యక్రమంలో తమ అనుభవాలను పంచుకున్నారు. షో నిర్వహణతో టీహబ్ ప్రాంగణమంతా సందడిగా మారింది.





ఊరి దేవతలు.. ఊరూరా చుట్టాలు

ఎల్లలు దాటి వచ్చి గ్రామదేవతలకు ప్రణమిల్లి..

దర్శనం కోసం దేశం నలుమూలల నుంచి.. | అనామకుల నుంచి అపర కుబేరుల వరకు.. | సర్పంచ్ నుంచి ప్రధాని వరకు.. | భాగ్యనగరంలో గ్రామ దేవతల సేవలో భక్తజనం పునీతం..

గ్రామ దేవత.. గ్రామానికి రక్ష.. పాడి పంటలు, సుఖ సంతోషాలు, సకల సౌభాగ్యాలు కలిగించే కల్పవల్లి. ఆ ఊరి వారి కోర్కెలు తీర్చే ఇలవేల్పు. అమ్మలు గన్న అమ్మకు ఆ గ్రామస్తులు భక్తి ప్రపత్తులతో అమ్మవారి మొక్కులు తీర్చుకుంటారు. ఊరంతా ఏకమై ఏటేటా అమ్మవారికి వివిధ రూపాల్లో ఉత్సవాలు జరుపుతూ ఆశీర్వచనాలు పొందుతుంటారు. ఇది అనాదిగా వస్తున్న భక్తిపూర్వక ఆచారం. గ్రామ ప్రజల అపార విశ్వాసం. అప్పటివరకూ ఒక ఊరు వారు మాత్రమే చవిచూసిన అమ్మవారి ఆశీస్సుల మహిమలు జిల్లా, రాష్ట్ర, దేశ, ఖండాలను పాకి ఇప్పుడు ఆ తల్లికి విశ్వమంతా బంధువులయ్యారు. గాలిమోటారెక్కి మరీ అమ్మవారి మొక్కులు తీర్చుకుని వెళ్తుంటారు. ఔను..ఇది అక్షరాల నిజం. ఒకప్పుడు ఊరి భక్తులు తమ ప్రాంతానికే రక్ష అని భావించగా.. ఇప్పుడు విశ్వమే ఊరుగా మారి అమ్మవారి ఆశీస్సుల కోసం క్యూ కడుతున్నారు.

– సనత్‌నగర్



రథోత్సవ వేళ..

ఇక బోనాలు, కళ్యాణ మహోత్సవాలు, రథోత్సవాల వేళ..'అమ్మ' దర్శనం కోసం రెక్కలు కట్టుకుని మరీ విదేశాల నుంచి వచ్చేస్తారు. అంతెందుకు.. ఎక్కడో అమెరికాలో ఉండి కూడా ఆన్‌లైన్ ద్వారా అమ్మవారికి చీరలు తెప్పించి మరీ ప్రదానం చేస్తుంటారంటే అమ్మవారిపై భక్తిప్రపత్తులు ఏపాటివో అర్థమవుతుంది. అలాగే అమ్మవారి చీరలు వేలం ఎప్పుడెప్పుడా అంటూ వేచిచూస్తూ ఎక్కడో విదేశాల్లో ఉన్నవారు సైతం వాటిని తీసుకునేందుకు పోటీపడుతుంటారు.



ప్రధాని నరేంద్రమోదీకి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అర్చకులు

గ్రామ దేవతలు అయిన సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి, బల్కంపేట ఎల్లమ్మ, జూబ్లీహిల్స్ పెద్దమ్మ, బేగంపేట కట్టమైసమ్మ, శివారు ప్రాంతాల్లో భక్తులచే నిత్య పూజలందుకుంటున్న గండిమైసమ్మ, మైసిగండి.. ఇలా ఎందరో గ్రామ దేవతలు మమ్ము కాసే దేవతలుగా భక్తజనం దండాలు పెట్టుకుంటూ మొక్కులు తీర్చుకుంటారు. అమ్మవార్ల ఆలయాలకు ఎక్కడెక్కడి నుంచో భక్తులు వ్యయప్రయాసలకోర్చి వస్తుంటారు. ఆ ఆలయాలు నిత్య కళ్యాణం.. పచ్చతోరణం అన్నట్లు భక్తకోటి దర్శనాలతో విలసిల్లుతున్నాయి.

లష్కర్‌లో కొలువై.. విశ్వమంతా వ్యాపించి..

ఉజ్జయినీలో కలరాతో అల్లాడుతుంటే నగరం నుంచి ఓ మిలటరీ టీమ్ అక్కడి సేవా కార్యక్రమాల్లో పాల్గొంది. ఆనాడు 13 కులాలకు చెందిన వారు టీమ్‌గా అక్కడికి వెళ్లగా తమకెవరికీ ఏమి కాకుండా సురక్షితంగా ఇంటికి చేరునేలా చూడు తల్లీ అంటూ ఉజ్జయినీ అమ్మవారి సూరిటి అప్పయ్య అనే భక్తుడు వేడుకుంటే.. ఆ తల్లి కటాక్షించింది. ఆ భక్తుడు మొక్కుకున్న విధంగా ఆ ఉజ్జయినీ మహంకాళిని లష్కర్‌లో ప్రతిష్ఠించాడు. అలా కొలువైన మహంకాళిని కొన్ని దశాబ్దాలుగా కేవలం ఆ ప్రాంతం వారే మొక్కుకుని నిత్య పూజలు చేస్తూ వచ్చారు. రానురాను ఎల్లలు దాటి మరీ భక్తులు దేశ, విదేశాల నుంచి వచ్చి అమ్మవారిని వేడుకుంటున్నారు.

నాడు బెహలూన్‌ఖాన్.. నేడు బల్కంపేట..

బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఆలయం తెలంగాణ ప్రాంతమే కాదు..దేశంలోనే సుప్రసిద్ధ ఆలయం. హైదరాబాద్ నగరం ఏర్పడకముందు ఇది కుగ్రామంగా ఉండేది. రాజాశివరాజ్ బహద్దూర్ అనే సంస్థానాధీశుడి హయాంలో ఈ ప్రాంతాన్ని బహలూన్‌ఖాన్ గూడగా పిలిచేవారు. కాలక్రమేణా అది కాస్తా బల్కంపేటగా మారి ఇప్పుడు ఎల్లమ్మ అమ్మవారి ఆలయంతో ఆ గ్రామం విశ్వవ్యాప్తమైంది. ఎక్కడెక్కడి నుంచో భక్తులు అమ్మవారి దర్శనార్థం వస్తుంటారు.



బోనమెత్తుకున్న పీవీ సింధు, వైష్ణవి చైతన్య

హుండీ

ఆదాయం లెక్కించే సమయంలో విదేశీ కరెన్సీ కూడా కనిపిస్తుంటుంది. ముఖ్యంగా అమెరికా, ఆస్ట్రేలియా కరెన్సీలు ఎక్కువగా వస్తుంటాయి. ఆలయానికి రాలేని భక్తుల కోసం ఆన్‌లైన్ హుండీ విధానాన్ని కూడా దేవాదాయ శాఖ తీసుకొచ్చింది.

అమ్మవారి సేవలో జాతీయ, రాష్ట్ర ప్రముఖులు..

ఒకనాడు గ్రామ సర్పంచ్, పెద్దల పర్యవేక్షణలో నిర్వహించే ఉజ్జయినీ జాతరకు చుట్టుపక్కల ఊళ్లకు చెందిన వారు మాత్రమే బండ్లు కొట్టుకొని వచ్చేవారు. రాష్ట్రపతి, ప్రధానమంత్రి వరకూ అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

1982–1987 కాలంలో భారత రాష్ట్రపతి హోదాలో జ్ఞాన్‌జైల్‌సింగ్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఇటీవల నగర పర్యటనకు విచ్చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమ్మవారి సేవలో పునీతులయ్యారు. అంతకముందు అమిత్ షా, నడ్డా వంటి జాతీయ నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నీతా అంబానీ.. ప్రపంచంలోనే అత్యంత సంపన్నుల్లో ఒకరైన ముఖేష్ అంబానీ సతీమణి. ఆమె హైదరాబాద్‌లో అడుగుపెట్టిన ప్రతిసారీ బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకుని ఆశీస్సులు తీసుకోవడం పరిపాటి. ఇక గవర్నర్, రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన దివంగత నేత రోశయ్య బతుకున్నంతకాలం అమ్మవారి సేవలో పునీతులయ్యారు. వీరే కాదు..రాజకీయ, వ్యాపార తదితర రంగాల్లో ఉన్నవారు బల్కంపేట ఎల్లమ్మ అంటే అపార భక్తి విశ్వాసం. పొన్నం ప్రభాకర్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కేసీఆర్ కుటుంబ సభ్యులు, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, దానం నాగేందర్ ఇలా రాష్ట్రానికి చెందిన వారే కాదు..ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ ఇలా దక్షిణ, ఉత్తర భారతదేశం అని తేడా లేకుండా విభిన్న రాష్ట్రాలకు చెందిన ఎందరో భక్తజనులు అమ్మవారి దర్శనం కోసం వస్తుంటారు.



బల్కంపేట ఎల్లమ్మ సన్నిధిలో నీతా అంబానీ

ఊహ తెలిసినప్పటి నుంచి..



ఊహ తెలిసినప్పటి నుంచి మహంకాళి జాతరను చూస్తున్నాను. అప్పట్లో లష్కర్ ప్రాంత ప్రజలే పూజించి మొక్కులు తీర్చుకునేవారు. భక్తులు పెరిగే కొద్ది ఆలయం విశాలంగా మారుతూ వచ్చింది.

– సీకే నర్సింగరావు (72), దక్కన్ మానవా సేవా సమితి

ఎక్కడెక్కడో స్థిరపడ్డ వారు కూడా..



బల్కంపేట ఎల్లమ్మ, సికింద్రాబాద్ మహంకాళి అమ్మవార్ల ఆశీస్సులు ఉంటే ఏదైనా సాధించగలమన్న నమ్మకం. ఎక్కడెక్కడో స్థిరపడ్డ వారైనా దర్శనం కోసం వస్తుంటారు. మొక్కులు తీర్చుకుంటారు.

–అన్నపూర్ణ, బల్కంపేట ఎల్లమ్మ, సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి ఆలయాల పూర్వ ఈఓ

నేచర్స్ లవింగ్లీ!

వందల జీవజాతులతో పుస్తకావిష్కరణ



పొద్దుపొద్దున్నే లేవడం.. ఫోన్లు పట్టడం.. రీల్స్ చూడటం.. గేమ్స్ ఆడటం.. చాలా మంది పిల్లలు చేస్తున్న పనులు. ఫోన్ మోజులో పడి బయటి ప్రపంచాన్ని పట్టించుకోవడం మానేస్తున్నారు. ఎప్పుడూ ఫోన్‌లో బిజీగా ఉంటున్నారు. అయితే వీళ్లు మాత్రం చాలా ప్రత్యేకం. ప్రకృతిని ప్రేమిస్తూ.. ప్రకృతి ఒడిలో సేదతీరుతూ.. ప్రకృతిని పది మందికీ పరిచయం చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. చిన్న వయసులోనే జీవ వైవిధ్యానికి ఉన్న ప్రాముఖ్యాన్ని లోకానికి చాటి చెబుతున్నారు. వారే హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ పూర్వ విద్యార్థులైన అజ్మా ఖాన్, ఇబ్రహీం, నియో వెంకట్, అన్నవరపు సాత్విక్. రెండేళ్లుగా ఎంతో శ్రమించి హెచ్‌పీఎస్‌లో ఉన్న జీవ వైవిధ్యాన్ని కళ్లకు కట్టేలా అద్భుతమైన ఫొటోలతో పుస్తకాన్ని ప్రచురించారు. ఈ పుస్తకం వెనుక ఉన్న వారి శ్రమ గురించి తెలుసుకుందాం..

- సాక్షి, సిటీబ్యూరో

- ప్రకృతిపై ప్రేమతో నలుగురు చిన్నారుల కృషి
- రెండేళ్లుగా కష్టపడి ఫొటోలు, వివరాల సేకరణ
- 71 జాతుల పక్షులు, 128 జాతుల కీటకాలు, 16 జాతుల సరిసృపాలు

కాంక్రీట్ అరణ్యంలో చాలావరకూ పక్షులు, కీటకాలు దాదాపు కనుమరుగవుతున్నాయి. దాదాపు 150 ఎకరాల్లో విస్తరించి ఉన్న హెచ్‌పీఎస్ బేగంపేట క్యాంపస్‌లో మాత్రం జీవవైవిధ్యం పరిఢవిల్లుతోంది. ఎన్నో రకాల జాతులు ఇక్కడ మనుగడ సాగిస్తున్నాయి. ఇటీవలే 12వ తరగతి పూర్తి చేసుకున్న వీరంతా రెండేళ్లుగా స్కూల్లోని జంతు జాతులపై తీవ్ర పరిశోధన చేశారు. పక్షులు, కీటకాలు, సీతాకోకచిలుకలు ఇలా ఎన్నో రకాల జీవులను తమ కెమెరాల్లో అద్భుతంగా బంధించారు. వాటన్నింటినీ విభాగాల వారీగా విభజించి, ఒక్కో జీవం గురించి వివరించారు. 71 జాతుల పక్షులు, 128 జాతుల కీటకాలు, 16 జాతుల సరీసృపాలు, మూడు జాతుల ఉభయచరాలను పుస్తకంలో పొందుపరిచారు.

అనేక విషయాలు నేర్చుకున్నాం..

తమ ప్రాజెక్టులో భాగంగా ఎన్నో విషయాలు నేర్చుకున్నామని వాళ్లు చెబుతున్నారు. సమాచారం సేకరణసమయంలో చాలా మందితో మాట్లాడామని, వారంతా సహకరించారని పేర్కొన్నారు. ఎవరితో ఎలా మాట్లాడాలో తెలుసుకున్నామని తెలిపారు. పక్షులు, కీటకాల సమూహంలో ఎలా ప్రవర్తిస్తున్నాయో తమకు అర్థమైందని వివరించారు. వాటిని చూసి మనం నేర్చుకోవాల్సింది చాలా ఉందన్నారు.

భవన నిర్మాణాల్లో మార్పు రావాలి..

పర్యావరణంలో ప్రతి జీవీ ముఖ్యమేనని, ప్రస్తుతం నిర్మిస్తున్న భవనాల్లో జీవ జాతుల కోసం ఎలాంటి ఏర్పాట్లూ చేయట్లేదని, దీంతో అనేక పక్షి జాతులు అంతరించిపోతున్నాయని చెబుతున్నారు. జీవ వైవిధ్యం ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించడమే తమ పుస్తకం ముఖ్య ఉద్దేశమని వారు పేర్కొంటున్నారు. తమతోటి విద్యార్థులు కూడా తమను చూసి ప్రకృతిపై ప్రేమను పెంచుకున్నారని గుర్తుచేసుకున్నారు.

చిన్నప్పటి నుంచి ఆసక్తితో..

ప్రకృతి అంటే చిన్నప్పటి నుంచి ఎంతో ఇష్టం. మా స్కూల్లో ఎన్నో జీవులు తారసపడుతుండేవి. వాటన్నింటినీ ప్రపంచానికి పరిచయం చేయాలని ఆలోచన ఉండేది. నాతో పాటు నాలాంటి ఆలోచన ఉన్న స్నేహితులతో కలిసి ఈ ప్రాజెక్టును పూర్తి చేశాం. స్కూల్లోని టీచర్లు మమ్మల్ని ఎంతో ప్రోత్సహించారు.

– అజ్మా ఖాన్

నెట్‌లో సరైన సమాచారం లేదు..

చాలా జీవుల గురించి ఇంటర్నెట్‌లో వెతికితే సరైన సమాచారం లభించట్లేదు. చాలాసార్లు తప్పుడు సమాచారం లభిస్తోంది. ఎలాగైనా వాటి గురించి సరైన సమాచారం అందించాలని అనుకున్నాం. అందుకే ఈ పుస్తకాన్ని తీసుకొచ్చాం. సమాచారం సేకరణకు ఎంతో కష్టపడ్డాం. – నియో వెంకట్

పర్యావరణం అంటే ఇష్టం..

పర్యావరణం అంటే ఇష్టం. పక్షులు, జంతువులు, వాటి సమూహంతో, మనుషులతో ఎలా ప్రవర్తిస్తాయో గమనిస్తుంటా. చేపలను పెంచడం అంటే ఇష్టం. ఇంట్లోనే సొంతంగా అక్వేరియం రూపొందించి, పలు రకాల చేపలను పెంచుకుంటున్నాను. రెడ్ టెయిల్ క్యాట్‌ఫిష్, టైగర్ ఆస్కార్, ఇరిడిసెంట్ ఆస్కార్, చెర్రీ బార్బ్ వంటి ఎన్నో చేపలను జాగ్రత్తగా చూసుకుంటున్నాను.

– ఇబ్రహీం వదూద్ అహ్మద్ దస్తగిర్

కెమెరా ముఖ్యమైనది..

ఫొటోగ్రఫీ అంటే ఇష్టం. ఫోన్లు విస్తృతంగా వినియోగంలోకి వచ్చిన తర్వాత ఫొటోలు, కెమెరాల గురించి పెద్దగా పట్టించుకోవట్లేదు. కెమెరాల్లో తీసిన ఫొటోలకు ప్రాముఖ్యత ఉంటుంది. వాటి విలువ తెలుస్తుంది. మంచి ఫొటో కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సి ఉంటుంది. అప్పుడే అందమైన ఫొటోలు తీయడానికి అవకాశం ఉంటుంది. – సాత్విక్ అన్నవరపు



క్లుప్తంగా...

ఏపీలో మరో రెండు రోజులు వర్షాలు

ఉపరితల ఆవర్తనం ఫలితం



సాక్షి, అమరావతి: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వచ్చే రెండురోజులు ఏపీ వ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. పశ్చిమబెంగాల్, జార్ఖండ్, ఒడిశా మీదుగా ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి కొనసాగుతుండగా, శనివారం పశ్చిమ బంగాళాఖాతం, కోస్తాంధ్ర తీరంలో ఏర్పడి సముద్రమట్టానికి సగటున 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం దాంతో కలిసిపోయింది. దీని ప్రభావంతో వచ్చే రెండురోజులు రాష్ట్ర వ్యాప్తంగా తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తా యని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. అనేకచోట్ల ఉరుములతో కూడిన జల్లులు పడతాయని, అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, పలుప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వివరించారు. ఆదివారం ఏపీలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. అల్లూరి సీతారామ రాజు జిల్లా కొయ్యూరులో 24 గంటల్లో 9.4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. తూర్పుగోదా వరి జిల్లా తాళ్లపూడిలో 6 సెంటీమీటర్లు, పశ్చిమగోదావరి జిల్లా పోలవరంలో 7, కదిరిలో 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

శ్రీవారి ఆలయంలో రేపు ఆణివార ఆస్థానం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జూలై 16న సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినం ఘనంగా నిర్వహించనున్నారు. ఆ రోజున సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి శోభాయమానంగా అలంకరించిన పుష్పపల్లకిపై తిరుమల వీధుల్లో ఊరేగుతారు. ఆణివార ఆస్థానం కారణంగా జూలై 16న అష్టదళ పాద పద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

దర్శనానికి 24 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. భక్తులతో అన్ని కంపార్ట్‌మెంట్లు నిండి క్యూ లైన్ టీబీసీ వద్దకు చేరుకుంది. శనివారం అర్ధ రాత్రి వరకు 75,916 మంది శ్రీవారిని దర్శించుకుని హుండీలో రూ.3.87 కోట్లు వేశారు. టైంస్లాట్ టోకెన్‌లు ఉన్నవారికి సకాలంలో, దర్శన టికెట్లు లేనివారికి 24 గంటల్లో, ఎస్ఈడీ టికెట్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనమవుతోంది.

రూ.3,000 నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు?

ఏపీలో 1.60 కోట్ల కుటుంబాల ఎదురుచూపులు

జాబ్ కేలండర్, నిరుద్యోగ భృతిపై నిరుద్యోగులు గంపెడాశలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాలు, ఉపాధి కోసం యువత ఎదురు చూస్తోంది. జాబ్ కేలండర్‌పై గంపెడాశలు పెట్టుకుంది. చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఇంటికో ఉద్యోగం వచ్చేంత వరకు 'నిరుద్యోగ భృతి'ఇవ్వాలని కోరుతోంది. అధికారంలోకి వచ్చి నెల దాటినా, నిరుద్యోగ భృతి గురించి మాట్లాడటం లేదని, ఎప్పటి నుంచి ఇస్తారో స్పష్టంగా చెప్పాలని ఆంధ్రప్రదేశ్‌లోని 1.60 కోట్ల కుటుంబాల్లోని యువత డిమాండ్ చేస్తోంది. 2014లో చంద్రబాబు ఇంటికొక ఉద్యోగం లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను నట్టేట ముంచారు. మరోసారి అలాంటి హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ప్రభుత్వం ఏర్పడి నెల రోజులైనా నిరుద్యోగ భృతిపై నోరు మెదపక పోవడం నిరుద్యోగులను ఆందోళనకు గురిచేస్తోంది. గతంలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు.. మళ్లీ బూటకపు హామీలతోనే ఇప్పుడు నాలుగోసారి అధికారంలోకి వచ్చారు. కానీ, ఆయన రాజకీయ జీవితంలో చెప్పింది చెప్పినట్లు ఏనాడు ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిన దాఖలాలు లేవు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం, హామీలను అమలు చేయడం ఆయన డిక్షనరీలోనే లేదు. ఇలాంటి పరిస్థితుల్లో భారీ సంఖ్యలో యువత ప్రభుత్వ కొలువులు వస్తాయని.. లేదంటే నిరుద్యోగ భృతి అందుతుందనే ఆశతో ఎదురు చూస్తోంది. చాలా మంది ప్రస్తుతం చేస్తున్న చిన్నా చితకా పనులు వదిలేసి.. స్టడీ సర్కిళ్లు, లైబ్రరీల బాట పడుతున్నారు. కుటుంబానికి ఆర్థిక భారంగా మారినప్పటికీ ప్రభుత్వం ఇచ్చే భృతితో ఎలాగోలా నెట్టుకు రావచ్చనే ఉద్దేశంతో పోటీ పరీక్షల్లో రాణించేందుకు ప్రణాళికలు వేసుకుంటున్నారు.

సూపర్ సిక్స్ టాప్‌లో భృతి

ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన తమ ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్‌లో నిరుద్యోగులకు పెద్ద పీట వేస్తున్నట్టు ప్రకటించారు. నిరుద్యోగులందరికీ ఉద్యోగాల కల్పనతో పాటు ఉద్యోగం వచ్చేంత వరకు ప్రతి ఒక్కరికీ నెలకు రూ.3 వేల భృతి ఇస్తామంటూ ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల దాటినప్పటికీ ఆ ఊసే ఎత్తట్లేదు. మెగా డీఎస్సీ పేరుతో నామమాత్రంగా ప్రకటించిన 16 వేల పోస్టుల భర్తీ కాస్తా నత్త నడకను తలపిస్తోంది. డిగ్రీ అర్హతతో ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్స్ పరీక్షలతో పాటు ఇంటర్మీడియట్, పదవ తరగతి అర్హతతో ప్రభుత్వ కొలువుల కోసం పోటీపడే వారు లక్షల్లో ఉన్నారు. వీరితో పాటు ప్రభుత్వ కొలువు సాధించేందుకు ఇంకా వయస్సు ఉండి.. ఆర్థిక తోడ్పాటు లేక పోటీ పరీక్షలను పక్కన పెట్టి ఊళ్లలో వ్యవసాయం, పట్టణాల్లో చిన్న చిన్న పనులు చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్న వారందరినీ కలుపుకుంటే దాదాపు ప్రతి ఇంటిలో ఒక నిరుద్యోగి కనిపిస్తున్న పరిస్థితి. ప్రభుత్వ కొలువుల కోసం కష్టపడి ఆగిపోయిన వారందరూ కూటమి ప్రభుత్వ నిరుద్యోగ భృతి హామీతో తిరిగి పోటీ పరీక్షల వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే ప్రభుత్వం ఈ హామీని అమలు చేయడంలో జాప్యం చేస్తుండటంతో నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో చేసినట్టే చేస్తారా?

గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 2014–19లో నెలకు రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి.. ఐదేళ్ల పబ్బం గడుపుకుని మొండి చెయ్యి చూపించారు. అప్పట్లో కూడా ఇంటికో ఉద్యోగం అని ఊదరగొట్టి నిరుద్యోగులను నట్టేట ముంచారు. నిరుద్యోగ భృతికి 2017–18లో రూ.500 కోట్లు కేటాయింపులు చేసినప్పటికీ, రూపాయి కూడా ఇవ్వలేకపోయారు. అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా ఒత్తిడి తేవడంతో ఎన్నికలకు ముందు యువ నేస్తం పేరుతో తూతూ మంత్రంగా డ్రామా నడిపించారు. విధివిధానాల రూపకల్పనకు మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి సవాలక్ష ఆంక్షలు విధించి నిరుద్యోగ భృతి ఇచ్చే వారి సంఖ్యను భారీగా కుదించారు. తొలుత 12 లక్షల మందికి పైగా నిరుద్యోగ భృతికి అర్హులుగా తేల్చగా.. ఆ తర్వాత పది లక్షలకు కుదించారు. మళ్లీ అందులో 2.10 లక్షల మందే అర్హులంటూ.. 1.62 లక్షల మందికే ఇస్తామని.. దీనికి ఈ–కేవైసీ లింక్ పెట్టి కేవలం వేల సంఖ్యలో మాత్రమే నిరుద్యోగ భృతి ఇచ్చి మమ అనిపించారు. గతంలో ఇలా నిరుద్యోగ భృతి హామీని నీరుగార్చి.. ఉద్యోగాలను భర్తీ చేయకపోగా ఆరోగ్య మిత్రలను, ఫీల్డ్ అసిస్టెంట్లను, గోపాల మిత్రలను ఉద్యోగాల నుంచి తొలగించారు. ఈ సారైనా నిరుద్యోగులు అందరికీ ఉద్యోగాలతో పాటు ఉద్యోగం వచ్చే వరకు భృతి ఇవ్వాలని నిరుద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.




ఉద్యోగాల కల్పన

చంద్రబాబు పాలనలో..	వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో..	
2014-19 మధ్య చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు 34,108	2019-24 మధ్య వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో శాశ్వత ఉద్యోగాలు 2,21,003	ఔట్ సోర్సింగ్, ఇతర ఉద్యోగాలు 3,73,695
మే 2019 నాటికి మొత్తం ఉద్యోగులు 3,97,128	కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగాలు 43,923	వైఎస్ జగన్ ప్రభుత్వం కల్పించిన మొత్తం ఉద్యోగాలు 6,38,621

'గంటా' ఆస్తుల వేలం!

రుణాలు ఎగ్గొట్టిన కేసులో టీడీపీ ఎమ్మెల్యేకు బ్యాంకు ఝలక్

- మొత్తం రూ.390 కోట్ల రికవరీకి చర్యలు
- ఇప్పటికే పలుమార్లు నోటీసులిచ్చిన ఇండియన్ బ్యాంకు
- అయినా స్పందించని గంటా, ఆయన బంధువులు
- ఆగస్టు 8న ఆస్తులు వేలం వేస్తామని బ్యాంకు ప్రకటన జారీ



సాక్షి, విశాఖపట్నం: మాజీమంత్రి, టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆయన బంధువులు రూ.వందల కోట్ల మేర రుణాలను ఎగ్గొట్టిన కేసులో వారికి అప్పులిచ్చిన ఇండియన్ బ్యాంకు ఆస్తుల వేలానికి ఉపక్రమించింది. రుణాలను వడ్డీతో సహా వసూలు చేసుకునేందుకు వరుసగా డిమాండ్ నోటీసులు జారీచేసినా గంటా బ్యాచ్ పట్టించుకోకపోవడంతో తనఖా పెట్టిన వాటిలో పలు ఆస్తులను ఇప్పటికే స్వాధీనం చేసుకున్న బ్యాంకు వాటి వేలానికి రంగం సిద్ధంచేసి అందుకు సంబంధించిన తేదీని తాజాగా ప్రకటించింది. గంటా రుణాల ఎగవేత కేసులకు సంబంధించిన వివరాలు ఏమిటంటే..

విశాఖపట్నం వన్‌టౌన్‌లోని లక్ష్మీటాకీస్ వద్ద ప్రత్యూష రిసోర్సెస్ అండ్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో మాన్యుఫ్యాక్చరింగ్, మిషనరీ అండ్ ఎక్విప్‌మెంట్ కార్యకలాపాల కోసం రిజిస్ట్రేషన్ నం.047165తో 2005 ఆగస్టు 18న రిజిస్టర్ అయ్యింది. రూ.500 కోట్ల ఆథరైజ్డ్ క్యాపిటల్, రూ.240.671 కోట్ల పెయిడ్ అప్ కాపిటల్‌తో ఈ సంస్థ ఏర్పడింది. కంపెనీలో యాక్టివ్ డైరెక్టర్లుగా గంటా తోడల్లుడైన పరుచూరి వెంకట భాస్కరరావు, ఆయన సోదరులు రాజారావు, వెంకయ్య, ప్రభాకరరావు ఉన్నారు. ఈ కంపెనీకి భీమిలి టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో పాటు కొండయ్య, బాలసుబ్రహ్మణ్యం, నార్నే అమూల్యలు హామీదారులుగా ఉన్నారు. కంపెనీ విస్తరణ పేరుతో డాబా గార్డెన్స్ శారదా వీధిలో ఉన్న ఇండియన్ బ్యాంకు నుంచి రుణాలు పొందారు. ఇవి పొందినప్పటి నుంచి ఒక్క వాయిదా కూడా చెల్లించలేదు. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి 29 నాటికి ఒక దఫా తీసుకున్న రుణం తాలుకా బకాయిలు అక్షరాలా రూ.390.58 కోట్లుగా బ్యాంకు అధికారులు లెక్కగట్టారు. మరో దఫా రుణానికి సంబంధించి వడ్డీతో కలిసి రూ.141.68 కోట్లు బకాయిలుగా పేరుకుపోయాయని ఇండియన్ బ్యాంకు జారీచేసిన నోటీసుల్లో పేర్కొంది.

నోటీసులిచ్చినా బేఖాతరు.. ఆస్తుల స్వాధీనం..

ఈ నేపథ్యంలో.. 2016 అక్టోబరు 4 నుంచి పలు దఫాలుగా బ్యాంకు అధికారులు నోటీసులు జారీచేసి వడ్డీతో సహా కలిపి బకాయిలు చెల్లించాలని కోరారు. అయినాసరే ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం.. మరోపక్క గడువు ముగియడంతో బ్యాంకు ఆస్తులు స్వాధీనం చేసుకోవడం మొదలుపెట్టింది. అయినప్పటికీ గంటా ముందుకు రాకపోవడం.. బకాయిలు చెల్లించకపోవడంతో మరోసారి ఏడు స్లాట్స్‌లో పూచీకత్తుగా పెట్టిన మరికొన్ని స్థలాల్ని స్వాధీనం చేసుకుంటున్నట్లు ఈ ఏడాది మార్చి 18న బ్యాంకు నోటీసులు జారీచేసింది. ప్రత్యూష కంపెనీకి చెందిన ఆస్తులు, కంపెనీ డైరెక్టర్లయిన పరుచూరి వెంకట భాస్కరరావు, రాజారావు, వెంకయ్య ప్రభాకరరావుల ఆస్తులతో పాటుగా కంపెనీకి హామీదారులుగా ఉన్న మంత్రి గంటా శ్రీనివాసరావు, కేబీ సుబ్రహ్మణ్యం, అమూల్య ఆస్తులను కూడా స్వాధీనం చేసుకోవడంతో పాటు మరికొన్ని ఆస్తుల వేలం వేస్తున్నట్లు బ్యాంకు ప్రకటన జారీచేసింది. కాగా, గతంలోనే బ్యాంకు కొన్ని ఆస్తులను వేలం వేయగా.. ఇప్పుడు రూ.390 కోట్ల రికవరీకి బ్యాంకు మరిన్ని ఆస్తుల వేలం ప్రకటన జారీచేసింది.

ఆగస్టు 8న ఈ–వేలం..

ఈ ప్రకటనలో.. పద్మనాభం మండలం ఐనద గ్రామం వద్ద ఉన్న సర్వేనెం.12లో వీరికి స్టార్ విలేజ్ పేరున వుడా లేఅవుట్‌లోని 5,326.54 చ.గజాల విస్తీర్ణంలో ఏడు స్లాట్స్‌లో ఉన్న 33 ప్లాట్లను స్వాధీనం చేసుకుంటున్నట్లు నోటీసుల్లో స్పష్టం చేసింది. వీటి విషయంలో ఎలాంటి లావాదేవీలు జరపడానికి వీల్లేదని, బ్యాంకు హెచ్చరిక జారీచేసింది. అదేవిధంగా రూ.390.58 కోట్ల బకాయిలు రాబట్టుకునేందుకు గతంలో స్వాధీనం చేసుకున్న స్థిరాస్తుల విక్రయానికి కూడా మార్చి 18న బ్యాంకు మరోసారి నోటీసులు జారీచేసింది. దీనికి సంబంధించిన వేలం ప్రక్రియ కూడా నిర్వహిస్తున్నట్లు పత్రికల్లో శనివారం ఇండియన్ బ్యాంకు ప్రకటనలిచ్చింది. మెస్సర్స్ ప్రత్యూష అసోసియేట్స్ పేరుతో నగరంలోని గంగులవారి వీధిలో ఉన్న 274.65 చ.గజాల వాణిజ్య భవనం వేలం వేస్తున్నట్లు ప్రకటించింది. దీనికి రిజర్వ్ ధరగా రూ.2.56 కోట్లుగా నిర్ణయించింది. దీంతో పాటు ద్వారకానగర్‌లోని అదే సంస్థ పేరుతో శ్రీశాంత కాంప్లెక్స్‌లో ఉన్న ప్లాట్ నం.138సీ లోని 2,500 చ.గజాల విస్తీర్ణంగల రెండు ప్లాట్లను వేలం వేస్తున్నట్లు ప్రకటించారు. వీటికి రిజర్వ్ ధరగా 1.26 కోట్లుగా నిర్ణయించారు. ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా.. ప్రాతిపదికన వేలంలో విక్రయిస్తామని బ్యాంకు వెల్లడించింది. ఆగస్టు 8వ తేదీన గంటా అండ్ కో ఆస్తుల ఈ–వేలం పాట జరుగుతుందని ఇండియన్ బ్యాంకు పేర్కొంది.

ముగ్గురి మాటే శాసనం

రిటైర్డ్ ఐపీఎస్‌ల గుప్పిట్లో పోలీసు శాఖ

- ఏబీవీ, ఆర్పీ ఠాకూర్, ఘట్టమనేని శ్రీనివాస్‌లే అసలు బాస్‌లు
- పోలీసు శాఖను వీరే నియంత్రిస్తారని చెప్పిన ముఖ్య నేత.. వీరి సర్వీసు అంతా అవినీతి, అక్రమాలు, వివాదాలే
- ఎస్సై నుంచి డీజీ వరకు వారి మాటే వేదం
- ఆ త్రయం ప్రాపకం దక్కితేనే పోస్టింగులు.. వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టాలి.. వేధించాలి
- మూటలు ఇవ్వాలి.. వారి మాటే వినాలి
- ఇవన్నీ చేస్తేనే పోస్టింగులు
- వారు సంతృప్తి చెందితేనే చిన బాబు, పెద్ద బాబు వద్దకు



వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మెట్రోకు మళ్లీ మోకాలడ్డు!

- వైజాగ్ మెట్రో ప్రాజెక్టుని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుయుక్తులు
- మరోసారి డీపీఆర్ తయారీకి సీఎం చంద్రబాబు ఆదేశాలు
- ఇప్పటికే కేంద్రానికి పంపిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- 76 కిలోమీటర్ల లైట్ మెట్రో కారిడార్ నిర్మాణానికి రూ.14,309 కోట్లు
- ఇప్పుడు కొత్త డీపీఆర్ పేరుతో టీడీపీ ప్రభుత్వం తాత్సారం
- ముందు అమరావతిలో మెట్రో రైలు తీసుకురావడమే లక్ష్యం
- ఇదయ్యేవరకు రాష్ట్రంలో ఎక్కడా మెట్రో లేనట్టే

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం వాసులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న మెట్రోపై మళ్లీ చంద్రబాబు నీలినీడలు కమ్ముకుంటున్నాయి. అభివృద్ధి అంతా ఒక్కచోటకే పరిమితం చేసేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ఆలోచనలు విశాఖ నగరాభివృద్ధికి ఆటంకంగా నిలుస్తున్నాయి. ముందు అమరావతికి మెట్రో రైలు వచ్చేవరకు రాష్ట్రంలో ఇంకెక్కడా మెట్రో ఉండకూడదన్న లక్ష్యంతో చంద్రబాబు ప్రభుత్వం అడుగులేస్తోంది. ఇందులో భాగంగానే వైజాగ్ మెట్రో ప్రాజెక్టు పనులకు అంతా సిద్ధమవుతున్న సమయంలో.. వాటిని మరింత ఆలస్యం చేసేందుకు మళ్లీ మొదటికి తీసుకొస్తోంది. ఇప్పటికే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి పంపింది. అయితే దీన్ని రద్దు చేసి కొత్త డీపీఆర్‌ను సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు మెట్రో అధికారులకు ఆదేశాలు జారీ చేయడం ఇందుకు నిదర్శనమని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చంద్రబాబుకి నచ్చలేదట..

రాష్ట్రంలోనే అతిపెద్ద నగరంగా, రాష్ట్ర ఆర్థిక రాజధానిగా ఉన్న విశాఖపట్నాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం ముందడుగు వేసింది. లైట్ మెట్రో ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసింది. 76 కిలోమీటర్ల మేర నాలుగు కారిడార్లతో నిర్మించనున్న తొలి విడత ప్రాజెక్టుకు రూ.14,309 కోట్లు వ్యయం అవుతుందని పేర్కొంటూ గతేడాది డిసెంబర్ 29న ఉత్తర్వులు సైతం జారీ చేసింది. పబ్లిక్ – ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో చేపట్టబోయే ఈ ప్రాజెక్టులో ప్రభుత్వాల వాటా 40 శాతం కాగా, టెండరు దక్కించుకున్న సంస్థ 60 శాతం భరించనున్నట్లు ఉత్తర్వుల్లో పొందుపరిచింది. జనవరిలో కేంద్ర ప్రభుత్వానికి డీపీఆర్‌ని కూడా పంపింది. అయితే.. కూటమి ప్రభుత్వం రావడంతో ఆలస్యం, అలసత్వం చోటు చేసుకుంటున్నాయి. విశాఖ అభివృద్ధి తమకు ఇష్టం లేదన్నట్టు చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలోనే పూర్తిస్థాయిలో మెట్రో డీపీఆర్ తయారు చేసినట్లు అధికారులు వివరించినా.. తనకు ఆ డీపీఆర్ నచ్చలేదని చంద్రబాబు చెప్పేశారు. మళ్లీ కొత్తగా డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆలస్యం, అలసత్వంతో వైజాగ్‌కు మెట్రో రాకుండా చేసేందుకే చంద్రబాబు ఈ తరహా ఆదేశాలు జారీ చేశారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముందు గన్నవరం నుంచి అమరావతి వరకు మెట్రో రైలు నిర్మించడమే చంద్రబాబు లక్ష్యమని తెలుస్తోంది. అది పూర్తయ్యే వరకూ రాష్ట్రంలో ఎక్కడా మెట్రో మాటే లేకుండా కుయుక్తులు పన్నుతున్నట్లు సమాచారం.



ఏదో వంక.. అటకెక్కించడం పక్కా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైజాగ్ మెట్రో ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు వడివడిగా అడుగులు వేసింది. విశాఖపట్నం భవిష్యత్తు అవసరాలు, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా.. మొత్తం 76.90 కి.మీ మేర లైట్‌మెట్రో ప్రాజెక్టుకు డీపీఆర్‌ను అధికారులు సిద్ధం చేశారు. దీన్ని కేబినెట్ కూడా ఆమోదించింది. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం(పీపీపీ)–వయబిలిటీ గ్యాప్ ఫండింగ్(వీజీఎఫ్) విధానంలో మెట్రో నిర్మించడానికి గత ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. మొత్తం ప్రాజెక్టు విలువ రూ.14,309 కోట్లు అవుతుందని.. ఇందులో ప్రభుత్వాలు రూ.5,723.6 కోట్లు భరించాల్సి ఉండగా ప్రైవేట్ డెవలపర్.. వీజీఎఫ్ కింద రూ.8,585.4 కోట్లు భరిస్తూ పనులు ప్రారంభించాలని నిర్ణయించింది. ప్రాజెక్టు టెండర్లు ఖరారైనప్పటి నుంచి మూడేళ్లకే తొలి మార్గంలో ప్రయాణికులకు మెట్రో సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కృతనిశ్చయంతో అడుగులు వేసింది. భవిష్యత్తులో విశాఖలో నిర్మించే ఫ్లైఓవర్లను కూడా దృష్టిలో పెట్టుకొని డీపీఆర్ డిజైన్లు సిద్ధం చేశారు. అయితే చంద్రబాబు.. మెట్రో ఫ్లైఓవర్ల ఎత్తు, వెడల్పులు సరిగా లేవని.. అందులో మార్పులు చేయాలని సూచించడం గమనార్హం. మెట్రో పిల్లర్ల ఎత్తు ఎలా పెంచాలి? ఏ ప్రాంతంలో ఫ్లైఓవర్ పొడవుగా ఉండాలి.. ఎక్కడ వెడల్పు తక్కువగా ఉండాలో నిపుణులకు క్లాస్ తీసుకున్నట్లు సమాచారం. ఇలా.. ఏదో ఒక వంకతో.. వైజాగ్ మెట్రో ప్రాజెక్టుని నెమ్మదిగా అటకెక్కించేందుకు కూటమి ప్రభుత్వం కుయుక్తులకు పాల్పడుతోంది. దేశంలోనే శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఒకటైన విశాఖని వెనక్కి నెట్టేందుకు కుట్రలు పన్నడంపై నగర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీపీఎస్ గెజిట్‌ను ఉపసంహరించుకోవాలి




రాజపత్ర నోటిఫికేషన్‌ను దహనం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

- పాత తేదీలతో రాజపత్రం జారీ దుర్మార్గం
- ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలను విస్మరించడం తగదు
- రాష్ట్ర ప్రభుత్వంపై యూటీఎఫ్ నేతల మండిపాటు.. గెజిట్ కాపీలు దహనం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

జగన్ వల్లే పెట్టుబడులు పైపైకి..





పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోనే మూడో స్థానం

సాక్షి, అమరావతి: మాజీ సీఎం వైఎస్ జగన్ తన హయాంలో కనబర్చిన ప్రత్యేక శ్రద్ధతో పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక గుర్తింపు సాధించింది. ఈ విషయంలో ఏపీ 2024 జనవరి నుంచి మార్చి వరకు 3 నెలల కాలంలో దేశంలోనే మూడో స్థానంలో నిలిచింది. ఈ సమయంలో రాష్ట్రంలోకి కొత్తగా 15 ప్రాజెక్టుల ద్వారా రూ.22,580 కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో వెల్లడించింది. ఇదే సమయంలో రూ.1,02,534 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉండగా.. రూ.36,329 కోట్ల పెట్టుబడులతో గుజరాత్ రెండో స్థానంలో నిలిచింది. ఇదే కాలంలో ఏపీలో కొత్తగా 14 యూనిట్ల ఉత్పత్తి ప్రారంభించడం ద్వారా రూ.1,049 కోట్ల పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వచ్చాయి.

నాటి సీఎం జగన్ ప్రత్యేక చొరవవల్లే

వాస్తవానికి.. నాటి సీఎం జగన్ ప్రత్యేక కృషితో ఏపీలో అనువైన వాతావరణం కల్పించడంవల్లే ఈ కాలంలో కొత్త పరిశ్రమలు రాష్ట్రం వైపు ఎక్కువగా మొగ్గు చూపాయి.ఏపీలో 4 పోర్టుల పనులు యుద్ధప్రాతిపదికన చేయించడం.. 10 ఇండస్ట్రియల్ నోడ్స్‌ను ప్రారంభించడం.. 10 ఫిషింగ్ హార్బర్ల పనులకు కూడా శ్రీకారం చుట్టడం.. ఎంఎస్ఎంఈలకు ఎన్నడూలేని విధంగా ప్రోత్సహించడం లాంటి అంశాలు ఏపీలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం ఏర్పడడానికి ప్రధాన కారణాలు. కేంద్రం సైతం ఇందుకు బలం చేకూరుస్తూ తన నివేదికల్లో ఏపీలో పరిశ్రమల ఏర్పాటును ప్రస్తావించింది.

ప్రపంచాన్ని కుదిపేసిన కోవిడ్ మహమ్మారి తర్వాత కాలంలో కొత్త పెట్టుబడులను ఆకర్షించడం, వాటిని వాస్తవ రూపంలోకి తీసుకురావడంలో ఆంధ్రప్రదేశ్ దూకుడు ప్రదర్శించింది. ఈ విపత్కర సమయంలో రాష్ట్రంలో ఒక్క పరిశ్రమ కూడా మూతపడకుండా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వారిని చేయిపట్టి నడిపించడంతో పాటు పరిశ్రమలకు గతంలో చంద్రబాబు సర్కారు ఎగ్గొట్టిన బకాయిలను చెల్లించడంతో పారిశ్రామికవేత్తలకు ఏపీపై నమ్మకం ఏర్పడింది. దీంతో 2022 నుంచి 2024 మార్చి వరకు అంటే 27 నెలల కాలంలో రాష్ట్రంలోకి పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చాయి. ఈ 27 నెలల కాలంలో రాష్ట్రంలోకి 120 సంస్థలు కొత్తగా పెట్టుబడులు పెట్టడానికి ఒప్పందాలు చేసుకున్నాయని, దీనికి సంబంధించి ఇండస్ట్రియల్ ఎంటర్‌ప్రెన్యూర్స్ మెమోరాండం (ఐఈఎం) పార్ట్–ఏను జారీచేసినట్లు డీపీఐఐటీ పేర్కొంది. ఈ 120 ఒప్పందాల ద్వారా రాష్ట్రంలోకి రూ.50,955 కోట్ల పెట్టుబడులు వచ్చాయి.

ఇదే సమయంలో కొత్తగా 112 యూనిట్లు ఉత్పత్తి ప్రారంభించడం ద్వారా రూ.62,069 కోట్ల పెట్టుబడులు వాస్తవరూపం దాల్చాయి. ఈ 112 సంస్థలు ఉత్పత్తి ప్రారంభించడంతో ఐఈఎం పార్ట్–బీని మంజూరుచేసినట్లు డీపీఐఐటీ ఆ నివేదికలో వెల్లడించింది.

ఇస్లాం వెలుగు



ప్రవక్త జీవితంలో ముఖ్య ఘట్టం

మొహర్రం

ఇస్లామీయ క్యాలండర్ ప్రకారం సంవత్సరంలోని మొదటి నెల 'మొహర్రం'. ప్రతి సంవత్సరం ఈ నెల వస్తూనే ముహమ్మద్ ప్రవక్త (స) వారి జీవితంలోని ఓ ముఖ్యమైన ఘట్టం మనసులో మెదులుతుంది. అదే 'హిజ్రత్'. (మక్కా నుండి మదీనాకు వలస). హిజ్రత్ తరువాతనే ధర్మానికి జవసత్వాలు చేకూరాయి. ధర్మం ఎల్లెడలా విస్తరించింది. ధర్మ పరిరక్షణ, మానవ సేవ, మానవులకు సత్య సందేశాన్ని అందించడం లాంటి మహత్తర ఆశయం కోసం కష్ట నష్టాలను సహించాల్సి వచ్చినా, చివరికి స్వదేశాన్ని విడిచి వలస వెళ్ళవలసి వచ్చినా వెనకాడ కూడదనే విషయాన్ని ముహర్రం ప్రతి సంవత్సరం విశ్వాసులకు గుర్తు చేస్తూ ఉంటుంది.

దేవుడు భూమ్యాకాశాలను సృష్టించిన నాటి నుండి నెలల సంఖ్య పన్నెండు మాత్రమే. వాటిలో నాలుగు పవిత్ర మాసాలు'. అందులో 'మొహర్రం' కూడా ఒకటి. ప్రవక్త(స) ప్రవచనం ప్రకారం: 'పన్నెండు నెలలు ఒక సంవత్సరం. అందులో నాలుగు నెలలు గౌరవప్రదమైనవి. జుల్ ఖ అద, జుల్ హిజ్జ, ముహర్రమ్, రజబ్. కనుక ఈ నెలలో ఎక్కువగా సత్కార్యాలు ఆచరిస్తూ పాపాలకు దూరంగా ఉండాలి. సమాజంలో సత్యం, న్యాయం, ధర్మం, మానవీయ విలువల పరిరక్షణకు కృషి చేయాలి. సమాజంలో ప్రబలిన అన్ని రకాల చెడులను రూపుమాపడానికి ప్రయత్నం చేయాలి. సతతం దైవ భీతి (తఖ్వా) తో గడపాలి. అప్పుడే దైవ సహాయం లభిస్తుంది. ఈ నెల ఘనతకు సంబంధించి ముహమ్మద్ ప్రవక్త(స) ఇలా అన్నారు. 'ముహర్రం అల్లాహ్ నెల. రమజాన్ ఉపవాసాల తరువాత శ్రేష్ఠమైన ఉపవాసాలు ముహర్రం ఉపవాసాలే.' (సహీహ్ ముస్లిం: 2755)

రమజాను ఉపవాసాలు ఫర్జ్ కాక ముందు ఆషూర (ముహర్రం పదవ తేది) ఉపవాసం విధిగా ఉండేది. అదే రోజు కాబాపై కొత్తవస్త్రం కప్పేవారు. ప్రవక్త మహనీయులు మదీనాకు వలస వెళ్ళిన తరువాత, అక్కడి యూదులు రోజా (ఉపవాసం) పాటించడం గమనించారు. అది ముహర్రం పదవ తేదీ. (యౌమె ఆషూరా) అప్పుడు ప్రవక్త వారు, 'ఏమిటి ఈరోజు విశేషం?' అని వారిని అడిగారు. దానికి వారు, 'ఇది



కాకతాళీయంగా 'కర్బలా' సంఘటన కూడా ఇదే రోజున జరగడం వల్ల దీని ప్రాముఖ్యత మరింతగా పెరిగిపోయింది. అంతమాత్రాన ముహర్రం నెలంతా విషాద దినాలుగా పరిగణించనక్కర లేదు. ఎందుకంటే సత్యం కోసం, న్యాయం కోసం, ధర్మం కోసం, విలువల కోసం, హక్కులకోసం, ఇస్లామీయ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం హజ్రత్ ఇమామె హుసైన్ (ర) అమరగతి పొందిన చారిత్రక రోజిది. అమరత్వం అనేది మానవ సహజ భావోద్రేకాల పరంగా బాధాకరం కావచ్చునేమోగాని, విషాదం ఎంతమాత్రం కాదు. 'కర్బలా' సాక్షిగా ఒక విశ్వాసి పోషించవలసిన పాత్రను ఆయన ఆచరణాత్మకంగా నిరూపించారు. అందుకే ఆ మహనీయుడు అమరుడై దాదాపు వేయిన్నర సంవత్సరాలు కావస్తున్నా, నేటికీ కోట్లాదిమంది ప్రజలకు, ప్రజాస్వామ్య ప్రియులకు ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలిచారు. అందుకే ప్రతియేటా 'మొహర్రం' నెలలో ఆయన త్యాగాన్ని ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజలు స్మరించుకుంటారు.

చాలా గొప్పరోజు. ఈ రోజే దైవం మూసా ప్రవక్త(అ) ను, ఆయన జాతిని ఫిరౌన్ బారి నుండి రక్షించాడు. అప్పుడు మూసా ప్రవక్త, దైవానికి కృతజ్ఞతగా రోజా పాటించారు. కనుక మేము కూడా ఆయన అనుసరణలో ఈ రోజు ఉపవాసం పాటిస్తాము'. అని చెప్పారు. అప్పుడు ప్రవక్తమహనీయులు, 'మూసా ప్రవక్త అనుసరణలో రోజా పాటించడానికి మీకంటే మేమే ఎక్కువ హక్కుదారులం' అని చెప్పి, తమ అనుచరులకు రోజా పాటించమని ఉపదేశించారు. ముహర్రం మాసం 9, 10 లేదా 10, 11 కాని రెండురోజులు రోజా (ఉపవాసం) పాటించాలి.

ఆషూరా ఉపవాసం పాటించడం వల్ల గత సంవత్సరకాలం పాపాలు మన్నించబడతాయని కూడా ఆయన సెలవిచ్చారు. (సహీహ్ ముస్లిం 1162).

మొహర్రం నెల ప్రాముఖ్యం, హజ్రత్ ఇమామె హుసైన్ (ర) అమరత్వం మామూలు విషయం కాదు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ, ధర్మసంస్థాపన, దైవప్రసన్నతే ధ్యేయంగా సాగిన సమరంలో హజ్రత్ ఇమామె హుసైన్, ఆయన పరివారం వీరమరణం పొందారు. అందుకని ఆయన ఏ లక్ష్యం కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడి అమరుడయ్యారో మనం దాని నుంచి ప్రేరణ పొందాలి. సమాజంలో దుర్మార్గం ప్రబలినప్పుడు, ఉన్మాదం జడలు విప్పినప్పుడు, విలువల హననం జరుగుతున్నప్పుడు, సమాజ శ్రేయోభిలాషులు, న్యాయప్రేమికులు, పౌరసమాజం తక్షణం స్పందించాలి. న్యాయం కోసం, ధర్మం కోసం, మానవీయ విలువల కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం శక్తివంచన లేకుండా పోరాడాలి. ఇదే ఇమామె హుసైన్ అమరత్వం మనకిస్తున్న సందేశం.

(17, బుధవారం మొహర్రం - యౌమె ఆషూరా)

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

ధర్మ జిజ్ఞాస

క్రైస్తవ్యం చెప్పే యుగాంతం

పరిశుద్ధ గ్రంథంలో యుగాంతం గురించిన ప్రస్తావన విరివిగానే కనిపిస్తుంది. దీనిని యేసు ప్రభువు రెండవ రాకడ, ప్రభువు దినం, యుగసమాప్తి, కడవరి దినాలు, అంత్యకాలంగా పేర్కొనడం జరిగింది. ప్రారంభంలో ఈ సృష్టిని చేసిన దేవుడు చివరిగా మానవులను సృజించాడు.



బైబిల్‌లో మొదటి గ్రంథమైన ఆదికాండంలో రాసి ఉన్నట్లుగా నరులు భూమ్మీద విస్తరించే సమయంలోనే మానవులపై దేవుడికి ఎంతో కోపం వచ్చినట్లుగా గమనిస్తాం. కారణం వారు దేవుని మార్గాన్ని విడిచారు. చీకటి మార్గాలు, సాతాను మార్గాలు వెదకడం ప్రారంభించారు. నరుల చెడుతనం భూమిమీద బహుగా విస్తరించడం వారి హృదయ తలంపులు, ఊహలన్నీ చెడ్డవిగా ఉండటం దేవుడు గమనించి, భూమి అంతా బలత్కారంతో నిండబడి ఉండటం దేవునికి సంతాపాన్ని కలుగజేసింది. ఫలితంగా నీతిమంతుడైన ఒక్క నోవహు కుటుంబాన్ని సకల పశుపక్ష్యాదులు, జంతువులను రెండేసి చొప్పున ఓ ప్రత్యేక ఓడ ద్వారా రక్షించి మిగతా మానవులందరినీ మహాజల ప్రళయం ద్వారా నశింప చేసినట్లుగా చూస్తాం. నోవహు సంఘటన క్రీస్తుపూర్వం సుమారు 2,400 సంవత్సరాల క్రితం జరిగినట్లుగా బైబిల్ పండితులు చెబుతుంటారు.

మరల భూమి మీద పాపం విస్తరించినప్పుడు రెండువేల సంవత్సరాల క్రితం దేవుడే యేసుక్రీస్తు రూపంలో నరరూపుధారుడై ఈ భూమ్మీదకి వచ్చాడు.. పాపుల రక్షణార్థమై సిలువమీద మరణించాడు. 3వ రోజున పునరుత్థానుడై పరలోకానికి వెళ్ళాడు. యేసుక్రీస్తు తన బోధల్లో ఈ భూమి అంతం గురించి చాలా స్పష్టంగా తెలియ చేశాడు. త్వరలోనే యుగసమాప్తి ఉంటుందని పాపపు జీవితాన్ని వదిలివేసి దేవుని నమ్ముకొని మారుమనస్సు పొంది దేవుడిచ్చే ఉచిత రక్షణను స్వీకరించడం ద్వారా పరలోకానికి వారసులవుతారని, పాపులందరి కోసం నరకం సిద్ధంగా ఉందని చెప్పాడు. యుగసమాప్తి సమయంలో దీనిని యేసుక్రీస్తు మరల రెండవసారి భూమ్మీదకు వస్తాడు. ఆ తర్వాత అంతం ఉంటుంది. దీనిని యేసు ద్వితీయ ఆగమనంగా, క్రీస్తు రెండవ రాకడగా పిలుస్తారు. అయితే ఈ రెండవ రాకడ ఎప్పుడు వస్తుంది? దానికి సూచనలేంటి అని శిష్యులు ఏసుప్రభువును అడిగినప్పుడు యుద్ధాలను గూర్చిన సమాచారం ఎక్కువగా వింటారని, జనాలమీదికి జనం, రాజ్యంమీదికి రాజ్యం లేస్తాయని, కరువులు, భూకంపాలు కలుగుతాయి. భూమ్మీద దేవుని బిడ్డలకు మహాశ్రమ వేదన కలుగుతుందని, మనుష్యుల్లో ఒకరిపట్ల ఒకరికి ద్వేషం పెరుగుతుందని, అక్రమం విస్తరించి మనుషుల్లో ప్రేమ చల్లారుతుందని, అలాగే యుగసమాప్తంలో సూర్యుడు వెలుగు ఇవ్వడని, చంద్రుడు కాంతి కోల్పోతాడని, ఆకాశం నుండి నక్షత్రాలు రాలతాయని, తుదకు క్రీస్తు మహా ప్రభావంతో భూమ్మీదకు వస్తాడని పేర్కొన్నాడు. అయితే ఆయన రాకడ అందరికీ తెలిసే విధంగా ఉండక అకస్మాత్తుగా దొంగ వచ్చినట్లు ఉంటుందని, అందుకే దేవుని భయం కలిగి పరిశుద్ధ జీవితం కలిగి జాగరూకతతో జీవించాలని యేసు చెప్పాడు. అంత్యదినాలలో అపాయకరమైన దినాలు వస్తాయని భక్తుడైన పౌలు చెప్పాడు. మనుష్యులు స్వార్థ ప్రియులు, ధనాపేక్షులు, అబద్ధాలాడే వారు అవిధేయులు, కృతజ్ఞత లేని వారు, అపవిత్రులు, తల్లిదండ్రులను గౌరవించని వారు, అనురాగ రహితులు, అతిద్వేషులు, అపవాదకులు, అజితేంద్రియులు, క్రూరులు, సజ్జనద్వేషులు, మూర్ఖులు, గర్వాంధులు, దేవుని కంటే సుఖానుభవం ఎక్కువగా కోరేవారుగా ఉంటారని పౌలు భక్తుడు చెప్పాడు.

అయితే యేసు చెప్పిన రెండవ రాకడ గురుతులు చాలా ఇప్పటికే జరిగాయని, ప్రస్తుత సమాజం చూసినా అది బహిర్గతమౌతుందని, యేసు రాకడ త్వరలో ఉందని దైవజనులు చెపుతున్నారు. ఏ దినమైనా ఏ సమయంలోనైనా ఈ యుగ సమాప్తి జరగవచ్చని, అందుకు సిద్ధంగా ఉండాలని బోధిస్తున్నారు.

"అంత్యకాలంలో జరిగే విషయాలన్నీ బైబిల్‌లోని ప్రకటన గ్రంథంలో వివరంగా రాయబడ్డాయి. ఆయా కాలాలలో దేవుడు తన భక్తులకు భూమి అంతం గురించి తెలియజేస్తూనే ఉన్నాడు. అంతిమంగా ఈ భూమ్మీద జన్మించిన ప్రతిమనిషి దేవుని తీర్పును ఎదుర్కొంటాడని. దేవుని నమ్ముకున్న వారు. భూమ్మీద పాపం లేకుండా పవిత్రంగా జీవించిన వారు మాత్రమే దేవునితో సదాకాలం జీవించడానికి పరలోకానికి కొనిపోబడతారు. అక్రమంగా జీవించిన వాళ్ళంతా నిత్య నరకాగ్నిలో నిరంతరం వేదన అనుభవిస్తూ జీవిస్తారు."

– బందెల స్టెర్జి రాజన్

సినిమా

స్పెషల్ ట్రైనింగ్?



గౌతమ్, మహేశ్‌బాబు

మహేశ్‌బాబు హీరోగా నటించిన చిత్రం 'వన్: నేనొక్కడినే' (2014). ఈ సినిమాలో మహేశ్‌బాబు చిన్న నాటి సన్నివేశాల్లో ఆయన తనయుడు గౌతమ్ ఘట్టమనేని నటించారు. చైల్డ్ ఆర్టిస్టుగా గౌతమ్‌కి ఇదే తొలి మూవీ. అయితే 'వన్: నేనొక్కడినే' తర్వాత గౌతమ్‌ను స్క్రీన్‌పై చూడాలని మహేశ్ అభిమానులు ఎంతగానో ఆశపడుతున్నారు. అయితే ఇందుకు తగ్గ పక్కా ప్రణాళికను మహేశ్ రెడీ చేస్తున్నారట. ఇటీవల ప్లస్ టూ గ్రాడ్యుయేషన్‌ను విదేశాల్లో పూర్తి చేశాడు గౌతమ్. అయితే విదేశాల్లో కాలేజ్ స్టడీస్ చేసే సమయంలోనే యాక్టింగ్ కోర్సులో కూడా గౌతమ్ జాయిన్ అయ్యేలా మహేశ్ బాబు ఏర్పాట్లు చేస్తున్నారట. ఇందుకోసం ప్రముఖ యాక్టింగ్ ఇన్‌స్టిట్యూషన్స్ వివరాలను సేకరించే పనిలో ఉన్నారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. గౌతమ్‌ను యాక్టింగ్ కోర్సులో జాయిన్ చేసే ఆలోచనలో మహేశ్‌బాబు ఉన్నారంటే భవిష్యత్తులో గౌతమ్ హీరోగా చేస్తారని ఆశిస్తున్నారు మహేశ్‌బాబు ఫ్యాన్స్. కాగా ఈ విషయాలపై పూర్తి సమాచారం అందాల్సి ఉంది. ఇదిలా ఉంటే.. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. సెప్టెంబరులో ఈ సినిమా చిత్రీకరణ స్టార్ట్ కానున్నట్లు తెలిసింది.

నాదనాథుడి ఉగ్రరూపం



శరత్ కుమార్

మంచు విష్ణు కలల ప్రాజెక్టుగా రూపొందుతోన్న చిత్రం 'కన్నప్ప'. 'మహాభారత్' సిరీస్ ఫేమ్ ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. అవా ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్‌లపై మంచు మోహన్ బాబు నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న ఈ మూవీలో ప్రభాస్, మోహన్ బాబు, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం, ప్రీతి ముకుందన్, కాజల్ అగర్వాల్ వంటి వారు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. కాగా ఆదివారం (జూలై 14) శరత్ కుమార్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఈ మూవీలో ఆయన నటిస్తున్న నాదనాథుడి పాత్ర పోస్టర్‌ను రిలీజ్ చేశారు. రెండు చేతుల్లో కత్తులు పట్టుకుని ఉగ్రరూపంలో ఉన్న ఓ యోధుడిలా కనిపిస్తున్నారు శరత్ కుమార్. "శివ భక్తుడైన కన్నప్ప కథను 'కన్నప్ప'గా తెరపైకి తీసుకొస్తున్నాం. ఇటీవల విడుదల చేసిన టీజర్‌తో ఈ సినిమాపై మరింత బజ్ ఏర్పడింది. ఇందులోని యాక్షన్ సీక్వెన్స్, విజువల్స్ గురించి అందరూ మాట్లాడుతున్నారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ఈ మూవీని గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు న్నాం" అని చిత్ర యూనిట్ పేర్కొంది.

కాంబినేషన్ రిపీట్?



రవితేజ

'పవర్' మూవీ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రవితేజ హీరోగా బాబీ (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'పవర్'. 2014లో విడుదలైన ఈ మూవీ ప్రేక్షకులను మెప్పించింది. అయితే రవితేజ, బాబీల కాంబినేషన్ మళ్లీ రిపీట్ కానుందనే టాక్ ఫిల్మ్ నగర్‌లో వినిపిస్తోంది. రవితేజ కోసం ఓ పవర్‌ఫుల్ కథను రెడీ చేస్తున్నారట బాబీ. త్వరలోనే రవితేజకి ఫైనల్ నెరేషన్ ఇవ్వనున్నారట దర్శకుడు. అన్నీ కుదిరితే వీరి కాంబినేషన్‌లో మరో సినిమా సెట్ అవుతుందని టాలీవుడ్ టాక్. అంతేకాదు.. ఈ సినిమాని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించనున్నారని భోగట్టా. ఈ సంగతి ఇలా ఉంచితే... చిరంజీవి హీరోగా బాబీ దర్శకత్వంలో రూపొందిన 'వాల్తేరు వీరయ్య' సినిమాలోనూ రవితేజ ఓ కీలక పాత్ర చేశారు. ఈ చిత్రం ఈ ఏడాది సంక్రాంతికి విడుదలై హిట్ మూవీగా నిలిచిన సంగతి తెలిసిందే.

పవర్‌ఫుల్ సినిమాలో...



మీతా రఘునాథ్

సిద్ధార్థ్ హీరోగా '8 తొట్టక్కల్' ఫేమ్ శ్రీగణేష్ దర్శకత్వంలో ఓ ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. శాంతి టాకీస్‌పై 'మావీరన్' ఫేమ్ అరుణ్ విశ్వ నిర్మించనున్నారు. సిద్ధార్థ్ కెరీర్‌లోని ఈ 40వ సినిమా చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం కానుంది. తాజాగా ఈ మూవీలో నటి దేవయాని, నటుడు శరత్ కుమార్, 'గుడ్‌నైట్' సినిమా ఫేమ్ మీతా రఘునాథ్, కన్నడ నటి చైత్ర ఆచార్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించనున్నట్లు చిత్రయూనిట్ ఆదివారం అధికారికంగా ప్రకటించింది. "దర్శకుడు గణేష్ ఓ పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌ను రెడీ చేశారు. భారీ బడ్జెట్, అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ మూవీ నిర్మించనున్నాం. త్వరలోనే పూర్తి వివరాలను వెల్లడిస్తాం" అని చిత్రయూనిట్ పేర్కొంది.



దేవయాని

అప్పుడు సినిమాలకు గుడ్‌బై చెబుతా!



దుషారా విజయన్

'దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి' అన్నది సామెత. ఈ విషయంలో చాలామంది నటీనటులు ఎప్పుడూ ముందుంటారు. క్రేజ్ ఉన్నప్పుడే వరుస సినిమాలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తుంటారు. లీడ్ రోల్ దశ దాటాక కొందరు తారలు క్యారెక్టర్ ఆర్టిస్టులుగా చేస్తుంటారు. అయితే ఈ విషయంలో తన రూటే సపరేటు అంటున్నారు హీరోయిన్ దుషారా విజయన్. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా చేయరట. ఎందుకంటే ముప్పై ఐదేళ్ల తర్వాత సినిమాలకు గుడ్ బై చెబుతాననంటున్నారామె. 'బోద్దై ఏరి బుద్ధి మారి' (2019) సినిమా ద్వారా తమిళ ఇండస్ట్రీకి పరిచయం అయ్యారు దుషారా. పా. రంజిత్ దర్శకత్వం వహించిన 'సార్పట్ట పరంబరై' మూవీతో ఆమెకు మంచి గుర్తింపు రావడంతో వరుస అవకాశాలు వచ్చాయి. ప్రస్తుతం రజనీకాంత్ 'వేట్టయాన్', విక్రమ్ 'వీర ధీర శూరన్', ధనుష్ 'రాయన్' సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు దుషారా. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ– "నాకు ముప్పై ఐదేళ్లు వచ్చాక నటనకు స్వస్తి పలుకుతాను. ఆ తర్వాత విదేశాలన్నీ చుట్టేయాలనుకుంటున్నాను. నేను చూడని దేశమంటూ ఉండకూడదు. అలా ప్లాన్ చేసుకుంటున్నాను" అన్నారు.

దుబాయ్‌లో మ్యూజిక్ సిట్టింగ్స్



రత్నవేలు, ఏఆర్ రెహమాన్, బుచ్చిబాబు

రామ్‌చరణ్ హీరోగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సాన దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ పతాకాలపై వెంకట సతీష్ కిలారు ఈ సినిమా నిర్మించనున్నారు. ఉత్తరాంధ్ర నేపథ్యంతో సాగే ఈ స్పోర్ట్స్ డ్రామాలో రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేయనున్నారని, ఈ చిత్రానికి 'పెద్ది' అనే టైటిల్‌ను చిత్రయూనిట్ పరిశీలిస్తోందన్న టాక్ ఫిల్మ్‌ఇండస్ట్రీలో వినిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ చిత్ర సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్, కెమెరామేన్ రత్నవేలుతో చర్చలు జరుపుతున్నారు దర్శకుడు బుచ్చిబాబు. దుబాయ్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో వీరి చర్చలు సాగుతున్నాయి. వీలైనంత త్వరగా ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌ను పూర్తి చేసి, సెప్టెంబరులో సినిమాను స్టార్ట్ చేయాలని చిత్రయూనిట్ భావిస్తోందని సమాచారం.

హారర్ కామెడీ



శివ నాయుడు

ప్రదీప్ రెడ్డి, శివ నాయుడు, గోవా జ్యోతి ముఖ్య తారలుగా నటించిన హారర్ కామెడీ మూవీ 'యజ్ఞ'. చిత్తజల్లు ప్రసాద్ దర్శకుడు. సుభాష్ రావు సమర్పణలో ఆర్ఆర్ మూవీ క్రియేషన్స్, రేణుక ఎల్లమ్మ ఫిలింస్‌పై చిలుకోటి రఘురాం, చీలపల్లి విఠల్ గౌడ్ నిర్మించిన ఈ సినిమా త్వరలోనే రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ వేడుకలో శివనాయుడు మాట్లాడుతూ– "మా మూవీ ప్రేక్షకులకు ఫుల్ మీల్స్‌లా ఉంటుంది" అన్నారు. "'యజ్ఞ' ని పూర్తి చేయడానికి పెద్ద యజ్ఞమే చేశాం. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం" అన్నారు చిత్తజల్లు ప్రసాద్. "ఆడియన్స్‌కి నచ్చేలా మా సినిమా తెరకెక్కించాం" అన్నారు నిర్మాతలు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు ప్రతాని రామకృష్ణ గౌడ్, సాయివెంకట్, బసిరెడ్డి, గోవా జ్యోతి మాట్లాడారు. ఈ సినిమాకు సంగీతం: లక్ష్మణ సాయి.

మహిళల గొప్పతనంతో...



ఆదిత్య భాస్కర్, గౌరీ కిషన్

గౌరీ కిషన్, ఆదిత్య భాస్కర్, కలై అరసన్, అమ్ము అభిరామి, శాండీ, సోఫియా, జనని, సుభాష్ ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'హాట్ స్పాట్'. విఘ్నేష్ కార్తీక్ దర్శకత్వం వహించారు. మోజ్విత్, మొవిహాన్ సమర్పణలో అనీల్ రెడ్డి ఎం, మునిచంద్రా రెడ్డి యస్, ఇందు కుమార్ యం నిర్మించారు. కాగా ఈ మూవీ ఈ నెల 17 నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుందని మేకర్స్ ప్రకటించారు. "మంచి కథ.. సరికొత్త పాయింట్‌తో 'హాట్ స్పాట్' తీశాం. మహిళల గొప్పతనంతో పాటు నేటి సమాజానికి అద్దం పట్టేలా ఈ మూవీ ఉంటుంది. ఈ చిత్ర కథ అందరి జీవితాలకు కనెక్ట్ అవుతుంది" అని చిత్ర యూనిట్ పేర్కొంది.

ఎలా బయటపడ్డారు!



రవికృష్ణ

"ఐదుగురు చిన్ననాటి స్నేహితుల్లో పుట్టినరోజు నాడు జరిగిన ఓ ఘటనలో ఒకడు చనిపోతాడు. ఆ తర్వాత ఎదురైన పరిస్థితులను నలుగురు ఫ్రెండ్స్ ఎలా ఎదుర్కొన్నారు? పోలీసుల నుంచి ఎలా తప్పించుకున్నారు? ఆ కేసు నుంచి ఎలా బయటపడ్డారు? అనేది 'ది బర్త్‌డే బాయ్' మూవీలో చాలా ఆసక్తిగా ఉంటుంది" అని నటుడు రవికృష్ణ అన్నారు. రాజీవ్ కనకాల, రవికృష్ణ, సమీర్ మల్లా ముఖ్యపాత్రల్లో నటించిన చిత్రం 'ది బర్త్‌డే బాయ్'. విస్కీ దర్శకత్వంలో బొమ్మా బొరుస పతాకంపై ఐ.భరత్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ–"విరూపాక్ష' సినిమా చేస్తున్న సమయంలోనే 'ది బర్త్‌డే బాయ్' అవకాశం వచ్చింది. 48 గంటల్లో జరిగే కథ ఇది. నేను సీరియల్స్ చేసినా, బిగ్‌బాస్ రియాలిటీ షోలో పాల్గొన్నా అప్పటి పరిస్థితులను బట్టి చేశాను. అయితే నా లక్ష్యం సినిమాల్లో నటించడమే. 'విరూపాక్ష' తర్వాత సినిమాల్లో మంచి అవకాశాలు వస్తున్నాయి. ప్రస్తుతం 'ఏ1 ఏ2 ఏ3' అనే సినిమాలో హీరోగా చేస్తున్నాను. విజయ్ దేవరకొండ, సాయి ధరమ్ తేజ్‌గార్ల సినిమాల్లో నటిస్తున్నాను" అన్నారు.



గైక్వాడ్ చికిత్సకు రూ. 1 కోటి ఇవ్వనున్న బీసీసీఐ

భారత మాజీ క్రికెటర్, టీమిండియా మాజీ కోచ్ అన్షుమన్ గైక్వాడ్‌ను ఆదుకుంటామని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శి జై షా తెలిపారు. బ్లడ్ క్యాన్సర్‌తో బాధ పడుతున్న గైక్వాడ్ ప్రస్తుతం లండన్‌లో చికిత్స తీసుకుంటున్నారు. గైక్వాడ్ చికిత్స కోసం తక్షణమే రూ. 1 కోటి విడుదల చేస్తామని బీసీసీఐ ప్రకటించింది. 71 ఏళ్ల అన్షుమన్ గైక్వాడ్ 1975 నుంచి 1987 వరకు భారత జట్టు తరఫున 40 టెస్టులు, 15 వన్డేలు ఆడారు. 1997 నుంచి 1999 వరకు భారత జట్టుకు కోచ్‌గా కూడా పనిచేశారు.

ప్రిక్వార్టర్ ఫైనల్లో అనాహత్ సింగ్

ప్రపంచ జూనియర్ స్క్వాష్ చాంపియన్‌షిప్ బాలికల సింగిల్స్‌లో భారత రైజింగ్ స్టార్, జాతీయ చాంపియన్ అనాహత్ సింగ్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. అమెరికాలో జరుగుతున్న ఈ మెగా టోర్నీలో మూడో రౌండ్‌లో అనాహత్ సింగ్ 11-7, 12-10, 11-6తో సమంతా జాఫీ (అమెరికా)పై గెలిచింది. బాలుర సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్ శౌర్య బావా కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. మూడో రౌండ్‌లో శౌర్య 4-11, 11-7, 12-10, 11-6తో రస్టిన్ వైజర్ (అమెరికా)పై నెగ్గాడు.



భారత 'ఎ' జట్టులో షబ్నమ్, యశశ్రీ



షబ్నమ్



యశశ్రీ

ముంబై: వచ్చే నెలలో ఆస్ట్రేలియాలో ఆస్ట్రేలియా 'ఎ' మహిళల క్రికెట్ జట్టుతో సిరీస్‌లో పాల్గొనే భారత 'ఎ' జట్టును ప్రకటించారు. 18 మంది సభ్యులతో కూడిన భారత 'ఎ' జట్టుకు కేరళకు చెందిన ఆఫ్ స్పిన్నర్ మిన్ను మణి కెప్టెన్‌గా వ్యవహరిస్తుంది. ఆంధ్రప్రదేశ్ పేస్ బౌలర్ షబ్నమ్ షకీల్, హైదరాబాద్ అమ్మాయి సొప్పదండి యశశ్రీలకు కూడా భారత 'ఎ' జట్టులో చోటు లభించింది. ఆగస్టు 7 నుంచి 25 వరకు జరిగే ఈ సిరీస్‌లో ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో టీమిండియా మూడు టి20లు, మూడు వన్డేలు, ఒక నాలుగు రోజుల మ్యాచ్ ఆడుతుంది.

భారత 'ఎ' జట్టు: మిన్ను మణి (కెప్టెన్), శ్వేత సెహ్రావత్ (వైస్ కెప్టెన్), ప్రియా పూనియా, శుభ సతీశ్, తేజల్ హసబ్నీస్, కిరణ్ నవ్‌గిరే, సజన, ఉమా చెత్రి, శిప్రా గిరి, రాఘవి బిష్ట్, సైకా ఇషాక్, మన్నత్ కశ్యప్, తనుజా కన్వర్, ప్రియా మిశ్రా, మేఘన సింగ్, సయాలీ సట్గరే, షబ్నమ్ షకీల్, యశశ్రీ.

ఉరుగ్వేకు మూడో స్థానం



చార్లోట్ (అమెరికా): కోపా అమెరికా కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో మాజీ చాంపియన్ ఉరుగ్వే జట్టు మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఆదివారం జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో ఉరుగ్వే 'షూటౌట్'లో 4-3 గోల్స్ తేడాతో కెనడా జట్టును ఓడించింది. నిర్ణీత సమయం ముగిశాక రెండు జట్లు 2-2తో సమంగా ఉండటంతో విజేతను నిర్ణయించేందుకు 'షూటౌట్'ను నిర్వహించారు. రెగ్యులర్ టైమ్‌లో కెనడా తరఫున ఇస్మాయిల్ కోన్ (20వ ని.లో), జొనాథన్ డేవిడ్ (80వ ని.లో)... ఉరుగ్వే తరఫున రోడ్రిగో బెన్‌టాన్‌కర్ కోల్మన్ (8వ ని.లో), లూయిస్ స్వారెజ్ (90+2వ ని.లో) ఒక్కో గోల్ చేశారు.



4-1తో ముగించారు

చివరి టి20లోనూ భారత జట్టుదే గెలుపు

మెరిసిన సంజూ సామ్సన్, ముకేశ్ కుమార్ ● 42 పరుగులతో ఓడిన జింబాబ్వే

హరారే: మరోసారి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన భారత జట్టు జింబాబ్వే పర్యటనను ఘనవిజయంతో ముగించింది. ఆదివారం జరిగిన చివరిదైన ఐదో టి20 మ్యాచ్‌లో టీమిండియా 42 పరుగుల తేడాతో జింబాబ్వేను ఓడించింది. వరుసగా నాలుగో గెలుపుతో భారత బృందం సిరీస్‌ను 4-1తో సొంతం చేసుకుంది. కెప్టెన్ హోదాలో శుబ్‌మన్ గిల్ భారత్‌కు తొలి సిరీస్‌ను అందించాడు. ఈ మ్యాచ్‌కంటే ముందే సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత జట్టు ఆఖరి మ్యాచ్‌లోనూ ఆధిపత్యం కనబరిచింది. జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 167 పరుగులు సాధించింది. సంజూ సామ్సన్ (45 బంతుల్లో 58; 1 ఫోర్, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో అలరించాడు. అనంతరం జింబాబ్వే 18.3 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. 26 పరుగులు చేయడంతోపాటు రెండు వికెట్లు పడగొట్టిన శివమ్ దూబేకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. 8 వికెట్లు తీయడంతోపాటు 28 పరుగులు చేసిన వాషింగ్టన్ సుందర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు దక్కింది.

సిక్స్‌తో మొదలు...

భారత్ ఇన్నింగ్స్ వరుసగా రెండు సిక్స్‌లతో మొదలైంది. సికందర్ రజా వేసిన తొలి బంతినే యశస్వి జైస్వాల్ (5 బంతుల్లో 12; 2 సిక్స్‌లు) సిక్స్‌గా మలిచాడు. ఇది నోబాల్ కూడా కావడంతో భారత్ ఖాతాలో తొలి బంతికే ఏడు పరుగులు చేరాయి. రెండో బంతిపై కూడా జైస్వాల్ సిక్స్ కొట్టాడు. అయితే మరో రెండు బంతుల తర్వాత జైస్వాల్ బౌల్డ్ అవ్వడంతో భారత్ తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత మూడో ఓవర్లో అభిషేక్ ఒక సిక్స్ కొట్టగా... గిల్ రెండు ఫోర్లు బాదాడు. ముజరబాని వేసిన నాలుగో ఓవర్లో అభిషేక్ (11 బంతుల్లో 14; 1 సిక్స్), ఎన్‌గరావా వేసిన ఐదో ఓవర్లో గిల్ (14 బంతుల్లో 13; 2 ఫోర్లు) అవుటయ్యారు. దాంతో భారత్ ఐదు ఓవర్లు ముగిసేసరికి 40/3తో ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో సంజూ సామ్సన్, రియాన్ పరాగ్ (24 బంతుల్లో 22; 1 సిక్స్) జాగ్రత్తగా ఆడి నాలుగో వికెట్‌కు 65 పరుగులు జోడించారు. ఈ క్రమంలో సామ్సన్ 39 బంతుల్లో తన అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. పరాగ్ పెవిలియన్ చేరుకున్నాక వచ్చిన శివమ్ దూబే (12 బంతుల్లో 26; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడటంతో భారత స్కోరు 150 దాటింది. 168 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే ఒకదశలో 85/3తో పటిష్టంగా కనిపించింది. అయితే మైర్స్ (32 బంతుల్లో 34; 4 ఫోర్లు, 1 సిక్స్) అవుటయ్యాకజింబాబ్వే తడబడింది. తొమ్మిది పరుగుల తేడాలో నాలుగు వికెట్లు కోల్పోయి విజయంపై ఆశలు వదులుకుంది.

5 ఇప్పటి వరకు భారత జట్టు ఐదు మ్యాచ్‌లతో కూడిన ఏడు టి20 ద్వైపాక్షిక సిరీస్‌లను ఆడింది. ఇందులో ఐదు సిరీస్‌లను (2020లో న్యూజిలాండ్‌పై; 2021లో ఇంగ్లండ్‌పై; 2022లో వెస్టిండీస్‌పై; 2023లో ఆస్ట్రేలియాపై, 2024లో జింబాబ్వేపై) భారత్ దక్కించుకుంది. ఒక సిరీస్‌ను (2023లో వెస్టిండీస్ చేతిలో) కోల్పోయి, మరో సిరీస్‌ను (2022లో దక్షిణాఫ్రికాతో) సమంగా ముగించింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (బి) సికందర్ రజా 12; శుబ్‌మన్ గిల్ (సి) సికందర్ రజా (బి) ఎన్‌గరావా 13; అభిషేక్ శర్మ (సి) మందాడె (బి) ముజరబాని 14; సంజూ సామ్సన్ (సి) మరుమాని (బి) ముజరబాని 58; రియాన్ పరాగ్ (సి) ఎన్‌గరావా (బి) మవూటా 22; శివమ్ దూబే (రనౌట్) 26; రింకూ సింగ్ (నాటౌట్) 11; వాషింగ్టన్ సుందర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 167. వికెట్ల పతనం:** 1-13, 2-38, 3-40, 4-105, 5-135, 6-153. **బౌలింగ్:** సికందర్ రజా 4-0-37-1, ఎన్‌గరావా 4-0-29-1, ఫరాజ్ అక్రమ్ 4-0-39-0, ముజరబాని 4-0-19-2, మవూటా 4-0-39-1.

జింబాబ్వే ఇన్నింగ్స్: మధెవెరె (బి) ముకేశ్ 0; మరుమాని (ఎల్బీడబ్ల్యూ) (బి) సుందర్ 27; బెనెట్ (సి) దూబే (బి) ముకేశ్ 10; మైర్స్ (సి) అభిషేక్ (బి) దూబే 34; సికందర్ రజా (రనౌట్) 8; క్యాంప్‌బెల్ (సి) తుషార్ (బి) దూబే 4; మదాండె (సి) సామ్సన్ (బి) అభిషేక్ శర్మ 1; ఫరాజ్ అక్రమ్ (సి) సామ్సన్ (బి) ముకేశ్ 27; మవూటా (సి అండ్ బి) తుషార్ దేశ్‌పాండే 4; ముజరబాని (నాటౌట్) 1; ఎన్‌గరావా (బి) ముకేశ్ 0; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (18.3 ఓవర్లలో ఆలౌట్) 125. వికెట్ల పతనం:** 1-1, 2-15, 3-59, 4-85, 5-87, 6-90, 7-94, 8-120, 9-123, 10-125. **బౌలింగ్:** ముకేశ్ 3.3-0-22-4, తుషార్ దేశ్‌పాండే 3-0-25-1, రవి బిష్ణోయ్ 3-0-23-0, వాషింగ్టన్ సుందర్ 2-0-7-1, అభిషేక్ శర్మ 3-0-20-1, శివమ్ దూబే 4-0-25-2.

'కింగ్' అల్‌కరాజ్

● వరుసగా రెండో ఏడాది వింబుల్డన్ పురుషుల సింగిల్స్ టైటిల్ కైవసం
● ఫైనల్లో ఏడుసార్లు చాంపియన్ జొకోవిచ్‌పై అలవోక విజయం
● రూ. 29 కోట్ల 23 లక్షల ప్రైజ్‌మనీ సొంతం చేసుకున్న స్పెయిన్ స్టార్

లండన్: పురుషుల టెన్నిస్‌లో కార్లోస్ అల్‌కరాజ్ శకం మొదలైంది! 21 ఏళ్ల ఈ స్పెయిన్ స్టార్ వరుసగా రెండో ఏడాది వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను గెల్చుకున్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో మూడో సీడ్ అల్‌కరాజ్ 2 గంటల 27 నిమిషాల్లో 6-2, 6-2, 7-6 (7/4)తో రెండో సీడ్, 24 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ విజేత జొకోవిచ్ (సెర్బియా)పై గెలిచాడు. విజేత అల్‌కరాజ్‌కు 27 లక్షల పౌండ్ల (రూ. 29 కోట్ల 23 లక్షలు) ప్రైజ్‌మనీ... రన్నరప్ జొకోవిచ్‌కు 14 లక్షల పౌండ్ల (రూ. 15 కోట్ల 15 లక్షలు) ప్రైజ్‌మనీ లభించాయి. అల్‌కరాజ్ కెరీర్‌లో ఇది నాలుగో గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్. అతను 2022లో యూఎస్ ఓపెన్, 2023లో వింబుల్డన్, 2024లో ఫ్రెంచ్, వింబుల్డన్ టోర్నీలను సాధించాడు.

బ్రేక్ పాయింట్‌తో మొదలు...

గత ఏడాది ఐదు సెట్ల పోరులో జొకోవిచ్‌ను ఓడించిన అల్‌కరాజ్ ఈసారి తొలి పాయింట్ నుంచే ఆధిపత్యం కనబరిచాడు. తొలి సెట్‌లో 14 నిమిషాలపాటు జరిగిన తొలి గేమ్‌లోనే జొకోవిచ్ సర్వీస్‌ను అల్‌కరాజ్ బ్రేక్ చేశాడు. ఆ తర్వాత ఐదో గేమ్‌లో జొకోవిచ్ సర్వీస్‌ను రెండోసారి బ్రేక్ చేసిన అల్‌కరాజ్ అదే జోరులో 41 నిమిషాల్లో తొలి సెట్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో సెట్‌లో తొలి గేమ్‌లో, ఏడో గేమ్‌లో జొకోవిచ్ సర్వీస్‌లను బ్రేక్ చేసిన అల్‌కరాజ్ 34 నిమిషాల్లో సెట్ నెగ్గాడు. మూడో సెట్‌లోని తొమ్మిదో గేమ్‌లో జొకోవిచ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన అల్‌కరాజ్ పదో గేమ్‌లోని తన సర్వీస్‌లో 40-0తో మూడు మ్యాచ్ పాయింట్లను సాధించాడు. అయితే ఈ మూడు మ్యాచ్ పాయింట్లను జొకోవిచ్ కాపాడుకొని గట్టెక్కాడు. ఆ తర్వాత ఇద్దరూ తమ సర్వీస్‌లను కాపాడుకోవడంతో టైబ్రేక్ అనివార్యమైంది. టైబ్రేక్‌లో అల్‌కరాజ్ పైచేయి సాధించి జొకోవిచ్ ఆట కట్టించాడు.



6 ఓపెన్ శకంలో ఒకే ఏడాది ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ టోర్నీ టైటిల్స్ సాధించిన ఆరో ప్లేయర్ అల్‌కరాజ్. గతంలో రాడ్ లేవర్ (ఆస్ట్రేలియా: 1969లో), జాన్ బోర్గ్ (స్వీడన్: 1978, 1979, 1980లలో), రాఫెల్ నాదల్ (స్పెయిన్: 2008, 2010లలో), ఫెడరర్ (స్విట్జర్లాండ్: 2009లో), జొకోవిచ్ (సెర్బియా: 2021లో) ఈ ఘనత సాధించారు.

ఫైనల్ మ్యాచ్ గణాంకాలు

అల్‌కరాజ్		జొకోవిచ్
5	ఏస్‌లు	8
6	డబుల్ ఫాల్ట్‌లు	4
16/22	నెట్ పాయింట్లు	27/53
5/14	బ్రేక్ పాయింట్లు	1/3
42	విన్నర్స్	26
24	అనవసర తప్పిదాలు	25
109	మొత్తం పాయింట్లు	87

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ నేవీలో 10+2 (బీటెక్) క్యాడెట్ ఎంట్రీ స్కీమ్

ఇండియన్ నేవీ.. ఎగ్జిక్యూటివ్, టెక్నికల్ బ్రాంచ్‌ల్లో 10+2(బీటెక్) క్యాడెట్ ఎంట్రీ స్కీమ్ కింద నాలుగేళ్ల బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. కేరళ రాష్ట్రం ఎజిమలలోని ఇండియన్ నేవల్ అకాడమీలో శిక్షణ ఉంటుంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 40 (మహిళలకు 08 పోస్టులు).
» **బ్రాంచ్:** ఎగ్జిక్యూటివ్, టెక్నికల్. -కోర్సు ప్రారంభం: 2025 జనవరిలో;
» **అర్హత:** కనీసం 70 శాతం మార్కులతో సీనియర్ సెకండరీ పరీక్ష (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్) ఉత్తీర్ణతతో పాటు జేఈఈ (మెయిన్స్) 2024 పరీక్షలో ర్యాంక్ సాధించి ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:** 02.07.2005 నుంచి 01.01.2008 మధ్య జన్మించిన వారై ఉండాలి.
» **ఎంపిక విధానం:** జేఈఈ (మెయిన్) 2024 ర్యాంక్, పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 06.07.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.07.2024
» **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

ఇండియన్ బ్యాంక్, చెన్నైలో 1500 అప్రెంటిస్‌లు

చెన్నైలోని ఇండియన్ బ్యాంక్ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంక్ శాఖల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 1500
» **కేటగిరీల వారీగా ఖాళీలు:** ఎస్సీ-255,ఎస్టీ-77, ఓబీసీ-351,ఈడబ్ల్యూఎస్-137,యూఆర్-680
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 01.07.2024 నాటికి 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» **శిక్షణ వ్యవధి:** 12 నెలలు.
» **స్టైపెండ్:** నెలకు మెట్రో/అర్బన్ శాఖల్లో రూ.15,000, రూరల్/సెమీ అర్బన్ శాఖల్లో రూ.12,000.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ రాతపరీక్ష, లోకల్ లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్, సర్టిఫికేట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** ఆన్‌లైన్ విధానంలో పరీక్ష జరుగుతుంది. రీజనింగ్ ఆప్టిట్యూడ్ అండ్ కంప్యూటర్ నాలెడ్జ్(25 ప్రశ్నలు-25 మార్కులు), జనరల్ ఇంగ్లిష్(25 ప్రశ్నలు-25 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(25 ప్రశ్నలు-25 మార్కులు), జనరల్ ఫైనాన్షియల్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు-25 మార్కులు). పరీక్ష వ్యవధి 60 నిమిషాలు.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** విజయవాడ/గుంటూరు, విశాఖపట్నం, కర్నూలు, విజయనగరం, హైదరాబాద్/సికింద్రాబాద్, ఖమ్మం, కరీంనగర్, వరంగల్.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 10.07.2024
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 31.07.2024.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 10.07.2024 నుంచి 31.07.2024 వరకు
» **వెబ్‌సైట్:** https://www.indianbank.in

ఎయిమ్స్ దియోఘర్‌లో 94 సీనియర్ రెసిడెంట్ పోస్టులు

దియోఘర్ (జార్ఖండ్)లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్).. వివిధ విభాగాల్లో సీనియర్ రెసిడెంట్ (నాన్ అకడమిక్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 94.
» **వేతనం:** నెలకు రూ.67,700.
» **విభాగాలు:** అనెస్థీషియాలజీ-క్రిటికల్ కేర్, అనాటమీ, బయోకెమిస్ట్రీ, బర్న్-ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజీ, కార్డియోథొరాసిక్-వాస్కులర్ సర్జరీ, కమ్యూనిటీ-ఫ్యామిలీ మెడిసిన్, డెంటల్ సర్జరీ, డెర్మటాలజీ-వెనిరియాలజీ, ఎండోక్రైనాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, గ్యాస్ట్రోఎంటరాలజీ, గ్యాస్ట్రోఇంటెస్టినల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, మైక్రోబయాలజీ, మెడికల్ ఆంకాలజీ, నియోనెటాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, న్యూక్లియర్ మెడిసిన్, ఆబ్‌స్టెట్రిక్స్-గైనకాలజీ, ఆప్తల్మాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్లు సడలింపు ఉంటుంది.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రిజిస్ట్రార్ ఆఫీస్, ఫోర్త్ ఫ్లోర్, ఎయిమ్స్, దేవిపూర్(అకడమిక్ బ్లాక్), డియోఘర్ -814152(జార్ఖండ్) చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** ప్రకటన వెలువడిన 15 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** www.aiimsdeoghar.edu.in

క్లర్క్ కొలువుల పిలుపు

బ్యాంకు ఉద్యోగార్థులకు శుభవార్త! ఐబీపీఎస్.. వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 6,128 క్లర్క్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. పదకొండు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో.. క్లరికల్ కేడర్‌లో కొలువుదీరే అవకాశం లభిస్తుంది. వీటికి డిగ్రీ అర్హతతోనే పోటీ పడొచ్చు. ఈ నేపథ్యంలో.. ఐబీపీఎస్ క్లర్క్స్ సీఆర్‌పీ-14 ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 6,128 క్లర్క్ పోస్టులు
» ఐబీపీఎస్ ఆధ్వర్యంలో నియామక ప్రక్రియ
» రెండు దశల రాత పరీక్షలో ప్రతిభతో కొలువు

మొత్తం 6,128 పోస్టులు

ఐబీపీఎస్ తాజాగా విడుదల చేసిన సీఆర్‌పీ క్లర్క్స్-14 ప్రక్రియ ద్వారా మొత్తం పదకొండు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 6,128 క్లర్క్ పోస్టల నియామకం చేపట్టనున్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంకు, ఐఓబీ, యూకో బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఇండియన్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకుల్లో ఈ ఖాళీలు ఉన్నాయి. సదరు బ్యాంకులకు సంబంధించి ఏపీలో 105 పోస్టులు, తెలంగాణలో 104 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- 2024, జూలై 21 నాటికి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. దీంతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి. స్కూల్/కాలేజ్ స్థాయిలో కంప్యూటర్/ఐటీ ఒక సబ్జెక్ట్‌గా చదివుండాలి.
- వయసు: జూలై 1, 2024 నాటికి 20-28 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు.

రెండు దశల ఎంపిక ప్రక్రియ

ఐబీపీఎస్ సీఆర్‌పీ ఫర్ రిక్రూట్‌మెంట్ ఆఫ్ క్లర్క్ ఎంపిక ప్రక్రియ మొత్తం రెండు దశల్లో జరుగుతుంది. అవి.. ప్రిలిమినరీ రాత పరీక్ష; మెయిన్ రాత పరీక్ష. తొలుత అభ్యర్థులకు ప్రిలిమినరీ రాత పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా.. ఐబీపీఎస్ నిర్దేశించిన కటాఫ్ జాబితాలో నిలిచిన వారికి తదుపరి దశలో మెయిన్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. మెయిన్స్ పరీక్షలోనూ విజయం సాధించి.. తుది జాబితాలో నిలిస్తే క్లర్క్ కొలువు ఖాయమవుతుంది.

తొలి దశ ప్రిలిమినరీ

ఐబీపీఎస్ క్లర్క్స్ నియామక ప్రక్రియలోని తొలి దశ ప్రిలిమినరీ పరీక్ష.. మూడు విభాగాల్లో ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు-30 మార్కులు, న్యూమరికల్ ఎబిలిటీ 35 ప్రశ్నలు-35 మార్కులు, రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు-35 మార్కులు.. ఇలా మొత్తం 100 ప్రశ్నలు-100 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం 60 నిమిషాలు.

మెయిన్స్ పరీక్ష విధానం

తొలిదశ ప్రిలిమినరీ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా పోస్టల సంఖ్యను అనుసరించి మెరిట్ లిస్ట్‌ను రూపొందిస్తారు. ఆ మెరిట్ లిస్ట్‌లో నిలిచిన వారు మెయిన్స్ ఎగ్జామినేషన్‌కు హాజరవ్వాల్సి ఉంటుంది. మెయిన్స్ ఎగ్జామినేషన్ నాలుగు విభాగాల్లో నిర్వహిస్తారు. జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు-50 మార్కులు, జనరల్ ఇంగ్లిష్ 40 ప్రశ్నలు-40 మార్కులు, రీజనింగ్ ఎబిలిటీ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ 50 ప్రశ్నలు-60 మార్కులు, -క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 50 ప్రశ్నలు-50 మార్కులు.. ఇలా 190 ప్రశ్నలు-200 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం 2 గంటల 40 నిమిషాలు.



ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, జూలై 21
- ప్రిలిమినరీ పరీక్ష హాల్ టిక్కెట్ల డౌన్‌లోడ్: 2024, ఆగస్ట్‌లో
- ఆన్‌లైన్ ప్రిలిమినరీ ఎగ్జామ్ తేదీలు: 2024, ఆగస్ట్‌లో
- మెయిన్ ఎగ్జామినేషన్ తేదీ: 2024,అక్టోబర్‌లో
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.ibps.in/index.php/clerical-cadre-xiv

రాత పరీక్షలో రాణించేలా

ఐబీపీఎస్ క్లర్క్ నియామక పరీక్షకు సంబంధించి అభ్యర్థులు ముందుగా స్వీయ సమయ ప్రణాళికను రూపొందించుకోవాలి. నోటిఫికేషన్‌లో నిర్దిష్టంగా తేదీని ప్రకటించనప్పటికీ.. ఆగస్ట్‌లో ప్రిలిమినరీ పరీక్ష, అక్టోబర్‌లో మెయిన్ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. అంటే.. ఇప్పటి నుంచి ప్రిలిమ్స్‌కు రెండు నెలలు, మెయిన్స్‌కు మూడు నెలల సమయం అందుబాటులో ఉంది. దీనికి అనుగుణంగా.. టైమ్ ప్లాన్‌ను రూపొందించుకుని ప్రిపరేషన్‌కు ఉపక్రమించాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో ఇడియమ్స్, సెంటెన్స్ కరెక్షన్, వొకాబ్యులరీ, సెంటెన్స్ రీ అరేంజ్‌మెంట్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూట్స్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. గ్రామర్‌కే పరిమితం కాకుండా.. జనరల్ ఇంగ్లిష్ నైపుణ్యం పెంచుకోవాలి. ఇందుకోసం ఇంగ్లిష్ దినపత్రికలు చదవడం,వాటిలో వినియోగిస్తున్న పదజాలం,వాక్య నిర్మాణం వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

ఉమ్మడి వ్యూహం

ప్రిలిమ్స్, మెయిన్స్ విధానంలో జరిగే ఐబీపీఎస్ క్లర్క్స్ పరీక్షలో.. మూడు విభాగాలు (ఇంగ్లిష్ లాంగ్వేజ్, రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్/న్యూమరికల్ ఎబిలిటీ) ఉంటాయి. ప్రిలిమ్స్‌లో అడిగే ప్రశ్నల క్లిష్టత స్థాయి కొంత తక్కువగా, మెయిన్స్ క్లిష్టత స్థాయి కొంత ఎక్కువగా ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు ఈ మూడు విభాగాలకు సంబంధించి మొదటి నుంచే మెయిన్స్ దృక్పథంతో అధ్యయనం సాగించాలి.

న్యూమరికల్ ఎబిలిటీ

దీన్ని మెయిన్స్‌లో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌కు సరితూగే విభాగంగా పేర్కొనొచ్చు. విద్యార్థులు ప్రధానంగా అర్థమెటిక్ అంశాల(పర్సంటేజెస్, నిష్పత్తులు, లాభ-నష్టాలు, నంబర్ సిరీస్, బాడ్‌మాస్ నియమాలు)పై పూర్తిగా అవగాహన పొందేలా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు గత పరీక్షలు, వెయిటేజీ కోణంలో డేటా ఇంటర్‌ప్రిటేషన్, డేటా అనాలిసిస్‌లపై ప్రత్యేక దృక్పథంతో ప్రిపరేషన్ కొనసాగించాలి.

రీజనింగ్

ఇది కూడా రెండు పరీక్షల్లో (ప్రిలిమ్స్, మెయిన్స్) ఉంటుంది. ఇందులో మంచి మార్కుల సాధనకు కోడింగ్-డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, డైరెక్షన్, సిలాజిజమ్ విభాగాలను బాగా ప్రాక్టీస్ చేయాలి.

ప్రిలిమ్స్‌తోపాటే మెయిన్స్

ప్రిలిమ్స్ ప్రిపరేషన్‌తోపాటే మెయిన్స్‌లో అదనంగా ఉండే జనరల్ అవేర్‌నెస్, ఫైనాన్షియల్ అవేర్‌నెస్, కంప్యూటర్ నాలెడ్జ్ అంశాల ప్రిపరేషన్ కూడా సాగించాలి. ప్రిలిమ్స్ పూర్తయ్యాక వీటిపై దృష్టి పెట్టాలనుకునే ఆలోచన సరికాదు. సమయాభావం సమస్య కూడా తలెత్తుతుంది. ఎందుకంటే.. ప్రిలిమ్స్ ఆఖరి స్లాట్ పరీక్ష ముగిసిన తర్వాత మెయిన్ ఎగ్జామినేషన్‌కు అందుబాటులో ఉండే సమయం తక్కువగా ఉంటుంది. ఈ సమయంలో మెయిన్స్‌లో అదనంగా ఉండే రెండు విభాగాలకు ప్రిపరేషన్ పూర్తి చేయడం కష్టమవుతుంది.

జనరల్ అవేర్‌నెస్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్

ఈ విభాగంలో బ్యాంకింగ్ రంగం పరిణామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. నోటిఫికేషన్‌లో విత్ స్పెషల్ రిఫరెన్స్ టు బ్యాంకింగ్ అని స్పష్టంగా పేర్కొన్నారు. కాబట్టి బ్యాంకింగ్ రంగంలోని అబ్రివేషన్లు, పదజాలం, విధులు, బ్యాంకులకు సంబంధించిన కొత్త విధానాలు, కోర్ బ్యాంకింగ్‌కు సంబంధించి చట్టాలు, విధానాలు, రిజర్వ్ బ్యాంకు విధులు వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. జనరల్ అవేర్‌నెస్‌లో కరెంట్ అఫైర్స్, స్టాక్ జనరల్ నాలెడ్జ్ కోణంలోనూ ఆర్థిక సంబంధ వ్యవహారాల (ఎకానమీ, ప్రభుత్వ పథకాలు)కు ప్రాధాన్యం ఇవ్వాలి.

కంప్యూటర్ ఆప్టిట్యూడ్

మెయిన్ ఎగ్జామినేషన్‌లో మూడో విభాగంలో ఒక సబ్జెక్ట్‌గా ఉన్న కంప్యూటర్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించి కంప్యూటర్ ఆపరేషన్ సిస్టమ్స్, కంప్యూటర్ స్ట్రక్చర్, ఇంటర్నెట్ సంబంధిత అంశాలు, పదజాలంపై దృష్టి పెట్టాలి. కీబోర్డ్ షాట్ కట్స్,కంప్యూటర్ హార్డ్‌వేర్ సంబంధిత అంశాలు(సీపీయూ, మానిటర్,హార్డ్‌డిస్క్ తదితర)గురించి తెలుసుకోవాలి.

గ్రాండ్, మోడల్ టెస్ట్‌లకు ప్రాధాన్యం

ప్రిలిమ్స్ ముగిసిన తర్వాత మెయిన్స్‌కు అందుబాటులో ఉండే వ్యవధిలో అభ్యర్థులు మెయిన్స్ గ్రాండ్ టెస్ట్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి రోజు ఒక గ్రాండ్ టెస్ట్ రాసే విధంగా వ్యవహరించాలి. మెయిన్స్‌లోని అదనపు అంశాలకు లభిస్తున్న వెయిటేజీని గుర్తించి ఆమేరకు ప్రిపరేషన్ సాగించాలి. వెయిటేజీ కొంచెం తక్కువగా ఉందని భావిస్తే పెద్దగా ఆందోళన చెందకుండా.. అప్పటికే పట్టు సాధించిన అంశాల్లో మరింత నైపుణ్యం సాధించే విధంగా ముందుకు సాగాలి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
622	186
80,519	24,502

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	18,398	▲	115
డోజోన్స్	40,001	▲	247
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,253	▲	30
డాక్స్	18,748	▲	214
షాంఘై	2,971	▲	1
నికాయ్	41,191	▼	1,033

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.14	84.07
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.69	108.26
€	యూరో	ఎస్‌బీఐ	89.29	91.65
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	51.47	52.60
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.42	57.36
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.50	64.16
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.35	22.92
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.85	23.63
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.36	12.44

అద్దిల్లా..? సొంతిల్లా..?



- ఒకే చోట ఉండేవారికి సొంతిల్లు అనుకూలం
- రుణం తీసుకుని ఈఎంఐ కట్టుకుంటే స్థిరాస్తి
- దీని విలువ దీర్ఘకాలంలో పెరిగేదే
- ఇంటి రుణంపై పన్ను ప్రయోజనాలు
- తరచూ ఉద్యోగాలు మారితే అద్దె ఇల్లు అనుకూలం



చాలా మంది తేల్చుకోలేని అంశం.. అద్దె ఇంట్లో ఉండడం నయమా? లేక సొంతిల్లు సమకూర్చుకోవడం బెటరా? అని. ఈ రెండింటిలో ఆర్థికంగా ఏది లాభదాయకమో నిపుణులను అడిగితే చెబుతారు. కానీ, ఇల్లు అన్నది భావోద్వేగాలు, సామాజిక గుర్తింపు, మానసిక ప్రశాంతత తదితర ఎన్నో అంశాలతో ముడిపడి ఉంటుంది. అద్దె ఇల్లు ఆర్థిక భారం లేనిది. సొంతిల్లు ఆర్థిక బాధ్యతను తెచ్చిపెడుతుంది. ఒకటి రెండు నెలల అడ్వాన్స్ ఉంటే నిమిషాల్లో అద్దె ఇంట్లో దిగిపోవచ్చు. కానీ, సొంతింట్లో కుడి కాలు మోపాలంటే భారీ మొత్తం కావాలి. లేదంటే బ్యాంక్ తలుపు తట్టాలి. అద్దె ఇంట్లో మనకు నచ్చకపోయినా, ఇంటి యజమానికి గిట్టకపోయినా మరో గూడు వెతుక్కోవాల్సిందే. సొంతింట్లో ఎవరికి వారే రారాజు. ఇలా నాణేనికి రెండువైపులా లాభనష్టాలున్నాయి. తమకు ఏది అనుకూలమో ఎవరికి వారు తేల్చుకోవాల్సిందే. ఈ దిశగా అవగాహన కల్పించి, సులువుగా నిర్ణయం తీసుకోవ దానికి దారి చూపించేదే ఈ వారం 'ప్రాఫిట్ ప్లస్' కథనం.

– సాక్షి, బిజినెస్ డెస్క్

ఆర్థిక కోణం...

ఇంటి విషయంలో ముందుగా తమ ప్రాధాన్యతలు ఏంటన్నవి ముఖ్యం. మెట్రో నగరాల్లో ఇంటి ధరలు చూస్తే చుక్కల్లో కనబడుతున్నాయి. కనుక అక్కడ సొంతిల్లు చాలా మందికి సాధ్యపడకపోవచ్చు. అలాంటి చోట అద్దె ఇల్లే ఆర్థికంగా సౌకర్యం. ఇంటి కొనుగోలుతో పోలిస్తే అద్దె తక్కువగా ఉంటుంది. ఇంటి కొనుగోలుకు సరిపడా ఆర్థిక స్థోమత ఉన్న వారి విషయంలో అంత గందరగోళం అక్కర్లేదు. వృత్తి/ఉద్యోగ/వ్యాపార రీత్యా తరచూ ప్రాంతాలు మారే అవసరం లేకపోతే నిశ్చింతగా సొంతింటికి మొగ్గు చూపొచ్చు. కానీ, నగరాలు, పట్టణాల్లో రుణంపై ఇంటిని సమకూర్చుకోవాలని భావించే వారు అక్కడి రెంటల్ ఈల్డ్స్ (ప్రాపర్టీ విలువపై అద్దె రాబడి), ప్రాపర్టీ విలువ పెరుగుదల శాతం ఏ మేరకు ఉంది, తదితర అంశాలను తప్పకుండా పరిగణనలోకి తీసుకోవాలి. మన దేశంలోని చాలా పట్టణాల్లో రుణంపై ఇల్లు కొనుగోలు చేసి చెల్లించే ఈఎంఐతో పోల్చితే.. చాలా తక్కువకే అద్దె ఇల్లు వచ్చేస్తుంది. పట్టణాల్లో ఇంటిని కొనుగోలు చేయడం మంచి ఆప్షనే. కాలం గడిచే కొద్దీ దాని విలువ పెరుగుతూ వెళ్తుంది. కానీ, దాన్ని సమకూర్చుకునేందుకు సరిపడా పెట్టుబడి కావాలి. పెట్టుబడి కోసం అయితే కొత్తగా అభివృద్ధిలోకి వస్తున్న నగర, పట్టణ శివారు ప్రాంతాల్లో ఇల్లు కొనుగోలు చేసుకోవడం వల్ల.. తక్కువ కాలంలోనే ఎక్కువ విలువ సమకూరుతుంది.

ఏమిటి మార్గం?

అద్దిల్లు, సొంతిల్లు విషయంలో ప్రతి ఒక్కరి ఆలోచన, అవసరాలు వేర్వేరుగా ఉంటాయి. కొందరు ఆర్థిక ప్రయోజనానికే పెద్ద పీట వేస్తే.. కొందరు సామాజిక గుర్తింపునకు, స్థిరాస్తి సమకూర్చుకోవడానికి ప్రాధాన్యమిస్తుంటారు. ఇంటిని పెట్టుబడిగా చూసే వారూ ఉన్నారు. తమ ప్రస్తుత ఆదాయ స్థితిగతులు, ప్రాంతం, ఉద్యోగం/వృత్తి/వ్యాపారం ఇలా ఎన్నో అంశాల ఆధారంగా అనుకూలమైన నిర్ణయం తీసుకోవాలి. ముఖ్యంగా రుణానికి చెల్లింపులు చేయగల ఆర్థిక వెసులుబాటు ఉండడం తప్పనిసరి. చివరిగా.. సొంతిల్లుతో ఉండే అనుబంధం ఏ ఆర్థిక సూత్రం కూడా తెచ్చివ్వలేదన్నది వాస్తవం!

అద్దె రాబడి తక్కువ...

మన దేశంలో ఇంటిపై సగటు రాబడి 2.9 శాతంగా ఉంది. ప్రపంచంలో ఇక్కడే తక్కువ. అదే యూఎస్, కెనడా, దుబాయిలోని పట్టణాల్లో ఇంటిపై అద్దె రాబడి 5–6 శాతంగా ఉంది. అద్దె రాబడి 4 శాతాన్ని మించినప్పుడు రుణంపై ఇంటిని కొనుగోలు చేసుకోవడం అత్యుత్తమమని ఆర్థిక గణాంకాలు చెబుతున్నాయి. మీరు ఉండాలనుకుంటున్న ప్రాంతంలో ప్రస్తుత రెంటల్ ఈల్డ్ (అద్దెకు ఇస్తే వచ్చే రాబడి) (ప్రాపర్టీ విలువతో పోలిస్తే చెల్లించే అద్దె రేటు), ఏటా ఎంత చొప్పున పెరుగుతుందన్నది తెలుసుకోవాలి. వీటి ఆధారంగా అద్దె/ఈఎంఐ రేషియో ఎంతో తేల్చుకోవాలి. రియల్ ఎస్టేట్ పరిశోధనా సంస్థ 'లైసస్ ఫోరాస్' ఇందుకు సంబంధించి విలువైన గణాంకాలు రూపొందించింది. దీని ప్రకారం 100 శాతం అంతకంటే తక్కువ నిష్పత్తి ఉన్న పట్టణాల్లో అద్దె ఇంట్లో ఉండడమే లాభం. ఈ రేషియో 100 దాటిన చోట సొంతిల్లు సమకూర్చుకోవడం లాభం.

	విశాఖపట్నం	భువనేశ్వర్, పట్నా	ముంబై, హైదరాబాద్	కోచి, లక్నో	పుణె, గోవా	ఇండోర్, బెంగళూరు	వడోదర
ప్రస్తుత రెంటల్ ఈల్డ్	2	2.3	2.5	2.9	3.3	3.6	4
ఏటా 5 శాతం పెరిగితే రెంట్/ఈఎంఐ రేషియో	57	64	70	81	91	99	109
ఏటా 6 శాతం పెరిగితే	61	68	75	86	97	106	117
7 శాతం పెరిగితే	65	73	80	92	104	113	125
8 శాతం పెరిగితే	70	79	87	100	113	123	136
9 శాతం పెరిగితే	77	86	94	109	123	133	148
10 శాతం పెరిగితే	84	94	104	119	135	146	162

విశ్లేషణ

విశాఖలో రెంటల్ ఈల్డ్ ప్రాపర్టీ విలువపై 2 శాతంగా ఉంది. ఇది ఏటా 5 శాతం పెరుగుతూ పోతే రెంటల్/ఈఎంఐ రేషియో 57 శాతం అవుతుంది. ఏటా 10 శాతం పెరిగితే ఈ రేషియో 84 శాతంగా ఉంటుంది. 11 శాతం పెరిగితే రేషియో 93గా ఉంటుంది. అదే హైదరాబాద్‌లో రెంటల్ ఈల్డ్ 2.5 శాతం.. ఏటా 9 శాతం వరకు పెరిగితే రెంట్/ఈఎంఐ రేషియో 94గా ఉంటుంది. ఒకవేళ ఏటా 10 శాతం పెరిగితే ఈ రేషియో 104కు వెళుతుంది. హైదరాబాద్‌లో ఏటా 10 శాతం చొప్పున అద్దెలు పెరిగేట్టు అయితే అప్పుడు రుణంపై ఇల్లు కొనుగోలు చేసి, ఈఎంఐలు కట్టుకోవడమే ప్రయోజనకరం. అద్దె పెరుగుదల 10 శాతంలోపే ఉంటే కిరాయికి తీసుకోవడం ఆర్థికంగా ప్రయోజనకరం. ఒకవేళ మీరు ఎంపిక చేసుకున్న ప్రాంతంలో ప్రస్తుత రెంటల్ ఈల్డ్ ప్రాపర్టీ విలువపై 4 శాతం అంతకంటే ఎక్కువే ఉండి, ఏటా అద్దె 5 శాతం పెరిగినా సరే.. అక్కడ రుణంపై ఇల్లు కొనుగోలు చేసి ఈఎంఐ కట్టుకోవడమే లాభం.

ఆఫీసుకు దగ్గరుంటే..

తమ కార్యాలయాలకు దగ్గరగా లేదా వ్యాపార సంస్థలకు సమీపంలో ఉండాలనుకుంటే ఇంటిని అద్దెకు తీసుకోవడమే లాభం. అలాంటి చోట సొంతిల్లు సమకూర్చుకోవడానికి భారీ పెట్టుబడి కావాలి. దాంతో పోలిస్తే చాలా తక్కువకే అద్దె ఇల్లు వచ్చేస్తుంది. పైగా రోజూ ఇంటి నుంచి వెళ్లి వచ్చేందుకు ఎక్కువ సమయం పట్టదు. ఇంధన వ్యయాల భారం ఉండదు. విలువైన సమయం, వనరుల ఆదా అవుతాయి.

సెలబ్రిటీలు ఇలా..

సెలబ్రిటీలు మాధురి దీక్షిత్, కృతి సనన్ సొంతింటికి బదులు అద్దింట్లో ఉండడానికే ప్రాధాన్యమిస్తున్నారు. అభిషేక్ బచ్చన్ ముంబైలో ఒకే ప్రాజెక్టులో 6 అపార్ట్‌మెంట్లు కొన్నారు.

ఈ అంశాలు గమనించాలి..

ఆర్‌బీఐ డేటా ప్రకారం 2010–11 నుంచి 2017–18 మధ్య కాలంలో (రియల్ ఎస్టేట్ రంగ నియంత్రణ సంస్థ (రెరా) రాక ముందు) ప్రాపర్టీల ధరలు ఏటా 15 శాతం చొప్పున పెరిగాయి. 2018–19 నుంచి 2022–23 కాలంలో (రెరా వచ్చిన తర్వాత) ఏటా 3 శాతం పెరిగాయి. చారిత్రకంగా చూస్తే దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణం కంటే రెట్టింపు స్థాయిలో ప్రాపర్టీల ధరలు పెరిగినట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఈ రకంగా చూస్తే ప్రాపర్టీ కొనుగోలు లాభదాయకమే. 30 ఏళ్ల కాలానికి రుణం తీసుకుని ఇల్లు కొనుగోలు చేస్తే, ప్రతి నెలా చెల్లించాల్సిన ఈఎంఐ, ఇంటి అద్దె కంటే రెట్టింపు ఉంటుంది. కానీ, 15–17 ఏళ్లు గడిచే సరికి ఇంటి అద్దె ఏటా పెరుగుతూ రుణ ఈఎంఐకి చేరువ కావచ్చు.

లాభాలు

సొంతిల్లు

- ఒకే చోట స్థిరపడిన వారు శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకోవడాన్ని పరిశీలించొచ్చు. మన దేశంలో పట్టణీకరణ వేగంగా జరుగుతోంది. ఇది ఇళ్లు, స్థలాల విలువలకు దన్నుగా నిలుస్తుంది. కనుక ఇంటిపై పెట్టుబడి దీర్ఘకాలంలో సంపదకు దారితీస్తుంది.
- సొంతిల్లుతో వచ్చే ప్రశాంతతను వెలకట్టలేం. భద్రతకు హామీనిస్తుంది. ఖాళీ చేయాల్సిన అనిశ్చితి ఉండదు. ఎవరికీ సమాధానం చెప్పుకోవాల్సిన అవసరం ఉండదు. గోపత్య ఉంటుంది. ఇంటిని ఎలా వినియోగించుకోవాలనే విషయంలో పరిమితులు ఉండవు. నచ్చినట్టుగా ఇంటిని మార్చుకోవచ్చు. రాజీపడాల్సిన అవసరం ఉండదు.
- అద్దెకు బదులు ఈఎంఐ కట్టుకుంటే స్థిరాస్తి సమకూరుతుంది. రుణంపై ఇంటిని సమకూర్చుకోవడం వల్ల దీర్ఘకాలంలో దాని విలువ పెరగడమే కాదు.. పన్ను రూపంలోనూ ఎంతో ఆదా అవుతుంది. ఇంటి రుణ ఈఎంఐలో అసలు (ప్రిన్సిపల్), వడ్డీ అని రెండు భాగాలుంటాయి. అసలుకు చెల్లించే మొత్తం గరిష్ఠంగా ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షలపై సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు పొందొచ్చు. అలాగే, సెక్షన్ 24 కింద ఇంటి రుణంపై ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్ఠంగా రూ. 2 లక్షల వడ్డీ భాగంపై పన్ను లేకుండా చూసుకోవచ్చు. ఒకవేళ రుణంపై కొనుగోలు చేసిన ఇంటిని అద్దెకు ఇచ్చినట్టయితే అప్పుడు వడ్డీ ఒక ఆర్థిక సంవత్సరంలో ఎంత ఉన్నా, ఆ మొత్తంపై పన్ను మినహాయింపు ప్రయోజనం ఉంది.
- సొంతింటితో అనుబంధం విడదీయరానిది. అదే అద్దె ఇంట్లో ఉండి, చుట్టుపక్కల వారితో మంచి సంబంధాలు ఏర్పడిన తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోవడం కష్టమనిపిస్తుంది. ఉన్నట్టుండి ఇల్లు ఖాళీ చేయాల్సిన అగత్యం ఏర్పడదు. సొంతిల్లు వ్యక్తిగత హోదాను పెంచుతుంది. సామాజిక గుర్తింపును తెస్తుంది.



- చివరిగా సొంతిల్లు ఉంటే.. విశ్రాంత జీవనంలో స్థిరమైన ఆదాయాన్నిచ్చే బంగారు బాతు అవుతుంది. రివర్స్ మార్ట్‌గేజ్‌తో ప్రతి నెలా స్థిరమైన ఆదాయాన్ని బ్యాంక్ నుంచి పొందొచ్చు.

అద్దె ఇల్లు

- అద్దె ఇంటితో ఉండే అత్యంత అనుకూలత.. నచ్చిన ప్రాంతంలో ఉండొచ్చు. సొంతిల్లు అయితే మారకుండా ఎప్పటికీ ఒకేచోట ఉండిపోవాల్సి వస్తుంది.
- ప్రతికూల ఆర్థిక పరిస్థితుల్లో, ఉద్యోగం కోల్పోయి ఖాళీగా ఉండాల్సి వస్తే, తక్కువ అద్దె ఇంటికి వెళ్లి సర్దుకోవచ్చు. సొంతిల్లు అయితే వ్యక్తిగత కష్టాలతో సంబంధం లేకుండా ఈఎంఐ కట్టాల్సిందే.
- అద్దె ఇల్లు అయితే ఇంటి నిర్వహణ భారం తమ మీద పడదు. వాటర్ ట్యాంక్‌లు, నీటి మోటార్‌ల నిర్వహణ, రిపేర్లు, పెయింట్స్ తదితర బాదర బంధీలు ఉండవు. వీటి రూపంలో ఆర్థిక భారం పడదు. ఇంటి పన్నుల బాధా ఉండదు.
- రుణంపై ఇల్లు కొనుగోలు చేయాలంటే.. మొత్తం విలువలో 20 శాతం డౌన్ పేమెంట్ కింద సమకూర్చుకోవాలి. అదే అద్దె ఇంటి విషయంలో ఈ అవసరం ఉండదు. కొద్ది నెలల అద్దెకు సరిపడా రిఫండబుల్ డిపాజిట్ చెల్లిస్తే సరిపోతుంది.

వేతన జీవులకు రియల్టీ ఆస్తి



వేతన జీవులకు రియల్ ఎస్టేట్ ఒక ఆస్తిగా మారుతుంది. నీవు ప్రతి నెలా అద్దె కింద రూ.లక్ష చెల్లిస్తుంటే, దానికి అదనంగా రూ.50,000–60,000 చెల్లించేట్టు అయితే సొంతిల్లు దక్కుతుంది. పదేళ్ల పాటు ఇదే అద్దెను చెల్లించడం వల్ల ఎలాంటి ఆస్తి సమకూరదు. కనుక ఈఎంఐతో ఒక ఆస్తిని సమకూర్చుకోవచ్చు.

– అజితేష్ కొరుపూలు, అశోక బిల్డర్స్ (రియల్ ఎస్టేట్ కంపెనీ) సీఈవో

తెలివైన నిర్ణయం కాదు!



గురుగ్రామ్‌లో నేను ఉండే ఇంటికి ప్రతి నెలా రూ.1.5 లక్షలు అద్దె, మెయింటెనెన్స్‌తో కలిపి రూ.1.65 లక్షలు చెల్లిస్తున్నా. అది గోల్ఫ్‌కోర్స్‌తో కూడిన ఖరీదైన ప్రాంతం. నేను ప్రస్తుతం అద్దెకు ఉంటున్న అపార్ట్‌మెంట్ ఖరీదు రూ.7.5–8 కోట్లు. దీన్ని కొనుగోలు చేయాలంటే 70 శాతం మేర రూ.6 కోట్లు రుణం తీసుకోవాలి. దీనికి ప్రతి నెలా రూ.6–7 లక్షల ఈఎంఐ చెల్లించాలి. అంటే నేను ప్రస్తుత ఇంటికి చెల్లిస్తున్న అద్దె కంటే ఈఎంఐ నాలుగు రెట్లు అధికం. కనుక ఇల్లు కొనుగోలు చేయడం నాకు తెలివైన నిర్ణయం కాబోదు. ఇల్లు అనేది లిక్విడిటీ (కోరుకున్న వెంటనే సొమ్ము చేసుకోగల) ఉన్న ఆస్తి కాదు. కనుక నేను అదే రూ.6 లక్షలను పబ్లిక్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేస్తాను. పైగా అద్దె ఇల్లు తీసుకోవడంలో కొంత స్వేచ్ఛ ఉంటుంది. 15 రోజుల్లోనే చిన్న సైజు నుంచి పెద్ద సైజు ఇంటికి మారొచ్చు. నేను నా పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి ఉంటే తప్ప ఇంటి విషయంలో నా ఆలోచన ఇదే.

– శంతను దేశ్‌పాండే, బోంబే షేవింగ్ కంపెనీ ఫౌండర్

హాస్యాస్పదం



ప్రస్తుత వేల్యుయేషన్ల వల్లే నేను రియల్ ఎస్టేట్‌ను కొనుగోలు చేయలేదు. నా వరకు ఈ వేల్యుయేషన్లు నిజంగా హాస్యాస్పదం. వడ్డీ రేట్ల కంటే ఇంటిపై రాబడులు తక్కువ. ఇళ్లు, ఆఫీస్‌ల ధరలు పెరుగుతాయని కొనుగోలు చేయడం తెలివైన నిర్ణయం అనిపించడంలేదు. పెట్టుబడులపై 10–12 శాతం రాబడులు సంపాదించుకోలిగినప్పుడు, 3 శాతానికే (ప్రాపర్టీ విలువలో) వచ్చే అద్దె ఇల్లు తీసుకోవడమే మంచిది. పెట్టుబడులపై వచ్చే రాబడి కంటే రెంటల్ ఈల్డ్ చాలా తక్కువ. నా తల్లిదండ్రులు నివసించిన ఇల్లు ఒక్కటే నాకు ఉంది. దానికి కూడా భావోద్వేగ పరమైన కారణాలున్నాయి.

– నిఖిల్ కామత్, జెరోదా కో–ఫౌండర్

కోటక్ మహీంద్రా ఏఎంసీ పీఎస్‌యూ ఇండెక్స్ ఫండ్

బీఎస్‌ఈ పీఎస్‌యూ ఇండెక్స్‌ను ట్రాక్ చేసే కొత్త ఫండ్‌ను కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ జూలై 24తో ముగుస్తుంది. బీఎస్‌ఈ పీఎస్‌యూ ఇండెక్స్‌లో ప్రస్తుతం వివిధ పరిశ్రమలకు చెందిన



56 ప్రభుత్వ రంగ సంస్థల స్టాక్స్ ఉన్నాయి. ఇంధనం, ఆర్థికం మొదలుకుని డిఫెన్స్, ఇన్‌ఫ్రా వరకు వివిధ రంగాల్లో పీఎస్‌యూలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. వైవిధ్యమైన పీఎస్‌యూ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా డైవర్సిఫికేషన్ ప్రయోజనాలను పొందడానికి ఈ ఫండ్ ఉపయోగపడగలదని సంస్థ వైస్ ప్రెసిడెంట్ దేవేందర్ సింఘాల్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-7-2024	
విశాఖ	575–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	555–00
విజయవాడ	555–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	530–00
వరంగల్	532–00
రిటైల్ ధర	5.90

ఐదేళ్లలో పెట్టుబడి రెట్టింపు ఎలా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



నేను ఐదేళ్ల తర్వాత పదవీ విరమణ తీసుకుంటాను. ప్రస్తుతం నాకు ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో పెద్ద మొత్తంలో నిధి ఉంది. ఈ మొత్తాన్ని నేను రిటైర్మెంట్ అయ్యే నాటికి, ఐదేళ్లలో రెట్టింపు చేసుకోవాలన్నది నా ఆలోచన. కనుక ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి? – మనోహరన్ వరదరాజన్

పెట్టుబడి రెట్టింపునకు ఐదేళ్ల కాల వ్యవధి అన్నది చాలా తక్కువ. ఇంత తక్కువ కాలంలో పెట్టుబడి రెట్టింపు చేసుకోవాలంటే ఏటా 15 శాతం రాబడి సంపాదించాల్సిందే. పూర్తి ఈక్విటీ పెట్టుబడుల పరంగా చూసినా ఇది పెద్ద లక్ష్యమే. రిటైర్మెంట్ తర్వాత మీ జీవన వ్యయాలకు సరిపడా రాబడి కోసం పెట్టుబడులపై ఏ మేరకు ఆధారపడి ఉంటారన్నది కీలకం అవుతుంది. రిటైర్మెంట్ తర్వాత పెట్టుబడుల వచ్చే రాబడి ద్వారానే మీ అవసరాలను తీర్చుకునేట్టు అయితే.. నూరు శాతం పెట్టుబడులను ఈక్విటీలకు కేటాయించుకోవడం రిస్క్ అవుతుంది. పైగా అస్థిరతలు కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది. అలాగని మొత్తం పెట్టుబడులను ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాల్లో (డెట్) పెట్టడం కూడా సరి కాదు. ఎందుకంటే డెట్ సాధనాల్లో రాబడులు ద్రవ్యోల్బణంతో పోలిస్తే మెరుగ్గా ఉండవు. దీనికి పరిష్కారం ఈక్విటీ, డెట్‌తో కూడిన అసెట్ అలోకేషన్ ప్రణాళికను రూపొందించుకోవడమే. ఈక్విటీలకు 50 శాతం, డెట్‌కు 50 శాతం కేటాయించుకోవడం అనుకూలంగా ఉంటుంది. అయితే, ఈక్విటీకి కేటాయించిన మొత్తాన్ని ఒకేసారి ఇన్వెస్ట్ చేయకూడదు. రెండు నుంచి మూడేళ్ల కాలంలో క్రమంగా ఇన్వెస్ట్ చేయాలి. డెట్ పెట్టుబడులపై 6–7% మేర రాబడి, ఈక్విటీలపై 11–12% రాబడి వస్తుందని అనుకుంటే.. అప్పుడు మీ మొత్తం పెట్టుబడిపై నికర రాబడి 9–10% అవుతుంది. ఈ ప్రకారం మీ పెట్టుబడి వచ్చే ఐదేళ్లలో 50–60% వృద్ధి చెందుతుంది. అంతేకానీ రెట్టింపు కాదు. ఉదాహరణకు మీ వద్ద రూ.10 లక్షలు ఉన్నాయనుకుంటే, అవి ఐదేళ్లలో రూ.16 లక్షలుగా మారతాయి. ఒకవేళ రిటైర్మెంట్ నాటికి ఈ పెట్టుబడి అవసరం లేదనుకుంటే అప్పుడు 70–75 శాతాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. అలా చూసినా 15 శాతం రాబడి సహేతుకం కాదు. ద్రవ్యోల్బణానికి దీటైన రాబడి కోరుకుంటే మొత్తం పెట్టుబడుల్లో కనీసం మూడింట ఒకవంతు అయినా ఈక్విటీలకు కేటాయించుకోవాలని గుర్తుంచుకోవాలి. రిటైర్మెంట్ తర్వాత పెట్టుబడి నుంచి ఏటా 6 శాతం మించి ఉపసంహరించుకోకుండా కట్టుబడి ఉండాలి.

నేను 20 ఏళ్ల క్రితం ఓ లిస్టెడ్ కంపెనీలో పెట్టుబడులు పెట్టాను. స్టాక్ బ్రోకర్ ద్వారానే కొనుగోలు చేసి, లావాదేవీపై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ) కూడా చెల్లించాను. కానీ, అదే కంపెనీ పదేళ్ల క్రితం స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల నుంచి డీలిస్ట్ అయింది. ఆ పెట్టుబడులను నేను 2023–24లో విక్రయించాను. వీటిపై పన్ను ఎలా అమలవుతుంది? ఇండెక్సేషన్ ప్రయోజనం ఉంటుందా? – సుధాకర్ కోలంగర్త్

మీరు 20 ఏళ్ల క్రితం స్టాక్స్‌ను వాస్తవంగా కొనుగోలు చేశారు. కనుక పెట్టుబడులపై వచ్చిన లాభం నుంచి 20 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. దీనికి ఇండెక్సేషన్ (ద్రవ్యోల్బణం ప్రభావం మినహాయించడం) ఉంటుంది. మీరు విక్రయించినది అన్‌లిస్టెడ్ సెక్యూరిటీ. ఈ తరహా అన్‌లిస్టెడ్ సెక్యూరిటీల్లో 24 నెలలకు పైగా ఉన్న పెట్టుబడులను దీర్ఘకాలికమైనవిగా పరిగణిస్తారు. 24 నెలలలోపు వాటిని స్వల్పకాల పెట్టుబడులుగా ఆదాయపన్ను చట్టం చూస్తోంది. స్వల్పకాల పెట్టుబడులపై లాభం ఇన్వెస్టర్ వార్షికాదాయానికి కలుస్తుంది. తమకు వర్తించే రేటు ప్రకారం పన్ను చెల్లిస్తే సరిపోతుంది.

ఆకర్షణీయంగా ఫ్లెక్సీ, మల్టీ క్యాప్ ఫండ్స్

వచ్చే రెండేళ్లలో 60 నగరాలకు విస్తరణ • ఎడెల్వీజ్ ఎంఎఫ్ ఎండీ రాధికా గుప్తా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కార్పొరేట్ల ఆదాయాలు బాగుంటున్న నేపథ్యంలో వాటితో ముడిపడి ఉన్న మార్కెట్ల పనితీరు కూడా మెరుగ్గానే ఉండగలదని ఎడెల్వీజ్ మ్యుచువల్ ఫండ్ ఎండీ రాధికా గుప్తా చెప్పారు. కొన్ని విభాగాలు కాస్త అధిక వేల్యుయేషన్లలో ట్రేడవుతున్నప్పటికీ స్థూలంగా మార్కెట్‌ని చూస్తే బబుల్‌లాంటి (బుడగలాగా పేలిపోయే) పరిస్థితేమీ లేదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అగ్రెసివ్ ఇన్వెస్టర్లు .. ఫ్లెక్సీ క్యాప్, మల్టీ క్యాప్, బిజినెస్ సైకిల్ ఫండ్స్ మొదలైన వాటిల్లో ఇన్వెస్ట్ చేయొచ్చని సూచించారు. కాస్త కన్జర్వేటివ్‌గా ఉండే వారు బ్యాలెన్స్‌డ్ ఫండ్స్ లాంటి హైబ్రిడ్ ఫండ్స్‌ను ఎంచుకోవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం తమ ఏయూఎం (నిర్వహణలోని ఆస్తుల పరిమాణం) రూ. 1.04 లక్షల కోట్ల స్థాయిలో ఉండగా, 25–30 శాతం వృద్ధి సాధించేందుకు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని రాధిక చెప్పారు. గత ఆరేళ్లలో ఆరు నగరాల నుంచి ప్రస్తుతం 35 పైచిలుకు నగరాలకు కార్యకలాపాలు విస్తరించామని. వచ్చే రెండేళ్లలో ఈ సంఖ్యను 60కి పెంచుకోవాలని నిర్దేశించుకున్నామని తెలిపారు. సుమారు 15 లక్షలుగా ఉన్న ఫోలియోలను 30–40 లక్షలకు పెంచుకోవడంపై దృష్టి పెడుతున్నట్లు వివరించారు.



సిప్‌లు పెరగడమనేది దేశీ మార్కెట్లకు మేలు చేస్తోందని, విదేశీ నిధులపై ఆధారపడే పరిస్థితి తగ్గుతుందని ఆమె చెప్పారు. ఇన్వెస్టర్లు అసాధారణ రాబడులకు హామీలనిచ్చే సాధనాల విషయంలో సదా అప్రమత్తంగా ఉండాలని, పనితీరు మాత్రమే కాకుండా సంస్థ పటిష్టతను కూడా చూసుకోవాలని రాధిక సూచించారు. భారత ఎకానమీ వృద్ధి చెందడమనేది కేవలం ఏదో ఒక రంగంపై ఆధారితమైనది కాకుండా వివిధ రంగాలవ్యాప్తంగా ఉంటుందనే విషయాన్ని రిటైల్ ఇన్వెస్టర్లు గుర్తించి, తదనుగుణంగా పెట్టుబడులు పెట్టాలని పేర్కొన్నారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
రికార్డుల ర్యాలీ కొనసాగొచ్చు
పేటీఎమ్ నుంచి వైదొలగిన సాఫ్ట్‌బ్యాంక్

గరీబ్ రథ్ ఇక సూపర్ ఫాస్ట్

గంటకు 130 కిలోమీటర్ల వేగం ● ఇప్పటి వరకు ఐసీఎఫ్ కోచ్‌లతో నడిచిన గరీబ్ రథ్ ఇకపై ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో పెరగనున్న భద్రత



సాక్షి, హైదరాబాద్: ఆకుపచ్చ రంగు బోగీలతో పరుగులు తీసే గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ ఇప్పుడు సరికొత్తగా ఎరుపు రంగు బోగీలతో పట్టాలెక్కడంతో పాటు శరవేగంగా పరుగులు తీయనుంది. గరీబ్ రథ్ రైళ్లకు ఇప్పటివరకు ఉన్న దశాబ్దాల నాటి ఐసీఎఫ్ (ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ) కోచ్‌ల స్థానంలో ఇకపై ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఎల్‌హెచ్‌బీ (లింక్‌హాఫ్‌మెన్ బుష్) కోచ్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఎల్‌హెచ్‌బి కోచ్‌లతో కూడిన గరీబ్ రథ్ ఈ నెల 22 నుంచే సికింద్రాబాద్ నుంచి వైజాగ్‌మధ్య ప్రారంభం కానుంది. ఈ ఎక్స్‌ప్రెస్‌లో మొత్తం బోగీలన్నీ తృతీయ శ్రేణి ఏసీ కోచ్‌లే ఉంటాయి. ఎల్‌హెచ్‌బీ కోచ్‌ల వల్ల గరీబ్ రథ్ వేగం గరిష్టంగా గంటకు 130 కిలోమీటర్‌ల వరకు చేరుకోనుంది. సూపర్ ఫాస్ట్ రైళ్లతో సమానంగా ఇది పరుగులు తీయనుంది.

మిగతా రైళ్ల టికెట్ ధర కంటే చాలా తక్కువ

గోదావరి, ఈస్ట్ కోస్ట్, విశాఖ, కోణార్క్ ఫలక్‌నుమా వంటి సూపర్‌ఫాస్ట్ రైళ్లలో సికింద్రాబాద్ నుంచి విశాఖకు థర్డ్ ఏసీ టికెట్ ధర రూ.1080 వరకు ఉంటుంది. కానీ సికింద్రాబాద్ నుంచి విశాఖకు గరీబ్ రథ్ థర్డ్ ఏసీ టికెట్ ధర రూ.770 ఉంటుంది.

ఇకపై ఆ రైళ్లు కూడా స్పీడ్ రైడ్: గరీబ్ రథ్ రైళ్లను ఎల్‌హెచ్‌బీలుగా మార్చనున్నట్లు రైల్వేబోర్డు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు దక్షిణమధ్య రైల్వే పరిధిలో కాజీపేట్, విజయవాడ మీదుగా సికింద్రాబాద్ నుంచి విశాఖకు నడిచే రైలుతో పాటు వికారాబాద్, రాయ్‌చూర్ మీదుగా నడిచే సికింద్రాబాద్–యశ్వంత్ పూర్ ట్రై వీక్లీ గరీబ్ రథ్ కూడా ఎల్‌హెచ్‌బీగా మారనుంది. అలాగే దక్షిణ మధ్య రైల్వే జోన్ నుంచి రాకపోకలు సాగించే ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ – నిజాముద్దీన్, యశ్వంత్‌పూర్–విశాఖ గరీబ్‌రథ్ రైళ్లు కూడా ఎల్‌హెచ్‌బీకి మారనున్నాయి. దశలవారీగా దక్షిణ మధ్య రైల్వేలో సూపర్‌ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఐసీఎఫ్ నుంచి ఎల్‌హెచ్‌బీకి మార్చారు. ఇప్పటి వరకు 90% రైళ్లు ఐసీఎఫ్ నుంచి ఎల్‌హెచ్‌బీకి మారగా, మరో 18 రైళ్లు ఐసీఎఫ్ కోచ్‌లతో నడుస్తున్నాయి. త్వరలో వీటినీ ఎల్‌హెచ్‌బీకి మార్చనున్నారు.

ఈ కోచ్‌లు ఎంతో సురక్షితం

- ఎల్‌హెచ్‌బీ కోచ్‌లలో ప్రయాణికులకు ఎంతో భద్రత ఉంటుంది.
- దురదృష్టవశాత్తు రైళ్లు పట్టాలు తప్పి ప్రమాదాలకు గురైనా ఈ కోచ్‌లు ఒకదానిపైకి ఒకటి రాకుండా నిలిచిపోతాయి. దీంతో ప్రమాద తీవ్రత తక్కువగా ఉంటుంది. ఐసీఎఫ్ కోచ్‌లలో ప్రమాదాలు జరిగినప్పుడు కోచ్‌లు ఒకదానిపైకి మరొకటి చేరుతాయి. దీంతో ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణనష్టం ఎక్కువగా ఉంటోంది.
- అగ్ని ప్రమాదాలు వంటివి జరిగినా వెంటనే వ్యాప్తి చెందవు. ఇటీవల జరిగిన రైలు ప్రమాదాల్లో ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు ఉన్న రైళ్లలో ప్రాణనష్టం తక్కువగా ఉండడానికి కారణం కోచ్‌ల సామర్థ్యమేనని అధికారులు చెబుతున్నారు.

19 నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

సాక్షి, హైదరాబాద్: గురుపౌర్ణమి సందర్భంగా భక్తులు అరుణాచలంలో గిరిప్రదక్షిణకు ఆసక్తి చూపుతారు. గత కొన్నేళ్లుగా అక్కడికి వెళ్లే భక్తుల రద్దీ పెరుగుతోంది. దీంతో ఈసారి స్పెషల్ బస్సులు పెంచాలని సంస్థ నిర్ణయించింది. ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, నల్లగొండ, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్ తదితర పట్టణాల నుంచి వీటిని నడపనుంది. ఈ నెల 21న గురుపౌర్ణమి కాగా, 19 నుంచి 22 వరకు ఈ బస్సులు అందుబాటులో ఉంటాయని ఆర్టీసీ వెల్లడించింది. అరుణాచలంతోపాటు కాణిపాకం, శ్రీపురం కూడా దర్శించుకునేలా ఈ ప్యాకేజీని ఏర్పాటు చేసింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.